సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 206
మంగళవారం 11-4-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | BANGALORE | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'



'థ్రిల్లర్'లో లక్నో విన్నర్...
బెంగళూరుపై చివరి బంతికి నెగ్గిన సూపర్ జెయింట్స్ - 12లో



ఒడిదొడుకుల ట్రేడింగ్
13 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్.. 17,600 దాటి ముగిసిన నిఫ్టీ - 13లో



దేశవ్యాప్తంగా కోవిడ్ మాక్ డ్రిల్
భారత్‌లో కరోనా కేసుల్లో పెరుగుదల నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో కేంద్రం కోవిడ్ మాక్‌డ్రిల్ నిర్వహించింది.
వివరాలు 6లో ▸



పాపల్‌ప్రీత్ సింగ్ అరెస్ట్
ఖలిస్తానీ అనుకూల బోధకుడు అమృత్‌పాల్ సింగ్ ప్రధాన అనుచరుడు పాపల్‌ప్రీత్ సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
వివరాలు 6లో ▸



అంగుళమైనా ఆక్రమించలేరు!
భారత సరిహద్దులను ఎవరు పడితే వాళ్లు ఆక్రమించుకునే రోజులు పోయాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు.
వివరాలు 6లో ▸



తైవాన్‌పై యుద్ధానికి సై!
ఏ క్షణంలోనైనా తాము తైవాన్‌పై యుద్ధానికి దిగేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామని చైనా సైన్యం ప్రకటించింది.
వివరాలు 6లో ▸

చట్టాలకు రామోజీ అతీతుడా!

మార్గదర్శి చిట్స్ విషయంలో తటస్థుల పేరిట ఎల్లో డ్రామా

- 1982 కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఇప్పుడే తెచ్చినట్లుగా పెడబొబ్బలు
- డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం 1999లోనే చేశారు
- అవన్నీ చందాదారులు, డిపాజిట్ దారుల హక్కుల పరిరక్షణ కోసమే
- వాటిని అమలు చేయమని కోరటమే నేరమన్నట్లుగా రామోజీ గగ్గోలు
- చట్టాలను ఉల్లంఘించడం వల్లే శారదా, సుదర్శన్ చిట్స్ దివాలా
- డిపాజిట్లను మళ్లించి బోర్డు తిప్పేసిన అగ్రిగోల్డ్, కృషి, చార్మినార్, ప్రుడెన్షియల్ బ్యాంక్‌లు
- 'మార్గదర్శి' ఖాతాదారులు మోస పోకూడదన్నదే ప్రభుత్వం ఉద్దేశం
- నిధులు మళ్లించామని అంగీ కరించిన ఏ–1 చెరుకూరి రామోజీ
- ఆ చట్టాన్ని పాటించబోమని తేల్చిచెప్పిన ఏ–2 చెరుకూరి శైలజ
- డిపాజిట్ల సేకరణ, నిధుల మళ్లింపు సహా ఇప్పటికే బట్ట బయలైన మార్గదర్శి అక్రమాలు



సాక్షి, అమరావతి: ఇది నా దేశం... అనుకున్న వాళ్లెవ రైనా ఇక్కడి చట్టాలను గౌరవించి తీరాలి. ఆ చట్టా లకు లోబడే పనిచేయాలి. అసలు ఒక వ్యాపారం చేస్తూ... ఆ వ్యాపారాన్ని ఏ చట్టం కింద రిజిస్టర్ చేశారో ఆ చట్టం తనకు తెలియనే తెలియదని... దాన్ని తాను పాటించనని నిస్సిగ్గుగా... నిర్భీతిగా చెప్పే మనుషులను ఏం చేయాలి? తమకు ఏ చట్టా లూ వర్తించవని చెప్పే పెద్ద మనుషుల్ని ఏమనాలి? ఇక్కడైతే చెరుకూరి రామోజీరావు అనో... చెరుకూరి శైలజా కిరణ్ అనో పిలవాల్సి ఉంటుంది. ఎందుకం టే నాటి మార్గదర్శి ఫైనాన్షియర్స్ నుంచి నేటి మార్గ దర్శి చిట్స్ వరకూ... మేం డిపాజిట్లు సేకరించ లేదని కానీ, మేం నిధులు మళ్లించలేదని గానీ వాళ్లు చెప్పటం లేదు. చట్టప్రకారం అలా చెయ్యకూడదు కదా? అంటే... ఆ చట్టాలేవీ తమకు వర్తించవంటు న్నారు. ఆ చట్టాలు తాము పాటించబోమని చెబుతు న్నారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ వ్యవహారంలో... ఆ కంపెనీ ద్వారా తాము చేసినవన్నీ చట్ట విరుద్ధ మైన పనులే అని తేలటంతో... తప్పును కప్పిపు చ్చుకోవటానికి ఏకంగా ఆ సంస్థనే మూసేశారు. ఇపుడు ఆ సంస్థే లేదు కదా? అని వాదిస్తున్నారు. ఒక బ్యాంకు తన వద్దకు వచ్చిన డిపాజిట్లను ఇష్టం వచ్చినట్లు సొంత అవసరాల కోసం వాడేయొచ్చా? సొంత కంపెనీల్లోకి మళ్లించొచ్చా? అలా మళ్లిస్తే బ్యాంకు కుప్పకూలిపోదా? కృషి, చార్మినార్..
మిగతా 2వ పేజీలో ▶

పిల్లలకూ 'టోఫెల్'

ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు సీఎం జగన్ మరో వరం

- ఆత్మవిశ్వాసంతో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సాహం
- 3–5 విద్యార్థులకు 'ప్రైమరీ టోఫెల్'.. 6–9 తరగతులకు 'జూనియర్ టోఫెల్' పరీక్ష
- ఇప్పటికే ఇంగ్లిష్ మీడియంతో పాటు బై లింగ్యువల్ టెక్స్‌బుక్స్
- ప్రతి దశలో చదువులకు అండగా ప్రభుత్వం
- పిల్లలకు ప్రతి అంశంలో పట్టుకోసం సబ్జెక్ట్ టీచర్ల వ్యవస్థ
- ఇంటర్ వరకూ అమ్మ ఒడి
- ఆ తర్వాత.. విద్యాదీవెన, వసతి దీవెన.. గైర్హాజరుపై ట్రాకింగ్.. తల్లిదండ్రులకు సమాచారం
- డ్రాపౌట్ ప్రశ్నే ఉత్పన్నం కాకుండా చర్యలు
- విద్యాశాఖపై ఉన్నత సమీక్షలో సీఎం కీలక నిర్ణయాలు



సాక్షి, అమరావతి: ఇంగ్లిష్ మీడియం నుంచి బై లింగ్యువల్ (ద్వి భాషా) పాఠ్యపుస్తకాల దాకా.. టంచన్‌గా ఫీజుల నుంచి నాణ్యమైన మధ్యాహ్న భోజనం వరకూ ప్రతి అంశంపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటూ పిల్లలకు అత్యుత్తమ బోధన అందేలా నిరంతరం పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాజాగా మరో కీలక సూచన చేశారు. అంతర్జా తీయ ప్రమాణాలకు అనుగుణంగా మన విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, విద్యార్థులను
మిగతా 2వ పేజీలో ▶

గ్రామ స్థాయిలోనే కరోనాకు వైద్యం

- వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశం
- విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ సేవలను వినియోగించుకోవాలి
- ఫీవర్ సర్వే ద్వారా అనుమానిత లక్షణాలున్న వారికి పరీక్షలు

2లో

న్యూస్‌రీల్

అండగా నిలిస్తే అభాండాలా?



వ్యవసాయాన్ని పండుగలా మార్చిన జగన్ ప్రభుత్వంపై అభాండాలు వేస్తూ రైతులను మభ్యపెట్టాలని ఈనాడు చూస్తోంది. 'కౌలు రైతులకు మిగిలింది కంటితుడుపే' అంటూ సోమవారం ఆ పత్రిక వండివార్చిన కథనంపై అంశాల వారీగా 'ఫ్యాక్ట్‌చెక్'.
వివరాలు 3 ▸

ఈ నెల 20 వరకు కేజీబీవీ ప్రవేశాలకు గడువు



రాష్ట్రంలోని 352 కస్తూర్బా బాలికా విద్యాలయా (కేజీబీవీ)ల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 8 తరగతుల్లోని మిగులు సీట్ల భర్తీకి సమగ్ర శిక్ష ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు.
వివరాలు 10 ▸

ఆమ్ ఆద్మీ.. ఇక జాతీయ పార్టీ

AAM AADMI PARTY

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ని ఎన్నికల సంఘం జాతీయ పార్టీగా గుర్తించింది. అలాగే, ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియాలకు ఇప్పటిదాకా ఉన్న జాతీయ పార్టీ హోదాను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. యూపీలో ఆర్‌ఎల్‌డీ, ఏపీలో బీఆర్‌ఎస్, మణిపూర్‌లో పీడీఏ, పుదుచ్చేరిలో పీఎంకే, పశ్చిమ బెంగాల్‌లో ఆర్‌ఎస్పీ రాష్ట్ర పార్టీ హోదాను రద్దు చేస్తున్నట్లు పేర్కొంది.
వివరాలు 6 ▸

ఇదండీ సంగతి



మన సీఎం గారే పార్టీ ఆఫీస్‌కు వెళ్తున్నారు!

పోలవరం పనులు భేష్..




కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి అభినందన

- 2017–18 సవరించిన అంచనాల మేరకు నిధులివ్వాలని కోరిన రాష్ట్ర అధికారులు
- 45.72 మీటర్ల పరిధిలోకి మరో 36 గ్రామాలు వస్తాయని వెల్లడి
- సానుకూలంగా స్పందించిన కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి.. ముంపు గ్రామాల్లో లైడార్ సర్వే చేయాలని ఆదేశం
- నిర్వాసితుల పునరావాసం బాధ్యత కేంద్రానిదేనని స్పష్టీకరణ
- తొలి దశ, రెండో దశకు అవసరమైన నిధులపై నాలుగు రోజుల్లో సమావేశం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనులు బాగా జరుగుతున్నాయని కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి పంకజ్ కుమార్ అధికారులను అభినందించారు. షెడ్యూల్ ప్రకారం ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్, అప్రోచ్ ఛానల్, స్పిల్‌వే, స్పిల్ ఛానల్, పైలెట్ ఛానల్ పూర్తి చేసి గోదావరి వరదను సమర్థంగా మళ్లించారని రాష్ట్ర జలవనరుల అధికారులను, పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ)ని అభినందించారు. కాఫర్ డ్యామ్‌ల మధ్య పడిన అగాధాలను మళ్లీ వరద వచ్చేలోగా పూడ్చివేయాలని ఆదేశించారు. దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా 'యు' ఆకారంలో కొత్త డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించి పాత దానితో అనుసంధానించాలని చెప్పారు. తద్వారా వరదల్లోనూ
మిగతా 10వ పేజీలో ▶

అటువంటి కాలేజీని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు



- నిర్వహణ, కార్యకలాపాలు సరిగా లేని కళాశాలలపై హైకోర్టు తీర్పు
- ఎన్‌బీటీ అండ్ ఎస్‌వీసీ కాలేజీ టేకోవర్‌కు సమర్థన
- ప్రజా ప్రయోజనాల దృష్ట్యానే ప్రభుత్వం టేకోవర్ చేసిందని వెల్లడి
- జీవో 17 విషయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టీకరణ.. కాలేజీ సెక్రటరీ పిటిషన్ కొట్టివేత

- వివరాలు 14లో


రాత్రి వేళల్లో భీమిలి బీచ్ నీలివర్ణ అందాలు

కాంతులీనుతున్న సాగరతీరం

రాత్రి వేళ నీలిరంగుతో మెరుస్తున్న భీమిలి బీచ్

- అలల పొంగులో కాంతి వెదజల్లడంపై పర్యాటకుల ఆశ్చర్యం..
- పగటి పూట కనిపించని కాంతి కెరటాలు
- సముద్రజీవులు వెదజల్లే కాంతి పరావర్తనం వల్లే రంగుమార్పు!

సాక్షి, విశాఖపట్నం: సాగరతీర అందాలకు స్వర్గధామంగా ఉన్న విశాఖలో ఇప్పుడు మరో అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. పగలంతా అలల సవ్వడితో పర్యాటకులను అలరిస్తున్న భీమిలి బీచ్.. వారం రోజులుగా రాత్రి సమయంలో నీలివర్ణంతో కాంతులీనుతూ కనువిందు చేస్తోంది. బయోలుమినిసెంట్ తరంగాల కారణంగా అలల పొంగులో కాంతి వెదజల్లుతుండటంతో పర్యాటకులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. వారం రోజుల కిందట భీమిలి బీచ్ వద్ద
మిగతా 14వ పేజీలో ▶

చాక్లెట్లు కాదు..రాకెట్లు

- కోరుకున్న రీతిలో తయారుచేస్తున్న స్కైరోరా
- సమాచార విప్లవానికి నాంది పలికిన సంస్థ
- ప్రైవేట్ రాకెట్లకు పెరుగుతున్న డిమాండ్
- స్పేస్ స్టార్టప్స్‌లో పోటీ పడుతున్న అమెరికా, చైనా, యూరప్, భారత్

- వివరాలు 5లో



ఇంటింటా 'నమ్మకం'

'జగనన్నే మా భవిష్యత్తు'కు 20 లక్షలకుపైగా మిస్డ్ కాల్స్


రాజమహేంద్రవరంలోని 13వ వార్డ్ అంబేద్కర్‌నగర్‌లో జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్‌ను వలంటీర్ నుంచి తీసుకుని ఆప్యాయంగా చూస్తున్న వృద్ధురాలు

- నాలుగో రోజూ ప్రతి గ్రామంలో ఘన స్వాగతం
- ఆకివీడులో స్వయంగా స్టిక్కర్ అతికించిన టీడీపీ సర్పంచ్
- గుంటూరులో జగనన్నకు మద్దతుగా విద్యార్థుల భారీ ర్యాలీ

సాక్షి, అమరావతి: జగనన్న సైన్యానికి ప్రతి గడపలో ఘన స్వాగతం లభిస్తోంది. మాట నిలబెట్టుకుంటూ మూడున్నరేళ్లలోనే 98 శాతానికి పైగా హామీలను నెరవేర్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రతి గ్రామంలో ఆత్మీయ పలకరింపులు ఎదురవుతున్నాయి. 'మా నమ్మకం నువ్వే జగన్' నినాదంతో చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ఊరూవాడ విస్తృతంగా కొనసాగుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజక వర్గ సమన్వయకర్తలు, కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు అందరూ సమష్టిగా ఇంటింటికీ వెళ్తున్నారు. ప్రతి గడపకి వెళ్లి 15 నిమిషాలకు పైగా గడుపుతున్నారు. గత ప్రభుత్వం అనుసరించిన మోసపూరిత విధానాలు, ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన వైనాన్ని వివరిస్తున్నారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేకూర్చిన మంచిని వివరిస్తూ మరోసారి ఆశీర్వదించాలని కోరుతున్నారు. నాలుగో రోజు
మిగతా 3వ పేజీలో ▶

డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న చోట సమాంతరంగా మరో వాల్

- యు ఆకారంలో నిర్మించి, పాత డయాఫ్రమ్ వాల్‌తో అనుసంధానం
- పోలవరం ప్రధాన డ్యామ్ వద్ద ఏర్పడిన అగాధాలను పూడ్చే పనులకూ లైన్ క్లియర్
- రూ.2022.05 కోట్లతో పరిపాలన అనుమతి.. ఉత్తర్వులు జారీ చేసిన జల వనరుల శాఖ ముఖ్యకార్యదర్శి.. అదనపు వ్యయాన్ని భరిస్తామన్న కేంద్రమంత్రి
- చంద్రబాబు వల్లే దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్, ప్రధాన డ్యామ్ వద్ద అగాధాలు



- పర్యవసానమే పోలవరం పనుల్లో జాప్యం, అదనపు వ్యయం.. చంద్రబాబు పాపాల వల్లే ఈ భారం అంటున్న అధికారులు

10లో

మండుతోంది!

- రాష్ట్ర వ్యాప్తంగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- నేడు పలు మండలాల్లో వడగాడ్పులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగింది. పలు ప్రాంతాల్లో సోమవారం ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటె ఎక్కువగా నమోదయ్యాయి. 119 కేంద్రాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు గుర్తించారు. సాధారణ ఉష్ణోగ్రతల కంటె సగటున రెండు డిగ్రీలు ఉష్ణోగ్రత పెరిగినట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. అత్యధికంగా విజయనగరం జిల్లా నెల్లిమర్లలో 41.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. విజయనగరం జిల్లా రాజాంలో 41.8, నంద్యాల జిల్లా అవుకులో 41.6, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం, విజయనగరం జిల్లా అల్లాడపాలెంలో 41.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉష్ణోగ్రతలు, హ్యూమిడిటీని విశ్లేషించినప్పుడు చాలా ప్రాంతాల్లో అసౌకర్య సూచికలు (డిస్‌కంఫర్టబుల్ ఇండెక్స్) పెరిగినట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీంతో ప్రజలు ఎండ ప్రభావంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు చెబుతున్నారు. ఎండ, ఉక్కపోతతో ఈ పరిస్థితి నెలకొందంటున్నారు.

ఈ మండలాల్లో నేడు వడగాడ్పులు

వారం రోజుల పాటు రాష్ట్రమంతా ఇలాగే వేడి వాతావరణం ఉంటుందని, ఉష్ణోగ్రతలు ఇంకా పెరుగుతాయని చెబుతున్నారు. మంగళవారం 26 మండలాల్లో, బుధవారం 69 మండలాల్లో ఎండ తీవ్రత, వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అడ్డతీగల, నెల్లిపాక, చింతూరు, గంగవరం, రాజవొమ్మంగి, వరరామచంద్రపురం మండలాలు, అనకాపల్లి జిల్లాలోని కోటవురట్ల, మాకవరపాలెం, నర్సీపట్నం, నాతవరం మండలాలు, తూర్పు గోదావరి జిల్లాలోని రాజానగరం, సీతానగరం, గోకవరం, కోరుకొండ మండలాలు, ఏలూరు జిల్లాలోని కుక్కునూరు మండలం, కాకినాడ జిల్లాలోని గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి, కోటనందూరు, పెద్దాపురం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాలు, పార్వతిపురం మన్యం జిల్లాలోని గరుగుబిల్లి, జియమ్మవలస, కొమరాడ, వీరఘట్టం మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని పేర్కొంది.

గ్రామ స్థాయిలోనే కరోనాకు వైద్యం

- వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షలో సీఎం జగన్ ఆదేశం
- విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ సేవలను వినియోగించుకోవాలి
- ఫీవర్ సర్వే ద్వారా అనుమానిత లక్షణాలున్న వారికి పరీక్షలు

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా మరోసారి కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా వ్యవహరించాలని వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. కోవిడ్ కేసులు పెరిగితే గ్రామ స్థాయిలోనే పరీక్షలు నిర్వహించడంతోపాటు అక్కడే మందులు సహా వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైరస్ సోకితే వెంటనే పెద్దాస్పత్రులకు తరలించేలా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్దేశించారు. ఎప్పటికప్పుడు దేశవ్యాప్తంగా కేసుల సంఖ్య, వ్యాప్తి తీరును గమనిస్తూ అప్రమత్తంగా ఉంటూ వైరస్ కట్టడికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన సీఎం జగన్ కోవిడ్ కట్టడి చర్యలు, నూతన మెడికల్ కాలేజీల పనుల పురోగతిని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆ వివరాలివీ..


ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఇటు ఫీవర్ సర్వే.. అటు ఫ్యామిలీ డాక్టర్

వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ సేవలను సమర్థంగా వినియోగించుకుంటూ వైరస్ వ్యాప్తిని అడ్డుకోవాలి. బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఈ వ్యవస్థలు ఎంతో దోహదం చేస్తాయి. ఫీవర్ సర్వే ద్వారా లక్షణాలు గుర్తించిన వారికి వైరస్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి. జ్వరం, ఇతర లక్షణాలతో బాధపడుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పరిశీలించాలి. ప్రతి విలేజ్ క్లినిక్‌కూ సరిపడా టెస్టింగ్ కిట్స్, మందులు అందుబాటులో ఉంచాలి. ప్రస్తుత వేరియంట్‌కు అనుగుణంగా మందులను సమకూర్చుకోవాలి. ల్యాబ్‌లన్నింటినీ పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలి.

49వ విడత ఫీవర్ సర్వే

సమీక్ష సందర్భంగా రాష్ట్రంలో వైరస్ వ్యాప్తి, నివారణ చర్యల గురించి అధికారులు వివరించారు. పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, ఆందోళనకర పరిస్థితులేమీ లేవని వెల్లడించారు. గ్రామస్థాయిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో కరోనా టెస్టింగ్ ర్యాపిడ్ కిట్‌లు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ర్యాపిడ్ టెస్ట్‌లో పాజిటివ్ అని తేలితే వెంటనే ఆర్టీపీసీఆర్‌కు నమూనాలు పంపుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 49వ విడత ఫీవర్ సర్వే కొనసాగుతోందన్నారు. సర్వే ద్వారా అనుమానిత లక్షణాలున్న వారిని గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఆస్పత్రుల్లో ఆక్సిజన్ పైప్ లైన్లు, పీఎస్ఏ ప్లాంట్లు, సిలిండర్లు, కాన్సన్ట్రేటర్లను తనిఖీ చేసి సిద్ధంగా ఉంచుతున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రయాణికుల నుంచి ర్యాపిడ్ శాంపిళ్లను సేకరించేందుకు విమానాశ్రయాల్లో ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

షెడ్యూల్ ప్రకారం మెడికల్ కాలేజీల పనులు

కొత్త వైద్య కళాశాలల నిర్మాణ పనులపై సీఎం సమీక్షించారు. మొదటి ప్రాధాన్యతతో ప్రారంభించనున్న విజయనగరం, మచిలీపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు, నంద్యాల మెడికల్ కాలేజీల పనులు షెడ్యూల్ ప్రకారం సజావుగా జరుగుతున్నట్లు అధికారులు వివరించారు. మిగిలిన కళాశాలల్లో పనులను నిర్దేశించిన ప్రకారం ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. పలాసలో కిడ్నీ స్పెషాల్టీ హాస్పిటల్, కర్నూలులో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, కడపలో జీజీహెచ్ సూపర్ స్పెషాలిటీ, క్యాన్సర్ విభాగంతో సహా మూడు బ్లాకులు తుది దశలో నిర్మాణంలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, ఆర్థిక శాఖ కార్యదర్శి గుల్జార్, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ సాంబశివారెడ్డి, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎండీ మురళీధర్ రెడ్డి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్, ఔషధ నియంత్రణ విభాగం డీజీ రవి శంకర్, డీఎంఈ డాక్టర్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకూ 'టోఫెల్'

▶ మొదటి పేజీ తరువాయి

ఆత్మవిశ్వాసంతో తీర్చిదిద్ది పోటీ పరీక్షల్లో రాణించేలా చిన్న నాటి నుంచే టోఫెల్ (టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ యాజ్ ఏ ఫారిన్ లాంగ్వేజ్) పరీక్షకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యుత్తమ ఆంగ్ల నైపుణ్యాలు, సామర్థ్యాలు అలవడేలా తగిన శిక్షణ ఇచ్చి టోఫెల్ పరీక్షలకు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. దీని ద్వారా 3 నుంచి 5 తరగతి విద్యార్థులకు ప్రైమరీ స్థాయిలో, 6 నుంచి 9 తరగతుల వారికి జూనియర్ స్థాయిలో టోఫెల్ పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులకు సర్టిఫికెట్లు అందించనున్నారు. ప్రైమరీ స్థాయిలో వినడం, చదవడంలో నైపుణ్యాలపై పరీక్ష ఉంటుంది. జూనియర్ స్థాయిలో వీటికి అదనంగా మాట్లాడటంలో నైపుణ్యాలను కూడా పరీక్షిస్తారు. ఈ పరీక్షల కోసం విద్యార్థులు, టీచర్లను సన్నద్ధం చేసేలా ఇ – కంటెంట్‌ను రూపొందించాలని సీఎం జగన్ ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతి విద్యార్థీ అత్యున్నత శిఖరాలు అధిరోహించేలా ముందడుగు వేస్తున్నట్లు సీఎం జగన్ తెలిపారు. విద్యార్థుల చదువులకు అన్ని దశల్లో అండగా ఉంటూ నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. పాఠశాల విద్య మొదలుకొని ఉన్నత విద్యవరకు ఎక్కడా చదువులు ఆర్థికంగా భారం కాకుండా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని చెప్పారు. ఏ ఒక్క విద్యార్థీ, ఏ కారణంతోనూ చదువులకు దూరం కాకుండా, డ్రాపౌట్లు అనే ప్రసక్తే లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో క్షేత్రస్థాయిలో విద్యాశాఖను సమన్వయం చేశామన్నారు. పిల్లలు పాఠశాలకు గైర్హాజరైతే తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో పాటు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, టీచర్లు వారితో మాట్లాడి బడికి పంపేలా పటిష్ట వ్యవస్థను తీసుకొచ్చామని తెలిపారు. విద్యారంగంపై సోమవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు అంశాలపై అధికార యంత్రాంగానికి మార్గనిర్దేశం చేశారు. ఆ వివరాలివీ..

స్కూల్ పిల్లలకు 'టోఫెల్' పరీక్షలు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యుత్తమ ఆంగ్ల నైపుణ్యాలు, సామర్థ్యాలు అలవడేలా తగిన శిక్షణ ఇచ్చి టోఫెల్ పరీక్షలకు సిద్ధం చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. 3 నుంచి 5 తరగతి ప్రైమరీ విద్యార్థులకు టోఫెల్ ప్రైమరీ పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్ అందించాలన్నారు. 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు జూనియర్ టోఫెల్ పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులకు జూనియర్ స్టాండర్డ్ టోఫెల్ సర్టిఫికెట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మొత్తం మూడు దశల్లో పరీక్షలు ఉంటాయి. ప్రైమరీ స్థాయిలో లిజనింగ్, రీడింగ్ నైపుణ్యాల పరీక్ష ఉంటుంది. జూనియర్ స్టాండర్డ్ స్థాయిలో లిజనింగ్, రీడింగ్, స్పీకింగ్ నైపుణ్యాలను పరీక్షిస్తారు. ఈ పరీక్షల కోసం విద్యార్థులు, టీచర్లను సన్నద్ధం చేసేలా ఇ – కంటెంట్‌ను రూపొందించాలని సీఎం ఆదేశించారు.

నిరంతరం ట్రాకింగ్

విద్యార్థులు ప్రతి రోజూ తరగతులకు హాజరై అభ్యసన ప్రక్రియ అవాంతరాలు లేకుండా సాఫీగా సాగేలా చూడడం, నాణ్యతా ప్రమాణాలు పెరిగేలా బోధనాభ్యసన ప్రక్రియలను ట్రాకింగ్ చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. 'సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో విద్యాశాఖ ఇప్పటికే సినర్జీతో ఉంది. దీన్ని మరింత సమర్థంగా వినియోగించుకోవాలి. పిల్లలు పాఠశాలలకు గైర్హాజరైన పక్షంలో తల్లిదండ్రులకు వెంటనే మెసేజ్ వెళుతోంది. దీంతో తమ పిల్లలు సక్రమంగా స్కూళ్లకు వెళ్లేలా చర్యలు తీసుకోగలుగుతున్నారు. వలంటీర్ నుంచి సచివాలయ సిబ్బంది, టీచర్లు తల్లిదండ్రులను కలుసుకుంటూ పిల్లలను పాఠశాలలకు పంపేలా ప్రోత్సహించడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. విద్యారంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. ప్రతి ఒక్క విద్యార్థికీ నాణ్యమైన చదువులు అందేలా ఎక్కడా రాజీ లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆర్థిక స్తోమత లేనందున పిల్లలను చదించుకోలేకపోతున్నామనే పరిస్థితి తలెత్తకుండా అర్హత కలిగిన ప్రతి తల్లికీ పిల్లలను బడికి పంపేలా అమ్మ ఒడి అందిస్తున్నాం. ఇంటర్మీడియట్ వరకూ అమ్మ ఒడిని వర్తింపచేశాం. ఆ తర్వాత కూడా ఉన్నత చదువులు అభ్యసించేలా విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను అమలు చేస్తున్నాం. తల్లిదండ్రులపై నయాపైసా కూడా ఫీజుల భారం లేకుండా ప్రభుత్వమే జగనన్న విద్యాదీవెన కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తోంది. విద్యార్థుల వసతి, రవాణా, భోజన ఖర్చుల కోసం ఏటా రూ.20వేల వరకు ఇస్తున్నాం. ఇలా ప్రతి దశలోనూ చదువులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రతి విద్యార్థికీ ఈ తోడ్పాటు అందేలా ట్రాక్ చేస్తున్నాం. డ్రాపౌట్ అనే ప్రశ్నే ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. దీనిపై ఎప్పటికప్పుడు సమర్థంగా పర్యవేక్షణ కొనసాగించాలి' అని సమీక్షలో సీఎం సూచించారు.

విద్యాకానుక కిట్లు..

జగనన్న విద్యాకానుక 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి అన్ని వస్తువులను ముందుగానే సిద్ధం చేసి ఉంచాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. పుస్తకాల ముద్రణ ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించగా మే 15 నాటికి అన్ని రకాలుగా సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు.

నైపుణ్యాలు పెంపొందించేలా సబ్జెక్టు టీచర్లు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మూడో తరగతి నుంచే అలవడాల్సిన నైపుణ్యాలు, సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు సబ్జెక్టు టీచర్ల విధానాన్ని తెచ్చామని సీఎం జగన్ తెలిపారు. దీనివల్ల పాఠశాల దశనుంచే పిల్లలకు ప్రతి సబ్జెక్టులో పట్టు లభించి చక్కటి పునాది ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా సబ్జెక్టు టీచర్లకు మెరుగైన బోధన పద్ధతులపై ఐఐటీ మద్రాస్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ కోర్సుల నిర్వహణకు అధికారులు ప్రతిపాదించగా సీఎం అందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధనా పద్ధతుల్లో నైపుణ్యాలను మెరుగుపరిచేలా కోర్సు ఉంటుందని, వచ్చే రెండేళ్ల పాటు సర్టిఫికెట్ కోర్సు కొనసాగుతుందని అధికారులు వివరించారు. 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఈ వేసవిలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాల ద్వారా బోధనా నైపుణ్యాలు మరింత మెరుగుపడి పిల్లలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, అత్యున్నత ప్రమాణాలు సాధించగలుగుతామని సీఎం పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో పిల్లల సంఖ్యకు తగినట్టుగా టీచర్లు ఉండాలని స్పష్టం చేశారు. దీనిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా టీచర్లను నియమించాలని ఆదేశించారు. ఎక్కడా కూడా టీచర్లు సరిపోలేదన్న మాటే రాకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యాబోధనకు సంబంధించి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ) ఏర్పాటుపై సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. వచ్చే జూన్ నాటికి నాడు – నేడు తొలిదశ పూర్తైన స్కూళ్లలో తరగతి గదుల్లో ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలకు సీబీఎస్ఈ అఫిలియేషన్ పూర్తిస్థాయిలో చేయాలన్నారు. ఇప్పటికే వెయ్యి ప్రభుత్వ స్కూళ్లు అఫిలియేట్ అయ్యాయని, మిగిలిన వాటికి కూడా అఫిలియేషన్ పొందేలా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో రెండో దశ నాడు – నేడు పనులపైనా సీఎం సమీక్షించారు. ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టి ముందుకు వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు.

ట్యాబ్‌లకు తక్షణమే మరమ్మతులు

8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ, వినియోగిస్తున్న తీరుపై సీఎం సమీక్షించి కొన్ని సూచనలు జారీచేశారు. ట్యాబ్‌లకు మరమ్మతులు అవసరమైతే వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ట్యాబ్‌లకు సంబంధించి ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే ఫిర్యాదు చేయడానికి వీలుగా ఒక నంబరును స్కూల్‌లో ప్రదర్శించాలని సీఎం ఆదేశించారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఎస్‌వోపీ రూపొందించి అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సమస్య తలెత్తితే రెండు మూడు రోజుల్లోనే పరిష్కరించి తిరిగి విద్యార్థులకు అప్పగిస్తున్నట్లు వివరించారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుంటూ సీఎం ఆదేశాల మేరకు పకడ్బందీగా చర్యలు తీసుకోవడం ద్వారా పదో తరగతి పరీక్షలను సమర్థంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎక్కడా లీకేజీలు, మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా సజావుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాలను నో మొబైల్ జోన్స్‌గా ప్రకటించినట్లు తెలిపారు. ప్రశ్న పత్రాల్లో క్యూ ఆర్ కోడ్ ఇవ్వడం ద్వారా లీకేజీలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ పరీక్షల్లో కూడా ఇలాంటి చర్యలే తీసుకోవడంతో సజావుగా ముగిశాయన్నారు. సమీక్షలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ ప్రభుత్వ సలహాదారు ఏ.సాంబశివారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్, ఇంటర్ విద్య కమిషనర్ ఎంవీ శేషగిరిబాబు, పాఠశాల విద్యాశాఖ(మౌలిక వసతులు) కమిషనర్ కాటమనేని భాస్కర్, సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలకు రామోజీ అతీతుడా..!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రుడెన్షియల్ బ్యాంకుల నుంచి బిచాణా ఎత్తేసిన బ్యాంకులన్నీ ఇలా చేసినవే కదా?

మార్గదర్శి చిట్స్‌లో ప్రస్తుతం వేలకోట్ల రూపాయల మనీ లాండరింగ్, అక్రమ నిధుల మళ్లింపు జరుగుతున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరుపుతోంది. నిజాలు బయటికొస్తున్నాయి. కానీ దీన్ని ఈ నిజాలు వెలుగుచూడకుండా 86 ఏళ్ల రామోజీరావు కొత్త నాటకానికి తెరతీశారు. 'ఈనాడు' పత్రికను అడ్డంపెట్టుకుని, తటస్థుల ముసుగులో తన వాళ్లను తెరపైకి తెస్తున్నారు. అడ్డగోలు బుకాయింపులకు దిగుతున్నారు. మార్గదర్శిపై ఏ ఒక్క ఫిర్యాదూ రాలేదు కదా? అలాంటపుడు సీఐడీ విచారణ ఎందుకంటున్నారు. 'ఈనాడు' పత్రికలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు వస్తున్నందుకే ప్రభుత్వం కక్ష గట్టి ఇలా చేస్తోందని... తన వాళ్లచేత కేంద్రానికి లేఖలు కూడా రాయిస్తున్నారు.

ఇక్కడ మార్గదర్శిలో చిట్లు వేస్తున్నవారు, డిపాజిటర్లు గమనించాల్సింది ఒక్కటే. యావత్తు దేశాన్ని కుదిపేసి దివాలా తీసిన శారదా చిట్‌ఫండ్స్‌గానీ, వేల మందిని ముంచేసిన సుదర్శన్ చిట్స్‌గానీ కూలిపోవటానికి ముందు చాలా బలంగా కనిపించినవే కదా? కూలిపోయేదాకా వాటిపై ఎవ్వరూ ఎలాంటి ఫిర్యాదులూ చేయలేదే!!. ఎవ్వరూ ఫిర్యాదు చేయకపోబట్టే... చట్టాలు ఉల్లంఘిస్తున్నా అక్కడి ప్రభుత్వాలు పట్టించుకోకపోవటం వల్లే అవి కుప్పకూలాయి. వేల మంది దాచుకున్న కష్టార్జితాన్ని స్వాహా చేసేశాయి. ఇలాంటి పరిస్థితుల్లో మార్గదర్శి చిట్స్‌ను... చట్టప్రకారం నడుచుకోవాలని కోరటం తప్పా? చట్టాలను అనుసరించాలని అడగటం నేరమా? ఇదెక్కడి తీరు!!.

అయినా డిపాజిట్లు సేకరించకూడదన్న ఆర్‌బీఐ నిబంధనల్ని ఉల్లంఘించినందుకు ఎన్ని ఎన్‌బీఎఫ్‌సీలు మూతపడలేదు? కనీసం మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎన్‌బీఎఫ్‌సీ (నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ)లు కూడా కాదు. ఒక 50 మంది చిట్ సభ్యులుంటే... ప్రతినెలా ప్రతి ఒక్కరి దగ్గరా సొమ్ములు వసూలు చేసి.. వాటిని చిట్ పాడుకున్న ఎవరో ఒక్కరికి ఆ నెల్లోనే ఇవ్వటం దాని పని. మరి ప్రతినెలా అలా ఎవరి చిట్ల డబ్బులు వాళ్లకు ఇచ్చేస్తున్నపుడు వేల కోట్ల రూపాయల మిగులు మొత్తాలు దానిదగ్గర ఎలా ఉంటాయి? వాటిని తన సొంత సంస్థల్లోకి మళ్లించే అధికారం ఎవరిచ్చారు? వాటిని స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్‌చేసే అధికారం ఎక్కడి నుంచి వచ్చింది? ఇవన్నీ ఉల్లంఘనలు కావా?

పత్రికాధిపతి... వ్యాపారవేత్త అనే రెండు టోపీల్ని రామోజీరావు ధరిస్తుంటారని... వ్యాపారాల్లో అక్రమాలేవైనా బయటపడినపుడి ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోబోయినపుడల్లా... అది పత్రికా స్వేచ్ఛపై దాడి అంటూ ఎదురుదాడికి దిగుతారని సాక్షాత్తూ ఈ దేశ సర్వోన్నత న్యాయస్థానమే గతంలో చెప్పింది. గతమంతా రామోజీ చేసింది ఇదే. కాకపోతే ఇపుడలా మాటలు పనిచేయటం లేదు. నమ్మేవారెవరూ లేరు. దీంతో ఆ మాటలు తాను చెప్పకుండా... తటస్థుల ముసుగులో తనకు కొమ్ముకాసే కొందరితో చెప్పిస్తున్నారు. అయినా అక్రమాలు చేస్తున్న మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై చర్యలు తీసుకుంటుంటే మధ్యలో ఈ తటస్థులెవరు? వీళ్లేమైనా మార్గదర్శిలో చిట్లు వేస్తున్నవారా? వీళ్లకేం సంబంధం? వీళ్లకసలు అక్రమాలకు పాల్పడుతున్న రామోజీని రక్షించే బాధ్యతను ఎవరిచ్చారు? రామోజీరావా... చంద్రబాబు నాయుడా?



ఈ చట్టాలు చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాదే?

కేంద్ర చిట్‌ఫండ్ చట్టం–1982, రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం–1999లను ఉల్లంఘించి నిధులు మళ్లించినట్టు, అక్రమ డిపాజిట్లు సేకరించినట్టు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ సోదాల్లో ఆధారాలతో సహా వెల్లడైంది. చందాదారులు, డిపాజిట్‌దారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఆ శాఖ అధికారుల ఫిర్యాదుతో సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. దీన్ని వక్రీకరిస్తూ రామోజీరావు మీడియా, చంద్రబాబు పార్టీ గగ్గోలు పెడుతున్నాయి. నిజానికి ఈ రెండు చట్టాలూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసినవేమీ కావు. చిట్‌ఫండ్ చట్టాన్ని కేంద్రం 1982లో రూపొందించింది. ఇక ఏపీ డిపాజిటర్ల హక్కుల పరిరక్షణ చట్టాన్ని తెచ్చింది 1999లో చంద్రబాబు ప్రభుత్వమే. వాటిని అమలు చేస్తుంటే... దాన్ని రామోజీరావుపై వేధింపులుగా వక్రీకరిస్తున్నారు.

చిట్‌ఫండ్ చట్టాన్ని ఉల్లంఘిస్తే ఆ తరవాత దివాలాయే!!

చిట్‌ఫండ్ చట్టాన్ని, డిపాజిటర్ల చట్టాన్ని ఉల్లంఘిస్తే ఏమవుతుందన్నట్లుగా రామోజీరావు, ఆయన మనుషులు, టీడీపీ ప్రజల్ని తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తున్నాయి. సామాన్యుల డబ్బు భద్రంగా ఉండటం కోసం చేసిన ఆ చట్టాలను ఉల్లంఘిస్తే ఏమవుతుందో... దేశంలో బట్టబయలైన ఎన్నో చిట్‌ఫండ్ కుంభకోణాలు, ప్రైవేట్ బ్యాంకుల ఆర్థిక దోపిడీలు నిరూపించాయి కూడా...

అన్నింటినీ మించిపోయిన మార్గదర్శి

శారదా చిట్‌ఫండ్, అగ్రిగోల్డ్, కృషి బ్యాంక్, ప్రుడెన్షియల్ బ్యాంక్ కుంభకోణాలను తలదన్నే రీతిలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతోందని ఆధారాలతో సహా వెల్లడైంది. స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు గత ఏడాది నవంబరు, డిసెంబరులలో మార్గదర్శి చిట్స్ కార్యాలయాల్లో నిర్వహించిన సోదాల్లో ఈ అక్రమాలు వెలుగుచూశాయి. అనంతరం సీఐడీ అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన సోదాల్లోనూ ఈ అక్రమాలు ధ్రువపడ్డాయి.

- **రశీదు ముసుగులో అక్రమ డిపాజిట్లు:** చందాదారులు పాడిన చిట్ మొత్తాన్ని వారికి వెంటనే చెల్లించడం లేదు. ఆ మొత్తంపై 4 నుంచి 5 శాతం వరకు వడ్డీ చెల్లిస్తామని చెబుతూ ఓ రశీదు ఇస్తున్నారు. అంటే మార్గదర్శి సంస్థ ఆ చిట్ మొత్తాన్ని డిపాజిట్‌గా స్వీకరిస్తోంది. ఇది రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు విరుద్ధం. చిట్‌ఫండ్ కంపెనీలు డిపాజిట్లు స్వీకరించడం నేరం. మార్గదర్శి చిట్స్ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా ' ప్రత్యేక రశీదు' ముసుగులో డిపాజిట్లు సేకరిస్తోంది. ఈ అక్రమ డిపాజిట్లు ఎన్ని వేల కోట్లు అన్నది లెక్కతేలాల్సి ఉంది.
- **గతంలో రూ.15వేల కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరణ:** మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట అక్రమ డిపాజిట్లు సేకరించిన నేర చరిత్ర మార్గదర్శి గ్రూపునకు ఉంది. గతంలో అక్రమంగా సేకరించిన రూ.15వేల కోట్ల డిపాజిట్లపై ఆదాయపన్ను చెల్లించాలని ఆదాయపన్ను శాఖ నోటీసులు కూడా ఇచ్చింది. దాంతో హడావుడిగా మార్గదర్శి ఫైనాన్సియర్స్‌ను మూసేశారు. కేసు దర్యాప్తులో ఉండగా సంస్థను మూసివేయడం అంటే ఆధారాలను ధ్వంసం చేయడమే. అది క్రిమినల్ నేరం.
- **చందాదారుల సొమ్ము సొంత పెట్టుబడిగా...:** మార్గదర్శి చిట్స్‌కు మూడు అనుబంధ కంపెనీలున్నట్టుగా బ్యాలన్స్ షీట్లో పేర్కొన్నారు. మార్గదర్శి చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్–చెన్నై, మార్గదర్శి చిట్స్ (కర్ణాటక) ప్రైవేట్ లిమిటెడ్–బెంగళూరు, ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్– హైదరాబాద్‌లను అనుబంధ కంపెనీలుగా చూపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులను మళ్లించడానికే ఈ కథ. ఒక్క ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లోనే 88.5 శాతం వాటాకోసం పెట్టుబడి పెట్టినట్టు నిర్ధారణ అయ్యింది. అంటే రామోజీరావు కుటుంబం రూపాయి పెట్టకుండా...చందాదారుల సొమ్ముతోనే సొంత వ్యాపారాలు చేస్తున్నారు. అసలు చిట్ ఫండ్ కంపెనీలు ఇతర వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టడం చిట్ ఫండ్ చట్టం–1982కు విరుద్ధం.
- మార్గదర్శి చిట్స్ కార్యాలయాల నుంచి భారీగా నిధులను మార్గదర్శి ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ నిధులను మార్గదర్శి యాజమాన్యం మార్కెట్ రిస్క్ అత్యధికంగా ఉండే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడిగా పెడుతోంది. ఇది చిట్ ఫండ్ చట్టానికి విరుద్ధం.
- **రికార్డుల కనికట్టు...:** చట్ట విరుద్ధంగా చేస్తున్న ఈ మోసాన్ని కప్పిపుచ్చేందుకు మార్గదర్శి చిట్స్ రికార్డుల్లో భారీ అవకతవకలకు పాల్పడుతోంది. చందాదారుల సొమ్ము చెక్కుల రూపంలో తమ వద్ద ఉన్నట్టుగా బ్యాలన్స్‌షీట్‌లో చూపిస్తోంది. ఏటా మార్చి 31న వందల కోట్ల రూపాయలు చెక్కులు వచ్చినట్టు చూపిస్తోంది. కానీ ఆ చెక్కులు ఎన్నిరోజులైనా క్యాష్ కావు. అంటే... అవి బోగస్ చెక్కులన్నమాట. అప్పటికే ఆ సొమ్మును మనీ లాండరింగ్ చేసేశారన్నది స్పష్టంగా తెలియకమానదు.
- **ఏపీ ప్రజల సొమ్ము... పెత్తనం పక్క రాష్ట్రంలో:** రాష్ట్రంలో మార్గదర్శి చిట్స్‌కున్న 37 బ్రాంచీల్లో ఏడు బ్రాంచిల్లో చందాదారులు చెల్లించిన మొత్తం అక్కడి బ్యాంకుల్లో లేదు. ఆ సొమ్మంతా నిబంధనలకు విరుద్ధంగా పక్క రాష్ట్రానికి తరలించేస్తున్నారు. రాష్ట్రంలోని మార్గదర్శి ఫోర్‌మేన్‌కు చట్ట ప్రకారం ఉండాల్సిన చెక్ పవర్‌తో సహా ఎలాంటి అధికారాలూ లేవు. బ్యాంకు వ్యవహారాలు, చెక్ పవర్ అంతా హైదరాబాద్‌లోని మార్గదర్శి ఎండీ శైలజతో పాటు ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలోని 11మందికే ఉంది. ఇక్కడి చందాదారుల సొమ్ము భద్రత గురించి అడిగితే తనకు తెలియదని ఫోర్‌మెన్ చెబుతున్నారు. హైదరాబాద్ వెళ్లి అడిగితే... తెలంగాణలో ఉంది కనక అది ఏపీ అధికారుల పరిధిలోకి రాదని చెబుతున్నారు. మరీ ఏపీ చందాదారుల సొమ్ముకు బాధ్యులెవరని అడిగితే... సమాధానం లేదు.
- **ఒక్క బ్యాంకు ఖాతా చాలట...:** చిట్‌ఫండ్ సంస్థలు తాము నిర్వహించే ప్రతి చిట్టీకీ సంబంధిత బ్యాంకు ఖాతా వివరాలివ్వాలి. మార్గదర్శి దీన్ని పట్టించుకుంటే ఒట్టు. అన్ని చిట్లకూ ఒకే బ్యాంకు ఖాతా. ఏపీకి సంబంధించి ప్రత్యేక ఖాతా కూడా లేదు.
- **ఇదో పోంజీ తరహా స్కామ్:** మార్గదర్శి చిట్స్ పోంజీ స్కీమ్‌కు తక్కువేమీ కాదు. చిట్టీల్లో 30 – 40శాతం టికెట్లు(సభ్యత్వాలు) యజమాన్యానివే. వాటికి తన తరఫున చెల్లించాల్సిన చందాలను చెల్లించడం లేదు. కొత్త చిట్లు, ఇతర చిట్ల నుంచి వచ్చిన సొమ్మును తాము చెల్లించినట్టుగా రికార్డుల్లో చూపిస్తోంది. వాటిపై మళ్లీ 5 శాతం కమీషన్ తీసుకుంటోంది. అంటే... ఏ రోజైనా కొత్తగా వచ్చే చందాదారులు తగ్గినా, కొత్త చిట్లు ఆగినా మార్గదర్శి తన తరఫున చెల్లించాల్సిన చందాను చెల్లించే పరిస్థితి ఉండదు. అప్పుడు చిట్ పాడుకున్నవారికి సొమ్ము చెల్లించే అవకాశమూ ఉండదు. అదేరోజున దివాలా తీసే ప్రమాదం ఉంటుంది.

ఒక్క రూపాయి చెల్లించకుండా... తమపేరిట చిట్టీలు

సాధారణంగా ప్రతి చిట్‌కూ నిర్ణీత చందాదారుల సంఖ్య ఉంటుంది. కొన్ని గ్రూపుల్లో తక్కువ మంది సభ్యులు (టికెట్లు) చేరితే కొన్ని ఖాళీగా ఉండిపోతాయి. ఆ ఖాళీ టికెట్స్‌ను కంపెనీ తీసుకోవాలి. వాటి చందాను కంపెనీ చెల్లించాలి. తరవాత కొత్త చందాదారులు చేరితే ఆ మేరకు టికెట్స్ భర్తీ చేయొచ్చు. చిట్‌ఫండ్ చట్టంలోని ఈ నిబంధనలను మార్గదర్శి ఏనాడూ పట్టించుకోలేదు. గరిష్ఠంగా ఒకో గ్రూపులో 50% వరకూ టికెట్లు కంపెనీవే ఉన్నాయి. వాటికోసం మార్గదర్శి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. చిట్లపై తమకు వచ్చే డిస్కౌంట్ల మొత్తాన్ని డూప్లికేట్ చేసి అన్నిచోట్లా రికార్డుల్లో చూపిస్తోంది.

నిధులు మళ్లించామని అంగీకరించిన రామోజీ

సీఐడీ దర్యాప్తులో... తాము మార్గదర్శి చిట్స్ నిధులను ఇతర సంస్థలకు మళ్లించామని రామోజీరావే అంగీకరించారు. ఆధారాలతోసహా సీఐడీ అధికారులు ప్రశ్నించేసరికి ఆయన నోటమాట రాలేదు. దాంతో నిధులు మళ్లించింది వాస్తవమేనని అంగీకరిస్తూనే అది తమ ఆర్థిక ప్రణాళిక అన్నట్టుగా బుకాయించేందుకు ప్రయత్నించారు. ఈ కేసులో ఏ–1గా ఉన్న రామోజీరావే అక్రమాలు నిజమేనని సమ్మతించిన తరువాత ... మళ్లీ వక్రీకరిస్తూ వితండవాదనలెందుకు?

చట్టాలు తమకు వర్తించవన్న శైలజ

మామ కంటే రెండు ఆకులు ఎక్కువ చదివానన్నట్టుగా ఏ–2 చెరుకూరి శైలజ వ్యవహరించారు. అసలు చిట్‌ఫండ్ చట్టం తమకు వర్తించదని... తాము పట్టించుకోమని ఆమె సీఐడీ అధికారుల వద్దే వ్యాఖ్యానించడం తీవ్రమైన అంశమని నిపుణులు చెబుతున్నారు. కంపెనీల చట్టాన్ని అనుసరిస్తున్నామన్న ఆమె... పోనీ ఆ చట్ట ప్రకారమైనా అనుబంధ కంపెనీలకు నిధుల మళ్లించడం నేరమే కదా అని అంటే మాత్రం సమాధానమివ్వలేదు.

ఏ ఆధారాలతో మాట్లాడారు?

- వచ్చి వివరణ ఇవ్వండి
- మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కేసును తప్పుబట్టిన వారికి సీఐడీ నోటీసులు

సాక్షి, అమరావతి : మార్గదర్శి అక్రమ వ్యవహారాల కేసులో సీఐడీ కీలక నిర్ణయం తీసుకుంది. నిధుల అక్రమ మళ్లింపు, అక్రమ పెట్టుబడుల వ్యవహారాల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవహారాలను సమర్థిస్తూ సదస్సులు, సమావేశాల్లో మాట్లాడుతున్న వారికి, లేఖలు రాస్తున్న వారికి, ప్రకటనలు ఇస్తున్న వారికి నోటీసులు జారీచేస్తోంది. ఏ ఆధారాలతో ఏ ప్రాతిపదికన అలా మాట్లాడారో వచ్చి వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో సీఐడీ పేర్కొంది. మార్గదర్శి చిట్‌ఫండ్ వ్యవహారాలన్నీ సక్రమమే.. కేవలం రామోజీరావును వేధించేందుకే ఈ కేసు పెట్టారని జీవీఆర్ శాస్త్రి అనే ప్రొఫెసర్ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఆయనకూ నోటీసు ఇవ్వాలని సీఐడీ విభాగం నిర్ణయించింది. అసలు కేంద్ర చిట్‌ఫండ్ చట్టం, ఏపీ డిపాజిటర్ల హక్కుల పరిరక్షణ చట్టాల గురించి ఏం తెలుసు.. ఆ చట్టాలను మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఉల్లంఘించలేదని ఎలా చెప్పగలుగుతున్నారని సీఐడీ ఆయన్ని ప్రశ్నించనుంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక వ్యవహారాలు, రికార్డుల నిర్వహణ అంతా సక్రమంగా ఉందని ఏ ప్రాతిపదికన లేఖ రాశారో కూడా ఆయన వివరణ కోరనుంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై సీఐడీ నమోదు చేసిన కేసును తప్పుబడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాంతాలతోపాటు హైదరాబాద్‌లో సదస్సులు, సమావేశాల్లో ప్రసంగించిన ఆడిటర్లు, న్యాయవాదులు, ఇతర రంగాలకు చెందిన వారికి కూడా సీఐడీ నోటీసులు జారీచేయనుంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ చట్టాలను ఉల్లంఘించ లేదనడానికి వారివద్ద ఉన్న ఆధారాలను సమర్పించాలని ఆదేశించనుంది.

వివరణలను రికార్డ్ చేయనున్న సీఐడీ

ఇక మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాలపై ఓ వైపు సీఐడీ దర్యాప్తు.. మరోవైపు న్యాయస్థానంలో విచారణ కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ కేసులో ఏ–1గా ఉన్న చెరుకూరి రామోజీరావు, ఏ–2గా ఉన్న చెరుకూరి శైలజలు ఎలాంటి తప్పుచేయలేదని, చట్టాలను ఉల్లంఘించలేదని ఏ ప్రాదిపదికన, ఏ ఆధారాలతో మాట్లాడారో వారు వివరించాల్సి ఉంది. నోటీసులకు వారు వ్యక్తిగతంగా హాజరై ఇచ్చే వివరణను పూర్తిగా ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలని సీఐడీ నిర్ణయించింది. తద్వారా ఈ కేసు దర్యాప్తులో ఆ అంశం కీలకంగా మారుతుందన్నది సీఐడీ ఉద్దేశం. ఆధారాలు లేకుండా.. కేవలం సీఐడీపై దుష్ప్రచారం చేసేందుకు వారు నిరాధారణ ఆరోపణలు చేసినట్లు తేలితే తదనుగుణంగా తదుపరి చర్యలు తీసుకోవాలని సీఐడీ భావిస్తోంది.


విజయనగరం జిల్లా ధర్మవరంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పాలనపై మహిళ అభిప్రాయాన్ని సేకరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


తిరుపతి 27వ డివిజన్‌లో ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటున్న నగర మేయర్ డాక్టర్ శిరీష, పార్టీ నేతలు


గుంటూరు జిల్లా తాడికొండ మండలం లాం గ్రామంలో మహిళల అభిప్రాయం తెలుసుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా


కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గంలోని దేవమాడలో ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్


ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో వృద్ధురాలి నుంచి వివరాలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను


విశాఖలో స్టిక్కర్లు అంటిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


పశ్చిమగోదావరి జిల్లా ఆచంటలో ఓ ఇంటి వద్ద సర్వే చేస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు


విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో సీఎం జగన్ స్టిక్కర్‌కు క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగుడు అద్దేపల్లి రాంబాబు

ఇంటింటా 'నమ్మకం'

▶ మొదటి పేజీ తరువాయి

సోమవారం కార్యక్రమానికి భారీ స్పందన లభించింది. అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, విద్యార్థులు, యువత ప్రతి ఒక్కరూ సీఎం జగన్ సంక్షేమ పాలనపై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం 46 నెలలుగా అందిస్తున్న పథకాలతో తమ జీవితాల్లో వెలుగులు నిండాయని పలువురు లబ్ధిదారులు ఆనందంగా చెబుతున్నారు. గృహ సారథుల నుంచి సీఎం జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లను తీసుకుని ఇంటి తలుపు, మొబైల్ ఫోన్‌కు అతికించి తమ నమ్మకం, భవిష్యత్తు, అంతా జగనన్నే అంటూ నినదిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన విషయం తెలిసిందే.

20 లక్షలకుపైగా మిస్డ్ కాల్స్..

ప్రజా సర్వేలో భాగంగా ప్రజా మద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలను గృహ సారథులు అడిగినప్పుడు.. ఈ ప్రభుత్వంలో తమకు రూ.లక్షల్లో ప్రయోజనం చేకూరిందని, వైఎస్ జగనే మళ్లీ సీఎం కావాలంటూ ప్రజలు తమ మనసులో మాట చెబుతున్నారు. సమాధానాలు నమోదు చేసి రసీదు తీసుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలియచేస్తూ స్వచ్ఛందంగా 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తున్నారు. ఆ వెంటనే కృతజ్ఞతలు తెలియచేస్తూ సీఎం జగన్ సందేశంతో ఐవీఆర్ఎస్ కాల్ రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'మెగా పీపుల్స్' సర్వేకి భారీ స్పందన లభిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజా మద్దతు పుస్తకంలో 28 లక్షలకు పైగా కుటుంబాలు పాల్గొన్నాయి. మూడు రోజుల్లో 20 లక్షలకు పైగా మిస్డ్ కాల్స్ వచ్చాయి.


'జగనన్నే మన భవిష్యత్' అని నినదిస్తూ గుంటూరులో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గుంటూరులో గళమెత్తిన విద్యార్థిలోకం

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): విద్యార్థులకు ఉన్నతంగా, ఉత్తమంగా, ఉచితంగా చదువుకునే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని విద్యార్థి లోకం నినదించింది. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో జగనన్నే మన భవిష్యత్తు అని నినదిస్తూ గుంటూరు వేదికగా విద్యార్థులు గళమెత్తారు. లాడ్జిసెంటర్ నుంచి హిందూ కాలేజ్ సెంటర్ వరకు జరిగిన ర్యాలీలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శంకర్‌విలాస్, ఓవర్ బ్రిడ్జి, ప్రభుత్వాసుపత్రి, ఏసీ కళాశాల మీదుగా ర్యాలీ కొనసాగింది. విద్యార్థులంతా జగన్ మామే తమ భవిష్యత్తు అని భావిస్తున్నారని పానుగంటి చైతన్య చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్, రీజనల్ కోఆర్డినేటర్ విఠల్, విద్యార్థి నేతలు రవి, గంటి, బాజి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.


'జగనన్నే మా భవిష్యత్' స్టిక్కర్‌ను అతికిస్తున్న కుప్పనపూడి టీడీపీ సర్పంచ్ అనూరాధ

స్టిక్కర్ అతికించిన టీడీపీ సర్పంచ్

ఆకివీడు: పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం కుప్పనపూడిలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. స్థానిక టీడీపీ సర్పంచ్ ముత్యాల అనూరాధ ఈ కార్యక్రమంలో స్వయంగా పాల్గొనడంతోపాటు వైఎస్ జగన్ ఫొటోతో ముద్రించిన స్టిక్కర్‌ను ఓ ఇంటి గోడపై అతికించడం విశేషం. కుప్పనపూడిలో నిర్మించిన సీసీరోడ్లను సోమవారం ప్రారంభించగా వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ ముత్యాల అనూరాధ హాజరయ్యారు. అనంతరం అక్కడ నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొని సర్పంచ్ స్వయంగా ఓ ఇంటికి సీఎం జగన్ ఫొటోతో ముద్రించిన స్టిక్కర్‌ను అతికించారు. వివక్ష లేకుండా పారదర్శకంగా లబ్ధి చేకూరుస్తున్న సీఎం జగన్‌కు ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు సైతం మద్దతు తెలియచేస్తున్నారని నరసింహరాజు పేర్కొన్నారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మేకా పార్వతి, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, ఎంపీటీసీ బంటుమిల్లి పుణ్యవతి, కౌన్సిలర్‌లు మోటుపల్లి కుమారి, గేదెల అప్పారావు, మాజీ సర్పంచ్ ముత్యాల శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



జగనన్నే మా నమ్మకం

ఈ ఫొటోలో కనిపిస్తున్న వారు సయ్యద్ బాబు, అతని కుమారుడు సయ్యద్ రసూల్. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని వాంబే కాలనీ ఎ–బ్లాక్ వద్ద నివాసం ఉంటున్నారు. చిన్నారి రసూల్‌కు మూగ, చెవుడు లోపం ఉంది. నెల రోజుల కిందట ప్రభుత్వం తరఫున సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.5.30 లక్షలు ఇవ్వడంతో రసూల్‌కు ఆపరేషన్ చేయించారు. ఆ కృతజ్ఞతతో తండ్రీ కొడుకులిద్దరూ వాంబేకాలనీ ఎ.బ్లాక్‌లో సోమవారం జరిగిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో పాల్గొని ఇలా స్టిక్కర్లు అతికిస్తూ తమ అభిమానం చాటుకున్నారు.

మే 3న భోగాపురం విమానాశ్రయానికి శంకుస్థాపన

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్


విష్ణుచక్రం గ్రామంలో పోర్టు శంకుస్థాపన స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రులు, నాయకులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం/సంతబొమ్మాళి: ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం సాకారమవుతోందని, రాష్ట్ర ప్రభుత్వం విజయనగరం జిల్లా భోగాపురం వద్ద అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మే 3వ తేదీన శంకుస్థాపన చేస్తారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మౌలిక వసతులశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. విమానాశ్రయ నిర్మాణానికి ప్రభుత్వం సేకరించిన భూములను మంత్రి సోమవారం పరిశీలించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ విమానాశ్రయ నిర్మాణానికి ఏర్పడిన అవాంతరాలు, అడ్డంకులు అన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించిందని తెలిపారు. 2,200 ఎకరాల విస్తీర్ణంలో విమానాశ్రయాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 2,195 ఎకరాల భూసేకరణ పూర్తి చేశామని, మిగిలిన భూసేకరణ కూడా త్వరలో పూర్తవుతుందని వివరించారు. 30 నెలల వ్యవధిలో విమానాశ్రయ నిర్మాణం పూర్తిచేయడమే లక్ష్యమని వెల్లడించారు.

19న భావనపాడు పోర్టుకు శంకుస్థాపన

భావనపాడు పోర్టు నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19న శంకుస్థాపన చేస్తారని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. ఆయన సోమవారం మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజుతో కలిసి శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేట పంచాయతీ విష్ణుచక్రం వద్ద పోర్టుకు శంకుస్థాపన స్థలం, హెలీప్యాడ్ ఏరియా, నౌపడలో సమావేశ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం అమర్‌నాథ్ మాట్లాడుతూ.. మచిలీపట్నం పోర్టుకు వచ్చే నెలలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకమని చెప్పారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అండగా నిలిస్తే అభాండాలా?

46 నెలల్లో 17.61 లక్షల మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు

వీటితో ప్రమేయం లేకుండానే ఈ-పంట నమోదు

దీని ప్రామాణికంగానే సంక్షేమ ఫలాలు

3.92 లక్షల మందికి రూ.529.07 కోట్ల పెట్టుబడి సాయం

9.83 లక్షల మందికి రూ.6,905.76 కోట్ల పంట రుణాలు

ఎప్పటిలాగే అసత్యాలతో 'ఈనాడు' దుష్ప్రచారం


సాక్షి, అమరావతి: గతంలో ఎన్నడూ లేనివిధంగా కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోంది. గత ప్రభుత్వాలు ఆలోచన కూడా చేయని పంట సాగు హక్కుదారుల చట్టం–2019 తీసుకురావడమే కాదు... పంట సాగుదారు హక్కు పత్రాల (సీసీఆర్సీ) ఆధారంగా వైఎస్సార్ రైతుభరోసా కింద పెట్టుబడి సాయం, పంట రుణాలు, సున్నా వడ్డీ రాయితీతో పాటు వివిధ కారణాలతో చనిపోయిన రైతు కుటుంబాలకు రూ.7 లక్షల పరిహారం అందిస్తున్నారు. అంతేకాదు.. కౌలురైతులకు ఈ–క్రాప్ నమోదు ప్రామాణికంగా సబ్సిడీ విత్తనాలు, ఎరువులివ్వడమే కాదు, పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ), ఉచిత పంటల బీమా వంటి సంక్షేమ పథకాలూ అందిస్తున్నారు. ఈ–క్రాప్‌లో నమోదే ప్రామాణికంగా పండించిన పంటలను ఆర్బీకేల ద్వారా అమ్ముకోగలుగుతున్నారు. కానీ, వాస్తవాలకు ముసుగేసి తప్పుడు కథనాలతో 'ఈనాడు' నిత్యం బురదజల్లడమే పనిగా పెట్టుకుంది. వ్యవసాయాన్ని పండుగలా మార్చిన జగన్ ప్రభుత్వంపై అభాండాలు వేస్తూ రైతులను మభ్యపెట్టాలని చూస్తోంది. 'కౌలు రైతులకు మిగిలింది కంటితుడుపే' అంటూ సోమవారం ఆ పత్రిక వండివార్చిన కథనంపై అంశాల వారీగా 'ఫ్యాక్ట్‌చెక్' ఇదిగో..

ఆరోపణ: కొత్త చట్టం తెచ్చినా చిక్కుముడేనా?

వాస్తవం: భూ యజమాని హక్కులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా, వారి హక్కులకు రక్షణ కల్పిస్తూనే వాస్తవ సాగుదారులకు పంట సాగుదారు హక్కు పత్రాలను జారీచేస్తోంది. ఇందుకోసం ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు రెవెన్యూ శాఖతో కలిసి ఆర్బీకేల ద్వారా గ్రామస్థాయిలో అవగాహనా సదస్సులు నిర్వహిస్తోంది. భూ యజమానులను ఒప్పించి మరీ కౌలుదారులకు సీసీఆర్సీలు జారీచేస్తోంది. 2019 నుంచి ఇప్పటివరకు 17.61 లక్షల మంది కౌలు రైతులకు ఈ కార్డులు మంజూరు చేశారు.

ఆరోపణ: పంట రుణాల్లోనూ కోతే..

వాస్తవం: వాస్తవ సాగుదారులందరికీ పంట రుణాలివ్వాలన్న సంకల్పంతో పీఏసీఎస్‌లను ఆర్బీకేలతో అనుసంధానం చేశారు. సీసీఆర్సీ కార్డులున్న వారికి రుణాలు అందిస్తున్నారు. సీసీఆర్సీ పొందలేని కౌలు రైతులను గుర్తించి, వారితో జాయింట్ లయబిలిటీ గ్రూపు (జేఎల్‌జీ)లను ఏర్పాటుచేస్తున్నారు. ఈ గ్రూపుల ద్వారా కౌలుదారులకు పెద్దఎత్తున రుణాలు అందేలా చేస్తున్నారు. ఇలా 2019 నుంచి ఇప్పటివరకు 9.83 లక్షల మందికి రూ.6,905.76 కోట్ల రుణాలు అందించారు. 2022–23లోనే 2.19 లక్షల మంది కౌలుదారులకు రూ.1,802.74 కోట్ల రుణాలు అందించారు. అంతేకాదు.. రూ.లక్ష లోపు పంటరుణాలు పొందిన కౌలుదారులకు వైఎస్సార్ సున్నావడ్డీ రాయితీ కూడా అందిస్తున్నారు. ఇలా ఇప్పటివరకు 30వేల మందికి రూ.6.26 కోట్ల సున్నా వడ్డీ రాయితీని అందించారు.



ఆరోపణ: రైతుభరోసా సాయమేది?

వాస్తవం: దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నారు. భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలుదారులతో పాటు అటవీ, దేవాదాయ భూమి సాగుదారులకు కూడా రూ.13,500 చొప్పున మూడు విడతల్లో రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా అందిస్తోంది. 16 లక్షల మంది కౌలుదారుల్లో 6 శాతం మందికి మాత్రమే రైతుభరోసా అందుతుందనడంలో వాస్తవంలేదు. మెజారిటీ కౌలుదారులు సొంత భూమి కూడా కలిగి ఉన్నారు. వీరందరికీ భూ యజమానిగా వైఎస్సార్ రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందుతోంది. సీసీఆర్సీ కార్డులు పొందిన కౌలు రైతులు సమీప ఆర్బీకేల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు 'భరోసా' అందిస్తున్నారు. సొంత భూమిలేకుండా పూర్తిగా కౌలుకి మాత్రమే సాగుచేస్తున్న దాదాపు 1.24 లక్షల మందికి రైతుభరోసా సాయం అందిస్తున్నారు. సీసీఆర్సీ కార్డుల ఆధారంగా వైఎస్సార్ రైతుభరోసా కింద 46 నెలల్లో 3.92 లక్షల మందికి రూ.529.07 కోట్ల పెట్టుబడి సాయం అందించారు.

ఆరోపణ: కౌలురైతులకు అందని సంక్షేమ ఫలాలు..

వాస్తవం: కౌలుదారులకు సంక్షేమ ఫలాలు అందడం లేదనడంలో ఏమాత్రం వాస్తవంలేదు. వైఎస్సార్ రైతుభరోసాతో సహా భూ యజమానులకు వర్తింపజేసే సంక్షేమ ఫలాలన్నీ భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సాగుదారులకు కూడా వర్తింపజేస్తున్నారు. సీసీఆర్సీ కార్డు ఉన్నా లేకున్నా కూడా అందిస్తున్నారు. ఈ–క్రాప్ బుకింగ్ ఆధారంగా 2019–20లో 6,331 మందికి రూ.5.73 కోట్లు, 2020–21లో 1.38 లక్షల మందికి రూ.140.70 కోట్లు, 2021–22లో 68,911 మందికి రూ.77.84 కోట్ల పంట నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ), ఖరీఫ్–2020లో 51,238 మందికి రూ.156.80 కోట్లు, ఖరీఫ్–21 సీజన్‌లో 1,21,735 మందికి రూ.330.34 కోట్ల పంటల బీమా పరిహారంతో పాటు 2.50 లక్షల మంది రైతులకు రూ.3,500 కోట్ల సబ్సిడీతో కూడిన 8వేల క్వింటాళ్ల విత్తనాలు అందించారు.

కౌలుదారుల కుటుంబాలకు నేరుగా పరిహారం

గత ప్రభుత్వ హయాంలో ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాలకు ఇచ్చే రూ.5లక్షల నష్టపరిహారాన్ని 2019లో వైఎస్ జగన్ సర్కారు రాగానే రూ.7లక్షలకు పెంచారు. అలాగే, టీడీపీ హయాంలో తమకు అనుకూలంగా ఉండే వారికి మాత్రమే అరకొరగా ఇచ్చేవారు. ఆ ఇచ్చే మొత్తంలో కూడా రూ.1.5 లక్షలు అప్పులకు జమచేసుకోగా, మిగిలిన రూ.3.5 లక్షలు కూడా విత్‌డ్రా చేసుకునేందుకు వీల్లేకుండా రైతు కుటుంబం పేరిట జమ చేసేవారు. కేవలం వడ్డీని మాత్రమే తీసుకుంటూ ఐదేళ్లకో.. పదేళ్లకో గడువు ముగిసిన తర్వాత విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం వ్యవసాయాధారిత కారణాలవల్ల ఆత్మహత్య చేసుకునే కౌలుదారులకు సీసీఆర్సీ కార్డు ఉంటే రూ.7లక్షలు, లేకుంటే వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష పరిహారం నేరుగా బాధిత కౌలురైతు కుటుంబసభ్యుల ఖాతాకు జమచేస్తోంది.

2019 నుంచి కౌలురైతులకు అందించిన పంట రుణాలు.. (రూ.కోట్లలో)

సంవత్సరం	రైతుల సంఖ్య	పంట రుణాలు
2019-20	3,87,610	2,304.00
2020-21	1,95,666	1,055.00
2021-22	1,80,562	1,744.02
2022-23	2,19,032	1,802.74
మొత్తం	9,82,870	6,905.76

వైఎస్సార్ రైతుభరోసా కింద లబ్ధిపొందిన కౌలుదారులు.. (రూ.కోట్లలో)

సంవత్సరం	రైతుల సంఖ్య	లబ్ధి
2019-20	1,08,256	146.15
2020-21	69,899	94.36
2021-22	89,877	121.33
2022-23	1,23,871	167.23
మొత్తం	3,91,903	529.07

'జగనన్నే మా భవిష్యత్' ప్రచార రథం ప్రారంభం



తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ప్రజల్లోకి చొచ్చుకుపోతుంది. ఆయా సచివాలయాల పరిధిలో కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత వినూత్నంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్ ప్రత్యేక ప్రచార రథాన్ని రూపొందించారు. ఈ ప్రచార రథాన్ని సోమవారం సాయంత్రం తాటిచెట్లపాలెంలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.

'వేట' నిషేధం ఉల్లంఘిస్తే రాయితీలు కట్

రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ కన్నబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని సముద్ర జలాల్లో చేపల వేటపై నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించేవారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుంది. ఉత్తర్వులను ఉల్లంఘించి ఎవరైనా చేపల వేట చేస్తే ఆయా బోట్ల యజమానులపై ఏపీ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం ద్వారా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ కె.కన్నబాబు సోమవారం హెచ్చరించారు. ఆయా బోట్లను స్వాధీనం చేసుకుని జరిమానా విధించి ప్రభుత్వమిచ్చే అన్ని రకాల రాయితీలను, సౌకర్యాలను రద్దు చేస్తామన్నారు. ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులపాటు చేపల వేట నిషేధం అమల్లో ఉంటుందని ఆయన తెలిపారు. సముద్ర మత్స్య సంపద అభివృద్ధికి కృషి చేయడమే లక్ష్యంగా చేపల వేటపై నిషేధం అమలు చేస్తున్నామని చెప్పారు. తాజా ఉత్తర్వులను అనుసరించి సముద్ర జలాల్లో యాంత్రిక పడవలు, మోటారు బోట్లపై మత్స్యకారులు ఎటువంటి చేపల వేట చేయరాదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 61 రోజుల వేట నిషిద్ధ కాలం కచ్చితంగా అమలు చేసేందుకు మత్స్యశాఖ, కోస్ట్‌గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేస్తామని వివరించారు.

బలహీనులు ఎప్పటికీ క్షమించలేరు.
క్షమాగుణం కేవలం బలవంతుల లక్షణం.
– మహాత్మా గాంధీ

సాక్షి

మంగళవారం, ఏప్రిల్, 11

లీకుల సుడిగుండంలో అమెరికా

ఈ ప్రపంచంలో మూడింటిని దాచిపెట్టడం అసాధ్యమని బుద్ధుడు చెబుతాడు. అవి–సూర్యుడు, చంద్రుడు, సత్యం! ఏ దేశమైనా అంతర్జాతీయంగా తనవారెవరో, కానివారెవరో తెలుసుకోవటానికి నిత్యం ప్రయత్నిస్తుంటుంది. ఎలాంటి వ్యూహాలు పన్నాలో, ఏ ఎత్తుగడలతో స్వీయప్రయోజనాలు కాపాడుకోవాలో అంచనా వేసుకుంటుంది. అందుకు తన వేగుల్ని ఉపయోగిస్తుంది. పరస్పర దౌత్య మర్యాదలకు భంగం లేకుండా చాపకింద నీరులా ఈ పని సాగిపోతుంటుంది. ఈ విషయంలో అమెరికాది అందె వేసిన చేయి. నిఘా నిజమైనప్పుడు అది ఎన్నాళ్లు దాగుతుంది? తాజాగా బజారున పడిన అత్యంత రహస్యమైన పత్రాలు అమెరికాను అంతర్జాతీయంగా ఇరకాటంలో పడేశాయి. శత్రువులు సరే...దక్షిణ కొరియా, ఇజ్రాయెల్, ఉక్రెయిన్‌లాంటి దేశాలు సైతం తమపై అమెరికా నిఘా పెట్టిందన్న సంగతిని జీర్ణించుకోలేకపోతున్నాయి. ఇక దాని ప్రధాన ప్రత్యర్థి రష్యా గురించి చెప్పేదేముంది? ఆ దేశ రక్షణశాఖలోకి అమెరికా నిఘా విభాగం ఎలా చొచ్చుకుపోయిందో ప్రస్తుతం వెల్లడైన రహస్యపత్రాలు తెలియజెబుతున్నాయి. అలా సేకరించిన సమాచారం ఆధారంగా ఉక్రెయిన్‌కు సలహాలిస్తూ రష్యాపై దాని యుద్ధవ్యూహాలను పదునెక్కిస్తున్న వైనం బయట పడింది. ఉక్రెయిన్ వ్యూహాలపై, అది తీసుకుంటున్న నిర్ణయాలపై అమెరికాకు ఎలాంటి అభి ప్రాయాలున్నాయో ఈ పత్రాలు వివరిస్తున్నాయి. ఇటీవల ఉక్రెయిన్‌లో రష్యాకు వరస అపజయాలు ఎదురయ్యాయి. గతంలో స్వాధీనమైన నగరాల నుంచి అది తప్పుకోక తప్పనిస్థితి ఏర్పడింది. వీటన్నిటి వెనుక అమెరికా మార్గదర్శకం ఉన్నదని పత్రాలు చెబుతున్నాయి. ఇవన్నీ నకిలీ పత్రాలని ఉక్రెయిన్ సైనికాధికారులు దబాయిస్తున్నా పెంటగాన్ మాత్రం ఆ పని చేయలేకపోతోంది. ఉక్రెయిన్‌లోని ఏ ప్రాంతంపై ఏ రోజున ఎన్ని గంటలకు రష్యా సైన్యం దాడి చేయదల్చుకున్నదో అమెరికా నిఘా సంస్థ ఎప్పటికప్పుడు ఆ దేశాన్ని హెచ్చరించిన వైనాన్ని ఈ పత్రాలు బయటపెట్టాయి. అయితే సందట్లో సడేమియాలా లీకైన ఈ పత్రాల్లో ఫొటోషాప్ ద్వారా తనకు అనుకూలమైన మార్పులు చేర్పులూ చేసి ప్రత్యర్థులను గందరగోళపరచడానికి రష్యా ప్రయత్నిస్తోంది. ఎవరి ప్రయోజనం వారిది!

సరిగ్గా పదమూడేళ్లక్రితం జూలియన్ అసాంజ్ వికీలీక్స్ ద్వారా అమెరికాకు సంబంధించిన లక్షలాది కీలకపత్రాలు వెల్లడించాడు. ఆ తర్వాత సైతం ఆ సంస్థ అడపా దడపా రహస్య పత్రాలు వెల్లడిస్తూ అమెరికాకు దడపుట్టిస్తోంది. తాజా లీక్‌లు ఎవరి పుణ్యమో ఇంకా తేలాల్సివుంది. సాధారణ పరిస్థితుల్లో ఇలాంటి లీక్‌లు పెద్దగా సమస్యలు సృష్టించవు. గతంలో అసాంజ్ బయటపెట్టిన పత్రాలు అంతక్రితం నాలుగైదేళ్లనాటివి. అవి గతించిన కాలానివి కనుక నిఘా బారిన పడిన దేశం చడీచప్పుడూ లేకుండా తన వ్యవస్థలో అవసరమైన మార్పులు చేసుకుంటుంది. ఆ పత్రాల్లో ప్రస్తావనకొచ్చిన ఉదంతాల తీవ్రత కూడా చల్లబడుతుంది. కానీ ఈ పత్రాలు ఇటీవల కాలానివి. కేవలం 40 రోజులనాటివి. ఉక్రెయిన్ ఇంకా రష్యాతో పోరు సాగిస్తూనే ఉంది. సైన్యం బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో అది తీసుకుంటున్న దిద్దుబాటు చర్యలూ, అందుకోసం అనుసరిస్తున్న వ్యూహాలూ ఇంత వెనువెంటనే బట్టబయలు కావటం దాన్ని దెబ్బతీస్తాయనటంలో సందేహం లేదు. ముఖ్యంగా వైమానిక యుద్ధంలో ఉక్రెయిన్ బలహీనంగా ఉన్న వైనం బయటపడటం ఆ దేశానికి ముప్పు కలిగించేదే. అమెరికా నిఘా సంస్థ సీఐఏ పనితీరు కూడా ఈ పత్రాల ద్వారా బయటపడింది. రష్యా రక్షణ శాఖలోని ముఖ్యవ్యక్తుల ఫోన్ సంభాషణలు ఆ సంస్థ వేగులు వింటున్నారని, వారి మధ్య బట్వాటా అయ్యే సందేశాలు సంగ్రహిస్తున్నారని, వీటి ఆధారంగానే దాని రోజువారీ నివేదికలు రూపొందుతున్నాయని ఈ పత్రాలు తేటతెల్లం చేశాయి. అయితే ఉక్రెయిన్‌పై ఏడాదిగా సాగుతున్న యుద్ధంలో పెద్దగా పైచేయి సాధించలేకపోయిన రష్యాకూ ఈ లీక్‌లు తోడ్పడతాయి. ఉక్రెయిన్ విజయం సాధించటానికి దారితీస్తున్న పరిస్థితులేమిటో, ఇందులో తమ వైపు జరుగుతున్న లోపాలేమిటో తెలియటం వల్ల రష్యా తన వ్యూహాలను మార్చుకోవటం సులభమవుతుంది. అంతేకాదు...తన రక్షణ వ్యవస్థలోని ఏయే విభాగాల్లో అమెరికా నిఘా నేత్రాలు చొరబడ్డాయో ఈ లీక్‌లద్వారా గ్రహించి సొంతింటిని చక్కదిద్దుకునేందుకు రష్యాకు అవకాశం దొరికింది. అయితే అదే సమయంలో తల్చుకుంటే ప్రత్యర్థి శిబిరంలోకి అమెరికా ఎంత చురుగ్గా చొచ్చుకు పోగలదో, ఎలాంటి కీలక సమాచారం సేకరించగలదో ఈ వ్యవహారం తేటతెల్లం చేసింది. దాని సంగతెలావున్నా ఇజ్రాయెల్‌లో ప్రధాని నెతన్యాహూ తలపెట్టిన న్యాయసంస్కరణలకు వ్యతిరేకంగా పెల్లుబికిన ఉద్యమం వెనుక ఆ దేశ గూఢచార సంస్థ మొసాద్ హస్తమున్నదని అమెరికా అంచనా కొచ్చిన తీరు దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ఈ అభిప్రాయం తప్పని ఇజ్రాయెల్ చెబుతున్నా నిజమేమిటో ముందుముందు బయటపడక తప్పదు.

కానీ నిఘాలో ఇంతటి చాకచక్యాన్ని ప్రదర్శించే అమెరికాను సైతం బోల్తా కొట్టించగల అరివీర భయంకరులున్నారని తాజా లీకులు చెప్పకనే చెబుతున్నాయి. ఇవి ఎక్కడినుంచో కాదు...సాక్షాత్తూ పెంటగాన్ కార్యాలయం నుంచే బయటికొచ్చాయని పత్రాల్లోని సమాచారం చూస్తే అర్థమవుతుంది. ఇతర దేశాలపై నిఘా మాట అటుంచి స్వగృహ ప్రక్షాళనకు నడుం కట్టకతప్పదని అమెరికాను తాజా లీకులు హెచ్చరిస్తున్నాయి. అభిప్రాయాలు, అంచనాలు ఏవైనా...మస్తిష్కంలో ఉన్నంత వరకే వాటికి రక్షణ. అవి రహస్యపత్రాలుగా అవతారమెత్తిన మరుక్షణం ఎక్కడెక్కడికి ఎగురుకుంటూ పోతాయో చెప్పటం అసాధ్యమని తాజా వ్యవహారం తేటతెల్లం చేస్తోంది. అగ్రరాజ్యం ఇప్పటికైనా అప్రమత్తంగా ఉండకతప్పదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు. చైత్ర మాసం, తిథి: బ.పంచమి ఉ.6.43 వరకు, తదుపరి షష్ఠి తె.4.46 వరకు (తెల్లవారితే బుధవారం), నక్షత్రం: జ్యేష్ఠ ప.12.25 వరకు, తదుపరి మూల, వర్జ్యం: రా.8.04 నుండి 9.35 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.19 నుండి 9.06 వరకు, తదుపరి రా.10.48 నుండి 11.35 వరకు అమృతఘడియలు: తె.5.09 నుండి 6.43 వరకు (తెల్లవారితే బుధవారం).

సూర్యోదయం : 5.50
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

హక్కులకు ప్రమాదం!

ఒక నిషిద్ధ సంస్థలో కేవల సభ్యత్వం ఉన్నా సరే దాన్ని చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం–1967 కింద నేరంగా పరిగణించవచ్చని సుప్రీం కోర్టు బెంచ్ ఇచ్చిన తాజా తీర్పుతో మౌలిక న్యాయసూత్రాలకు విఘాతం కలిగినట్లయింది!


అభిప్రాయం



అశీష్ ఖేతాన్

ఇటీవల సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఒక నిషిద్ధ సంస్థలో కేవల సభ్యత్వం ఉన్నా సరే దాన్ని చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం – 1967 కింద నేరంగా పరిగణించవచ్చని సారాంశం. అయితే నిర్దిష్ట సంస్థలో క్రియాశీల, నిష్క్రియాత్మక సభ్యత్వాల మధ్య వ్యత్యాసాన్ని ఈ తీర్పు పట్టించుకోలేదు! ఉగ్రవాదంపై పోరు, దేశ భద్రత పరి రక్షణ పేరుతో చట్టవ్యతిరేకంగా ఏజెన్సీలు పని చేయడాన్ని చట్టబద్ధం చేయడం అనే ప్రమాదం ఈ తీర్పులో దాగుంది. 2011నాటి అరూప్ భూయాన్ వర్సెస్ ది స్టేట్ ఆఫ్ అస్సాం హోమ్ డిపార్ట్‌మెంట్ కేసులో సుప్రీంకోర్టే ఇచ్చిన తీర్పుకు ఇది స్వీయ విఘాతం. నిషిద్ధ సంస్థలు తమ సభ్యుల పేరు, చిరునామా, ఫోన్ నంబర్లు, ఈమెయిల్‌తో కూడిన రిజిస్ట్రీని నిర్వహించవు. చట్టబద్ధ సంస్థ సభ్యత్వ రికార్డుల విషయంలో కూడా, ఒక సంస్థ నిషేధానికి గురైన తర్వాత ఆ సంస్థలో ఎవరు సభ్యులు, ఎవరు దాంట్లో కొనసాగుతారు అని ఏ సంస్థ అయినా లేదా న్యాయస్థానమైనా ఎలా నిర్ధారిస్తాయి? సంబంధం ఉన్నంత మాత్రాన అమాయకులైన యువతీ యువకులను చట్టవిరుద్ధ ఉగ్రవాద సంస్థల సభ్యులుగా ఎలా ఇరికిస్తారు అనే విషయాన్ని గతంలో జ్యోతి బాబా సాహెబ్ కోర్జ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర (2012) కేసు చక్కగా విశ్లేషించింది. ఈ కేసులో 15 మంది వ్యక్తులను (అందరూ గిరిజన యువతీయువకులే) ఉగ్రవాద సంస్థ అయిన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సభ్యులుగా ఆరోపించారు. పుస్తకాలు, ఆర్టికల్స్, పాంప్లెట్స్ వంటి మావోయిస్టు ప్రచార సాహిత్యాన్ని కలిగివుండటమే వీరు చేసిన నేరం. ఇది తప్ప, వీరు ఉగ్రవాద చర్యల్లో లేదా హింసాత్మక చర్యల్లో పాల్గొన్నారని కానీ, ఉగ్రవాద శిబిరాన్ని నిర్వహించారనికానీ, రిక్రూట్‌మెంట్ చేశారని గానీ, మావోయిస్టు కార్యకర్తలకు ఆశ్రయం ఇచ్చారని కానీ, ఉగ్రవాద చర్యల కోసం నిధులు సేకరించారని కానీ వీరిపై ఆరోపణలు లేవు. కానీ, ఉగ్రవాద సంస్థ సభ్యత్వం తీసుకోవడం అనేది నిర్బంధించదగిన శిక్షార్హమైన నేరం అవుతుందని, దీనిగ్గాను యావజ్జీవ శిక్షకూడా విధించొచ్చని బాంబే హైకోర్టు 'ఉపా' సెక్షన్ 20కి విస్తృతార్థం కల్పించింది.

2011లో అరూప్ భూయాన్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు, ''హింసాత్మక చర్యలకు పాల్పడటం లేదా ప్రజలను హింసాత్మక చర్యలకు ప్రేరేపించడం లేదా అశాంతిని సృష్టించడానికి పూనుకోవడం చేస్తే తప్ప, నిషిద్ధ సంస్థలో కేవలం సభ్యత్వం ఉన్నంత మాత్రాన ఒక వ్యక్తిపై నేరారోపణ చేయలేము''. సూచించడం, ప్రేరేపించడం మధ్య వ్యత్యాసం ఉందంటూ బ్రాండెన్‌బర్గ్ వర్సెస్ ఓహియో కేసులో అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పుపై ఆనాడు భారత సుప్రీంకోర్టు ఆధారపడింది. ''కేవలం సభ్యత్వం ఉన్నంత మాత్రాన దాన్ని చట్టవిరుద్ధం అని చెప్పలేము. చట్టవ్యతిరేక కార్యాచరణకు స్పష్టంగా ప్రేరేపించినట్లయితేనే అది చట్టవిరుద్ధంగా మారుతుంద''ని అమెరికా ఫెడరల్ కోర్టు రనీఫ్ కేసులో తీర్పు చెప్పింది. సభ్యత్వం విషయంలో క్రియాశీలకంగా ఉండటానికి నిష్క్రియాత్మకంగా ఉండటానికి మధ్య వ్యత్యాసం ఉందంటూ స్కేల్స్ వర్సెస్ యునైటెడ్ స్టేట్స్ కేసులో అమెరికా ఫెడరల్ కోర్టు తీర్పు ఇచ్చింది. నిషిద్ధ సంస్థతో సంబంధం ఉన్నంత మాత్రాన అపరాధం మోపడానికి నేరన్యాయ చట్టంలో తావులేదని ఎల్‌బ్రాండ్ట్ వర్సెస్ రస్సెల్ కేసులో కూడా అమెరికా సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఆ తీర్పులను నాడు భారత సుప్రీంకోర్టు ప్రస్తావించింది. కానీ తాజా తీర్పు భద్రత పేరుతో హక్కులకు విఘాతం కలిగించేలా ఉంది.



కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు 44 సంస్థలను ఉగ్రవాద సంస్థలుగా, 13 సంస్థలను చట్టవ్యతిరేక సంస్థలుగా ప్రకటించింది. ఉగ్రవాదాన్ని, టెర్రరిస్టు చట్టాలను, ఉగ్రవాద బృందాలను నిర్వచించడంలో, అసంబద్ధంగా ఉగ్రవాదిగా ముద్రల పాలైన వారిని ఒక మేరకు కాపాడేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు పెనుగులాడుతున్నాయి. అదే సమయంలో ఉగ్రవాద నిరోధక సంస్థల అధికారాలను దుర్వినియోగం చేయడాన్ని అరికట్టాల్సి ఉంది. వ్యక్తులపై తప్పుడు ముద్రలు వేయడం అనేది వాస్తవానికి ఉగ్రవాదంపై పోరాట యత్నాలను పలుచబారుస్తుంది. ఇది ప్రజాస్వామిక విలువలను, సంస్థలను అణగదొక్కుతుంది. ఉగ్రవాద, చట్టవ్యతిరేక కార్యాచరణను ఏది ఏర్పరుస్తుంది? ఉగ్రవాద, చట్టవ్యతిరేక బృంద సభ్యుడిగా ఏదీ నిర్ధారిస్తుంది అనే అంశాలపై ప్రతి ఉదార ప్రజాస్వామిక వ్యవస్థలో కచ్చితమైన న్యాయపరమైన వ్యాఖ్యలకు అనుగుణంగానే మునుపటి మూడు తీర్పులు ఉంటూ వస్తున్నాయి. ఉదాహరణకు, సామాజిక లేదా వృత్తిపరమైన పరస్పర ప్రతిచర్యల క్రమంలో ఉగ్రవాద బృందాల సంబంధంలోకి తెలియకుండా వచ్చిన వారిని మినహాయించడానికి ఇవి ప్రాధాన్యమిచ్చాయి. ఇక్కడ మాత్రం అనుమానితులు కాని పౌరులను ఉచ్చులో చిక్కుకునేలా చేయడానికి నిఘా సంస్థలకు సుప్రీం తన తాజా తీర్పులో సమర్థంగా లైసెన్సును మంజూరు చేసినట్లయింది.

వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్
జిందాల్ గ్లోబల్ లా స్కూల్

పాశ్చాత్య ప్రభావంతో...

రాజ్యాంగ నిర్మాతల ఆశయం కొన్ని తీర్పులలో ప్రతిబింబించక పోవడమే కాక, కాలదోషం పట్టిన పాశ్చాత్య భావనలను ఇప్పుడు భారత న్యాయవ్యవస్థలో ప్రవేశపెట్టే ప్రయత్నం జరుగుతోందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

అభిప్రాయం



పి. వేణుగోపాల్ రెడ్డి

చట్టసభల, పరిపాలనా విభాగాల పని తీరును సమీక్షించే అధికారం న్యాయ వ్యవస్థకు ఉన్నప్పటికీ ఆ అధికారానికి కూడా పరిధులున్నాయి. అలాగే న్యాయవ్యవస్థ పరిధిలో సమీక్ష అంటే చట్ట నిర్మాణ వ్యవస్థ మీద, లేదా పరిపాలనా వ్యవస్థ మీద న్యాయవ్యవస్థ పర్యవేక్షణ అని భాష్యం కాదు. అందుకే చట్టసభలు చేసిన ఒక విధానంతో కొందరు విభేదించి, దానిని కొట్టివేయవలసిందిగా కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే ఆ వ్యాజ్యాల విషయంలో కోర్టులు అప్రమత్తంగా వ్యవహరించడం అనివార్యం. అలాగే సంప్రదాయాలకి సంబంధించి విదేశీ కోర్టుల నిర్ణయాలను ఇక్కడి తీర్పులలో చొప్పించడం కూడా ఇటీవల చర్చకు దారి తీసింది. 'అరూప్ భూయాన్ వర్సెస్ అస్సాం రాష్ట్ర ప్రభుత్వం' కేసులో సుప్రీంకోర్టు గతంలో తాను ఇచ్చిన తీర్పును తానే తిరగ రాసుకుంది. మరొకటి ప్రస్తుతం సుప్రీంకోర్టు నిర్ణయం కోసం ఎదురు చూస్తున్న సేమ్ సెక్స్ మ్యారేజీ వ్యవహారం. ఈ వ్యవహారం మీద నిర్ణయం చేసేటప్పుడు భారతీయ కుటుంబ వ్యవస్థ శ్రేయస్సును, చరిత్రను దృష్టిలో ఉంచుకోవాలని సుప్రీం కోర్టుకు ఒక మాజీ న్యాయమూర్తి లేఖ రాశారు.



'అరూప్ భూయాన్ వర్సెస్ అస్సాం రాష్ట్ర ప్రభుత్వం', 'కేరళ ప్రభుత్వం వర్సెస్ రనీఫ్' కేసులలో కొత్త మలుపు నేపథ్యంలో దేవాలయాలకు సంబంధించిన వ్యాజ్యాలలో, అక్రమ సంబంధాలు, సేమ్‌సెక్స్ మ్యారేజీ అంశంలో న్యాయ వ్యవస్థ నిర్ణయాలపై పునరాలోచన అవసరమన్న అభిప్రాయం వినిపిస్తున్నది. అరూప్ భూయాన్, రనీఫ్ కేసులు, సేమ్ సెక్స్ వివాహాలకు చట్టబద్ధత కల్పించడం వేర్వేరు వివాదాలే అయినా వాటికి ఒక అంతస్సూత్రం ఉంది. అది భారతీయ న్యాయ నిర్వహణలో అమెరికనిజమ్ ప్రవేశం! అంటే అమెరికా న్యాయసూత్రాలను తీర్పులలో ప్రవేశ పెడుతున్నారన్న నిరసన ఉంది.

భూయాన్ కేసులోనే 2011లో సుప్రీం నిర్ణయం ప్రకారం ఒక నిషిద్ధ సంస్థలో సభ్యుడైనంత మాత్రానే అతడు నేరగాడు కాదు. అతడు హింసకు పాల్పడినట్టు, దేశ విచ్ఛిత్తికి పాల్పడినట్టు తెలియాలి. ఆ నిర్ణయంతో మావోయిస్టు పార్టీ సభ్యులే కాదు, పీఎఫ్ఐ వంటి సంస్థ సభ్యులు కూడా స్వేచ్ఛగా బయటకు వచ్చారు. 'ఉపా'లోని సెక్షన్ 10 (ఎ) (1)ని కొట్టేయడంతో ఇది సాధ్యమైంది. ఎలాంటి వారు విడుదల కావడానికి అది దోహదపడింది? ఐఎస్ ఐఎస్‌తో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణతో పాటు, భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాల కోసమే వచ్చాడని మీడియా కూడా ఆరోపించిన 27 ఏళ్ల అరీబ్ మాజీద్‌కు బెయిల్ దొరికింది. ఇతడిని ఉపా కింద అరెస్టు చేశారు. ఇతడి పన్నాగం వల్ల ఎవరూ చనిపోలేదని కోర్టు భావించింది. ప్రత్యేక కోర్టు ఇతడికి ఇచ్చిన బెయిల్‌ను బొంబాయి హైకోర్టు సమర్థించింది. ఉపా కింద అరెస్టయిన మరొక ఉగ్రవాది మహమ్మద్ రయాసుద్దీన్‌కు కూడా ఇదే విధంగా బొంబాయి హైకోర్టు బెయిల్ ఇచ్చింది. అయితే ఈ మార్చి 24న ఉపా మీద తన గత నిర్ణయాన్ని తానే అత్యున్నత న్యాయస్థానం తిరగ రాసుకుంది. అంటే కొట్టేసిన సెక్షన్‌కు చెల్లుబాటు కల్పించింది.

ఇది భారతీయమైన న్యాయ నిర్వహణకు ఊతమిచ్చే నిర్ణయమని పలువురు భావించారు. ఈ అంశం మీద సుప్రీంకోర్టు విచారించినప్పుడు ప్రభుత్వ న్యాయవాది తుషార్ మెహతా పలు అంశాలను కోర్టు దృష్టికి తెచ్చారు. 2011 నాటి నిర్ణయం వెలువరించిన ధర్మాసనం తీవ్ర తప్పిదానికి పాల్పడిందని మెహతా చెప్పారు. భారత రాజ్యాంగ చట్టాల పరిధిని గమనంలోకి తీసుకోకుండా అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను అన్వయించారని తెలియచేశారు. ఈ పరిణామం ఇతర కేసులలో తీవ్ర గందరగోళానికి దారి తీసింది. వ్యక్తిగత గోప్యత, సేమ్‌సెక్స్ వివాహం, హిందూ ఆలయాల సంప్రదాయాలపై ఇచ్చిన తీర్పులలో ఆ గందరగోళం కనిపిస్తుందన్న అభిప్రాయం ఉంది.

భారత రాజ్యాంగం తొలి వాక్యమే 'భారతీయులమైన మేము..'. అలాంటిది ఇక్కడి కేసులలో తీర్పులకు అమెరికనిజాన్ని అంటగట్టడం ఎంత చేటు చేసే విషయమో చాలామందికి అర్థమైంది. స్వేచ్ఛ అనే అంశంలో అక్కడికీ ఇక్కడికీ ఉన్న వైరుధ్యం కూడా తెలిసి వచ్చింది. అందుకే అమెరికా లేదా యూరప్‌లకు చెందిన న్యాయ సూత్రాలను భారతీయ న్యాయవ్యవస్థ నుంచి పరిహరించే ప్రయత్నం స్వాగతించదగినదేనని నిపుణులు చెబుతున్నారు. సేమ్ సెక్స్ మ్యారేజీ గురించిన నిర్ణయం సుప్రీంకోర్టు వెలువరించవలసి ఉంది. ఈ నేపథ్యంలోనే జస్టిస్ ఎస్ఎన్ ధింగ్రా ఒక విన్నపం చేశారు. భారతీయ కుటుంబ వ్యవస్థ, సంస్కృతులను దృష్టిలో ఉంచుకొని దాని మీద నిర్ణయం తీసుకోవాలని కోరారు. వీటిని అనుమతించిన పాశ్చాత్య దేశాలు ఇప్పుడు అందుకు మూల్యాన్ని చెల్లిస్తున్నాయి. అయినా భారతీయ వ్యవస్థలోను ఆ రకమైన వివాహాలను అనుమతించాలని కోరడం వ్యవస్థ స్వరూపాన్ని, విలువలను ధిక్కరించడమే కదా!

వ్యాసకర్త 'ఏకలవ్య ఫౌండేషన్'
వ్యవస్థాపకులు । pvg@ekalavya.net

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అంచనాల గెలుపు

కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. మెజారిటీ మార్కును కూడా దాటి 4 శాతం మొగ్గుతో గెలవనున్న కాంగ్రెస్.. బీజేపీ, జేడీఎస్‌లను చెరో రెండు శాతం చొప్పున సమానంగా ప్రతికూలతలోకి నెట్టడం ద్వారా ఆ నాలుగు శాతాన్ని సాధిస్తుంది.

– సంజయ్ కుమార్, పొలిటికల్ ఎనలిస్ట్

అంతర్గత పాలన

కశ్మీర్ నియంత్రణ రేఖ ఒప్పందంపై చర్చలను పునః ప్రారంభించేందుకు 2017లో మోదీ తన రహస్య దూతను నవాజ్ షరీఫ్ చెంతకు పంపినట్లు ఈ వారం విడుదల కానున్న 'ది పర్స్యూట్ ఆఫ్ పీస్ : ఇండియా – పాకిస్తాన్ రిలేషన్స్ అండర్ సిక్స్ ప్రైమ్ మినిస్టర్స్' వెల్లడించనుంది! (గ్రంథకర్త : దివంగత సతీందర్ లంబా). ఈ యత్నాన్ని ఎన్.ఎస్.ఎ. అజిత్ దోవల్ నిర్ధరించినట్లు కూడా ఆ పుస్తకం పేర్కొంది.

– సుహాసినీ హైదర్, దౌత్య వ్యవహారాల ఎనలిస్ట్

ఇవి కలపండి

వేసవికి ఉత్తమమైన పానీయం.. కొత్తిమీర, కరివేపాకు, అల్లం.. వీటితో పాటు చిలకరింతగా కాస్తంటే కాస్త ఇంగువ, కల్లు ఉప్పు కలిపిన తాజా మజ్జిగ! ఉష్ణ తాపాన్ని తక్షణం తీర్చడంలో ఈ ద్రవాహారం తర్వాతే ఏదైనా!

– డా॥ దీపక్ కృష్ణమూర్తి, కార్డియాలజిస్ట్

వికృత పోకడలు!

లండన్ వెళ్లవలసిన ఎయిర్ ఇండియా ఎ.ఐ. 111 విమానం, బయలుదేరిన కొద్ది సేపటికే ఒక ప్రయాణికుడి హింసాత్మక ధోరణి కారణంగా తిరిగి ఢిల్లీలో ల్యాండ్ అయింది! క్యాబిన్ సిబ్బందిపై చెయ్యి చేసుకున్న అతడిని ఏకంగా విమాన ప్రయాణాల నుంచే నిషేధించాలి.

– విష్ణు సోమ్, న్యూస్ యాంకర్

పరుగెత్తి పాలు

కర్ణాటకలోకి అమూల్‌ను తెచ్చేందుకు బీజేపీ ప్రయత్నంతో కాంగ్రెస్ నేత డి.కె. శివకుమార్ రాష్ట్రవాళీ 'నందిని మిల్క్' పార్లర్‌ను సందర్శించారు! ఎన్నికల వేళ అక్కడ పాల రాజకీయాలూ షురూ!

– శాంతన్, గాంధేయవాది

ఇన్‌బాక్స్

సిక్కోలు ఉద్యమ ధీరుడు

శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాట నిర్మాతలలో పైలా వాసుదేవరావు ఒకరు. 1950 నుండి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీతో ఆయన ఉద్యమ ప్రయాణం సాగింది. సిక్కోలు పోరాటం 1968 నవంబర్ 25న ప్రారంభమైంది. కాలినడకన అనేక గ్రామాలు తిరుగుతూ టెక్కలి ప్రాంత ఆర్గనైజర్‌గా పనిచేశారు. వ్యవసాయ కూలీ రేట్ల కోసం, బంజరు భూములు, పోరంబోకు భూములు, దేవాదాయ భూములు వంటివాటిని పేదలకు పంచడం కోసం ఉద్యమాలు చేశారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేశారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరల కోసం అనేక ఉద్యమాలు నడిపారు.

గిట్టుబాటు ధరల కోసం, కూలీ రేట్ల కోసం సుబ్బారావు పాణిగ్రాహి నాయకత్వంలో గరుడభద్ర ప్రాంతంలో మహిళలు ప్రదర్శనగా వెళ్ళినప్పుడు భూస్వామి మజ్జి కామేష్ గూండాలు ఆనాడు పంచాది నిర్మల జాకెట్టు చింపివేసి, సుబ్బారావు పాణిగ్రాహిపై దాడి చేశారు. ఈ చర్య జరిగిన వెంటనే పార్టీ సమావేశం జరిపి మద్ది కామేష్ పంట కోతకు పిలుపునిచ్చింది. దీంతో శ్రీకాకుళ పోరాటం ప్రారంభమయ్యింది. ఈ పంట కోత జరిగిన తదుపరి రాజాం, బొడ్డపాడు, మామిడిపల్లి, మర్రిపాడు గ్రామాల్లో 144 సెక్షన్ పెట్టి పోలీసులు గ్రామాల్లో కొచ్చి 168 మందిపై కేసులు పెట్టారు. దీంతో పైలాతో సహా పార్టీ ముఖ్యులందరూ రహస్య జీవితంలోకి వెళ్లిపోయారు. ఉద్యమం ఉధృతం అవ్వడంతో గ్రామీణ ప్రాంతాల్లో పోలీస్ కాన్సన్ట్రేషన్ క్యాంపులు పెట్టారు. గ్రామాలను వల్లకాడులుగా మార్చారు. పార్వతీపురం ఏజెన్సీ వైపు గ్రామాలకు గ్రామాలే తగలబెట్టారు. 360 మంది కామ్రేడ్స్‌ను 1971 నాటికి బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపారు. ఈ పరిస్థితుల్లో అనేక కష్టనష్టాలకు ఓర్చి, పైలా మళ్లీ పార్టీని పునర్నిర్మించి రాష్ట్రకమిటీని ఏర్పాటు చేశారు. కాలక్రమంలో ఆయన చారు మజుందార్‌తో విభేదించి, సీపీఐ ఎంఎల్‌లో తన పార్టీని విలీనం చేశారు. తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో చంద్ర, తరిమెల నాగిరెడ్డి వంటి అగ్ర నాయకులతో చర్చలు జరిపారు. ఫలితంగా సీపీ, పైలా పార్టీలు విలీనమయ్యాయి.



పైలా వాసుదేవరావు

42 సంవత్సరాలు అజ్ఞాతవాసంలో ఉండి అంతిమ శ్వాస వరకు పీడిత ప్రజలకు అండగా నిలబడ్డ పైలా జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శనీయం.

– వంకల మాధవరావు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి
(నేడు కామ్రేడ్ పైలా వాసుదేవరావు వర్ధంతి)

సమ సమాజ స్వాప్నికుడు

అభిప్రాయం



డా॥ తిరునాహరి శేషు

అట్టడుగు వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడిన యోధుడు మహాత్మా జ్యోతిబా గోవిందరావు పూలే. మహారాష్ట్రలోని సతారాలో వెనుకబడిన వర్గాలకు చెందిన 'మాలి' (పూల దండలు కట్టే) కులంలో 1827 ఏప్రిల్ 11న జన్మించారు. బుద్ధుడి బోధనలు, కబీర్ రచనలు, అబ్రహం లింకన్ భావజాలం పూలేని ప్రభావితం చేశాయి. దీంతో వర్ణాశమ ధర్మం బలంగా వేళ్లూనుకొని ఉన్న భారతదేశ సామాజిక వ్యవస్థ గోడలను బద్దలు కొట్టడానికి ఉద్యమ బావుటా ఎగరేశారు. థామస్ పెయిన్ రాసిన 'ది రైట్స్ ఆఫ్ మ్యాన్' పుస్తకం చదివిన ప్రభావం, ఓ బ్రాహ్మణ మిత్రుడి వివాహ వేడుక సందర్భంగా ఎదురైన అవమానాలు పూలేని నిమ్న జాతుల హక్కులు, కుల వ్యవస్థ నిర్మూలన వంటి వాటి కోసం ఉద్యమించేలా చేశాయి.

1848 నుండి 1890 వరకు మరణించే దాకా... నిమ్న వర్గాల హక్కుల కోసం, స్త్రీల సాధికారత కోసం, రైతుల కోసం చేసిన ఉద్యమాలు పూలేని 'మహాత్ము'నిగా నిలబెట్టాయి. సమాజంలోని అన్ని అనర్థాలకూ మూలం విద్య లేకపోవటమే అని బలంగా నమ్మిన పూలే... అప్పటివరకు విద్యకు దూరంగా నెట్టివేయబడిన స్త్రీల కోసం 1848లో పూనా బుదవాడలో మొట్టమొదటి బాలికల పాఠశాల స్థాపించారు. 1852లో అంటరాని కులాల కోసం మరొక పాఠశాలను ఏర్పాటు చేశారు. అది మొదలు పీడిత వర్గాలలో విద్యా వ్యాప్తి కోసం అనేక పాఠశాలలను పూలే దంపతులు ఏర్పాటు చేశారు. దీంతో సంప్రదాయవాదులు పూలే తండ్రి గోవిందరావుపై ఒత్తిడి తెచ్చి... పూలేను గృహ బహిష్కరణ చేయించారు. అయినా ఆయన వెనక్కి తగ్గలేదు. భార్య సావిత్రీబాయి పూలేతో కలిసి మొక్కవోని దీక్షతో సమాజ ఉద్ధరణకు మునుముందుకే సాగారు.



స్త్రీ విద్యతోపాటూ, వితంతు పునర్వివాహాలు జరిపించి వారికి ఆశ్రయం ఇచ్చే ఏర్పాటూ చేశారు. వితంతువుల పిల్లలను, ఇతర అవాంఛిత గర్భందాల్చిన స్త్రీల పిల్లలను చేరదీసి వారిని కన్నబిడ్డల్లాగా చూసుకున్నారు. ఒక బ్రాహ్మణ వితంతువుకు జన్మించిన పిల్లవాడిని దత్తత తీసుకుని పెంచి ప్రయోజకుడిగా తీర్చిదిద్దారు. బాల్య వివాహాలకు, మద్యానికి వ్యతిరేకంగా పని చేశారు. రైతులను దోపిడీ చేస్తున్న కుల కర్ణిలూ, దేశ్‌ముఖ్‌లూ, పట్టీళ్లకు వ్యతిరేకంగా పూలే చేసిన పోరాటాలు రైతులకూ మేలు చేశాయి. సామాజిక సమస్యల పరిష్కారం కోసం సామాజిక విప్లవ సంస్థ అయిన 'సత్య శోధక్ సమాజ్'ని 1873లో ఏర్పాటు చేయటం పూలే సామాజిక ఉద్యమ చరిత్రలో ఒక మైలురాయిగా చెప్పవచ్చు.

సత్యాన్ని అన్వేషణ చేయడం, సామాజిక ఉద్యమాలను వ్యాప్తి చేయటానికి మార్గాలను వెతకటం, అందరికీ సమాన హక్కుల సాధన వంటి లక్ష్యాలతో సత్యశోధక్ సమాజ్ పని చేసింది. రైతు ఉద్యమాల వ్యాప్తి కోసం 'దినబంధు', 'దిన మిత్ర' అనే పత్రికలు కూడా సత్య శోధక్ సమాజ్ ఆధ్వర్యంలోనే నడిచాయి. 1873లో పూలే రాసిన 'గులాంగిరీ' సామాజిక ఉద్యమాలకు దిశా నిర్దేశం చేసిందనే చెప్పాలి.

'అగ్రకులాలకు కింది కులాలు బానిసలు కావు' అనేది గులాంగిరీ చేసిన బోధన. 'తృతీయ రత్న' నాటకం, 'రైతు చేతిలో కొరడా' గ్రంథంతోపాటు పూలే చేసిన అనేక రచనలు సామాజిక మార్పులకు దోహదపడ్డాయి. ఆ విధంగా దేశంలో సమ సమాజ నిర్మాణానికి పూలే ప్రధాన భూమిక పోషించారు.

వ్యాసకర్త అసిస్టెంట్ ప్రొఫెసర్,
కాకతీయ వర్సిటీ । 98854 65877
(నేడు జ్యోతిబా పూలే జయంతి)

ధర్మ స్నానం

శరీరంపై ధూళి పేరుకున్నప్పుడు, చెమట పట్టి మలినంగా ఉన్నప్పుడు మన శరీరం మనకే మోయలేని భారం అనిపిస్తుంది. ఇటువంటి స్థితిలో శరీరానికి ఎక్కడ లేని హాయినిస్తుంది స్నానం. శరీర బరువును దించేస్తుంది. తల భారాన్ని తలస్నానం వదిలించేస్తుంది. అంటే... శుభ్రత, శుద్ధి అనేవి మనల్ని తేలికపరుస్తాయి. భారాన్ని దించి హాయినిస్తాయి. అందుకే... 'స్నాత్యనేన ఇతి స్నానం' అంటారు. అంటే... దేనివల్ల శుచిగా మారి శుద్ధి అవుతుందో అది స్నానం.

ఈ శుద్ధి మనిషికి కేవలం శరీరానికే కాదు. మనస్సుకి కూడా అవసరం. మానసిక మలినాల్ని తొలగించి, మనస్సును శుద్ధి చేసే మాటల్ని సుభాషితాలు అంటాం. మనిషి ఆలోచనల్లో మలినాలు ఉంటే అవి మనిషికి పెను భారం అవుతాయి. మలిన యోచన వల్ల మలిన కర్మలకు మనుషులు పూనుకుంటారు. వాటివల్ల అపఖ్యాతి కలుగుతుంది. అది దుఃఖాన్ని తెచ్చిపెడుతుంది. మంచి మాటలు వినడం, మంచి సాహిత్యం చదవడం, ధార్మిక గ్రంథ పఠనం మనస్సును తేటపరిచే స్నానఘట్టాలు. వాటిలో తలార మునిగితే మనో మలినాలు తొలగిపోతాయి. బుద్ధుని ప్రబోధాలన్నీ మనస్సుని శుద్ధి పరిచేవే!

జ్యోతిర్మయం

నందకుడు ఒక గణానికి రాజు. ఒకసారి బుద్ధుడు వైశాలి దగ్గరి మహావనంలో ధర్మ ప్రసంగం చేస్తున్నాడు. ఆ ప్రబోధాన్ని నందకుడు శ్రద్ధగా వింటున్నాడు. ఆ రోజు శీలం గురించి, మనోశుద్ధి గురించి బుద్ధుడు చెప్తున్నాడు. నందకుడు వింటూ, తనను తాను దర్శించుకుంటూ అందులో లీనమైపోయాడు. కాసేపటికి ఒక పరిచారికుడు వచ్చి వంగి, చెవి దగ్గరలో మెల్లగా.. 'రాజా! తమ స్నానానికి వేళయ్యింది. వేన్నీళ్ళు సిద్ధం చేశాము' అన్నాడు.

'సేవకా! చాలు చాలు. ఇప్పుడు నన్ను పిలవకు. నేనిప్పుడు అదే పనిలో ఉన్నాను. భగవానుని ప్రవచనాలు వింటూ నా మనస్సును శుద్ధి చేసుకుంటున్నాను. ధర్మ స్నానం చేస్తున్నాను. నీవు చెప్పే బాహ్య స్నానం కంటే ఇదెంతో మేలైంది. ఆరోగ్యకరమయింది. నా మనస్సు మలినాల బరువు దించుకుని తేలిక పడుతోంది. ఇక నీవు వెళ్ళు' అని పంపివేశాడు. ప్రతి రోజూ కలత నిదురతో కలత చెందే రాజు, ఎన్నో ఏళ్ళ తర్వాత... ఆ రోజు రాత్రి కంటి నిండా నిద్రపోయాడు.

– బొర్రా గోవర్ధన్

క్లుప్తంగా...

విశాఖ పోర్టు చైర్మన్‌గా రామచంద్రన్ బాధ్యతల స్వీకరణ



సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) చైర్మన్‌గా టీకే రామచంద్రన్ సోమవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఏప్రిల్ 1న బాధ్యతలు చేపట్టినప్పటికీ.. అధికారికంగా విశాఖ చేరుకున్న రామచంద్రన్ పోర్టుని సందర్శించారు.అనంతరం వీపీఏ పరిపాలన భవనంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ట్యుటికోరిన్‌లోని వీవో చిదంబరం పోర్టు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రామచంద్రన్‌కు వీపీఏ చైర్మన్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర పోర్టులు, నౌకా, జలరవాణా మంత్రిత్వ శాఖ ఈ నెల 1న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. చెన్నైకు చెందిన రామచంద్రన్ 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందినవారు. తమిళనాడు క్యాడర్ అధికారిగా పలు హోదాల్లో విధులు నిర్వర్తించారు.

దుర్గమ్మకు అగ్గిపెట్టెలో చీర సమర్పణ



అధికారులకు చీర చూపిస్తున్న విజయ్

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు తెలంగాణ రాష్ట్రం సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారుడు విజయ్ అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీరను సోమవారం సమర్పించారు. బంగారం, వెండి జరీతో చేసిన ఈ చీరకు ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఐదు గ్రాముల బంగారం, పది గ్రాముల వెండిని ఉపయోగించి మంచి పట్టు దారాలతో ఈ చీరను నేశామన్నారు. దీని బరువు సుమారు 100 గ్రాములు ఉంటుందని తెలిపారు. చేనేత వృత్తిని కాపాడాలని అమ్మవారిని వేడుకున్నానని వివరించారు.

శ్రీశైల భ్రమరాంబకు నేడు కుంభోత్సవం

- నిమ్మకాయల దండలతో ఆలయం ముస్తాబు
- నేడు కల్యాణోత్సవం, ఏకాంత సేవ, ఆర్జిత సేవలు నిలుపుదల



నిమ్మకాయలతో అలంకరించిన భ్రమరాంబదేవి ఆలయం

శ్రీశైలం టెంపుల్: లోక కల్యాణార్థం శ్రీశైల/ం శ్రీభ్రమరాంబదేవికి మంగళవారం సంప్రదాయబద్ధంగా కుంభోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణం నిమ్మకాయలతో అలంకరించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవంలో భాగంగా ఉదయం మొదటి విడత సాత్వికబలిగా గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, నిమ్మకాయలు, అన్నపురాశి మొదలైనవి అమ్మవారికి సమర్పిస్తారు. అలాగే హరిహర రాయ గోపురం వద్ద కోటమ్మ వారికి పూజలు నిర్వహిస్తారు. స్వామి, అమ్మవార్ల పూజల అనంతరం అమ్మవారికి ఎదురుగా ప్రదక్షిణ మండపంలో అన్నాన్ని కుంభరాశిగా పోస్తారు. అలాగే సింహ మండపం వద్ద కూడా భక్తులు అమ్మవారికి కుంభరాశి సమర్పిస్తారు. అనంతరం సంప్రదాయాన్ని అనుసరించి స్త్రీవేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పిస్తారు. ఆ తర్వాత అమ్మవారికి రెండో విడత పసుపు, కుంకుమ, సాత్వికబలిగా కొబ్బరి కాయలు సమర్పిస్తారు. రాత్రి ఏడు గంటలకు అమ్మవారి నిజరూప దర్శనం భక్తులకు కల్పిస్తారు. కుంభోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, ఏకాంతసేవ, అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని అన్ని ఆర్జిత సేవలు నిలుపుదల చేశారు.

చీరాల వచ్చిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

చీరాల రూరల్: ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ సోమవారం బాపట్ల జిల్లా చీరాలకు వచ్చారు. ఆయన ఐఎల్‌టీడీ గెస్ట్‌హౌస్‌లో విడిది చేశారు. డీఎస్పీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సముద్ర తీర ప్రాంతాన్ని పోలీసులు తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. విహార యాత్రకు వచ్చిన యాత్రికులను సైతం అటువైపుగా వెళ్లకుండా ఆంక్షలు విధించారు. గవర్నర్ వాడరేవు తీర ప్రాంతాన్ని పరిశీలించి, ఈ నెల 12న బాపట్లలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొంటారని సమాచారం.

చాక్లెట్లు కాదు.. రాకెట్లు

కోరుకున్న రీతిలో తయారు చేస్తున్న స్కైరోరా

- సమాచార విప్లవానికి నాంది పలికిన సంస్థ
- ప్రైవేట్ రాకెట్లకు పెరుగుతున్న డిమాండ్
- స్పేస్ స్టార్టప్స్‌లో పోటీ పడుతున్న అమెరికా, చైనా, యూరప్, భారత్



కె.జి.రాఘవేంద్రారెడ్డి
(సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం)

రండి బాబూ రండి.. కోరుకున్న డిజైన్‌లో రాకెట్ తయారు చేయబడును! వినటానికి ఇది వింతగానే అనిపించినా నిజమే మరి! స్పేస్ స్టార్టప్స్‌లో అగ్రదేశాలు పోటీ పడుతున్నాయి. స్కాట్లాండ్‌కు చెందిన స్కైరోరా సంస్థ కావాల్సిన రీతిలో రాకెట్లు తయారు చేస్తోంది. ప్రైవేట్ సంస్థలు సమాచారాన్ని పొందేందుకు శ్రమ పడాల్సిన అవసరం లేకుండా తాము చేసి పెడతామని చెబుతోంది. వన్‌స్టాప్ సొల్యూషన్ తరహాలో సేవలందిస్తామని భరోసా ఇస్తోంది.

రాకెట్లండీ.. రాకెట్లు!

ప్రైవేట్ కంపెనీలు తమ కమ్యూనికేషన్స్, పర్యవేక్షణల సామర్థ్యాలు పెంచుకునేందుకు సొంతంగా రాకెట్లను అంతరిక్ష కక్ష్యలోకి పంపిస్తున్నాయి. గతంలో కేవలం ప్రభుత్వ రంగంలోనే అనుమతించిన మనదేశం ప్రైవేట్ రాకెట్ల ప్రయోగానికి కూడా అవకాశం కల్పిస్తూ ముందుకు వెళుతోంది. స్పేస్ ఎక్స్‌తో ప్రైవేట్ రాకెట్ల రేసును ఎలన్ మస్క్ ప్రారంభించారు. ఆయనకు చెందిన ఉపగ్రహ ఇంటర్నెట్ నెట్‌వర్క్ 42 వేల శాటిలైట్స్‌తో, జెఫ్ బెజోస్‌కు చెందిన కూపర్ నెట్‌వర్క్ 3,200 శాటిలైట్స్‌తో, యూకే ప్రభుత్వానికి చెందిన వన్‌వెబ్ నెట్‌వర్క్ 650 శాటిలైట్స్‌తో ఏర్పాటు చేసేలా పనులు సాగుతున్నాయి.

పెద్ద ఎత్తున స్పేస్ స్టార్టప్స్

ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున స్పేస్ స్టార్టప్స్ పుట్టుకొస్తున్నాయి. అమెరికా, చైనా, భారత్‌తోపాటు ఐరోపా అంతరిక్ష అంకుర పరిశ్రమల్ని ప్రోత్సహిస్తున్నాయి. 2030 నాటికి గ్లోబల్ స్పేస్ మార్కెట్‌లో 10 శాతం వాటాను సొంతం చేసుకునేలా బ్రిటన్ సిద్ధమైంది. దీనికి సంబంధించి యూకే మార్కెట్ విలువ 483 బిలియన్ డాలర్లుగా అంచనా వేస్తున్నారు. స్కాట్లాండ్‌కు చెందిన అంతరిక్ష శాస్త్రవేత్త వోలోడిమిర్ లెవికిన్ 2017లో స్కైరోరాని ప్రారంభించారు. లానార్క్‌షైర్ కంబర్‌నాల్డ్‌లోని ఫ్యాక్టరీలో స్కైరోరా తన రాకెట్లని డిజైన్ చేస్తోంది. ఎడిన్‌బర్గ్ శివార్లలోని టెస్ట్ బ్లాస్ట్ ఏరియాలో వాటిని ఉంచుతోంది. ప్యాసింజర్ రాకెట్స్ కాకుండా పేలోడ్ రాకెట్లను తయారు చేస్తోందీ సంస్థ.

స్కైరోరా ఫ్లాగ్‌షిప్ రాకెట్

తొమ్మిది ఇంజన్లు, 50 వేల లీటర్ల ఇంధన సామర్థ్యం, 7 మెట్రిక్ టన్నుల్ని మోసుకెళ్లే సత్తాతో సెకనుకు 8 కి.మీ. వేగంతో దూసుకెళ్లగల ఫ్లాగ్‌షిప్ రాకెట్‌ని స్కైరోరా సిద్ధం చేసింది. స్కైరోరా ఎక్స్‌ఎల్ పేరుతో 315 కిలోగ్రాముల పేలోడ్ తీసుకెళ్లగల ఫ్లాగ్‌షిప్ రాకెట్‌ని ఈ ఏడాది షెట్‌ల్యాండ్ దీవుల నుంచి ప్రయోగించేందుకు సిద్ధమైంది. వ్యవసాయ పరిశ్రమలు, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, బీమా సంస్థలు.. ఇలా భిన్న రంగాలకు సంబంధించి అంతరిక్షం నుంచి ఆప్టికల్, టెంపరేచర్ సెన్సార్స్ లాంటి వాటితో సమాచారం సేకరించి రియల్‌టైమ్‌లో డేటా రూపొందించేందుకు రాకెట్లను తయారు చేస్తామని ప్రకటించింది. ఇప్పటికే మొదటి దశ ప్రాజెక్టును పూర్తి చేసింది. 22.7 మీటర్ల పొడవైన రాకెట్ మొదటి దశ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది.

స్పేస్ ఎక్స్‌కు భిన్నంగా స్కైరోరా..

రాకెట్ల తయారీలో ఎలన్‌మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థకు, స్కైరోరాకు గట్టి పోటీ నడుస్తోంది. స్పేస్‌ఎక్స్ అనేది బస్సు ప్రయాణంలాంటిదని, ఇతర ప్రయాణికులతో కలసి నిర్దేశించిన ప్రాంతం నుంచే వినియోగించుకునే అవకాశం ఉందని స్కైరోరా సీఈవో లెవికిన్ చెబుతున్నారు. స్కైరోరా మాత్రం ట్యాక్సీ ప్రయాణం లాంటిదని, ప్రయాణికులు నచ్చిన ప్రాంతానికి ఎప్పుడు కావాలంటే అప్పుడు బయలుదేరేలా రూపొందించామని తెలిపారు. స్పేస్‌ఎక్స్‌లో రాకెట్ కోసం రెండేళ్లపాటు నిరీక్షించాల్సి ఉండగా స్కైరోరాలో మాత్రం ఆర్నెల్లు చాలని స్పష్టం చేస్తున్నారు. యూకే అంతరిక్ష పరిశ్రమలో స్కైరోరా సరికొత్త విప్లవాన్ని సృష్టించేందుకు సిద్ధమవుతోంది. ఇదే తరహాలో భారత్, చైనా సొంత రాకెట్లను తయారు చేసే స్పేస్ స్టార్టప్స్‌ని ప్రోత్సహిస్తూ అంతరిక్ష రంగంలో దూసుకెళ్లే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి.

మంచుకొండల్లో జారిపడి హవల్దార్ మృతి

- శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సీతారామపురం స్వగ్రామం
- నేడు గ్రామానికి హవల్దార్ మండ్ల ప్రసాద్ మృతదేహం



మండ్ల ప్రసాద్ (ఫైల్)

సీతారామపురం: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సీతారామపురానికి చెందిన ఆర్మీ హవల్దార్ మండ్ల ప్రసాద్ (42) లడఖ్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ జారిపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. సీతారామపురానికి చెందిన మండ్ల ప్రసాద్ 21 సంవత్సరాలుగా ఆర్మీలో పనిచేస్తున్నారు. శుక్రవారం లడఖ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రమాదవశాత్తు మంచుకొండల్లో జారిపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను తోటి జవాన్లు గుర్తించి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రసాద్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మంగళవారం మృతదేహాన్ని గ్రామానికి తీసుకురానున్నారు. ఆర్మీ లాంఛనాలతో అంత్యక్రియలు చేయనున్నారు. కాగా, ఆరేళ్ల కిందట ప్రసాద్ తమ్ముడు మండ్ల రమేష్ నెల్లూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ గన్ మిస్‌ఫైర్ అయ్యి మృతి చెందాడు.

విశాఖలో 'ఒబెరాయ్' బృందం పర్యటన

- జీఐఎస్‌లో ఒప్పందం మేరకు 7 స్టార్ హోటల్ ఏర్పాటుకు స్థల పరిశీలన
- భీమిలి సమీపంలో 40 ఎకరాలు కేటాయించిన పర్యాటక శాఖ
- డిజైన్లు సిద్ధం చేసిన 8 నెలల్లో పనులు ప్రారంభిస్తామని వెల్లడి



అన్నవరంలో భూములు పరిశీలిస్తున్న ఒబెరాయ్ ఆర్కిటెక్ట్, కన్సల్టెంట్స్, అధికారులు

సాక్షి, విశాఖపట్నం : ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన జీఐఎస్–2023లో రాష్ట్ర ప్రభుత్వంతో హోటల్స్ రంగంలో దిగ్గజ సంస్థ ఒబెరాయ్ కుదుర్చుకున్న ఒప్పందాన్ని అమలు చేసేందుకు కసరత్తు మొదలైంది. కార్యనిర్వాహక రాజధానిగా రూపాంతరం చెందుతున్న విశాఖలో అంతర్జాతీయ సౌకర్యాలతో కూడిన పర్యాటక హోటల్ నిర్మాణానికి ఒబెరాయ్ సంస్థ ఫాస్ట్‌ట్రాక్ ఏర్పాటు చేసుకుంది. ఇందులో భాగంగా ఒబెరాయ్ గ్రూప్ ఆర్కిటెక్ట్ ప్రబుద్ధ భట్టాచార్య, సంస్థ కన్సల్టెంట్లతో కలిసి సోమవారం విశాఖలో పర్యటించారు. ఒబెరాయ్ గ్రూప్‌కు పర్యాటకశాఖ కేటాయించిన భూములను పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణితో కలిసి పరిశీలించారు. భీమిలి సమీపంలోని అన్నవరం సముద్ర తీరంలో సర్వే నంబర్లు 108, 109, 110లో పర్యాటకశాఖకు ఉన్న 70 ఎకరాల్లో 40 ఎకరాలను ఒబెరాయ్ గ్రూప్‌కు కేటాయించింది. ఇక్కడ ఒబెరాయ్ గ్రూప్ సుమారు రూ.300 కోట్లతో బీచ్ వ్యూ పాయింట్‌లో 7 స్టార్ హోటల్ ఏర్పాటు చేయనుంది. ఈ భూములను పరిశీలించిన తర్వాత డిజైన్లు సిద్ధం చేస్తామని ఆర్కిటెక్ట్ భట్టాచార్య తెలిపారు. డిజైన్లు, అనుమతులు పూర్తయిన తర్వాత ఏడెనిమిది నెలల్లో గ్రౌండ్ వర్క్‌ను ప్రారంభిస్తామని వెల్లడించారు. వీలైనంత త్వరగా హోటల్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు.

పాడేరు ఐటీడీఏకు ఐఎస్‌వో సర్టిఫికెట్

- పనుల నాణ్యతలో తెలుగు రాష్ట్రాల్లోనే నంబర్–1
- ఐఎస్‌వో ధ్రువపత్రం అందజేసిన సంస్థ ఎండీ శివయ్య



ఐఎస్‌వో ధ్రువపత్రం అందుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పీవో గోపాలకృష్ణ

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): గిరిజనాభివృద్ధి కార్యక్రమాలు, విద్య, వైద్యం, గిరిజనుల జీవనోపాధి, మౌలిక సదుపాయాలకు సంబంధించి నాణ్యత ప్రమాణాల్లో పాడేరు ఐటీడీఏ నంబర్–1గా నిలిచింది. ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, తెలుగు రాష్ట్రాలకు సంబంధించి పాడేరు ఐటీడీఏకు ఐఎస్‌వో 9001:2015 సర్టిఫికెట్ అందించింది. కలెక్టరేట్‌లో ఐటీడీఏ చైర్మన్, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణకు సోమవారం ఐఎస్‌వో సంస్థ ఎండీ శివయ్య ఐఎస్‌వో ధ్రువపత్రం అందజేశారు. పాడేరు ఐటీడీఏ కార్యక్రమాల నిర్వహణలో నాణ్యత పాటించడం, ఉత్తమ వైద్య సేవలు, విద్యా ప్రమాణాల పెంపు, మెరుగైన జీవనోపాధి కల్పన, విద్యుదీకరణ, తాగునీటి సౌకర్యం కల్పన వంటి రంగాలలో పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలను ఐఎస్‌వో సంస్థ సమగ్రంగా పరిశీలించింది. పాడేరు ఐటీడీఏకు ఐఎస్‌వో సంస్థ సర్టిఫికెట్ అందజేయడంపై కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ సంతోషం వ్యక్తం చేశారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 86,129 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.86 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

లక్ష కడితే నెలకు రూ.40 వేల వడ్డీ

- ఏవోజీ కంపెనీ పేరిట డిపాజిటర్లకు టోకరా
- రూ.45 లక్షలు చెల్లించి మోసపోయిన బ్యూటీషియన్

చిత్తూరు అర్బన్: 'రూ.లక్ష పెట్టుబడి పెట్టండి. ప్రతి వారం రూ.10 వేలు పట్టుకెళ్లండి. మూడేళ్ల తర్వాత మీరు పెట్టిన రూ.లక్ష పెట్టుబడిని వెనక్కు ఇచ్చేస్తాం. మీరు పెట్టిన రూ.లక్షకు బాండు ఇదిగో' అంటూ ఓ బ్యూటీషియన్‌ను మోసం చేసి ఏకంగా రూ.45 లక్షలు కాజేసిన ఉదంతమిది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నరసింహరాజు కథనం ప్రకారం.. చిత్తూరు నగరంలోని చేపల మార్కెట్ వీధికి చెందిన అనురాధ కొంగారెడ్డిపల్లెలోని బ్యూటీషియన్‌గా పనిచేస్తున్నారు. బజారులో ఉన్న ఏవోజీ అనే కంపెనీలో డబ్బులు డిపాజిట్ చేస్తే మంచి లాభాలు ఇస్తున్నారంటూ తన బంధువు చెప్పడంతో అనురాధ అక్కడకు వెళ్లింది. రూ.లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ.40 వేలు వడ్డీ ఇస్తామని.. మూడేళ్ల తరువాత పెట్టుబడి రూ.లక్షను సైతం ఇచ్చేస్తామని ఏవోజీ కంపెనీ ప్రతినిధులు చెప్పారు. అయితే, కంపెనీ నిబంధనల ప్రకారం తొలి మూడు నెలల వరకు వడ్డీ రాదని, నాలుగో నెల నుంచి మొత్తం చెల్లిస్తామని చెప్పారు. ఇంత పెద్ద మొత్తం వస్తుందని ఆశపడ్డ అనూరాధ తనతో పాటు తన సమీప బంధువుల నుంచి అప్పు తీసుకుని, ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి ఏవోజీ కంపెనీ ప్రతినిధులకు ఏకంగా రూ.45 లక్షలు చెల్లించారు. మూడు నెలలు దాటడంతో వడ్డీ తీసుకుందామని కంపెనీకి వెళ్లిన అనూరాధ బోర్డు తిప్పేసినట్టు గ్రహించి పోలీసులను ఆశ్రయించింది. ఈ కంపెనీలో మరికొందరు కూడా పెద్దఎత్తున నగదు జమ చేసినట్లు తెలుస్తోంది. రూ.కోట్లలో డిపాజిట్లు చేసిన వాళ్లకు అసలు విషయం ఇంకా తెలియలేదు. ప్రస్తుతం బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఇంకా ఎవరైనా బాధితులు ఫిర్యాదు చేస్తే వాటిపై కూడా కేసు నమోదు చేస్తామని సీఐ పేర్కొన్నారు.

బీసీలను ప్రోత్సహించింది మేమే

- టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేశ్



శింగనమల/ గార్లదిన్నె: బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా ప్రోత్సహించింది టీడీపీయేనని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. సోమవారం అనంతపురం జిల్లా శింగనమల మండలంలోని సోదనపల్లి క్రాస్ నుంచి ఉల్లికంటిపల్లి వరకు యువగళం పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా సలకంచెరువు గ్రామంలో నిర్వహించిన బీసీ సదస్సులో నారా లోకేశ్ మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ కులాలకు దామాషా ప్రకారం నిధులు, రుణాలు కేటాయిస్తామన్నారు. బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకు వస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 26 వేల మంది బీసీలపై కేసులు పెట్టారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మట్టి మాఫియా రెచ్చిపోతోందని విమర్శించారు. రాష్ట్రంలోని బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణను జగన్ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. అందుకే ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. వాల్మీకులను ఆదుకున్నది టీడీపీయేనన్నారు. ఎస్టీ జాబితాలోకి చేర్చే అంశంపై గతంలోనే తీర్మానం చేసి పంపించామని, కానీ జగన్ ప్రభుత్వం మళ్లీ తీర్మానం అంటూ కొత్త డ్రామా ఆడుతోందని ఆరోపించారు. బీసీలకు శాశ్వత కులధ్రువీకరణ పత్రాలు అందించేలా చేస్తామన్నారు. మట్లగొంది సమీపంలో గొర్రెల కాపర్లతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.

పేదల సంక్షేమానికి బాబు అండ్ కో తూట్లు

925వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: పేదలు ఆర్థికంగా, సామాజిక, రాజకీయ రంగాల్లో ఎదిగితే తాము శాశ్వతంగా అధికారానికి దూరమవుతామనే భయంతోనే బాబు అండ్‌కో ఆధ్వర్యంలో కులవాదులు తప్పుడు కేసులతో సంక్షేమాన్ని అడ్డుకుంటున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 925వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చాక గత 75 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి , సంక్షేమం పేదల చెంతకు చేరిందనేది బహిరంగ సత్యమన్నారు. రాష్ట్రంలో 35 లక్షల మంది పేదలకు ఉచితంగా ఇళ్ల స్థలాలిచ్చి పక్కా ఇంటి నిర్మాణం చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల గుండెల్లో స్థానం సంపాదించాడని తెలిపారు. టిడ్కో ఇళ్ల పేరుతో సెల్ఫీలు దిగుతున్న చంద్రబాబు తన హయాంలో అరకొరగా ఇళ్లనిర్మాణాలు చేసి మధ్యలోనే వదిలేస్తే పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించి పేదలకిచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం చేస్తుందన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో శ్రీవారి ఆలయ మహాసంప్రోక్షణ

ఈ నెల 29 నుంచి మే 4వ తేదీ వరకు నిర్వహణ



సీతంపేటలోని శ్రీవారి ఆలయం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయ మహాసంప్రోక్షణ కార్యక్రమాలు ఈ నెల 29వ తేదీ నుంచి మే 4వ తేదీ వరకూ నిర్వహిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) జేఈవో వీరబ్రహ్మం వెల్లడించారు. కార్యక్రమ ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి వైభవాన్ని నలుదిశలా వ్యాప్తి చేసేందుకు దేశంలోని ప్రముఖ నగరాలతో పాటు మారుమూల ప్రాంతాల్లోనూ స్వామి వారి ఆలయాలను టీటీడీ నిర్మిస్తోందన్నారు. అందులో భాగంగానే సీతంపేటలో కూడా శ్రీవారి ఆలయాన్ని నిర్మించినట్లు చెప్పారు. మే 4వ తేదీ నుంచి భక్తులకు ఇక్కడ స్వామి వారి దర్శనం ప్రారంభిస్తామని వెల్లడించారు. అనంతరం విజయనగరం జిల్లా రాజాం సమీపంలో ఉన్న శ్రీవారి ఆలయాన్ని జేఈవో వీరబ్రహ్మంతో పాటు టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, డిప్యూటీ ఈవో గుణభూషణ్‌రెడ్డి తదితరులు సందర్శించారు.

సోలార్ స్తంభాన్ని ఢీకొట్టి..
ఆపై 200 మీటర్లు దూసుకెళ్లిన కారు

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి • తిరుపతి జిల్లాలో ఘటన • మృతులు కర్ణాటక వాసులు





నుజ్జునుజ్జయిన కారు, దాని పక్కనే శ్యామల మృతదేహం (ఇన్‌సెట్‌లో) గోపీనాథ్ మృతదేహం

కుప్పం రూరల్/చంద్రగిరి: తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై కాశిపెంట్ల సమీపంలో జరిగిన ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందారు. కర్ణాటకలోని కోలార్ జిల్లా కేజీఎఫ్ ఆర్ పేటకు చెందిన గోపీనాథ్ (46), శ్యామల (41) ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి కేజీఎఫ్ నుంచి కారులో తిరుమలకు చేరుకున్నారు. సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. కాశిపెంట్ల వద్ద వీరి కారు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న సోలార్ స్తంభాన్ని ఢీకొంది. అక్కడ నుంచి కారు పల్టీలు కొట్టుకుంటూ 200 మీటర్ల దూరంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్యామల కారులో నుంచి బయటపడి మృతి చెందగా, గోపీనాథ్ కారులో ఇరుక్కుపోయాడు. అటుగా వెళ్తున్న పలువురు అతి కష్టంమీద గోపీనాథ్‌ను బయటకు తీయగా..కాసేపటికే అతడు మృతి చెందాడు. మృతదేహాలను పోస్టుమార్టానికి తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. నిద్రమత్తే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరు యువకుల మృతి

కర్ణాటకలోని బెంగళూరు హొసుకోటకు చెందిన సుబాన్‌బాయ్ తన కుటుంబంతో చిత్తూరు జిల్లా, కుప్పం మండలంలోని నూలుకుంటలో తన మరదలు నసీబా ఇంటి వద్ద జరిగిన ఓ శుభ కార్యక్రమం కోసం ఆదివారం వచ్చాడు. ఆదివారం కార్యం ముగించుకుని సోమవారం అక్కడే ఉండిపోయారు. సుబాన్‌బాయ్ కుమారుడు మహ్మద్‌యాసీన్, తమ్ముడి కుమారుడు ఉమర్‌ఫరూక్ సమీపంలోని గోపినగర్ చెరువులో సరదాగా ఈతకు వెళ్లారు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో చెరువు గట్టుపైనే స్నానం చేస్తున్నారు. మహ్మద్‌యాసీన్ అదుపు తప్పి జారి పడిపోతుండగా, ఉమర్ ఫరూక్ చేయి పట్టుకున్నాడు. ఇద్దరూ నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టానికి కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుప్పం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

క్లుప్తంగా...

ఈసారి తక్కువ వర్షాలే

న్యూఢిల్లీ: దేశంలో ఈ ఏడాది సాధారణ కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రైవేట్ వాతావరణ అంచనాల ఏజెన్సీ 'స్కైమెట్ వెదర్' సోమవారం ప్రకటించింది. లా నినా, ఎల్‌నినో ప్రభావంతో కరువు సంభవించడానికి 20 శాతం అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది. వరుసగా గత నాలుగేళ్లుగా దేశంలో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు పడ్డాయి. ఈసారి సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైతే ప్రధానంగా వ్యవసాయ రంగంలో ఇబ్బందులు తప్పవు. పంటల ఉత్పత్తి పడిపోతుంది. తద్వారా ఆహార ధాన్యాల ధరలు పెరుగుతాయి.

వీడియోపై వివాదం.. దలైలామా క్షమాపణ



సిమ్లా: టిబెటన్ బౌద్ధ గురువు దలైలామా ఇటీవల తన వద్దకు ఆశీర్వాదం కోసం వచ్చిన ఓ బాలుడి పెదాలపై ముద్దు పెట్టుకోవడం వివాదాస్పదంగా మారింది. దీంతో సోమవారం ఆ బాలుడి కుటుంబానికి దలైలా మా క్షమాపణలు తెలిపారు. బాలుడిని పెదాల పై ముద్దుపెట్టుకోవడం, తన నాలుకను నోటితో తాకాలని కోరినట్లుగా ఉన్న 2 నిమిషాల వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దలైలామా చర్యల పట్ల నెటిజన్లు తీవ్ర నిరసన తెలుపుతున్నారు. దీంతో, తన మాటలతో ఎవరైనా బాధపడితే వారందరినీ ఆయన క్షమాపణ కోరారని దలైలామా బృందం తెలిపింది. 'తనను కలిసే వ్యక్తులతో, ముఖ్యంగా చిన్నారులతో సరదాగా ఉంటారు. ఒక్కోసారి ఆటపట్టిస్తుంటారు. సమావేశాల్లోనైనా, కెమెరాల ముందైనా ఆయన ఇలాగే ఉంటారు. అయితే, జరిగిన దానికి ఆయన క్షమాపణలు కోరుతున్నారు' అని వివరించింది.

అమృత్ సన్నిహితుడు అరెస్ట్

చండీగఢ్: ఖలిస్తానీ అనుకూల బోధకుడు అమృత్‌పాల్ సింగ్ ప్రధాన అనుచరుడు పాపల్‌ప్రీత్ సింగ్‌ను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అమృత్‌సర్‌లోని కథునంగల్ ఏరియాలో ఇతడిని పట్టుకున్నట్లు పంజాబ్ ఐజీ సుఖ్‌చైన్ సింగ్ చెప్పారు. పాపల్‌ప్రీత్ సింగ్‌పై జాతీయ భద్రతా చట్టంతోపాటు ఆరు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఖలిస్తానీ మద్దతుదారులపై మార్చి 18వ తేదీ నుంచి మొదలైన అరెస్టుల నుంచి అతడు తప్పించుకు తిరుగుతున్నాడు.

కర్ణాటక శాసనసభ ఎన్నికలకు సరిగ్గా నెల రోజులు మాత్రమే గడువు మిగిలి ఉంది. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్, జేడీ(ఎస్) పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. రాష్ట్రంలో 1985 నుంచి అధికార పార్టీ వరుసగా రెండోసారి నెగ్గిన దాఖలాలు లేవు. 38 ఏళ్ల ఆ సంప్రదాయాన్ని బద్దలుకొట్టి, మళ్లీ జెండా ఎగురవేయాలన్న కృతనిశ్చయంతో బీజేపీ ఉంది. మరోవైపు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యా బలాన్ని సొంతంగానే సాధించాలన్న పట్టుదలతో ముందుకు సాగుతోంది. తగిన మెజార్టీ లేక దెబ్బతిన్న అనుభవాలు ఆ పార్టీకి ఉన్నాయి. కర్ణాటకలో గెలుపు కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వ్యూహాలు రచిస్తున్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ నెగ్గి, సొంతంగా మెజార్టీ సాధిస్తే రెండు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నట్లే.

'రెండో' గండం దాటేస్తారా!?



ఆసక్తికరంగా కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు

వరుసగా రెండోసారి అధికారంలోకి రాలేకపోతున్న పార్టీలు

38 ఏళ్ల సంప్రదాయాన్ని తిరగరాయాలనుకుంటున్న బీజేపీ

సొంతంగానే పూర్తి మెజార్టీ సాధించాలన్నదే లక్ష్యం

స్వయంగా రంగంలోకి దిగిన నరేంద్ర మోదీ, అమిత్ షా

కర్ణాటకలో జనతా పార్టీ నేత రామకృష్ణ హెగ్డే ముఖ్యమంత్రిగా 1983 నుంచి 1985 వరకూ మైనార్టీ ప్రభుత్వం కొనసాగింది. రాష్ట్రంలో అదే తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం. 1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో జనతా పార్టీకి ఆశించిన ఫలితాలు రాలేదు. దీంతో రామకృష్ణ హెగ్డే తన ప్రభుత్వాన్ని రద్దు చేశారు. మూడు నెలల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. జనతా పార్టీ ఘన విజయం సాధించింది. 224 సీట్లున్న అసెంబ్లీలో ఏకంగా 139 సీట్లు గెలుచుకుంది. 1985లో వరుసగా రెండోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అనంతరం జనతా పార్టీలో విభేదాలు తలెత్తాయి. జనతా పార్టీ మూడు పార్టీలుగా విడిపోయింది. 1989లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓటమి పాలైంది. కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. వీరేంద్ర పాటిల్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత జరిగిన ప్రతి ఎన్నికల్లో అధికార పార్టీ ఓడిపోతూ వచ్చింది. 1989 నుంచి ఇప్పటివరకూ ఏడుసార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ముఖ్యమంత్రులకు మళ్లీ అదే పదవి వరుసగా రెండోసారి దక్కలేదు. మూడున్నరేళ్ల క్రితం సీఎంగా కుర్చీనెక్కిన బసవరాజ బొమ్మై తన పార్టీని గెలిపించి, మళ్లీ సీఎం అవుతారా! అన్నది చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన భవితవ్యం తేలిపోనుంది.

బొమ్మై లక్ ఎలా ఉందో!




కేంద్ర ప్రభుత్వ పథకాలతో రాష్ట్రంలో కోట్లాది మంది లబ్ధి పొందారని, వారంతా తమకు అనుకూలంగా ఓటు వేయడం ఖాయమని బీజేపీ నాయకత్వం ఆశలు పెంచుకుంది. కర్ణాటక ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. ప్రధాన మంత్రి జన సురక్ష యోజన కింద రాష్ట్రంలో 1.4 కోట్ల మంది ఖాతాల్లోకి రూ.6,000 చొప్పున బదిలీ చేశారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద అన్ని బీపీఎల్ కుటుంబాలకు హెల్త్ కార్డులు అందజేశారు. జన్ ఆవాస్ యోజన కింద 30 లక్షల మందికి ఇళ్ల నిర్మాణం కోసం రూ.10 లక్షల చొప్పున రుణాలు మంజూరు చేశారు. మరోవైపు సర్కారీ కాంట్రాక్టుల్లో '40 శాతం కమీషన్లు' అనే ఆరోపణలు బొమ్మై ప్రభుత్వానికి ప్రతికూలంగా మారాయి. రాష్ట్రంలో అవినీతి భారీగా పెరిగిపోవడం, రాజధాని బెంగళూరులో కనీస మౌలిక సదుపాయాలు కొరవడడం పట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఆశలు



కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సాధించిన సీట్లు



మోదీ-షాకు ప్రతిష్టాత్మకం

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలపై నరేంద్ర మోదీ, అమిత్ షా ఎంతో శక్తిని, సమయాన్ని, కేంద్ర ప్రభుత్వ వనరులను వెచ్చిస్తున్నారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మళ్లీ బీజేపీని గెలిపించి, ట్రెండ్‌ను రివర్స్ చేయాలన్నదే వారి లక్ష్యంగా కనిపిస్తోంది. గత ఏడు నెలలుగా కర్ణాటకలో ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. బెంగళూరు-మైసూర్ ఎక్స్‌ప్రెస్ వే, ధార్వాడలో ఐఐటీ క్యాంపస్, శివమొగ్గలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, హుబ్బళ్లిలో ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే ప్లాట్‌ఫామ్ వంటి కీలకమైన ప్రాజెక్టులను నరేంద్ర మోదీ ప్రారంభించారు. 'కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నుకోండి, డబుల్ ఇంజిన్ ప్రయోజనాలు అందుకోండి' అని పిలుపునిస్తున్నారు.

సంపూర్ణ మెజార్టీయే లక్ష్యం

రాష్ట్రంలో 2008, 2018లో బీజేపీ విజయం సాధించింది. రెండుసార్లూ 100 సీట్ల మార్కును దాటింది. కానీ, సంపూర్ణ మెజార్టీ అడుగు దూరంలోనే ఆగిపోయింది. ఇతర పార్టీల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. కానీ, అందుకు భారీ మూల్యమే చెల్లించాల్సి వచ్చింది. ఈసారి మాత్రం పూర్తి మెజార్టీ దక్కించుకునేందుకు మోదీ-షా నేరుగా రంగంలోకి దిగారు. కులాలు లెక్కలు, ప్రాంతీయ సమీకరణాలను క్షుణ్నంగా పరిశీలిస్తున్నారు. బీజేపీ తరఫున పోటీకి దిగే అభ్యర్థులను స్వయంగా ఎంపిక చేస్తున్నారు. గెలుపు గుర్రాల ఎంపికలో నిమగ్నమయ్యారు.

'కోటా' కార్డు పనిచేస్తుందా?

వేర్వేరు సామాజిక వర్గాలను ఆకట్టుకొనేందుకు బసవరాజ బొమ్మై రిజర్వేషన్ కార్డును ప్రయోగిస్తోంది. ఎన్నికల ప్రకటనకు కేవలం నాలుగు రోజుల ముందు రిజర్వేషన్ ఫార్ములాను సవరించే ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చింది. ఓబీసీ కేటగిరీలో ముస్లింలకు అమలవుతున్న 4 శాతం రిజర్వేషన్లను తొలగించి, వాటిని లింగాయత్‌లు, వొక్కళిగలకు సమానంగా వర్తింపజేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ముస్లింలకు ఆర్థికంగా వెనుకబడిన తరగతుల(ఈడబ్ల్యూఎస్) కేటగిరీలో రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. అలాగే ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచింది. కోటా కార్డు తమకు కచ్చితంగా లాభిస్తుందని బీజేపీ ధీమా వ్యక్తం చేస్తోంది. అయితే, రిజర్వేషన్ల విషయంలో బొమ్మై సర్కారు ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం ఇంకా ఆమోదించలేదు. అందుకే వాటి ప్రభావం ఓటర్లపై పెద్దగా ఉండకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రిజర్వేషన్ల పేరిట బీజేపీ డ్రామాలు ఆడుతోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.



కర్ణాటకలో ఓట్ల శాతం పెంచుకుంటేనే కాంగ్రెస్ గట్టెక్కే పరిస్థితి కనిపిస్తోంది. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ 38 శాతం ఓట్లతో 80 సీట్లు సాధించింది. బీజేపీ కేవలం 36.2 శాతం ఓట్లతో 104 స్థానాల్లో నెగ్గింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

జేడీ(ఎస్) బలం పాత మైసూర్

కిత్తూర్ కర్ణాటక(పాత ముంబై ప్రాంతం), కల్యాణ కర్ణాటక(హైదరాబాద్ కర్ణాటక), సెంట్రల్ కర్ణాటకతోపాటు కోస్తా ప్రాంతంలో బీజేపీ బలంగానే ఉంది. పాత మైసూర్ ప్రాంతం, బెంగళూరు సిటీలో మాత్రం వెనుకబడి ఉండడం ఆ పార్టీని కలవరానికి గురిచేస్తోంది. ఈ రెండుచోట్ల మొత్తం 89 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. పాత మైసూర్‌లో వొక్కళిగ సామాజికవర్గం ప్రాబల్యం అధికం. 2018 ఎన్నికల్లో జేడీ(ఎస్) ఇక్కడ 37 స్థానాలకు గాను 30 స్థానాలు గెలుచుకుంది. కింగ్‌మేకర్‌గా మారింది. ఆ పార్టీ నేత, వొక్కళిక సామాజికవర్గం ప్రముఖుడు హెచ్‌డీ కుమారస్వామి 14 నెలలపాటు సీఎంగా కొనసాగారు. పాత మైసూర్‌లో ఈసారి కూడా వీలైనన్ని ఎక్కువ సీట్లు సాధించి, ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారాలని జేడీ(ఎస్) భావిస్తోంది.



కన్నడనాట పాల గోల

అమూల్ నందినీ డెయిరీలపై రాజకీయ రగడ



బెంగళూరు: అసెంబ్లీ ఎన్నికల వేళ కర్ణాటకలో పాలపై వివాదం చినికిచినికి గాలివానగా మారుతోంది. బెంగళూరులో ఆన్‌లైన్ ద్వారా అమూల్ పాలు, పెరుగు విక్రయించనున్నట్టు గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఇటీవల చేసిన ప్రకటన కలకలం రేపుతోంది. అమూల్‌కు వ్యతిరేకంగా పలు కన్నడ సంస్థలు సోమవారం నిరసనలు, ధర్నాలు నిర్వహించాయి. గో బ్యాక్ అమూల్, సేవ్ నందిని అంటూ హాష్‌ట్యాగ్‌లతో సోషల్ మీడియాలోనూ నిరసనలు జోరందుకుంటున్నాయి. అమూల్‌ను రాష్ట్రంలోకి తీసుకొచ్చి స్థానిక నందినీ డెయిరీని దెబ్బ తీసేందుకు అధికార బీజేపీ ప్రయత్నిస్తోందని విపక్ష కాంగ్రెస్, జేడీ(ఎస్) విమర్శలు గుప్పిస్తున్నాయి. ''గుజరాత్‌కు చెందిన బరోడా బ్యాంక్ మా విజయ బ్యాంక్‌ను కబళించింది. దేశంలోని నౌకాశ్రయాలు, విమానాశ్రయాలన్నింటినీ గుజరాతీ అయిన అదానీకి కట్టబెడుతున్నారు. ఇప్పుడు నందినీ డెయిరీపై పడ్డారు'' అంటూ కాంగ్రెస్ నేత సిద్దరామయ్య దుయ్యబట్టారు. జేడీ(ఎస్) నేత కుమారస్వామి కూడా అమూల్‌పై విమర్శలతో ట్వీట్లు చేశారు. ఈ ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చింది. అమూల్ కర్ణాటకలోకి ప్రవేశించడం లేదని బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి అమిత్ మాలవీయ చెప్పారు. నందినీ డెయిరీని అమూల్‌లో విలీనం చేస్తారన్నది కూడా కాంగ్రెస్ కుట్రపూరిత ప్రచారం మాత్రమేనన్నారు. బీజేపీ హయాంలోనే నందినీ డెయిరీ భారీగా విస్తరించిందని చెప్పుకొచ్చారు.

అమెరికాలో కాల్పులు... ఐదుగురు దుర్మరణం


లూయిస్‌విల్లె: అమెరికాలోని కెంటకీ రాష్ట్రం లూయిస్‌విల్లెలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న కాల్పుల్లో ఐదుగురు చనిపోయారు. ఓల్డ్ నేషనల్ బ్యాంక్ పనిచేసే భవనంలోనే కాల్పులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. తమ కాల్పుల్లో దుండగుడు మరణించాడన్నారు. ఈ ఘటనలో పోలీసు అధికారి సహా ఆరుగురు గాయపడినట్లు చెప్పారు.

ఆలయంలో చెట్టు కూలి... మహారాష్ట్రలో ఏడుగురి మృతి

అకోలా: మహారాష్ట్రలోని అకోలా జిల్లాలో ఘోర ప్రమాదం సంభవించింది. ఆలయ ప్రాంగణంలో 100 ఏళ్ల వయసున్న చెట్టు కూలిపోవడంతో ఏడుగురు మరణించారు. మరో 37 మంది గాయాలపాలయ్యారు. బాలాపూర్ తాలూకా పారస్ గ్రామంలోని బాబూజీ మహారాజ్ ఆలయంలో ఆదివారం రాత్రి 7.30 గంటలకు ఈ సంఘటన జరిగిందని అధికారులు వెల్లడించారు.

కల్యంపూడి రాధాకృష్ణారావుకు అంతర్జాతీయ స్టాటిస్టిక్స్ పురస్కారం

భారత్-అమెరికన్ గణిత శాస్త్రవేత్తకు ప్రతిష్టాత్మక అవార్డు



వాషింగ్టన్: ప్రఖ్యాత భారత్-అమెరికన్ గణిత శాస్త్రవేత్త, గణాంకశాస్త్ర(స్టాటిస్టిక్స్) నిపుణుడు కల్యంపూడి రాధాకృష్ణారావు(102)ను ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పురస్కారం వరించింది. స్టాటిస్టిక్స్ రంగంలో నోబెల్ బహుమతితో సమానమైన 'ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటిస్టిక్స్'ను 2023 సంవత్సరానికి గాను రాధాకృష్ణారావుకు అందజేయనున్నట్లు ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటిస్టిక్స్ ఫౌండేషన్ ఒక ప్రకటనలో వెల్లడించింది. స్టాటిస్టిక్స్‌లో 75 ఏళ్ల క్రితం ఆయన చేసిన కృషి సైన్స్‌పై ఇప్పటికీ అమిత ప్రభావం చూపిస్తోందని ప్రశంసించింది. కెనడాలోని ఒట్టావాలో ఈ ఏడాది జూలైలో జరిగే ఇంటర్నేషనల్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ వరల్డ్ స్టాటిస్టిక్స్ కాంగ్రెస్‌లో అవార్డును ప్రదానం చేయనున్నారు. ఈ బహుమతి కింద 80,000 డాలర్లు అందజేస్తారు. ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటిస్టిక్స్‌ను ప్రతి రెండేళ్లకోసారి ప్రదానం చేస్తారు. 2017లో తొలిసారిగా ఈ అవార్డును డేవిడ్ ఆర్ కాక్స్ అందుకున్నారు. 2019లో బ్రాడ్లీ ఎఫ్రాన్, 2021లో నాన్ లాయిర్డ్ స్వీకరించారు.


ఏపీలో విద్యాభ్యాసం

కల్యంపూడి రాధాకృష్ణారావు కర్ణాటకలోని హడగళిలో తెలుగు కుటుంబంలో జన్మించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గూడూరు, నూజివీడు, నందిగామ, విశాఖపట్నంలో విద్యాభ్యాసం సాగింది. ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి గణితశాస్త్రంలో ఎంఎస్సీ చేశారు. 1943లో కలకత్తా యూనివర్సిటీ నుంచి స్టాటిస్టిక్స్‌లో ఎంఏ డిగ్రీ అందుకున్నారు. ఇంగ్లండ్‌లో కేంబ్రిడ్జి యూనివర్సిటీకి చెందిన కింగ్స్ కాలేజీలో పీహెచ్‌డీ చేశారు. 1965లో కేంబ్రిడ్జి వర్సిటీ నుంచి డీఎస్సీ డిగ్రీ స్వీకరించారు. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, తర్వాత కేంబ్రిడ్జిలోని ఆంత్రోపాలాజికల్ మ్యూజియంలో సేవలందించారు. పలు భారత, విదేశీ వర్సిటీల్లో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1968లో పద్మభూషణ్, 2001లో పద్మ విభూషణ్ అందుకున్నారు.

తైవాన్‌పై యుద్ధానికి సై!

చైనా సైన్యం ప్రకటన ● ముగిసిన సైనిక విన్యాసాలు ● అయినా తైవాన్ చుట్టూ మోహరింపులు యథాతథం ● తారస్థాయికి చేరిన ఉద్రిక్తతలు

తైవాన్ సముద్రజలాల్లో పయనిస్తున్న చైనా కోస్ట్‌గార్డ్ నౌక



తైపీ: దక్షిణ చైనా సముద్రంపై యుద్ధ మేఘాలు దట్టంగా కమ్ముకుంటున్నాయి. చైనా-తైవాన్ ఘర్షణ క్రమంగా తారస్థాయికి చేరుతోంది. ఈ ద్వీప దేశంపై ఏ క్షణంలోనైనా యుద్ధానికి దిగేందుకు అన్నివిధాలా సిద్ధంగా ఉన్నట్టు చైనా సైన్యం సోమవారం చేసిన ప్రకటన ప్రకంపనలు సృష్టిస్తోంది. స్వయంపాలిత హోదా ఉన్న తైవాన్ నిజానికి తమ అంతర్భాగమేనని చైనా చిరకాలంగా వాదిస్తుండటం తెలిసిందే. ఈ వాదనతో తైవాన్ తీవ్రంగా విభేదిస్తోంది. పూర్తిస్థాయి స్వతంత్ర దేశంగా గుర్తింపు పొందేందుకు చాలాకాలంగా ప్రయత్నిస్తోంది. అందుకు అమెరికా అన్నివిధాలా వెన్నుదన్నుగా నిలుస్తుండటంపై చైనా గుర్రుగా ఉంది. గత ఆగస్టులో చైనా హెచ్చరికలను ఖాతరు చేయకుండా అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ తైవాన్‌లో పర్యటించడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా తైవాన్ దేశాధ్యక్షురాలు సై ఇంగ్ వెన్ జరిపిన అమెరికా పర్యటనపై చైనా మరోసారి అగ్గిమీద గుగ్గిలం అవుతోంది. మూడు రోజులుగా చైనా సైన్యం తైవాన్ ద్వీపకల్పాన్ని దిగ్బంధించి భారీ సైనిక విన్యాసాలకు తెర తీసింది. జాయింట్ స్వార్డ్ పేరిట జరిగిన ఈ యుద్ధ సన్నద్ధత విన్యాసాలు సోమవారంతో ముగిశాయి. కానీ తైవాన్ చుట్టూరా చైనా సైనిక మోహరింపులు మాత్రం యథాతథంగా కొనసాగుతున్నాయి. ''ఏ క్షణంలోనైనా యుద్ధానికి దిగేందుకు సిద్ధంగా ఉన్నాం. స్వాతంత్ర్యం కోసం తైవాన్ చేసే ప్రయత్నాలను పూర్తిస్థాయిలో అణచివేస్తాం. ఈ విషయంలో విదేశీ జోక్యాలను కూడా మర్చిపోలేని రీతిలో తిప్పికొడతాం'' అంటూ ఈ సందర్భంగా చైనా సైన్యం ప్రకటన విడుదల చేసింది. ''తైవాన్‌లోని వేర్పాటువాదులకు, వారికి దన్నుగా నిలుస్తున్న బయటి శక్తులకు మా సైనిక విన్యాసాలు ఒక గట్టి హెచ్చరిక'' అని చైనా సైన్యం ఈస్టర్న్ కమాండ్ అధికార ప్రతినిధి షీ యీ అన్నారు. తైవాన్ విషయంలో తాము అనుసరిస్తున్న 'వన్ చైనా' సూత్రానికి అన్ని దేశాలూ మద్దతిస్తాయని ఆశిస్తున్నట్టు ఆ దేశ విదేశాంగ అధికార ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ అన్నారు. ఈ ప్రాంతంపై పట్టు కోసం తైవాన్‌ను పావుగా అమెరికా వాడుకుంటోందని పీఎల్‌ఏ డైలీ ఆరోపించింది. తమతో యుద్ధమే వస్తే తైవాన్‌కు సైనిక సాయానికి అమెరికా ముందుకు రాదని అభిప్రాయపడింది. గత ఆగస్టులో నాన్సీ పర్యటనకు నిరసనగా కూడా చైనా ఇలాంటి విన్యాసాలే చేపట్టడం తెలిసిందే. తైవాన్ పరిసరాల్లోని పలు లక్ష్యాలపై క్షిపణి ప్రయోగాలకు కూడా దిగి తీవ్ర ఉద్రిక్తతకు తెర తీసింది.

శతాబ్దాల నాటి ఘర్షణ

చైనా, తైవాన్ ఘర్షణలకు శతాబ్దాల చరిత్ర ఉంది. కొన్నేళ్లుగా తైవాన్ చుట్టూ సైనిక విన్యాసాలు చైనాకు పరిపాటిగా మారాయి. అయితే ఆ దేశాన్ని ఈ స్థాయిలో చుట్టుముట్టి సైనికంగా పూర్తిగా దిగ్బంధించడం ఇదే తొలిసారి. దీని వెనక కచ్చితంగా ఏదో మతలబు ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. షాన్‌డాంగ్ విమాన వాహక నౌకను కూడా చైనా రంగంలోకి దించింది. యుద్ధమే మొదలయ్యే పక్షంలో తైవాన్‌కు విదేశీ సైనిక సాయం అందకుండా అడ్డుకునేందుకే చైనా ఈ చర్యకు దిగిందని రక్షణ నిపుణులు భావిస్తున్నారు. తైవాన్‌లో అమెరికా జోక్యం మితిమీరుతోందనే సాకుతో ఆ దేశంపై ఏ క్షణంలోనైనా చైనా సైనిక చర్యకు దిగే ఆస్కారం లేకపోలేదని అభిప్రాయపడుతున్నారు. ఆదివారం నుంచి సోమవారం దాకా కనీసం 70కి పైగా యుద్ధ విమానాలు, 10 యుద్ధనౌకలు తైవాన్ జలసంధి చుట్టూ కలియ దిరిగాయి. వీటిలో 8 జే-16 ఫైటర్ జెట్లు, 4 జే-1 ఫైటర్లు, 8 ఎస్‌యూ-30 ఫైటర్లు, జే-15 ఫైటర్లున్నాయి. తైవాన్ అధ్యక్షురాలి అమెరికా పర్యటనకు ఆతిథ్యమిచ్చిన రెండు అమెరికా సంస్థలపై ఆంక్షలు విధిస్తున్నట్టు చైనా ప్రకటించింది.

ఆమ్ ఆద్మీ.. ఇక జాతీయ పార్టీ

జాతీయ హోదా కోల్పోయిన టీఎంసీ, ఎన్సీపీ, సీపీఐ

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)ని జాతీయ పార్టీగా కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించింది. ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ), కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ)లకు ఇప్పటిదాకా ఉన్న జాతీయ పార్టీ హోదాను రద్దు చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే యూపీలో ఆర్ఎల్డీ, ఆంధ్రప్రదేశ్‌లో బీఆర్ఎస్, మణిపూర్‌లో పీడీఏ, పుదుచ్చేరిలో పీఎంకే, పశ్చిమ బెంగాల్‌లో ఆర్ఎస్పీ, మణిపూర్‌లో ఎంపీసీకి రాష్ట్ర పార్టీ హోదాను రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. నాగాలాండ్‌లో ఎన్సీపీ, మేఘాలయాలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర పార్టీ హోదా కల్పించనున్నట్లు తెలిపింది. ఈసీ తాజా నిర్ణయంతో దేశంలో బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ), నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ), ఆమ్ ఆద్మీ పార్టీ రూపంలో ఆరు జాతీయ పార్టీలున్నాయి.


అంగుళమైనా ఆక్రమించలేరు: అమిత్ షా


కిబితూ (అరుణాచల్‌ప్రదేశ్)/బీజింగ్: భారత సరిహద్దులను ఎవరు పడితే వాళ్లు ఆక్రమించుకునే రోజులు పోయాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఇప్పుడు వాటిపై ఎవరూ కన్నేసే ధైర్యం కూడా చేసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. మన భూభాగంలో సూది మొన మోపినంత కూడా ఎవరూ ఆక్రమించలేరన్నారు. సోమవారం ఆయన అరుణాచల్‌ప్రదేశ్‌లో పర్యటించారు. తూర్పు దిశగా భారత దేశపు చిట్టచివరి సరిహద్దు గ్రామమైన కిబితూలో వైబ్రంట్ విలేజ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అమిత్ షా పర్యటనపై చైనా అభ్యంతరం వెలిబుచ్చింది.

విమానంలో సిబ్బందిపై ప్రయాణికుడి దాడి

న్యూఢిల్లీ: ఓ ప్రయాణికుడు మహిళా సిబ్బందితో దౌర్జన్యంగా ప్రవర్తించడమే గాక ఎమర్జెన్సీ డోరు తెరిచే ప్రయత్నం చేయడంతో సోమవారం ఢిల్లీ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం కాసేపటికే తిరిగొచ్చింది. సదరు ప్రయాణికుడిని ఢిల్లీలో పోలీసులకు అప్పగించింది. అతన్ని జస్‌కీరత్ సింగ్ (25)గా గుర్తించారు. ఇద్దరు సిబ్బందిని అతను కిందపడేసి కొట్టాడని కూడా సమాచారం.

ఇవి వందల కోట్లు పలికాయి...





సోత్‌బే సంస్థ ఇటీవల హాంకాంగ్‌లో నిర్వహించిన వేలంలో 18వ శతాబ్దానికి చెందిన ఈ పింగాణీ గిన్నె రూ.200 కోట్లు పలికింది. అదేవిధంగా. చైనా కళాకారుడు జాంగ్ డకియాన్ గీసిన 1973 నాటి 'లోటసెస్ ఆన్ గోల్డ్ స్క్రీన్' పెయింటింగ్ ఏకంగా రూ.262 కోట్లకు అమ్ముడైంది.

దేశవ్యాప్త కోవిడ్ మాక్‌డ్రిల్

ఆస్పత్రుల సన్నద్ధతపై ఉన్నతస్థాయి సమీక్ష



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కరోనా కేసుల్లో పెరుగుదల నమోదు చేసుకుంటున్న నేపథ్యంలో సోమవారం కోవిడ్ మాక్‌డ్రిల్ జరిగింది. పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో కోవిడ్ సన్నద్ధతను పరిశీలించారు. ఇందులో భాగంగా ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సందర్శించారు. వివిధ విభాగాధిపతులు, సిబ్బందితో ఆయన మాట్లాడారు. వారి సూచనలు, సలహాలు తీసుకున్నారు. 'రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాక్‌డ్రిల్‌కు భారీ స్పందన లభించింది. ఆరోగ్య శాఖల మంత్రులు ఆస్పత్రుల్లో సన్నద్ధత, సౌకర్యాలపై సమీక్షలు జరిపారు' అని ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో వివరించింది.

35 వేలు దాటిన యాక్టివ్ కేసులు

దేశంలో 24 గంటల వ్యవధిలో కొత్తగా 5,880 కరోనా కేసులు నమోదైనట్లు కేంద్రం సోమవారం తెలిపింది. యాక్టివ్ కేసులు 35,199కు చేరాయని పేర్కొంది. అదేసమయంలో, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీల్లో నలుగురు చొప్పున, గుజరాత్, జమ్మూకశ్మీర్, మహారాష్ట్ర, రాజస్తాన్‌లలో కలిపి మరో 14 మంది మరణించడంతో మొత్తం కోవిడ్ మరణాలు 5,30,979కు పెరిగాయని తెలిపింది. రోజువారీ పాజిటివిటీ రేటు 6.91% కాగా, మొత్తం కేసుల్లో యాక్టివ్ కేసులు 0.08%గా ఉన్నట్లు వివరించింది.

త్వరలో అందుబాటులోకి కోవోవ్యాక్స్

సీరమ్ ఇన్‌స్టిట్యూట్ తయారీ కోవిడ్ టీకా కోవోవ్యాక్స్‌ను కోవిన్ పోర్టల్‌లో చేర్చేందుకు కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఆమోదం తెలిపారు. కరోనా కేసులు పెరుగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. కోవోవ్యాక్స్ ధర రూ. 225గా ఉంటుందని పేర్కొన్నాయి. కోవిషీల్డ్, కోవాగ్జిన్ వేయించుకున్న పెద్దలు కోవోవ్యాక్స్‌ను బూస్టర్ డోస్‌గా తీసుకోవచ్చని అధికార వర్గాలు వెల్లడించాయి. కోవోవ్యాక్స్‌ను ఇప్పటికే డీసీజీఐ, డబ్ల్యూహెచ్‌వో, యూఎస్‌ఎఫ్‌డీఏ ఆమోదం లభించిందని గుర్తు చేశాయి.

పి7 నంబర్ ప్లేట్ @ రూ.122 కోట్లు



జుమెయిరా: దుబాయ్‌లో 'పి7'కారు నంబర్ ప్లేటు వేలంలో రూ.122.6 కోట్లు పలికి, రికార్డు నెలకొల్పింది. శనివారం రాత్రి జుమెయిరాలోని ఓ హోటల్‌లో 'మోస్ట్ నోబుల్ నంబర్స్'వేలం పాట జరిగింది. ఎమిరేట్స్ ఆక్షన్, దుబాయ్ రోడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ, టెలికమ్యూనికేషన్స్ కంపెనీలైన ఎటిసలాట్, డ్యు ఈ వేలాన్ని చేపట్టాయి. ఇందులో పలు కారు నంబర్ ప్లేట్లు, ప్రత్యేకమైన ఫోన్ నంబర్లు కలిపి మొత్తం రూ.221 కోట్లు పలికాయి. ఈ మొత్తాన్ని దుబాయ్ పాలకుడు షేక్ మహ్మద్ బిన్ రషీద్ నేతృత్వంలోని 'ఒన్ బిలియన్ మీల్స్'దాతృత్వ కార్యక్రమం కోసం వినియోగించనున్నారు. 'పి7'వేలం ప్రారంభ ధర రూ.33 కోట్లు కాగా కొన్ని సెకండ్లలోనే రూ.66 కోట్లకు ఎగబాకింది.ఒక దశలో 'పి7'కారు నంబర్ ప్లేట్‌కు దుబాయ్‌కి చెందిన ఫ్రెంచి వ్యాపారవేత్త, టెలిగ్రామ్ యాప్ యజమాని పావెల్ దురోవ్ రూ.78 కోట్లు వెచ్చించేందుకు ముందుకు వచ్చారు. కొద్దిసేపటికే 'ప్యానెల్ సెవెన్'రూ.122.6 కోట్లకు బిడ్ వేసింది. అయితే,'పి7'ను దక్కించుకున్న వ్యక్తి పేరు వెల్లడికాలేదు.

సాక్షి 24|7 తమిళనాడు

TAMILNADU

మంగళవారం : 11 ఏప్రిల్ 2023

హైకోర్టు న్యాయమూర్తిగా పట్టు దేవనాథన్

సాక్షి, చెన్నై: మద్రాసు హైకోర్టుకు మరో కొత్త న్యాయమూర్తి సోమవారం నియమితుల య్యారు. ఆయనతో ఇన్‌చార్జ్ సీజే రాజా ప్రమాణ స్వీకారం చేయించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన పట్టు దేవనాథన్‌ను మద్రాసు హైకోర్టుకు బదిలీ చేస్తూ గత నెల సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం తీసుకుంది. ఇందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. దీంతో కొత్త న్యాయ మూర్తి దేవనాదన్ హైకోర్టులో బాధ్యతలు స్వీక రించారు. ఈ నియామకంతో హైకోర్టులో న్యాయమూర్తులు సంఖ్య 61కి చేరింది. అయినా మరో 14 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఆన్‌లైన్ రమ్మీ నిషేధం బిల్లుకి గవర్నర్ ఆమోదం


గవర్నర్ ఆర్ఎన్ రవి

సాక్షి, చెన్నై: గవర్నర్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసిన నేపథ్యంలో రాజ్ భవన్ సోమవారం సాయంత్రం ఆన్‌లైన్ రమ్మీ వ్యవహారంలో ఓ అడుగు ముందుకు వేసింది. గత ఏడాది అక్టోబర్‌లో అసెంబ్లీ వేదికగా చేసిన ఆన్‌లైన్ రమ్మీ నిషేధ తీర్మానాన్ని గవర్నర్ వెనక్కి పంపించిన విషయం తెలిసిందే. దీంతో మరోసారి అసెంబ్లీ తీర్మానం చేసింది. దీన్ని కూడా తుంగలో తొక్కే ప్రయత్నం చేయడంలో రాజ్‌భవన్ నిమగ్నమైంది. అయితే, అసెంబ్లీ వేదికగా గవర్నర్‌కు వ్యతిరేకంగా తీర్మానం వంటి పరిణామాలతో ఆగమేఘాలపై సాయంత్రం ఆన్‌లైన్ రమ్మీనిషేధ చట్టాన్ని ఆమోదించినట్లు తెలిసింది. దీంతో రాజకీయ ఒత్తిళ్లకు గవర్నర్ తలొగ్గాల్సిన పరిస్థితి వచ్చిందని కొన్ని పార్టీలు స్పందిస్తుండగా, రెండోసారి తీర్మానాన్ని తిరస్కరించలేని పరిస్థితులో ఆమోదించారని మరికొన్ని పార్టీల నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

9 నియోజకవర్గాలపై దృష్టి

- రంగంలోకి బీజేపీ పర్యవేక్షకులు


బీజేపీ కార్యాలయం

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 9 నియోజకవర్గాల్లో పోటీ చేయడమే లక్ష్యంగా బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఆయా నియోజకవర్గాలలో పార్టీ బలోపేతం దిశగా పర్యవేక్షలకును సోమవారం నియమించింది. అన్నాడీఎంకేతో కలిసి లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కొనేందుకు బీజేపీ వ్యూహాలకు పదును పెట్టిన విషయం తెలిసిందే. అయితే ఈసారి తమిళనాడులో 9 నియోజకవర్గాలలో తమ అభ్యర్థులను నిలబెట్టేందుకు వీలుగా ముందస్తు కసరత్తులపై బీజేపీ జాతీయ అధిష్టానం దృష్టి పెట్టింది. ఈ నియోజకవర్గాలలో దక్షిణ చెన్నై, కోవై, నీలగిరి, కన్యాకుమారి, తిరునెల్వేలి, రామనాథపురం, శివగంగై, ఈరోడ్, వేలూరు ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 39 స్థానాలు ఉండగా, ఇందులో 9 స్థానాలను ఎలాగైనా దక్కించుకుని తమ అభ్యర్థులను నిలబెట్టేందుకు వీలుగా ఇప్పటి నుంచి కసరత్తుల వేగాన్ని బీజేపీ పెద్దలు పెంచారు. ఈ నియోజకవర్గాలు ప్రత్యేక పర్యవేక్షకులను నియమిస్తూ బీజేపీ అధిష్టానం ఆదేశాలు ఇచ్చింది. ఈ పర్యవేక్షకులు ఇక పూర్తిస్థాయిలో ఆయా నియోజకవర్గాలలో దృష్టి పెట్టనున్నారు. పార్టీ వర్గాలను కలుపుకుని కార్యక్రమాలను విస్తృతం చేయడం, సభ్యత్వ నమోదు, కేంద్ర పథకాలను దరిచేర్చడం వంటి పనులు విస్తృతం చేయనున్నారు. ఈ నియోజకవర్గాలలో గెలుపే లక్ష్యంగా వ్యూహాలకు మరింత పదును పెట్టే విధంగా రానున్న రోజుల్లో కేంద్ర మంత్రుల పర్యటనలు విస్తృతం కానున్నాయి. మంత్రుల నేతృత్వంలోనూ కార్యక్రమాలు విస్తృతం చేసి ప్రజల్ని ఆకర్షించే విధంగా దూసుకెళ్లనున్నారు.

ఇద్దరు పిల్లలను బావిలో తోసి తల్లి ఆత్మహత్య


చిన్నారులతో సూర్య(ఫైల్)

వేలూరు: తిరువణ్ణామలై సమీపంలోని సోమాసిపాడి పంచాయతీలోని వర్షవుత్తూరు గ్రామానికి చెందిన చిన్నరాసు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఇతని భార్య సూర్య(32) అదే గ్రామంలోని పీహెచ్‌సీలో నర్సుగా పనిచేస్తున్నారు. ఈ దంపతులకు లక్ష కుమార్(4), ఉదయకుమార్(2) అనే ఇద్దరు కుమారులున్నారు. అయితే భార్య భర్తల మధ్య తరచూ ఘర్షణలు ఏర్పడేది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం చిన్నరాసు దిండివనంలో బంధువుల శుభ కార్యంలో పాల్గొని రాత్రి 12 గంటలకు ఇంటికి వచ్చాడు. తలుపులు తెరిచి చూడగా ఇంటిలో భార్య, పిల్లలు లేక పోవడంతో పక్కన ఇంటి వారిని విచారించినా ఎటువంటి వివరాలు తెలియరాలేదు. సూర్య సెల్‌ఫోన్‌కు ఫోన్ చేస్తే గ్రామ సమీపంలోని బావి వద్ద శబ్దం వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు బావి వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం అనుమానంగా అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేయడంతో సిబ్బంది బావిలో గాలించగా బావిలో సూర్య, లక్ష కుమార్, ఉదయకుమార్ మృతదేహాలను బయటకు తీశారు. అయితే కుటుంబ కలహాల కారణంగానే సూర్య ఇద్దరు కుమారులను బావిలో తోసి వేసి తను కూడా బావిలో దూకి ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. వీటిపై కీల్ పెన్నాతూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. నర్సు ఇద్దరు చిన్నారులను బావిలో తోసి వేసి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆ ప్రాంతంలో సంచలనం రేపింది.

రాజకీయ భవన్!

రాష్ట్ర రాజ్ భవన్.. రాజకీయ భవన్‌గా మారింది.. రోజుకో సమావేశం, పూటకో సమీక్ష.. గంటకో విమర్శ చేస్తూ.. గవర్నర్ ఫక్తు రాజకీయ నాయకుడి అవతారం ఎత్తారు.. అని అసెంబ్లీ వేదికగా సీఎం ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ తీరును వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో సోమవారం ప్రత్యేక తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. రాష్ట్ర ప్రథమ పౌరుడికి తన బాధ్యతలను గుర్తుచేస్తూ హితబోధ చేయాలని, ప్రజల చేత ఎన్నుకోబడ్డ ప్రభుత్వం, అసెంబ్లీ వేదికగా ఆమోదించిన బిల్లుల ఆమోదానికి నిర్ణీత గడవును నిర్ణయించాలని కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రపతికి విజ్ఞప్తి చేశారు.

శాసనసభలో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్


- రాజకీయ నాయకుడిని తలపిస్తున్న గవర్నర్
- మేకకు గడ్డం..రాష్ట్రానికి గవర్నర్ అవసరమా?
- అసెంబ్లీలో సీఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు
- గవర్నర్‌కు వ్యతిరేకంగా మరోమారు సభలో తీర్మానం ఆమోదం
- రాష్ట్ర ప్రథమ పౌరుడికి హితబోధ చేయాలని కేంద్రం, రాష్ట్రపతికి వినతి

సాక్షి, చెన్నై: రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి గత కొంత కాలంగా చేస్తున్న వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అవుతున్న విషయం తెలిసిందే. స్టెరిలైట్‌కు తాళం వేయడమే లక్ష్యంగా విదేశాల నుంచి నిధులు సమకూరినట్లు ఆయన ఆరోపణలు చేయడం, రాష్ట్ర ప్రభుత్వ ముసాయిదాలు, కీలక బిల్లులు, తీర్మానాలకు సంబంధించి బహిరంగ వేదికలపై వ్యాఖ్యలు చేయడం తీవ్ర దుమారం రేపాయి. ఈ పరిస్థితుల్లో అసెంబ్లీ వేదికగా సోమవారం ఉదయం గవర్నర్‌కు వ్యతిరేకంగా మరో మారు పెద్ద చర్చే జరిగింది. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వం రూపొందించి ఇచ్చిన ప్రసంగంలోని అంశాలు కొన్నింటిని పక్కన పెట్టిన గవర్నర్ తీరును నిరసిస్తూ సభలో ప్రత్యేక తీర్మానం చేశారు. తాజాగా ఆయన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ మరో తీర్మానాన్ని ఆమోదించారు.

ఐదేళ్ల అనంతరం సభలో ఓటింగ్..

సభా నిబంధనలు 287 ప్రకారం 92(7)లోని అంశాల్లో పేర్కొన్నట్లుగా గవర్నర్‌తో సంప్రదింపులు, పేరు ఉచ్చారణ, చర్చలో వ్యక్తిగత విమర్శలు, తదితర అంశాలను నిలుపుదల చేయాలని కోరుతూ, గవర్నర్‌కు వ్యతిరేకంగా సభలో సీనియర్ మంత్రి దురై మురుగన్ తీర్మానం ప్రవేశ పెట్టారు. అన్నాడీఎంకే సభ్యుల వాకౌట్ నేపథ్యంలో సభలో ఓటింగ్ అనివార్యమైంది. స్పీకర్ అప్పావు ఓటింగ్‌కు ఆదేశించారు. సభ తలుపులు అన్నీ మూసి వేసి ఓటింగ్ నిర్వహించారు. డీఎంకే, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, వీసీకే, ఎండిఎంకే, మనిదనేయమక్కల్ కట్చి, కొంగునాడు దేశీ కట్చి, తమిళర్ వాల్వురిమై కట్చిల సభ్యులు ఈ తీర్మానాన్ని ఆమోదించారు. సభలో ఓటింగ్ సమయంలో 146 మంది ఉండగా, ఇద్దరు మాత్రం వ్యతిరేకించారు. వీరు బీజేపీకి చెందిన ఎమ్మెల్యేలు సరస్వతి, గాంధీ. అయితే బీజేపీ శాసన సభా పక్ష నేత నయినార్ నాగేంద్రన్, మరో ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ సభకు కాలేదు. 2017లో సీఎంగా పళణి స్వామి బల నిరూపణ కోసం ఓటింగ్ జరిగింది. ఆ తర్వాత ఐదేళ్ల అనంతరం ప్రస్తుతం సభలో మరోమారు ఓటింగ్ జరగడం గమనార్హం. గవర్నర్‌కు వ్యతిరేకంగా ఓటింగ్ ఆమోదం పొందడంతో సీఎం స్టాలిన్ ప్రసంగించారు.

'స్నేహం' ఎక్కడ..?

తమిళ ప్రజలు, తమిళనాడు ప్రభుత్వానికి మంచి స్నేహితుడిగా ఉంటారని భావించిన రాష్ట్ర గవర్నర్ ఇటీవల వ్యవహరిస్తున్న తీరు తమ మనో భావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని సీఎం స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని పక్క దారి పట్టించి, రాజకీయ నాయకుడి అవతారం ఎత్తుతుండటోనే ఈ ఏడాది రెండో సారి అసెంబ్లీలో గవర్నర్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేయాల్సి వచ్చినట్లు వ్యాఖ్యలు చేశారు. మేకకు గడ్డం అవసరం లేదు.. రాష్ట్రానికి గవర్నర్ కూడా అవసరం లేదని గతంలోనే దివంగత నేత అన్నాదురై చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా సభకు గుర్తు చేస్తున్నానని పేర్కొన్నారు. బాధ్యత గల ఆ పదవిలో ఉన్న వారు కాబట్టి దివంగత నేతలు అన్నా, కరుణానిధి తరహాలో తాను కూడా మర్యాద, గౌరవాన్ని ఇస్తూ వస్తున్నానని తెలిపారు. గవర్నర్‌ల బాధ్యతలను, వారి తీరును, కర్తవ్యాలను గుర్తుచేస్తూ గతంలో పలు కమిషన్లు ఇచ్చిన నివేదికలు, అభిప్రాయాలను, రాజ్యాంగ సృష్టికర్త అంబేడ్కర్ పేర్కొన్న అంశాలను ఈ సందర్భంగా సీఎం వివరించారు. అలాగే 2010లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గుర్తు చేస్తూ, ఇక్కడి ప్రస్తుత గవర్నర్ తమిళనాడు ప్రభుత్వానికి తమిళనాడు ప్రజలకు ×స్నేహితుడ్డుగా ఉండటానికి కూడా సిద్ధంగా లేరని ధ్వజమెత్తారు.

మనోభావాలను దెబ్బతీస్తే..

రాజకీయ ప్రయోజనాల కోసం, రాజకీయ స్వలాభం కోసం తమిళ ప్రజల మనో భావాలతో చెలగాటం ఆడితే చేతులు ముడుచుకుని కూర్చోబోమని సీఎం స్టాలిన్ హెచ్చరించారు. చట్ట సభలో ఆమోదించిన బిల్లులు, తీర్మానాలను ఆమోదించేందుకు గవర్నర్‌కు కాలపరిమితిని నిర్ణయించాలని సభా వేదికగా కేంద్రాన్ని, రాష్ట్రపతిని సీఎం స్టాలిన్ కోరారు. తమిళనాడు ప్రజల సంక్షేమానికి వ్యతిరేకంగా, తమిళనాడు శాసన సభను అవమానించే విధంగా వ్యవహరిస్తున్న గవర్నర్‌కు హితబోధ చేయాలని కోరారు. ఇకనైనా తమిళనాడు ప్రజల సంక్షేమానికి వ్యతిరేకంగా తమిళనాడుకు వ్యతిరేకంగా వ్యవహరించడం మానుకోవాలని, శాసనసభ ఆమోదించిన బిల్లులకు నిర్ణీత గడవులోపు ఆమోదం తెలియజేయాలన్నారు. సభలో అన్నాడీఎంకే, బీజేపీ మినహా తక్కిన పార్టీల నేతలు పేరు ఉచ్చరించకుండా గవర్నర్ తీరుపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

చివరగా సభలో ఆర్థిక మంత్రి పళణి వేల్ త్యాగరాజన్ రాజ్ భవన్ కోసం అవుతున్న అన్ని రకాల ఖర్చుల వివరాలను సభకు వివరించడం గమనార్హం.

రాజకీయాలు తగవు



ప్రభుత్వంతో గవర్నర్ ఓపెన్ మైండెడ్‌గా ఉండాలే గానీ, పరిపాలనా పరమైన అంశాలలో జోక్యం చేసుకోవడం, బహిరంగంగా చర్చించడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ప్రభుత్వ విధానాలు, తమిళనాడు ప్రజల మనోభావాలు, అసెంబ్లీ సార్వభౌమాధికారం, తమిళనాడు ప్రజల ప్రయోజనాల కోసం ఆమోదించిన బిల్లులను బహిరంగంగా కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గవర్నర్ తన పదవిని దాటి రాజకీయ నాయకుడిగా అవతరించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రధాని చెన్నైకు వచ్చినప్పుడు గానీయండి, తాను ఆయన్ని కలిసేందుకు ఢిల్లీ వెళ్లినప్పుడు గానీయండి ఈ గవర్నర్ తమిళనాడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటం అలవాటు చేసుకున్నట్లున్నారని ధ్వజమెత్తారు. రెండోసారి సభ ఆమోదించిన ఆన్‌లైన్ రమ్మీ నిషేధం బిల్లును సత్వరం ఆమోదించాల్సిన గవర్నర్ మళ్లీ తన తీరును తేటతెల్లం చేస్తూ తుంగలో తొక్కే ప్రయత్నం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రెండోసారిగా తన వద్దకు వచ్చిన బిల్లును నిరాకరించే అవకాశం గవర్నర్‌కు లేదని, అవసరం అయితే మంత్రి వర్గ సలహాలు తీసుకునే వెసులు బాటు ఉందని వివరించారు. గవర్నర్‌కు రాజ్యాంగం తెలియదని తాను చెప్పను అని పేర్కొంటూ, రాజకీయాలపై కన్నా, చట్టాలపై ఆయనకు విశ్వాసం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం రాజ్‌భవన్‌లో రోజూ జరుగుతున్న సమావేశాలు పూటకో విమర్శ, వ్యాఖ్యలను బట్టి చూస్తుంటే గవర్నర్ మతతత్వ భావాలు కలిగిన ఓ రాజకీయ నాయకుడిగా మారినట్లు స్పష్టం అవుతోందన్నారు. వ్యక్తిగతంగా గవర్నర్‌ను విమర్శించడం లేదని, ఆయన తీరు, కార్యకలాపాలను మాత్రమే విమర్శిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉపనేత రచ్చ

- చర్చకు అన్నాడీఎంకే పట్టు
- స్పీకర్ నిరాకరణతో వాకౌట్
- అసెంబ్లీ కమిటీలకు ఎన్నిక


మీడియాతో మాట్లాడుతున్న పళణి స్వామి

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే శాసన సభా పక్ష ఉపనేతగా పన్నీరు సెల్వాన్ని తొలగించాలని పట్టు బడుతూ సభలో అన్నాడీఎంకే సభ్యులు సోమవారం రభస సృష్టించారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయం ముగియగానే ప్రధాన ప్రతి పక్షనేత, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి ఓ తీర్మానం తీసుకొచ్చి చర్చించాలని కోరారు. ఇందుకు స్పీకర్ అప్పావు నిరాకరించారు. మంగళవారం అవకాశం ఇస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కీలక తీర్మానం ప్రవేశ పెట్టనుందని, దీనిపై చర్చించాల్సిన అవసరం ఉందని వారించారు. దీంతో అన్నాడీఎంకే సభ్యులు సభలో నినాదాలు హోరెత్తించారు. పన్నీరు సెల్వంను తొలగించి తమ పార్టీ శాసన పక్ష నేతగా ఉదయకుమార్‌ను నియమించాలని ఇప్పటికే పలుమార్లు విజ్ఞప్తి చేశామని పళణి స్వామి గుర్తు చేశారు. ఇన్నాళ్లు కోర్టుల్లో కేసులు ఉన్నాయని, దాట వేశారని, ఇప్పుడు కోర్టు తీర్పు తమకు అనుకూలంగా ఉందని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిని తప్పించి, ఉదయకుమార్‌ను నియమించాలని పట్టుబట్టారు. ఇందుకు స్పీకర్ నిరాకరించారు. అస్సలు అసెంబ్లీలో శాసన సభా పక్షఉప నేత పదవీ అన్నది ఒకటి లేదని, తామే అవకాశం కల్పించినట్లు వివరణ ఇచ్చారు. ఇందుకు అన్నాడీఎంకే సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, తమ ప్రసంగాలను ప్రత్యేక్ష ప్రసారంలో చూపించడం లేదని, తమ విజ్ఞప్తులు, డిమాండ్లను సభా రికార్డుల నుంచి తొలగిస్తున్నారని, నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని నినాదాలు చేశారు. చివరకు సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్టు అన్నాడీఎంకే సభ్యులు ప్రకటించి బయటకు వచ్చేశారు. ముందుగా సభలో అసెంబ్లీ కమిటీల ఏర్పాటుకు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్పీకర్ అప్పావు ప్రకటించారు. ప్రత్యేక అధికారాలు, గణాంకాలు, పద్దులు సభా వ్యవహారాలు, సలహాలు తదితర కమిటీలను గుర్తు చేస్తూ మధ్యాహ్నం 3 గంటల నుంచి (సోమవారం) ఈనెల 18వతేదీ 3 గంటలలోపు నామినేషన్లు సమర్పించాలని సూచించారు. అదేరోజు పరిశీలన, 19వ తేదీ ఉప సంహరణ ప్రక్రియలు జరుగుతాయని తెలిపారు. ఆయా పార్టీల తమ సంఖ్యా బలం మేరకు కమిటీల నియామకంపై దృష్టి పెట్టవచ్చు అని తెలిపారు.

కళాక్షేత్రలో ఏం జరుగుతోంది?

- విచారణకు కమిషన్
- రంగంలోకి ఐజీ మహేంద్ర కుమార్


కళాక్షేత్ర వద్ద పోలీసు భద్రత

సాక్షి, చెన్నై: కళాక్షేత్రలో ఏం జరుగుతోంది..? అన్న అంశంపై విచారణకు మానవ హక్కుల కమిషన్ నిర్ణయించింది. ఐజీ మహేంద్రకుమార్ రాథోడ్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని సోమవారం నియమించింది. వివరాలు.. ప్రముఖ నాట్య, సంగీత నిలయం కళాక్షేత్రలో పనిచేస్తున్న అధ్యాపకులపై లైంగిక వేధింపుల ఆరోపణలు గత వారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో అధ్యాపకుడు హరిపద్మన్‌ను అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. మరో ముగ్గురు అధ్యాపకులపై కూడా చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే మహిళా కమిషన్, కళాక్షేత్ర నేతృత్వంలో మరో విచారణ బృందం రంగంలోకి దిగింది. తాజాగా ఇది మానవ హక్కుల కమిషన్‌కు చేరింది. తమ నేతృత్వంలో విచారించేందుకు ఐజీ మహేంద్రకుమార్ రాథోడ్‌ను నియమిస్తూ మానవ హక్కుల కమిషన్ నిర్ణయం తీసుకుంది. మంగళవారం నుంచి ఈ బృందం విచారణ చేపట్టనుంది. ఆరు నెలల్లో కళాక్షేత్రాకు సంబంధించిన సమగ్ర వివరాలను ఈ బృందం మానవ హక్కుల కమిషన్‌కు సమర్పించనుంది.

ముట్టడి ప్రయత్నం.. ఉద్రిక్తత

కళాక్షేత్రాను ముట్టడించి విద్యార్థినులకు భరోసా ఇవ్వడం, వారికి న్యాయం చేకూర్చడమే లక్ష్యంగా ఐద్వా, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ఐ నేతృత్వంలో సోమవారం నిరసన కార్యక్రమం జరిగింది. తిరువాన్మియూరులోని కళాక్షేత్రను ముట్టడించేందుకు పెద్దఎత్తున యువత, మహిళలు ఉదయం కదిలారు. వీరిని మార్గం మధ్యలో పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. విద్యార్థినులను కళాక్షేత్ర యాజమాన్యం బెదిరిస్తోందని, వారికి భద్రత కల్పించాలని నిరసనకారులు నినాదాలు చేశారు. హరిపద్మన్‌కు బెయిల్ ఇవ్వకూడదని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ నిరసనతో కళాక్షేత్ర పరిసరాల్లో పోలీసు భద్రతను పెంచారు.

మఫ్టీలో ఎస్పీ!

- తనిఖీలకు సైకిల్‌పై ప్రయాణం
- గుర్తు పట్టని పోలీసులు..


ఎస్పీ శ్రీనివాస పెరుమాల్

సాక్షి, చెన్నై: విరుదునగర్ ఎస్పీ పోలీసు స్టేషన్ల తనిఖీకి మఫ్టీలో దూసుకెళ్లారు. సైకిల్‌పై వచ్చిన ఆయన్ని గుర్తు పట్టలేక పోగా, ఓ పోలీసు కాస్త కటువుగానే స్పందించాడు. చివరకు ఆయన ఎస్పీ అని తేలడంతో షాక్‌కు గురయ్యాడు. వివరాలు.. విరుదునగర్ జిల్లాలోని అమ్మన్ ఆలయాలలో ఫంగుణి ఉత్సవాలు కోలాహలంగా జరుగుతున్నాయి. రాత్రుల్లోని ఈ ఆలయాలలో ఉత్సవాలతో పాటు వివాదాలు జరగడం సహజం. దీంతో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితులలో తమ సిబ్బంది ఏ మేరకు భద్రతా విధుల్లో ఉన్నారా? లేదా స్టేషన్‌లలో నిద్ర పోతున్నారా? అని పరిశీలించేందుకు ఎస్పీ శ్రీనివాస పెరుమాల్ నిర్ణయించారు. దీంతో ఆదివారం అర్ధరాత్రి ఆయన మఫ్టీలో పోలీసుల స్టేషన్లలో తనిఖీలకు పయనం అయ్యారు. అది కూడా ఆయన సైకిల్‌పై ఎవరూ తనను గుర్తు పట్టని విధంగా మఫ్టీలో వెళ్లారు. విరుదునగర్ నగర పశ్చిమ పోలీసు స్టేషన్‌కు తొలుత వెళ్లారు. అక్కడ ప్రవేశ మార్గంలో ఓ పోలీసు, లోపల మరో ఇద్దరు మాత్రమే ఉండటాన్ని గుర్తించారు. స్టేషన్ వెలుపల ఉన్న పోలీసులను మఫ్టీలో ఉన్న ఎస్పీ ప్రశ్నించారు. తాను ఓ ఫిర్యాదు ఇవ్వడానికి ఇక్కడకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ తదితరులు భద్రతా విధులకు వెళ్లారని, వారు వచ్చినానంతరం ఫిర్యాదు అందజేయవచ్చు అని ఆ పోలీసు సూచించాడు. అంత వరకు పోలీసు స్టేషన్‌లోకి వెళ్లకుండా బయట ఉన్న కుర్చీలో కూర్చోవాలని ఆ పోలీసు పేర్కొన్నాడు. కాసేపు ఆ కుర్చీలో కూర్చున్న ఎస్పీ హఠాత్తుగా స్టేషన్‌లోకి వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో వచ్చిన వ్యక్తి తమ ఎస్పీ అని తెలియని ఆ పోలీసు కాస్త కటువుగానే వ్యవహరించాడు. ఏకవచనాలతో ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ లోనికి వెళ్లకూడదని హెచ్చరించాడు. చివరకు తాను ఎవరో అన్న విషయాన్ని ఎస్పీ పేర్కొనడంతో ఆ పోలీసు షాక్‌కు గురయ్యాడు. తక్షణం సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ, ఇతర సిబ్బంది పోలీసు స్టేషన్‌కు పరుగులు తీశారు.

రాజకీయ పార్టీగా విజయ్ మక్కళ్ ఇయక్కం

తమిళ సినిమా : నటుడు రజనీకాంత్ తర్వాత ఆ స్థాయి అభిమానులు కలిగిన నటుడు విజయ్. ఈయన తమిళనాడులో పెద్దఎత్తున మాస్ ఫాలోయింగ్ ఉన్న నటుడు కూడా. విజయ్ రాజకీయాల్లోకి రావాలని ఆయన తండ్రి, దర్శకుడు ఎస్ఏ.చంద్రశేఖర్ బలమైన కోరిక. విజయ్ అభిమాన సంఘాలను విజయ్ మక్కళ్ ఇయక్కంగా మార్చింది కూడా ఆయనే. ఎస్ఏ చంద్రశేఖర్ సారథ్యంలో విజయ్ ఈపాటికే రాజకీయ రంగ ప్రవేశం చేయాల్సింది. అయితే కారణం ఏమైనా విజయ్ తన తండ్రి కోరికలపై నీళ్లు చల్లారు. అలాంటిది ఇప్పుడు విజయ్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నట్లు తాజా సమాచారం. కాగా ఆయన అభిమానులు కొందరు గత లోకల్ బాడీ ఎన్నికల్లో విజయ్ మక్కళ్ ఇయక్కం పేరుపై పోటీ చేసి గెలిచారు కూడా. కాగా త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో విజయ్ తన విజయ్ మక్కళ్ ఇయక్కంను రాజకీయ పార్టీగా మార్చి ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీంతో ఆయన విజయ్ మక్కళ్ ఇయక్కం కార్యక్రమాలు, అభివృద్ధి గురించి రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లాలు, నగరాలు, గ్రామాల స్థాయిలో సభలు, సమావేశాలు నిర్వహించాలంటూ మక్కళ్ ఇయక్కం కార్యదర్శి తృతీయ బుస్సీ ఆనంద్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

కరోనా అలర్ట్

- ముందు జాగ్రత్తలు తప్పనిసరి
- కేసులు పెరిగితే కఠిన నిబంధనలు
- మంత్రి ఎం. సుబ్రమణియన్ వెల్లడి


ఆస్పత్రుల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఎం. సుబ్రమణియన్

సాక్షి, చెన్నై: కరోనా ముందు జాగ్రత్తలపై రాష్ట్ర ఆరోగ్యశాఖ దృష్టి పెట్టింది. ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై సోమవారం మాక్‌డ్రిల్ జరిగింది. కేసులు పెరిగిన పక్షంలో కట్టుబాట్లు తప్పదని ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ హెచ్చరించారు. వివరాలు.. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో కరోనా కేసులు పెరుగుతున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో రోజుకు 300 నుంచి 350లోపు కేసులు నమోదు అవుతున్నాయి. ఈ పెరుగుదల నేపథ్యంలో ఆస్పత్రుల్లో సిద్ధం చేసిన ముందు జాగ్రత్తలపై పరిశీలనకు మాక్‌డ్రిల్ నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలలో సిద్ధం చేసి ఉంచిన పడకలు, ఆక్సిజన్ సిలిండర్లు, మందులు తదితర వాటితో పాటు చికిత్స విధానాలను వివరించే విధంగా మాక్‌డ్రిల్ నిర్వహించారు. చెన్నైలోని రాజీవ్ గాంధీ జీహెచ్, స్టాన్లీ తదితర ప్రభుత్వ ఆసుపత్రులలో మాక్‌డ్రిల్ జరిగింది. కేసుల సంఖ్య అమాంతంగా పెరిగినా, చికిత్స అందించేందుకు వీలుగా ఆస్పత్రులలో సర్వం సిద్ధం చేసి ఉంచారు. ఈ మాక్‌డ్రిల్‌ను పరిశీలించిన ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కేసులు కట్టడిలోనే ఉన్నట్టు పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంటి నుంచి బయటకు వచ్చే సమయంలో మాస్కులు ధరించి తమను తాము రక్షించుకోవాలని సూచించారు. కేసులు మరింతగా పెరిగిన పక్షంలో కట్టుబాట్లు విధించక తప్పదని హెచ్చరించారు. ఆ పరిస్థితి రానివ్వకుండా ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఇదిలా ఉండగా, పుదుచ్చేరిలో మాస్కులు తప్పనిసరి కావడంతో సోమావారం పాఠశాలలకు వచ్చిన విద్యార్థులు, పరీక్షలకు హాజరైన విద్యార్థులు మాస్కులు ధరించి వచ్చారు. మాస్కులు ధరించని వారికి పాఠశాలలోనూ అందజేశారు.

క్లుప్తంగా

పటిష్టంగా ఇండియా - ఆస్ట్రేలియా సంబంధాలు



సమావేశంలో పాల్గొన్న కాన్సుల్ సారా కెర్లివ్, మాదిరెడ్డి

కొరుక్కుపేట: భారత్ – ఆస్ట్రేలియా ద్వైపాక్షిక సంబంధాలు పటిష్టంగా ఉన్నాయని, ఈ బంధం ఎన్నో ఏళ్లుగా కొనసాగుతుందని దక్షిణ భారతదేశానికి ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ అయిన సారా కిర్లేవ్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోమవారం ఆస్ట్రేలియా అండ్ ఇండియా -ఫుడ్ త్రూ ఫ్రెండ్‌షిప్ పేరుతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు . స్థానిక గిండిలోని పార్కు హయ్యాత్‌లో చేపట్టిన ఈ కార్యక్రమంలో లోకీ కలినరీ ఫెలోషిప్ సహ వ్యవస్థాపకులు, చెఫ్ మాది రెడ్డి, దిండిగల్ తలపాకట్టి నిర్వాహకులు దీపికా నాగస్వామి, పార్క్ హయ్యాత్ ఎగ్జిక్యూటివ్ చెఫ్ బాలాజీ నటరాజన్, జనరల్ మేనేజర్ సస్చాలెంజ్ పాల్గొని రెండు దేశాల సంప్రదాయ ఆహార రుచులపై మాట్లాడారు. అనంతరం ఆయా దేశాల ఆహార రుచులను ప్రదర్శించారు. భారత్ ఆహార అలవాట్లు , వంటకాల రుచులు అమోఘం అని ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ సారా కిర్లేవ్ అభిప్రాపడ్డారు. ఈనెల 11,12,16,19 తేదీల్లో రాత్రి 7గ ంటల నుంచి 11 గంటల వరకు ఆహార వంటకాల ప్రదర్శన చేపడుతున్నట్లు మాదిరెడ్డి వెల్లడించారు.

బస్సులో 30 సవర్ల నగలు చోరీ

• వ్యక్తి అరెస్టు.. నగలు స్వాధీనం

తిరువొత్తియూరు: కోయంబేడు బస్సులో 30 సవర్ల నగలు చోరీ చేసిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 30 సవర్ల నగలను స్వాధీనం చేసుకున్నారు. తిరువణ్ణామలై జిల్లా సెయ్యారు ప్రాంతంలో నగల దుకాణం, జౌళి దుకాణం నడుపుతున్న వ్యక్తి విఘ్నేష్. ఇతని దుకాణంలో డ్రైవర్‌గా పని చేస్తున్న వ్యక్తి సెయ్యారు ప్రాంతానికి చెందిన ఏలుమలై. డ్రైవర్ ఏలుమలై వద్ద ఉన్న ఓ నగల దుకాణంలో లేజర్ కటింగ్ చేసుకుని రావడానికి విఘ్నేష్ నగలను ఇచ్చి పంపాడు. ఈ క్రమంలో ఏలుమలై నగలతో తిరిగి వస్తున్న సమయంలో కోయంబేడు బస్టాండ్‌లో సీటు కోసం నగల సంచిని బస్సులో వేసిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నగల సంచిని చోరీ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు సీసీటీవీ కెమెరాల ద్వారా చంద్రశేఖర్ 47ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 30 సవర్ల నగలను స్వాధీనం చేసుకున్నారు.

రహదారి పనులు వేగవంతం

• మంత్రి ఏవావేలు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి ఏవావేలు

వేలూరు: తిరువణ్ణామలై నుంచి అరూర్ వరకు రూ.120 కోట్ల వ్యయంతో జాతీయ రహదారి పనులను వేగవంతం చేయాలని మంత్రి ఏవావేలు ఆదేశించారు. సోమవారం ఆయన రోడ్డు పనులను తనిఖీ చేశారు. అధికారుల వద్ద వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరువణ్ణామలై నుంచి అరూర్ వరకు తండ్రాంబట్టు, తానేపాడి మీదుగా ముఖ్యమంత్రి రోడ్డు అభివృద్ధి పథకం కింద జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయన్నారు. ఇందుకోసం రూ. 120 కోట్లు కేటాయించారని చెప్పారు. రోడ్డుకు అవసరమైన బ్రిడ్జి, రోడ్డుకు ఇరు పక్కల కాలువలు, చిన్న చిన్న బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రస్తుతం వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులను తనిఖీ చేసి పనులు నాణ్యతగా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. ఆరు నెలల్లో పనులను పూర్తి చేసి రాక పోకలకు వీలు కల్పిస్తామన్నారు. పార్లమెంట్ సభ్యులు అన్నాదురై, ఎమ్మెల్యే గిరి, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీధరన్, పట్టణ కార్యదర్శి కార్తీవేల్ మారన్ పాల్గొన్నారు. అనంతరం తిరువణ్ణామలైలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన తనిఖీ చేశారు.

అన్నాడీఎంకే ప్రతినిధికి పరామర్శ



జైలు నుంచి బయటకు వస్తున్న నాయకులు

వేలూరు: డీఎంకే మంత్రి దురైమురుగన్‌ను అసభ్య పదజాలాలతో ఫేస్‌బుక్, వాట్సాప్‌లో దూషించారని డీఎంకే కార్యకర్తలు కాట్పాడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాట్పాడి పోలీసులు విచారణ జరిపి పొల్లాచ్చికి చెందిన అన్నాడీఎంకే పార్టీ ఐటీ విభాగం ప్రతినిధి అరుణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి వేలూరు సెంట్రల్ జైలుకు తరలించారు. దీంతో మాజీ ముఖ్యమంత్రి ఎడపాడి పళనిస్వామి ఆదేశాల మేరకు అన్నాడీఎంకే పార్టీ ఐటీ విభాగం కార్యదర్శి రాజ్ సత్యన్, వేలూరు రీజనల్ కార్యదర్శి జననీ బిగ్ బజార్ సతీష్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కే అప్పు, పట్టణ కార్యదర్శి వేలయగన్ సెంట్రల్ జైలులో ఉన్న అరుణ్‌కుమార్‌ను పరామర్శించారు. అనంతరం కాట్పాడి కోర్టులో అరుణ్‌కుమార్‌కు బెయిల్ తీసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు.

కలెక్టర్‌కు విరూపాక్షిపురం వాసుల వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చిన వీసీకే కార్యకర్తలు

• వీసీకే కలెక్టర్‌కు ఫిర్యాదు

వేలూరు: అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని వేలూరు సమీపంలోని విరుపాక్షిపురంలోని ప్రైవేటు పాఠశాల ఎదురుగా గోడపై అంబేడ్కర్ చిత్రాన్ని వేసేందుకు స్థానికులు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే చిత్రాన్ని వేసేందుకు రెవెన్యూ అధికారులు నిరాకరణ తెలిపారు. దీంతో వీసీకే పార్టీ అనకట్టు నియోజక వర్గ ఇన్‌చార్జీ కోటి ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కలెక్టరేట్ చేరుకుని కలెక్టర్ కుమరవేల్ పాండియన్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రాన్ని వేసి వేడుకలు జరుపుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అయితే అధికారులు అనుమతి ఇవ్వడం లేదని వినతిలో పేర్కొన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రత్యేక బృందాలు

• నార్త్ చెన్నై జిల్లా నిర్వాహకుల నియామకం

కొరుక్కుపేట: ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఆదేశాల మేరకు డీఎంకేలో కొత్తగా క్రీడాభివృద్ధి కోసం ప్రత్యేక బృందం ఏర్పాటైంది. ఈ బృందం రాష్ట్ర కార్యదర్శిగా ఎంపీ దయానిధి మారన్‌ని నియమించారు. దీంతో ఆయా జిల్లాల్లో స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆర్గనైజర్లు, డిప్యూటీ ఆర్గనైజర్ల కోసం దరఖాస్తులు జారీ అయ్యాయి. డీఎంకే నాయకత్వం అర్హులైన వ్యక్తుల ఎంపికను, సంబంధిత జిల్లా క్రీడా అభివృద్ధి జట్టు నిర్వాహకులు, సబ్-ఆర్గనైజర్ల నియామకాన్ని ప్రకటించింది.

జిల్లా కార్యదర్శితో సమావేశం..

చెన్నై జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ టీమ్ నార్త్ చెన్నై జిల్లా ఆర్గనైజర్‌గా రాయపురానికి చెందిన గోవిందసామి నియమితులయ్యారు. సహ నిర్వాహకులుగా, తండయార్‌పేటకు కథిరవన్, పుదువన్న ఎంపిక చేశారు. రాయపేట లెనిన్, కొడుంకై యార్ ప్రభు, వ్యాసర్‌పాడి దేవ అన్బు, దినేష్‌కుమార్‌ను నియమించారు. ఉత్తర చెన్నైలో క్రీడలను ప్రోత్సహించేందుకు వీరంతా కృషి చేయాలని డీఎంకే నాయకత్వం ఆదేశించింది. ఈ సందర్భంలో చెన్నై నార్త్ జిల్లా డీఎంకే క్రీడాభివృద్ధి నిర్వాహకుడిగా నియమితులైన గోవిందస్వామి తనను నామినేట్ చేసిన జిల్లా కార్యదర్శి ఇళయ అరుణను స్వయంగా కలిసి.. శాలువా కప్పి అభినందించారు. తనను జిల్లా ఆర్గనైజర్‌గా ఎంపిక చేసినందుకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం .కె.స్టాలిన్, యువజన సంక్షేమం, క్రీడల శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్, డీఎంకే స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ టీమ్ రాష్ట్ర కార్యదర్శి దయానిధి మారన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

క్లినికల్ అధ్యయనంతో 'పార్కిన్సన్' నియంత్రణ



మాట్లాడుతున్న దేవ ప్రసాద్, వెట్రి వేల్

సాక్షి, చెన్నై: క్లినికల్ అధ్యయనంతో పార్కిన్సన్ వ్యాధిని నియంత్రించే పరిశోధన జపాన్‌లో విజయవంతమైనట్టు వైద్యనిపుణులు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాధిపై 90 రోజుల పాటు 104 ఏళ్ల వృద్ధురాలిపై అధ్యయనం చేశారని వివరించారు. ప్రపంచ పార్కినస్స్ డే సైంటిఫిక్ కాన్ఫరెన్స్ సోమవారం ఆన్‌లైన్ వేదికగా జరిగింది. ప్రపంచ దేశాలలోని వైద్య నిపుణులు ఈ సదస్సుకు హాజరయ్యారు. చెన్నై లయోలా కళాశాల ఆవరణ నుంచి చెన్నైకు చెందిన వైద్యులు, ఎన్‌బీసీహెచ్‌ఐ, ఎన్‌సీఆర్ఎం క్లినికల్ కో-ఆర్డినేటర్ వీ డాక్టర్ దేదీపియ దేవ ప్రసాద్, బీ వెల్ ఆసుపత్రి చైర్మన్ సీజే వెట్రి వేల్ బృందం తమ పరిశోధన, అధ్యయన వివరాలను తెలియజేశారు. అలాగే, 2023 అమెరికన్ సొసైటీ ఫర్ ఎక్స్‌పెరిమెంటల్ న్యూరోథెరపీటిక్స్ వార్షిక సమావేశంలో భాగస్వామ్యం చేస్తూ ఈ సమావేశం జరిగింది. ప్రపంచ దృష్టిని ఆకర్షించే విధంగా బీటా–గ్లూకాన్ పూర్తిగా నియంత్రించడం, ఆటిజంతో బాధపడుతున్న పిల్లలలో అసాధారణ ఆల్ఫా–సైనోప్రొటీన్‌ల చేరికను తగ్గించడం వంటి మునుపటి క్లినిక్ పరిశోధనలో తేలినట్టు వివరించారు. పార్కిన్సన్ అనేది మెదడుపై ప్రభావాన్ని చూపించే వ్యాధి అని, భారత్, అమెరికాలో దాదాపు పది లక్షల మంది దీని బారిన పడ్డట్టు పేర్కొన్నారు. పార్కిన్సన్ వ్యాధిపై ఈ క్లినికల్ పరిశోధనకు దారితీసిన అంశాలను గురించి పరిశోధనా బృందం సభ్యుడు డాక్టర్ దేదీపియ దేవ ప్రసాద్ వివరించారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ నిత్యానందం మాట్లాడుతూ ఈ అధ్యయనం మేరకు రోగి యొక్క మాగ్నెటిక్ రెసొనెన్స్ పార్కిన్సన్ ఇండెక్స్ (ఎంఆర్‌పీఐఆర్ఎస్) మొత్తంగా మెరుగుపడుతుందని చెప్పారు.

• ఆవిష్కరణ



ఎస్‌టీఆర్ఐడీ–23 అంతర్జాతీయ ఫిజియో థెరపీ సదస్సు సోమవారం ఎస్ఐఎంపీటీఎస్‌లో జరిగింది. అకడమిక్, వైజ్ఞానిక సెషన్స్, సాంస్కృతిక ఈవెంట్‌లతో విద్యార్థులు ఇందులో తమ ప్రతిభను చాటారు. దేశ విదేశాలలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 1,250 మంది విద్యార్థులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఇందులో సదస్సు ముఖ్య ఉద్దేశం, వక్తల సందేశాలతో పుస్తకాన్ని సిద్ధం చేసి ఆ విద్యా సంస్థ చాన్స్‌లర్ ఎంఎస్ వీరయ్యన్, ఒలింపిక్ క్రీడాకారిణి (షూటర్) ఇలవేనిల్ తదితరులు ఆవిష్కరించారు. - సాక్షి, చెన్నై

రోబోలతో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు



నాలుగో జనరేషన్ రోబోను ఆవిష్కరిస్తున్న పద్మశ్రీ డాక్టర్ మయిల్వాహనన్, గీతా హరిప్రియ

కొరుక్కుపేట: అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సలు సైతం రోబోలతో చేయడంతో వైద్యరంగంలో విప్లవాత్మకంగా మార్పులు చోటు చేసుకున్నట్టు సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ పద్మశ్రీ డాక్టర్ మయిల్వాహనన్ తెలిపారు. ఈ మేరకు చెన్నై నగరంలోని ప్రశాంత్ హాస్పిటల్‌లో మోకాలి శస్త్రచికిత్సల్లో వైద్యనిపుణులకు అన్ని విధాలా సహాయపడే నాలుగో తరం రోబోను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ కొత్త రోబోను పద్మశ్రీ డాక్టర్ మయిల్వాహనన్ ఘనంగా సోమవారం ప్రారంభించారు. ప్రశాంత్ ఆసుపత్రుల గ్రూపు చైర్‌పర్సన్ డాక్టర్ సి. గీతా హరిప్రియ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ స్వామి, డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మయిల్వాగనన్ మాట్లాడుతూ రోబోటిక్ సర్జరీలకు రోజు రోజుకూ ఆదరణ పెరుగుతుందని అన్నారు. భవిష్యత్‌లో రోబోలతోనే అన్ని శస్త్రచికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. రోబో సర్జరీ వల్ల రోగులు ప్రయోజకరంగా ఉంటాయని అన్నారు. సీనియర్ ఆర్థోపెడిక్ కన్సల్టెంట్ డాక్టర్ ఆరుముగం మాట్లాడుతూ ఆసుపత్రిలో ఏర్పాటైన కొత్త ఫోర్త్ జనరేషన్ రోబో ద్వారా సునిశితమైన భాగాలను క్షుణ్ణంగా చూడగలుగుతామని, మోకాలు, కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలను సులువుగా చేయగలుగుతామని వివరించారు.



ఎల్‌జీఎం ఫస్ట్ లుక్ పోస్టర్

ధోని ఆవిష్కరించిన
ఎల్‌జీఎం చిత్ర ఫస్ట్ లుక్

తమిళ సినిమా: ప్రఖ్యాత భారత్ క్రికెట్ క్రీడాకారుడు ఎమ్మెస్ ధోని సమర్పణలో ఆయన సతీమణి సాక్షి ధోని తొలిసారిగా చిత్ర నిర్మాణం చేపట్టి ఎంఎస్ ధోనీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై తమిళంలో నిర్మిస్తున్న చిత్రం ఎల్‌జీఎం. ఈ చిత్రంలో నటుడు హరీష్ కళ్యాణ్, నటి ఇవానా హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. నదియా, యోగిబాబు, మిర్చి విజయ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా రమేష్ తమిళ్ మణి దర్శకుడిగా పరిచయం అవుతూ సంగీతం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఇటీవలే ప్రారంభమైన ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. చిత్ర వివరాలను నిర్మాతల్లో ఒకరైన వికాస్ హసీజ తెలుపుతూ ఎల్‌జీఎం చిత్రం షూటింగ్ చాలా బాగా జరుగుతోందని, అవుట్ పుట్ సంతృప్తికరంగా వస్తోందని తెలిపారు. ఇది ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌తో కూడిన కథాచిత్రంగా ఉంటుందన్నారు. త్వరలోనే నిర్మాణాంతర కార్యక్రమాలు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ చిత్రంతో తమిళంలో తమ సినీ పయనం మొదలైందని, ఇది మంచి అనుభవంగా పేర్కొన్నారు. చిత్ర నిర్వాహకురాలు ప్రియాంసు చోప్రా తెలుపుతూ వైవిధ్యభరిత కథాంశంతో రూపొందుతున్న చిత్రం ఎల్‌జీఎం అని తెలిపారు. ఇందులో పలు ఆశ్చర్యకరమైన విషయాలు చోటు చేసుకుంటాయని అన్నారు. ప్రతిభావంతులైన నటీనటులు, సాంకేతిక నిపుణులతో రూపొందుతున్న ఈ చిత్ర నిర్మాణం తమకు గొప్ప అనుభూతిని కలిగిస్తోందని చెప్పారు. కాగా చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఎంఎస్ ధోని తన ట్విట్టర్ ద్వారా సోమవారం విడుదల చేశారు.

రెయిన్ బో ఆశ నెరవేరేనా..?



నటి రష్మిక మందన్న

తమిళ సినిమా: మొదటి నుంచి గ్లామర్‌నే నమ్ముకున్న నటి రష్మిక మందన్న. అలాంటిది పుష్ప చిత్రంలో డీ గ్రామర్ పాత్రను పోషించి నటిగా తన సత్తా చాటుకుంది. ఆ చిత్రం బాలీవుడ్ వరకు తీసుకెళ్లింది. అక్కడ ఏకంగా బిగ్ బి అమితాబ్ బచ్చన్‌తో కలిసి గుడ్ బై చిత్రంలో నటించే అవకాశాన్ని దక్కించుకుంది. అయితే ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించలేదు. నటిగా మాత్రం రష్మికకు మంచి పేరు తెచ్చిపెట్టింది. అయితే ఇక్కడ సక్సెస్ ప్రధానం కాబట్టి మంచి హిట్టు కోసం ఈమె ఎదురుచూస్తోంది. తదుపరి విడుదలకు సిద్ధమవుతున్న యానిమల్ చిత్రంపైనే ఆశలు పెట్టుకుంది. అదేవిధంగా తెలుగులో టాప్ హీరోయిన్‌గా వెలిగిపోతున్న రష్మిక మందన్నకు కోలీవుడ్లో రెండు చిత్రాల్లో నటించినా సరైన హిట్టు రాలేదు. తాజాగా ఒక బంపర్ ఆఫర్ ఈ అమ్మడిని వరించింది. అదే రెయిన్ చిత్రం. విశేషమేంటంటే ఇప్పటివరకు హీరోలతో ఆడి పాడే పాత్రల్లోనే నటిస్తూ వస్తున్న ఈ బ్యూటీకి తొలిసారిగా రెయిన్‌బో చిత్రంలో హీరోయిన్ ఓరియెంటెడ్ కథా చిత్రంలో నటిస్తోంది. ఇది ఫాంటసీ నేపథ్యంలో సాగే ప్రేమ కథ చిత్రం . కోలీవుడ్‌లో వరుసగా విజయాలు సాధిస్తున్న డ్రీమ్ వారియర్ పిక్చర్స్ అధినేతలు ఎస్సార్ ప్రకాష్ బాబు, ఎస్సార్ ప్రభు తాజాగా నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రం ద్వారా శాంతా రూపన్ దర్శకుడుగా పరిచయం అవుతున్నారు. ఇటీవలే పూజ కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ చిత్రంపై రష్మిక మందన్న చాలా ఆశలు పెట్టుకుంది. ఈ చిత్రంతో తమిళంలో హిట్ కొట్టి తీరుతాననే నమ్మకంతో ఉంది.

కోలీవుడ్ టాక్స్

విజయ్ సేతుపతి
జెంటిల్మెన్



సాయి రోహిణి

తమిళ సినిమా: విజయ్ సేతుపతి ఓ జెంటిల్మెన్ అని వర్ధమాన నటి సాయి రోహిణి పేర్కొంది. వేలూరుకు చెందిన అచ్చ తమిళ అమ్మాయి ఈ చిన్నది. తల్లిదండ్రులు కోరిక మేరకు చదువుకోవడానికి చెన్నైకి వచ్చిన సాయి రోహిణి చదువు పూర్తయిన తర్వాత తన దృష్టిని సినిమాలపై సారించింది. నటిని కావాలన్నది తన డ్రీమ్ అని పేర్కొంది. దాన్ని శక్తి వంచన లేకుండా ప్రయత్నించి సాధించగలననే నమ్మకంతో నటీమణులు కావాలనే ప్రకటనలను చూసి ప్రతి ఆడిషన్‌ను వదలకుండా పాల్గొనేదాన్నని చెప్పింది. అలా లభించిన అవకాశమే నాట్ రీచ్చబుల్ చిత్రం అని తెలిపింది. ఆ తర్వాత మిడిల్ క్లాస్ అనే చిత్రంలో నటించినట్లు చెప్పింది. ప్రస్తుతం దుచ్చాదనన్ అనే చిత్రంలో కథానాయికగా నటిస్తున్నట్లు చెప్పింది. ఈ చిత్ర షూటింగ్ గోపిశెట్టి పాలెం, ఈరోడ్ ప్రాంతాల్లో జరుపుకుంటోందని తెలిపింది. కాగా నటుడు సూరికి జంటగా హాట్ స్టార్ ఓటీటీ కోసం నిర్మాత అరుణ్ నిర్మిస్తున్న చిత్రంలో కథానాయకిగా నటించనున్నట్లు చెప్పింది. దీనికి వెట్రివీరన్ కథ, దర్శకత్వం బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపింది. వీరితోపాటు మరో రెండు తెలుగు చిత్రాలకు కమిట్ అయినట్లు చెప్పింది. కాగా విజయ్ సేతుపతి నేతృత్వంలో 2023 క్యాలెండర్ రూపొందించిన విషయం తెలిసిందే అన్నారు. అందులో నెలకొకటి చొప్పున 12 పేజీలను రూపొందించినట్లు అందులో రెండు పేజీల కోసం తాను విజయ్ సేతుపతి కలిసి నటించినట్లు చెప్పింది. అందుకోసం షూటింగ్ ఒకరోజు నిర్వహించినా అందులో విజయ్ సేతుపతితో కలిసి నటించిన అనుభవం మరువలేనిదని పేర్కొంది. ఆయన ఎలాంటి అసౌకర్యం కలగకుండా చాలా మర్యాదగా చూసుకున్నారని చెప్పింది. ఆ క్యాలెండర్ కోసం నటించిన వారిలో ఏకైక నటిని తానేనని సాయి రోహిణి చెప్పింది.

మళ్లీ చిత్ర నిర్మాణంలోకి ధనుష్



ధనుష్‌తో దర్శకుడు మారి సెల్వరాజ్

తమిళ సినిమా: కోలీవుడ్‌లో సక్సెస్‌ఫుల్ కథానాయకుడిగా కొనసాగుతున్న నటుడు ధనుష్. ఈయన గాయకుడు, దర్శకుడు, నిర్మాత కూడా. ప్రస్తుతం కథానాయకుడిగా కెప్టెన్ మిల్లర్ చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. అదేవిధంగా తన 50వ చిత్రానికి మరోసారి మెగా ఫోన్ పట్టడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. కాగా ధనుష్ 2012లో వండర్ బార్ ఫిలిమ్స్ అనే నిర్మాణ సంస్థను ప్రారంభించి తొలి ప్రయత్నంగా 3 చిత్రాన్ని నిర్మించారు. ఆ తర్వాత ఎదిర్ నీచ్చల్, వేలై ఇల్లా పట్టదారి, కాక్కీ సట్టై, కాకా ముట్టై, మారి, నానుమ్ రౌడీ దాన్, విచారణై, సినిమా వీరన్ (డాక్యుమెంటరీ చిత్రం) నా.పాండీ, రజనీకాంత్ కథానాయకుడిగా కాలా ఇలా పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. ఈయన చివరిగా 2018లో తను హీరోగా మారి -2 చిత్రాన్ని నిర్మించారు. ఆ తర్వాత సుమారు 5 ఏళ్లు చిత్ర నిర్మాణానికి దూరంగా ఉంటూ వచ్చిన ధనుష్ తాజాగా చిత్ర నిర్మాణానికి సిద్ధమయ్యారు. ఈయన వండర్ బార్ ఫిలిమ్స్ సంస్థ జి.స్టూడియోస్ సంస్థతో కలిసి ఒక భారీ చిత్రాన్ని నిర్మించడానికి సలహాలు చేస్తున్నారు. ఇందులో ధనుష్ కథానాయకుడిగా నటించనున్నారు. దీనికి మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించనున్నారు. వీరి కాంబినేషన్లో ఇంతకుముందు కర్ణన్ అనే సక్సెస్‌ఫుల్ చిత్రం వచ్చింది. కాగా తాజా చిత్రం గురించి అధికారిక ప్రకటనను చిత్రవర్గాలు ఆదివారం ప్రకటించారు. ఇందులో పలు భాషలకు చెందిన ప్రముఖ నటీనటులు, సాంకేతిక నిపుణులు పనిచేయనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

విక్రమ్ పుట్టినరోజు సందర్భంగా..



తంగలాన్ చిత్రంలో ఓ సన్నివేశం

తమిళ సినిమా: విక్రమ్ ఈ పేరు ప్రయోగాలకు పుట్టినిల్లు అని పేర్కొనవచ్చు. కోలీవుడ్‌లో కమలహాసన్ తర్వాత ఆ స్థాయిలో పాత్రల కోసం తనను తాను మలుచుకోవడానికి ఎంతవరకైనా వెళ్లే నటుడు విక్రమ్. శ్రమించు ఫలితం తానే వెతుక్కుంటూ వస్తుంది అన్న సిద్ధాంతానికి కట్టుబడి ఉండే నటుడు ఈయన. అలా తాజాగా తంగలాన్ చిత్రం కోసం తనను మరో వైవిధ్యమైన కోణంలో ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. కరెక్ట్‌గా చెప్పాలంటే ఈ చిత్రం కోసం విక్రమ్ గిరిజనవాసిగా మారిపోయారు. పా.రంజిత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ పతాకంపై జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. జి. ప్రకాష్ కుమార్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రంలో నటి పార్వతి, మాళవిక మోహన్ కథానాయికలుగా నటిస్తున్నారు. నటుడు పశుపతి, హరి, బ్రిటీష్ నటుడు డేనియల్ కాల్టకిరోన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ప్రిడియారికల్ కథా చిత్రంగా తెరకెక్కుతున్న ఈ చిత్ర షూటింగ్ ఇప్పటికే 80 శాతం పూర్తి అయ్యిందని, మరో 25 షూటింగ్ మాత్రమే బాకీ ఉందని ఇటీవల దర్శకుడు పి.రంజిత్ తెలిపారు. కగా ఈనెల 15వ తేదీన విక్రమ్ పుట్టినరోజు. దీంతో ఆ రోజు ఆయన అభిమానుల కోసం తంగలాన్ చిత్రం పోస్టర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో విక్రమ్ పుట్టినరోజు కోసం ఆయన అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అదేవిధంగా తంగలాన్ చిత్రంపైన భారీ అంచనాలు నెలకొన్నాయి.

క్లుప్తంగా

రెండు లగేజీ వ్యాన్‌లు ఢీ



బోల్తాపడిన వ్యాను

అన్నానగర్: ఊత్తంగరై సమీపంలో సోమవారం రెండు వ్యాన్లు ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. తిరువణ్ణామలై నుంచి సోమవారం ఉదయం పూలతో కూడిన లగేజ్ వ్యాన్ కృష్ణగిరి జిల్లా ఊత్తంగరై వైపు వస్తోంది. అదేవిధంగా కర్నాటకలోని మాండ్య నుంచి తిరుకోవిలూర్ అయ్యనార్ ఆలయానికి కొంతమంది భక్తులు లగేజ్ వ్యాన్‌లో వస్తున్నారు. పాంబారు డ్యామ్ సమీపంలో 2 వ్యాన్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కర్ణాటకలోని మాండ్య జిల్లాకు చెందిన వెంకటేశన్ (45) సంఘటనా స్థలంలోనే దుర్మణం చెందాడు. అలాగే మరో లగేజ్ వ్యాన్‌లో ప్రయాణిస్తున్న 14 మంది గాయలపాలయ్యారు. చుట్టుపక్కల వారు వారిని ఊత్తంగరై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

అన్నానగర్: 12 టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రామనాథపురం ఎస్ఐ శివజ్ఞాన పాండియన్ నేతృత్వంలో పోలీసులు సోమవారం వేకువజామున వాహన తనిఖీలు నిర్వహించారు. పరమకుడి ముదుకులత్తూరు వద్ద మెల్‌కవనూరు వెళ్తున్న ఓ లారీని అడ్డుకుని తనిఖీ చేశారు. తనిఖీల్లో లారీలో ఒక్కొక్కటి 40 కిలోలు ఉన్న 300 బస్తాల్లో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 12 టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం లారీ డ్రైవర్, లారీ యజమాని బందారు కులం, శంకర్ నగర్ ప్రాంతానికి చెందిన ఆయిరమ్ (35), లోడుమ్యాన్ మణికంఠన్ (35)లను అరెస్టు చేశారు. దీనికి సంబంధించి నెల్‌లై ప్రాంతానికి చెందిన కళాకారుడు, ముదుకులత్తూరు పురుధికులం ప్రాంతానికి చెందిన దైవమురుగన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని వాణిజ్య గోడౌన్‌కు తరలించారు.

డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్రవాహనం

తిరువొత్తియూరు: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన చెన్నై మరైమలైనగర్‌లో చోటుచేసుకుంది. సిరుచ్చేరి, పిల్లయార్ కోయిల్ వీధికి చెందిన అజిత్‌కుమార్ (26). ఇతను ఆదివారం రాత్రి స్నేహితులైన సెల్వ (26), వినోద్ కుమార్ (30)లతో కలిసి ద్విచక్ర వాహనంలో చెంగల్పట్టుకు బయలుదేరారు. మరైమలైనగర్ జీఎస్‌టీ రోడ్డులో వెళ్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అజిత్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. వినోద్‌కుమార్, సెల్వ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వీరిని పోలీసులు చెంగల్పట్టు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

10 మేకలు మృతి



అన్నానగర్: ముత్తూరు సమీపంలో ఆదివారం రాత్రి ఓ గుర్తు తెలియని జంతువు దాడి చేయడంతో 10 మేకలు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. తిరుపూర్ జిల్లా ముత్తూరు సమీపంలోని రంగప్పయన్ కాడు గ్రామానికి చెందిన నల్లకన్నన్ బావి తవ్వే కార్మికుడు. అలాగే జీవనం కోసం మేకలను పెంచుతుంటాడు. ఈ పరిస్థితుల్లో నల్లకన్నన్ చెరంపాళయం అష్టలక్ష్మి నగర్ ప్రాంతంలోని తన సొంత స్థలంలో మేకల పాకను ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం సాయంత్రం 7 గంటలకు తన మేకలను ఈ కొట్టంలో వదిలి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం 6 గంటలకు కొట్టం వద్దకు వెళ్లి చూడగా 10 మేకల తలలు, మెడలు, శరీరాలపై కాట్లు ఉన్నాయి. జంతువు కొరికినట్టు ఆనవాళ్లు కనిపించాయి. వెల్లకోయిల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఆదివారం అర్ధరాత్రి నల్లకన్నన్ కొట్టంలోకి ఏదో జంతువు ప్రవేశించి మేకలను కొరికి చంపినట్టు తేలింది. దీంతో ముత్తూరు ప్రభుత్వ పశువైద్య బృందం సంఘటనా స్థలానికి చేరుకుని చనిపోయిన మేకలను పరిశీలించారు. అనంతరం చనిపోయిన మేకలన్నింటినీ ఆ ప్రాంతంలోని గుంతల్లో పూడ్చిపెట్టారు. మృతి చెందిన 10 మేకల విలువ దాదాపు రూ.80 వేలు ఉంటుందని, చనిపోయిన మేకలకు జిల్లా యంత్రాంగం, నష్టపరిహారం అందించాలని నల్లకన్నన్ కోరాడు.

వృద్ధుడి ఆత్మహత్య

అన్నానగర్: వండలూరు సమీపంలోని ఓట్టేరి ఎక్స్‌టెన్షన్‌కు చెందిన కుమార్ (66) అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నా వ్యాధి నయం కాలేదు. దీంతో కుమార్ తీవ్ర వేదనకు గురయ్యాడు. ఈ స్థితిలో కుమార్ సోమవారం ఉదయం వండలూరు రైల్వేస్టేషన్ సమీపంలోకి వచ్చాడు. చెన్నై బీచ్ నుంచి చెంగల్పట్టుకు ఎలక్ట్రిక్ రైలు వెళ్తుండగా అకస్మాత్తుగా రైలు పట్టాలపై తల పెట్టాడు. ఇందులో కుమార్ తల తెగి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం క్రోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్



గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన గృహాలను ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

- గృహనిర్మాణ శాఖ భవనాలను ప్రారంభించిన సీఎం స్టాలిన్
- రెస్క్యూ ఫైర్‌స్టేషన్లను సచివాలయం నుంచి జెండా ఊపి ప్రారంభం

సాక్షి, చెన్నై : తమిళనాడు గృహ నిర్మాణ శాఖ నేతృత్వంలో రూ.183.60 కోట్లతో నిర్మించిన భవనాలను సీఎం స్టాలిన్ ప్రారంభించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సచివాలయంలో నుంచి పలు అభివృద్ధి కార్యక్రమాలకు జెండా ఊపి ప్రారంభోత్సవం చేశారు. ఇందులో గృహ నిర్మాణ శాఖ నేతృత్వంలో రూ.171.36 కోట్లతో, రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో రూ.10.88 కోట్లతో భవనాలు నిర్మించారు. తిరునల్వేలి, చెన్నై శాస్త్రి నగర్, చెంగల్పట్టు, ఈరోడ్, సేలం, కోయంబత్తూరులో నిర్మించిన గృహాలు, ప్రభుత్వ కార్యాలయ భవనాలు కూడా ఇందులో ఉన్నాయి. కార్యక్రమంలో మంత్రులు ముత్తుస్వామి, సుబ్రమణియన్, సీఎస్ ఇరై అన్బు పాల్గొన్నారు. అలాగే తమిళనాడు అర్బన్ డెవలప్‌మెంట్ బోర్డు తరపున రూ.284.32 కోట్లతో నిర్మించిన బహుళ అంతస్తుల తరహాలో నిర్మించిన 2828 గృహాలను కూడా సీఎం ప్రారంభించారు.

రూ.20 కోట్లతో అప్ గ్రేడ్ ఫైర్‌స్టేషన్లు

రూ.2.67 కోట్ల విలువైన 10 రెస్క్యూ టోయింగ్ వాహనాలు, 4 కోస్టల్ పెట్రోలింగ్ వాహనాల సేవలను సచివాలయం నుంచి సీఎం స్టాలిన్ జెండా ఊపి ప్రారంభించారు. అగ్నిమాపక శాఖలో కొత్తగా రూ.20.13 కోట్లతో సహాయక చర్యలకు ఉపయోగపడే రీతిలో వివిధ పరికరాలతో రెస్క్యూ స్టేషన్లు నిర్మాణం చేశారు. అగ్నిమాపక, రెస్క్యూ స్టేషన్లను సేలం జిల్లా అత్తయ్యంబట్టి, తిరుపూర్ జిల్లా ఊతుకులి, శివగంగై జిల్లా ఇళయాంకుడి, తిరుచ్చి జిల్లా వాయంబట్టి, కడలూరు జిల్లా కుమారచ్చి, కళ్లకురిచి జిల్లా నాయనా పాళయం, విల్లుపురం జిల్లా అన్నియూర్, మదురై లల్లా తిరుప్పర గుండ్రం తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. అలాగే చెంగల్పట్టు జిల్లా తాంబరం, కృష్ణగిరి జిల్లా హోసూరు తదితర ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రాలను కూడా సీఎం స్టాలిన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి కేఎస్ నెహ్రూ, పొన్ముడి, హోంశాఖ కార్యదర్శి ఫణీంద్రరెడ్డి, డీజీపీ శైలేంద్రబాబు, చెన్నై పోలీసు కమిషనర్ శంకర్‌జివాల్ తదితరులు పాల్గొన్నారు.

రెండు అమ్మవారి విగ్రహాలు లభ్యం

అన్నానగర్: కొల్లిడం సమీపంలోని కొడియంపాళయం దీవు గ్రామంలో ఆదివారం మరో రెండు అమ్మవారి విగ్రహాలు లభ్యమయ్యాయి. మైలాడుదురై జిల్లా కొల్లిడం సమీపంలోని కొడియంపాళయం అనే దీవు గ్రామంలో రెండు రోజుల క్రితం మూడు విగ్రహాలు, రెండు పెరుమాళ్ విగ్రహాలు, ఒక అమ్మన్ విగ్రహం లభ్యమయ్యాయి. వాటిని పుదుపట్నం పోలీసులు, శీర్గాళి తహసీల్దార్ సెంథిల్ కుమార్ స్వాధీనం చేసుకున్నారు. అదే బీచ్‌లో మరో రెండు విగ్రహాలు ఉన్నట్లు ఆదివారం సమాచారం అందడంతో గ్రామ పరిపాలనా అధికారి పావల్ చంద్రన్, పుదుపట్టినం పోలీసులు అక్కడికి చేరుకుని రెండు విగ్రహాలు, 3 అడుగులఎత్తు అమ్మవారి విగ్రహం, 2 అడుగుల ఎత్తు ఉన్న అమ్మవారి విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. కొడియంపాళయం దీవు గ్రామ తహసీల్దార్ కార్యాలయంలో భద్రంగా ఉంచారు. కొడియంపాళయం అనే దీవు గ్రామంలోని బీచ్ ఇసుకలోకి ఈ విగ్రహాలు ఎలా వచ్చాయి? ఇక్కడ ఎవరు తీసుకొచ్చారు, ప్రత్యేకంగా ఎందుకు ఇక్కడ పెట్టారు అనే కోణంలో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

23న ఫెఫ్సీ ఎన్నికలు



ఆర్‌కే సెల్వమణి జట్టు

తమిళ సినిమా: దక్షిణ భారత సినీ కార్మికుల సమాఖ్య (ఫెఫ్సీ) ఎన్నికల తేదీని సోమవారం ప్రకటించారు. దర్శకుడు ఆర్కే సెల్వమణి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఫెఫ్సీ ప్రస్తుత కార్యవర్గ పదవీకాలం ఈనెల 22వ తేదీతో ముగియనుంది. దీంతో 2023 నుంచి 2026 వరకు సమాఖ్య నూతన కార్యవర్గం కోసం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికలు ఏప్రిల్ 23వ తేదీన నిర్వహించనట్లు ఫెఫ్సీ కార్యవర్గం సోమవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అందులో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల దరఖాస్తులను ఈనెల ఏడో తేదీ నుంచి స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థుల దరఖాస్తులను 11వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు ప్రశ్నించడం జరుగుతుందని, అర్హులైన అభ్యర్థుల పేర్లను అదే రోజు సాయంత్రం ఫెఫ్సీ కార్యాలయంలో ప్రకటించనున్నట్లు తెలిపారు. అదే విధంగా పోటీ నుంచి విరమించుకోవాల్సిన అభ్యర్థులు 12,13 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను ఉపసంహరించుకునే అవకాశం ఉటుందని తెలిపారు. పోటీ చేసే అభ్యర్థుల జాబితాను 13వ తేదీన సాయంత్రం ప్రకటించినట్లు తెలిపారు. అదేవిధంగా 23వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికలు ఎన్నికల ప్రక్రియ జరుగుతుందని వెల్లడించారు. కాగా ఈ సారి కూడా ఆర్కే సెల్వమణి జట్టు పోటీ చేయనున్నట్లు ప్రకటించారు.

జ్యోతిష్యుడి దారుణ హత్య



హత్యకు గురైన జ్యోతిష్యుడు

అన్నానగర్: సెందమంగలమ్ సమీపంలో భార్యతో విడిగా జీవిస్తున్న ఓ జ్యోతిష్యుడిని సోమవారం కత్తితో నరికి దారుణంగా హత్య చేసిన ప్రియురాలిని పోలీసులు అరెస్టు చేశారు. నామక్కల్ జిల్లా సెందమంగళం సమీపంలోని కొండమనాయక్ కన్నట్టి వెస్ట్ రోడుకు చెందిన సుందర్ రాజన్ (60) జ్యోతిష్యుడు భార్య బేబీ (55) నరేష్ కుమార్ (34), సిమల్ (28) ఇద్దరు కుమారులు ఉన్నారు. తన వద్దకు జ్యోతిష్యం కోసం వచ్చే విడాకులు తీసుకున్న, వితంతువులైన మహిళలను సుందర్‌రాజన్ లక్ష్యంగా చేసుకుని వారిని తన వలలో పడేసి వారితో అక్రమ సంబంధాలు కొనసాగిస్తున్నాడు. అదేవిధంగా అదే ప్రాంతానికి చెందిన భర్త నుంచి విడిపోయి జీవిస్తున్న పరమేశ్వరి(48) జ్యోతిష్యం కోసం సుందర్‌రాజన్‌ను చూసేందుకు రావడంతో స్నేహితులయ్యారు. ఆ తర్వాత ఇద్దరూ తరచుగా ఏకాంతంగా కలుసుకునే వారు. ఈ విషయం బేబీకి తెలుసు. సుందర్ రాజన్‌ను చాలాసార్లు హెచ్చరించినా అతను మారలేదు. దీంతో బేబీ రెండేళ్ల క్రితం భర్త, కొడుకులను వదిలి వెళ్లిపోయింది. ఆ తర్వాత ఇంట్లో ఒంటరిగా ఉన్న సుందర్ రాజన్‌కు పరమేశ్వరి భోజనం పెట్టి గమనిస్తూ వచ్చింది. ఈ స్థితిలో సోమవారం సుందర్‌రాజన్ పేగులు బయటకు వచ్చిన స్థితిలో ఇంట్లో దారుణంగా హత్య చేయబడ్డాడు. ఇది గమనించిన చుట్టుపక్కల ప్రజలు వెంటనే సేందమంగళం పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుందర్ రాజన్ తన ఇంటిని స్నేహితురాలు పరమేశ్వరికి రాసిచ్చాడని, అయితే ఆమె అతని వద్ద ఉన్న రెండు ఇళ్లు, డబ్బులు అడగడంతో వారి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో సుందర్ రాజన్ పరమేశ్వరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే పరమేశ్వరితో పాటు అదే ప్రాంతానికి చెందిన మరో మహిళతో అక్రమ సంబంధం ఉంది. ఇంతలో పరమేశ్వరి మరో ప్రేమికుడితో కలిసి సుందర్‌రాజన్‌ను చంపేందుకు పథకం వేసింది. ఈ నేపథ్యంలో పరమేశ్వరి ఆదివారం రాత్రి తన ప్రేమికుడితో కలిసి సుందర్ రాజన్ ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో అక్కడే ఉన్న సుందర్‌రాజన్‌ను వారిద్దరూ కత్తితో పొడిచి చంపినట్లు పోలీసుల విచారణలో తేలింది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సెందమంగళం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంటనే పోలీసులు అదే ప్రాంతంలో ఉన్న పరమేశ్వరిని అరెస్టు చేసి తీవ్రంగా విచారిస్తున్నారు. పరారీలో ఉన్న ఆమె మరో ప్రేమికుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఉచిత దంత వైద్య శిబిరానికి స్పందన



వైద్యశిబిరంలో పాల్గొన్న వారితో డాక్టర్ రాజశేఖర్

కొరుక్కుపేట: చెన్నై టి.నగర్‌లోని వెంకటనారాయణ రోడ్డులోని నటేషన్ పార్క్ ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత దంత పరీక్షల వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ప్రజల్లో దంత సమస్యలపై అవగాహన తీసుకుని వచ్చేవిధంగా నగరానికి చెందిన దంతాలయం డెంటల్ అండ్ ఆర్థోడెంటిక్ సెంటర్ ఆధ్వర్యంలో దంత వైద్య నిపుణులు, ఆర్థో డాక్టర్ ఎల్.రాజశేఖర్ మార్గదర్శకత్వంలో సీనియర్ స్పెషలిస్ట్ డెంటల్ సర్జన్లు, పారామెడికల్ సిబ్బంది బృందం విచ్చేసి పార్కుకు వచ్చేవారికి, స్థానిక ప్రజలకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. అలాగే రోగులకు నోటి శుభ్రత గురించి అవగాహన కల్పించారు. సుమారు 300 మంది రోగులు శిబిరంలో వైద్యసేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ దంత సమస్యలు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, రోజుకు రెండుసార్లు బ్రష్ చేసుకోవాలని సూచించారు.

రూ.లక్ష విలువైన క్రీడాసామగ్రి వితరణ



క్రీడాసామగ్రి అందిస్తున్న మేయర్

అన్నానగర్: కడలూరు మేయర్ సుందరి రాజా ఆదివారం బాక్సర్లకు రూ.లక్ష విలువైన క్రీడాసామగ్రిని అందజేశారు. కడలూరు తూర్పు జిల్లా డీఎంకే కోశాధికారి శ్రీ కె.పి.కదిరవన్ ఆధ్వర్యంలో కడలూరు అన్నా క్రీడామైదానంలో రూ.లక్ష విలువైన క్రీడా పరికరాల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ డీఎంకే కార్యదర్శి కేఎస్ రాజా అధ్యక్షత వహించారు. కడలూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సుందరి రాజా పాల్గొని బాక్సర్లకు రూ.లక్ష విలువైన క్రీడాసామగ్రిని అందజేశారు. జిల్లా విద్యార్థి డిప్యూటీ ఆర్గనైజర్ బాలాజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం కార్యదర్శి కార్తీక్, మండలాధ్యక్షుడు ప్రసన్న, కౌన్సిలర్లు సుభాషిని రాజా, కోచ్‌లు శివరాజ్, ఇలవరసన్, అప్పాదురై పాల్గొన్నారు.

తండ్రి మృతి చెందినా పరీక్ష రాసిన విద్యార్థిని

తిరువొత్తియూరు: కారైకాల్ జిల్లాలో తండ్రి మృతిచెందిన దుఃఖంలో ఓ విద్యార్థిని సోమవారం 10వ తరగతి పరీక్ష రాసింది. కారైకాల్ జిల్లా తిరునల్లార్ సేత్తూరుకు చెందిన విజయకుమార్. ఇతనికి ముగ్గురు కుమార్తెలు. వీరిలో చిన్న కుమార్తె వినిత (15) అంబాకరత్తూరు తిరుళ్లారు ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. సోమవారం ఇంగ్లిషు పరీక్ష జరిగింది. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో విద్యార్థిని వినిత తండ్రి విజయకుమార్ గుండెపోటుతో మృతిచెందాడు. వినిత శోకంలోనూ పరీక్ష రాసింది. పరీక్ష పూర్తి అయిన తరువాత తండ్రి అంత్యక్రియల్లో పాల్గొంది. ఆమెను ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు ఓదార్చారు.

గర్భిణి విద్యార్థిని ఆత్మహత్య

అన్నానగర్: పెళ్లికి ప్రియుడి కుటుంబ సభ్యులు నిరాకరించడంతో 3 నెలల గర్భిణి విద్యార్థిని సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆమె ప్రియుడితో పాటు ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. మైలాడుదురై జిల్లా తిరువేర్కాడు సమీపంలోని పెరుందొట్టం గ్రామానికి చెందిన మురుగవేల్ కుమార్తె ప్రభావతి (20) శీర్కాళిలో ఓ ప్రైవేట్ నర్సింగ్ కాలేజీలో చదువుతోంది. సోమవారం తెల్లవారుజామున ఆమె తన ఇంటి పెరట్లోని వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తిరువేర్కాడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రభావతి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం శీర్గాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రభావతి ఇంట్లో సోదాలు జరిపిన దాంట్లో పోలీసులు ఓ లేఖను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆ లేఖలో ప్రభావతి తాను అదే ప్రాంతానికి చెందిన ఆనందరాజ్ (26)ను ప్రేమిస్తున్నానని, ప్రస్తుతం తాను 3 నెలల గర్భిణి అని తెలుపగా, ఆనందరాజ్ కుటుంబీకులు పెళ్లికి అంగీకరించలేదని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నట్టు తెలిపింది. తిరువేర్కాడు పోలీసులు కేసు నమోదు చేసి అలెగ్జాండర్ (40), ఆనందరాజ్, రంజిని (34) అనే ముగ్గురిని అరెస్టు చేసి విచారిస్తున్నారు. ప్రియుడి కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరించడంతో నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తిరువేర్కాడు వాసులను విషాదంలో ముంచెత్తింది.

మామ చేతిలో కోడలి హతం

అన్నానగర్: నెల్లైలో ఆదివారం కోడలిని ఇనుప రాడ్డుతో కొట్టి చంపిన మామను పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్‌లై పాలయంగోట్టై సమీపంలోని ఇట్టేరి ప్రాంతానికి చెందిన తంగరాజ్ (50) కుమాడుకు తమిళరసన్ సైనికుడు. ఇతని భార్య ముత్తుమారి(26). అయితే తంగరాజ్ భార్య చనిపోవడంతో రెండో పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. అందుకోసం అతను తన కోడలు ముత్తుమారిని ఇల్లు ఖాళీ చేయమని ఒత్తిడి చేశాడు. అయితే ఆమె దీన్ని వ్యతిరేకించింది. దీంతో కోడలిపై తంగరాజ్ కోపోద్రిక్తుడై ఈ నెల 7వ తేదీన ముత్తుమారి తలపై ఇనుప రాడ్డుతో కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం పాలయంగోట్టై ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ముత్తుమారి ఆదివారం రాత్రి మృతి చెందింది. దీంతో ఆగ్రహించిన ఆమె బంధువులు ముత్తుమారి మృతదేహాన్ని తీసుకునేందుకు నిరాకరించి నిరసనకు దిగారు. తంగరాజ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో అజ్ఞాతంలో ఉన్న తంగరాజ్‌ను మున్నీర్‌పల్లం పోలీసు ఇన్‌స్పెక్టర్ తిల్‌లై నాగరాజన్ నేతృత్వంలో సిబ్బంది అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

వృద్ధురాలి హత్య

తిరువొత్తియూరు: కృష్ణగిరి జిల్లాలో వృద్ధురాలిపై రాళ్లతో దాడి చేసి హత్య చేసిన మనవడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. కృష్ణగిరి జిల్లా ఉత్తకోట్టై కల్లావి కుంభనూర్‌కు చెందిన ఓబుల్ నాయుడు భార్య పొన్నియమ్మాల్ (85). ఓబుల్ నాయుడు గతంలో మృతి చెందాడు. వీరికి ఓ కుమారుడు, ఓ కుమార్తె. ఇద్దరికీ వివాహం అయ్యింది. ఈక్రమంలో పొన్నియమ్మాల్ గత కొన్ని రోజులకు క్రితం మామిడి తోటలో తలకు తీవ్రగాయాలతో మృతి చెంది పడి ఉంది. పోలీసుల విచారణలో పొన్నియమ్మాల్ మనవడు వెంకటేశన్ ఆమెను హత్య చేసినట్టు తెలిసింది. దీంతో పోలీసులు వెంకటేశన్‌ను అరెస్టు చేశారు. రూ. 1,000 తీసుకుందని అతడు అవ్వను హత్య చేసినట్లు తెలిసింది.

వైభవంగా ఆంజనేయ ఉత్సవం




ఆంజనేయ స్వామి ఉత్సవ వేడుక

కొరుక్కుపేట: రామభక్తుడైన ఆంజనేయ స్వామి ఉత్సవం సోమవారం రాత్రి వైభవంగా సాగింది. ఈ మేరకు చెన్నైలోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాలు సోమవారంతో వైభవంగా ముగిశాయి. 11 రోజులు పాటు సాగిన ఈ వేడుకల్లో చివరి రోజు ఆంజనేయ స్వామి ఉత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవారిని, ఆంజనేయ స్వామిని విశేషంగా అలంకరించి విశేష పూజలను చేపట్టారు. పెద్దసంఖ్యలో మహిళలు, భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని తరించారు. ఈ సందర్భంగా భక్తి కార్యక్రమంలో భాగంగా చంద్ర నాట్యాలయ డ్యాన్స్ అకాడమీ బృందం నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవం

తిరువొత్తియూరు: తిరుచ్చి జిల్లా మరుంగాపురి భగవతి అమ్మన్ ఆలయంలో సోమవారం అగ్నిగుండ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. 3,000 మంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. తిరుచ్చి జిల్లా తువరంకురిచ్చి సమీపంలోని మరుంగాపురి జమీన్‌కు సొంతమైన భగవతి అమ్మన్ ఆలయం ఉంది. ఈ ఆలయంలో ఏటా పంగుణి నెలలో విశేషంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఏప్రిల్ 2వ తేదీ పూల చాటింపుతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ముఖ్య ఘట్టమైన అగ్నిగుండ ప్రవేశం ఉత్సవం సోమవారం ఉదయం భగవతి అమ్మన్ ఆలయ ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో కంకణధారులైన సుమారు 300 మంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు.



భానుడి ప్రతాపం

కొరుక్కుపేట: రాష్ట్రంలో భానుడు క్రమంగా ఉగ్రరూపం దాల్చుతున్నాడు. గత కొన్ని రోజులుగా ఎండలు మండుతున్నాయి. వేడిగాలులు వీచే అవకాశం ఉంది. ఫలితంగా రానున్న రోజుల్లో భానుడు ప్రతాపం పెరిగి ఉష్ణోగ్రతలు మరింత ఎక్కువయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ సోమవారం తెలిపింది. ఇప్పటికే రాష్ట్రంలోని 7 జిల్లాల్లో సోమవారం 39 నుంచి 41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో అగ్ని నక్షత్రం ప్రారంభం అయితే పరిస్థితి ఏంటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ముందు జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్రజలు ముఖ్యమైన పనులు ఉంటేనే బయటకు రావాలని లేకుండా ఇంటికి పరిమితం కావాలని అధికారులు సూచిస్తున్నారు.

మర్రిచెట్టు దగ్ధం

అన్నానగర్: పెరియకుళం సమీపంలో ఆదివారం సాయంత్రం హఠాత్తుగా 200 ఏళ్ల మర్రి చెట్టులో మంటలు చెలరేగాయి. తేని జిల్లా పెరియకుళం నుంచి సోత్తుప్పారై ఆనకట్టకు వెళ్లే దారిలో నందనవనం అనే ప్రదేశం ఉంది. ఇక్కడ సుమారు 200 ఏళ్ల నాటి మర్రిచెట్టు ఉంది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం చెట్టు కింద ఎండిపోయిన మొక్కలు, ఆకులకు గుర్తు తెలియని వారు నిప్పు పెట్టారు. అయితే మంటలు భారీగా వ్యాపించడంతో చెట్టు పైభాగంలో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకు పెరియకుళం అగ్నిమాపక శాఖ అధికారి ముత్తుసెల్వం ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సుమారు 2 గంటలపాటు శ్రమించి మంటలను ఆర్పారు.

మూడు ఇళ్లలో 86 సవర్ల నగలు చోరీ

తిరువొత్తియూరు: తంజై జిల్లాలో రైతు ఇంట్లో 70 సవర్ల నగలు చోరీ చేసిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. తంజై సమీపంలోని రెడ్డిపాళయం కామాక్షి నగర్‌కు చెందిన రైతు మదియళగన్, భార్య కస్తూరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కస్తూరి ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా కస్తూరి పని చేస్తోంది. అయితే ఆమెకు అనారోగ్యంగా ఉండడంతో ఆస్పత్రికి వెళ్లే సమయంలో కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి ఎదురు ఇంటిలో ఉంటున్న వారి వద్ద ఇచ్చి వెళ్లారు. 26వ తేదీ చెన్నైకి వెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కస్తూరి తల్లి శాంతి ఎదురింటిలో ఉన్న వారి వద్ద నుంచి తాళం తీసుకుని లోపలికి వెళ్లగా ఇంటి వెనుక వైపు ఉన్న తలుపులు పగులగొట్టబడి ఉన్నాయి. బీరువాలో ఉంచిన 70 సవర్ల నగలు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదేవిధంగా అదే ప్రాంతానికి చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి ఇంట్లో దుండగులు 16 సవర్ల నగలను చోరీ చేశారు. ఈ రెండు సంఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నారు.

కొలనులో మునిగి కవలలు మృతి



మృతి చెందిన కవలలు

అన్నానగర్: పుదుకోట్టై జిల్లా తిరుమయం సమీపంలోని రాంగియం ప్రాంతానికి చెందిన మణికంఠన్, భార్య అళగు దంపతులకు 13 ఏళ్ల కవల కుమార్తెలు సమిత, సహానా, మరో కుమార్తె యాషిని (9) ఉన్నారు. రంగియం ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో ఇద్దరు కవలలు 8వ తరగతి, యాషిని 4వ తరగతి చదువుతున్నారు. కొన్నయ్యూర్‌లో పంగుణిమాసం పొంగల్ పండుగ సందర్భంగా, ముగ్గురు పిల్లలు వారి తల్లితో కలిసి ఆదివారం తిరుమయం పక్కనే ఉన్న తలంపట్టిలోని బంధువుల ఇంటికి వచ్చారు. మధ్యాహ్నం 12.30 గంటలకు బంధువుల ఇంటి దగ్గర కొలనులో నీళ్లు నిలిచాయి. సమిత, సహానా స్నానం చేయడానికి వెళ్లారు. చాలాసేపు వరకు సమిత, సహానా తిరిగి రాకపోవడంతో బంధువులు వెతికారు. అప్పుడు నీటికుంటలో బకెట్ తేలింది. దీంతో అనుమానం వచ్చిన బంధువులు కొలనులో పిల్లల కోసం వెతికారు. అనంతరం కవల పిల్లలను మృతదేహాలుగా వెలికితీశారు. నామన సముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జింక మృతిపై అధికారుల విచారణ



మృతి చెందిన జింక

అన్నానగర్: తిరుచ్చి-చెన్నై జాతీయ రహదారిపై సమయపురం, సిరుగనూరులో పెద్ద ఎత్తున అటవీ ప్రాంతాలు ఉన్నాయి. కోతులు, జింకలు, నెమళ్లు ఇక్కడ అధికంగా ఉన్నాయి. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో అడవుల్లో నీటి వనరులు ఎండిపోయాయి. దీంతో నీటి కోసం అటవీ జంతువులు నగరంలోకి వస్తున్నాయి. ఈ స్థితిలో ఆదివారం సిరుగనూరు నుంచి దచ్చంగురిచ్చి-లాల్గుడి వెళ్లే రహదారిపై ఓ జింక అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆ ప్రాంతవాసులు అటవీశాఖ అధికారులకు, సిరుగనూరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

క్లుప్తంగా...

కేసీఆరూ.. ముందు సింగరేణి గురించి ఆలోచించు..

ఏపీ బీజేపీ

సాక్షి, అమరావతి: ప్రస్తుతం కేంద్ర పరిధిలో ఉన్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బిడ్డింగ్ దాఖలు చేయనున్నట్లు వస్తున్న కథనాలపై బీజేపీ ఆంధ్రప్రదేశ్ శాఖ తీవ్రంగా స్పందించింది. రాజకీయ గిమ్మిక్కులు చేయడం కేసీఆర్‌కు అలవాటేనని.. ముందు తెలంగాణ రాష్ట్రంలోని సింగరేణి సంస్థ ఎందుకు దివాళా తీస్తుందో ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వేటుకూరి సూర్యనారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి వేరుగా ఈ అంశంపై స్పందిస్తూ.. కేసీఆర్ తన స్వార్థ రాజకీయాల కోసం ఇంకెంత కాలం సెంటిమెంట్ రాజకీయాలు వాడుకుంటారని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ఆదుకోవడం కోసం కేంద్రం కోట్లాది రూపాయలు ఇచ్చిందని.. అదే పది వేల కోట్ల నష్టాల్లో ఉన్న సింగరేణి సంస్థను రక్షించేందుకు కేసీఆర్ ఆలోచిస్తే మంచిదని సలహా ఇచ్చారు. రాష్ట్రంలోని ఓ ప్రముఖ పారిశ్రామిక వేత్త త్వరలోనే బీజేపీలో చేరనున్నట్లు వేటుకూరి సూర్యనారాయణ చెప్పారు.

ఏపీ ప్రజలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

తెలంగాణ ఉద్యమ సమయంలో ఆంధ్రప్రాంత ప్రజలను అవమాన పర్చిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆంధ్ర ప్రజలకు క్షమాపణలు చెప్పిన తరువాత మాత్రమే ఈ రాష్ట్రంలో అడుగుపెట్టాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు బిడ్ వేస్తానన్న కేసీఆర్ బయ్యారం స్టీల్ ప్లాంట్ గురించి ఏనాడు నోరు మెదపలేదని పేర్కొన్నారు.

20 వరకు కేజీబీవీ ప్రవేశాలకు గడువు

- 352 కేజీబీవీల్లో 6, 7, 8 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి చర్యలు
- ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 352 కస్తూర్బా బాలికా విద్యాలయా (కేజీబీవీ)ల్లో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి 6, 7, 8 తరగతుల్లోని మిగులు సీట్ల భర్తీకి సమగ్ర శిక్ష ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. అనాథలు, బడిబయటి పిల్లలు, బడి మానేసిన వారు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాలకు చెందిన బాలికలు ఈ సీట్లకు అర్హులు. ఎంపికైన విద్యార్థినులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందిస్తారు లేదా సంబంధిత పాఠశాల నోటీసు బోర్డులో కూడా నేరుగా వివరాలు చూసుకోవచ్చు.

డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న చోట సమాంతరంగా మరో వాల్

యు ఆకారంలో నిర్మించి, పాత డయాఫ్రమ్ వాల్‌తో అనుసంధానం

- పోలవరం ప్రధాన డ్యామ్ వద్ద ఏర్పడిన అగాధాలను పూడ్చే పనులకూ లైన్ క్లియర్
- రూ.2022.05 కోట్లతో పరిపాలన అనుమతి
- ఉత్తర్వులు జారీ చేసిన జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి
- అదనపు వ్యయాన్ని భరిస్తామన్న కేంద్ర మంత్రి
- చంద్రబాబు వల్లే దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్, ప్రధాన డ్యామ్ వద్ద అగాధాలు
- పర్యవసానమే పోలవరం పనుల్లో జాప్యం, అదనపు వ్యయం
- చంద్రబాబు పాపాల వల్లే ఈ భారం అంటున్న అధికారులు



సాక్షి, అమరావతి: గోదావరి వరద ఉధృతికి పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యామ్ (ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్) వద్ద ఏర్పడిన నాలుగు భారీ అగాధాలు పూడ్చి వయబ్రో కాంపాక్షన్ ద్వారా యథాస్థితికి తేవడం, దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా మరో డయాఫ్రమ్ వాల్ నిర్మించి పటిష్టం చేసే పనులకు రూ.2022.05 కోట్లతో ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత చంద్రబాబు ప్రభుత్వం ప్రాజెక్టు పనులను సక్రమంగా చేపట్టకపోవడం వల్ల 2019లో వచ్చిన వరదలకు ప్రాజెక్టు పలు చోట్ల తీవ్రంగా దెబ్బతింది. ప్రధాన డ్యామ్‌తో పాటు దిగువ కాఫర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్‌ల వద్ద పెద్ద పెద్ద అగాధాలు ఏర్పడ్డాయి. దీనివల్ల ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యంతో పాటు అదనపు వ్యయమూ అవుతోంది. గోదావరి వరద ఉధృతికి ప్రధాన డ్యామ్ వద్ద ఏర్పడిన భారీ అగాధాల పూడ్చివేత, డయాఫ్రమ్ వాల్‌ను సరిదిద్దడానికి అయ్యే అదనపు వ్యయాన్ని భరిస్తామని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి షెకావత్ గత ఏడాది హామీ ఇచ్చారు. డీడీఆర్‌పీ, సీడబ్ల్యూసీ మార్గదర్శకాల ప్రకారం దిగువ కాఫర్ డ్యామ్‌లో దెబ్బ తిన్న ప్రాంతాలను ఇసుకతో నింపిన జియోమెంబ్రేన్ బ్యాగులతో పూడ్చి వయబ్రో కాంపాక్షన్ చేసి రాష్ట్ర ప్రభుత్వం యథాస్థితికి తీసుకువచ్చింది. ఆ తరువాత దిగువ కాఫర్ డ్యామ్‌ను 30.5 మీటర్ల ఎత్తుకు పూర్తి చేసింది.

నిపుణుల కమిటీతో అధ్యయనం చేయించి

ప్రధాన డ్యామ్ అగాధాల పూడ్చివేత, డయాఫ్రమ్ వాల్ భవితవ్యాన్ని తేల్చడానికి దేశంలో అత్యున్నత సంస్థలైన సీడబ్ల్యూసీ, ఎన్‌హెచ్‌పీసీ, ఐఐటీ నిపుణులతో 15 రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం మేధోమథనం చేయించింది. ఈ బృందం పోలవరం ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించి, చేపట్టాల్సిన పనులపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసింది. అగాధాలను ఇసుకతో పూడ్చి వయబ్రో కాంపాక్షన్ చేయాలని సూచించింది. ప్రధాన డ్యామ్ గ్యాప్–2లో 1,396 మీటర్ల పొడవున నిర్మించిన డయాఫ్రమ్ వాల్‌లో నాలుగు చోట్ల 30 శాతం మేర దెబ్బతిందని తేల్చింది. ఆ నాలుగు ప్రాంతాల్లో 'యు' ఆకారంలో కొత్తగా డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించి పాత దానికి అనుసంధానం చేయాలని ఆదేశించింది. ఈ పనులకు రూ.2022.05 కోట్లు వ్యయం అవుతుందని తేల్చింది. ఆ మేరకు పనులు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతిచ్చింది.

బాబు సర్కారు నిర్వాకమిదీ..

పోలవరంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్వాకాల వల్లే ఈ అదనపు భారం పడుతోందని అధికార వర్గాలే బాహాటంగా చెబుతున్నాయి. విభజన చట్టం ప్రకారం కేంద్రమే కట్టాల్సిన పోలవరం ప్రాజెక్టును కమీషన్ల కక్కుర్తితో చంద్రబాబు సర్కారే చేపట్టింది. అసలు చేపట్టాల్సిన పనులు చేపట్టలేదు. సులభంగా చేయగలిగే, అధికంగా లాభాలు వచ్చే పనులకే ప్రాధాన్యత ఇచ్చింది. గోదావరి వరదను మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, పైలెట్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండానే ప్రధాన డ్యామ్ పునాది, డయాఫ్రమ్ వాల్‌ను 2018 జూన్ నాటికి పూర్తి చేశారు. స్పిల్ వేను పునాది స్థాయిలోనే వదిలేశారు. స్పిల్ ఛానల్‌లో మాస్ కాంక్రీట్ పనులు చేశారు. అప్రోచ్ ఛానల్, పైలెట్ ఛానల్‌లో తట్టెడు మట్టి ఎత్తకుండానే 2018లో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులను ప్రారంభించారు. నిర్వాసితులకు పునరావాసంపై మాత్రం దృష్టి పెట్టలేదు.

భారీ నష్టం

గోదావరి నదికి 2019లో భారీ వరదలు వచ్చాయి. పోలవరం వద్ద 2,400 మీటర్ల వెడల్పుతో ప్రవహించాల్సిన గోదావరికి అంత జాగా లేకపోయింది. దిగువ కాఫర్ డ్యామ్‌లో ఖాళీ ప్రదేశం 800 మీటర్లకు కుంచించుకుపోయింది. దీంతో వరద ఉధృత్తి మరింత తీవ్రమై ప్రధాన డ్యామ్ వద్ద గరిష్టంగా 35 మీటర్లు, కనిష్టంగా 22 మీటర్లు లోతుతో ఇసుక తిన్నెలు కోతకు గురై నాలుగు చోట్ల భారీ అగాధాలు ఏర్పడ్డాయి. ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. దిగువ కాఫర్ డ్యామ్‌లో 0 నుంచి 600 మీటర్ల వరకు కోతకు గురై 36.5 మీటర్ల లోతుతో భారీ అగాధం ఏర్పడింది. ఇలా చంద్రబాబు నిర్వాకం వల్ల జరిగిన విధ్వంసంతో పోలవరం పనుల్లో జాప్యమే కాకుండా, అదనపు వ్యయాన్నీ భరించాల్సి వస్తోంది.

టెండర్లకు రంగం సిద్ధం

గోదావరికి వరదలు వచ్చేలోగా ప్రధాన డ్యామ్ వద్ద ఏర్పడిన భారీ అగాధాలను పూడ్చివేత, డయాఫ్రమ్ వాల్‌ను పటిష్టవంతం చేసే పనులను పూర్తి చేయాలని కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి పంకజ్ కుమార్ ఆదేశించిన నేపథ్యంలో తక్షణమే ఆ పనులు చేపట్టడానికి టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాలని జలవనరుల శాఖ అధికారులు నిర్ణయించారు. నిబంధనల మేరకు లంసం ఓపెన్ విధానంలో టెండర్లకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. యుద్ధప్రాతిపదికన టెండర్లను ఖరారు చేసి రివర్స్ టెండరింగ్‌లో తక్కువ ధరకు కోట్ చేసిన కాంట్రాక్టు సంస్థకు పనులు అప్పగించనున్నారు.

పునరావాసంపై బాబు చేతులెత్తేసి..

ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మిస్తే తామంతా ముంపునకు గురవుతామని, పునరావాసం కల్పించాలని 103 గ్రామాల ప్రజలు సీడబ్ల్యూసీని ఆశ్రయించారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని సీడబ్ల్యూసీ ఆదేశించింది. కమీషన్ల కోసం నిర్మాణాన్ని నెత్తికెత్తుకున్న చంద్రబాబు సర్కారు.. నిర్వాసితులకు పునరావాసం కల్పించలేక చేతులెత్తేసింది. ఎగువ కాఫర్ డ్యామ్‌కు కుడి, ఎడమ వైపు 400 మీటర్ల చొప్పున, దిగువ కాఫర్ డ్యామ్ కుడి వైపున 600 మీటర్లు ఖాళీ ప్రదేశాలను వదిలేసింది. దీంతో గోదావరి ప్రవాహానికి అడ్డంకులేర్పడ్డాయి.

పోలవరం పనులు భేష్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రధాన (ఎర్త్ కమ్ రాక్‌ఫిల్) డ్యామ్ పనులను పూర్తి చేయొచ్చని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పనుల ప్రగతి, ముంపు ప్రభావంపై సోమవారం ఢిల్లీలో పంకజ్ కుమార్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం, రాష్ట్ర జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ నారాయణ రెడ్డి, పీపీఏ సీఈవో శివనందన్ కుమార్, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుష్విందర్ వోరా తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్టు పనుల ప్రగతిని పీపీఏ, రాష్ట్ర జల వనరులు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

సవరించిన అంచనాలకు సానుకూలం

ప్రాజెక్టును పూర్తి చేయాలంటే సీడబ్ల్యూసీ ఆమోదించిన సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లను విడుదల చేయాలని రాష్ట్ర అధికారులు కోరారు. ప్రాజెక్టు ఎఫ్‌ఆర్‌ఎల్ 45.72 మీటర్ల వరకు ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో 8 మండలాల్లోని 373 గ్రామాలు ముంపునకు గురవుతాయని, 1,06,006 కుటుంబాలకు పునరావాసం కల్పించాలని 2017–18 సవరించిన అంచనాల్లో పేర్కొన్నామని చెప్పారు. కానీ మరో 36 గ్రామాలు కూడా ముంపు పరిధిలోకి వస్తాయని, ఆ గ్రామాల్లో నిర్వాసితులకూ పునరావాసం కల్పించాలని కోరారు. దీనిపై పంకజ్ కుమార్ సానుకూలంగా స్పందించారు. నిర్వాసితులందరికీ పునరావాసం కల్పించాల్సిన బాధ్యత కేంద్రానిదేనని స్పష్టం చేశారు. 45.72 మీటర్ల పరిధిలోకి వచ్చే ముంపు గ్రామాల్లో లైడార్ సర్వే చేసి, నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయడానికి సహకరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌లకు వినతి పత్రాలు ఇచ్చారన్నారు. తొలుత 41.15 మీటర్ల వరకు, ఆ తరువాత 45.72 మీటర్ల వరకు ప్రాజెక్టు పూర్తి చేయాలంటే ఎంతెంత నిధులు అవసరమో నివేదిక ఇవ్వాలని సీడబ్ల్యూసీ చైర్మన్ వోరాను ఆదేశించారు. ప్రాజెక్టు సత్వర పూర్తికి అడ్‌హాక్‌గా రూ.10 వేల కోట్లు విడుదల చేయాలని సీఎం జగన్ చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని నివేదిక ఇవ్వాలని చెప్పారు. ఈ నిధులు ఎంత అవసరమో తేల్చడానికి పీపీఏ, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులతో నాలుగు రోజుల్లో సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా సమావేశం కానున్నారు.

బ్యాక్ వాటర్ ప్రభావం ఉండదు

ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల తమ రాష్ట్రాల్లో భూమి ముంపునకు గురవుతోందని సుప్రీం కోర్టులో తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు దాఖలు చేసిన కేసుపై సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. గోదావరికి 50 లక్షల క్యూసెక్కుల వరద వస్తుందన్న అంచనాతో సీడబ్ల్యూసీ సర్వే చేసిందని, అందులో బ్యాక్ వాటర్ ప్రభావం ఏ మాత్రం ఉండదని వెల్లడైందని అధికారులు వివరించారు. సుప్రీం కోర్టు నియమించిన గోపాలకృష్ణన్ కమిటీ కూడా ఇదే చెప్పిందన్నారు. సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్ మేరకే ప్రాజెక్టు నిర్మిస్తున్నామని చెప్పారు. దీనిపై పంకజ్‌కుమార్ స్పందిస్తూ సుప్రీం కోర్టుకు కేంద్రం తరఫున చెప్పాల్సిన అంశాలను స్పష్టం చేస్తామన్నారు.

ఈ నెలాఖరులోగా పోలవరానికి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి

ప్రాజెక్టు పనులను పరిశీలించేందుకు ఈ నెలాఖరులోగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పోలవరం వస్తారని వెదిరె శ్రీరాం చెప్పారు. ప్రాజెక్టుకు అవసరమైన నిధులను ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంటుందన్నారు. దీనిపై పంకజ్‌కుమార్ స్పందిస్తూ విభజన చట్టం ప్రకారం ప్రాజెక్టులో నీటి పారుదల విభాగం వ్యయం మొత్తాన్ని భరించాల్సిన బాధ్యత కేంద్రానిదేనని పునరుద్ఘాటించారు. ఆ మేరకు నిధులు విడుదల చేస్తామని చెప్పారు.

తెలంగాణ

పొంగులేటి, జూపల్లి సస్పెన్షన్

బీఆర్‌ఎస్ కేంద్ర కార్యాలయం ప్రకటన

సాక్షి, హైదరాబాద్: సుదీర్ఘకాలంగా అసమ్మతి స్వరాన్ని వినిపిస్తున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఖమ్మం లోక్‌సభ మాజీ సభ్యుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డిని భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున, పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఇద్దర్నీ పార్టీనుంచి సస్పెండ్ చేస్తున్నట్లు సోమవారం నాటి ఆ ప్రకటనలో పేర్కొంది. కొత్తగూడెంలో ఆదివారం జరిగిన 'అభిమానుల ఆత్మీయ సమ్మేళనం'లో పొంగులేటి, జూపల్లి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ అధినేత సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీవర్గాలు వెల్లడించాయి. 'తప్పులు చేశారు.. శిక్ష తప్పదు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేదు. ప్రభుత్వం వల్ల ఇబ్బంది పడుతున్న వారు ఏకమవుతున్నారు..' అంటూ పొంగులేటి, కేసీఆర్‌లో నిజాయితీ లోపించిందంటూ జూపల్లి విమర్శించారు.

జీ-20తో అంతర్జాతీయ స్థాయిలో విశాఖ ప్రతిష్ట...

రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం..

- పారదర్శకంగానే నగర సుందరీకరణ పనులు జరిగాయి
- అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేయడం తగదు...
- జీవీఎంసీ అంచనా వ్యయం రూ. 111 కొట్లు కాగా ..రూ. 83 కోట్లతో సుందరీకరణ...
- అవినీతి అంటూ ప్రతిపక్ష కార్పొరేటర్లు చేస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నా...
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగానే టెండర్ ప్రక్రియను బహిరంగంగా ప్రకటించలేదు..
- నిర్మాణ పనులు అన్నీ ప్రొసీజర్ ప్రకారమే జరిగాయి...
- మీడియా సమావేశంలో జీవీఎంసీ మేయర్ హరివెంకట కుమారి వెల్లడి.

సాక్షి, విశాఖపట్నం: జీ–20 సదస్సుతో అంతర్జాతీయ స్థాయిలో విశాఖ ప్రతిష్ట పెరిగిందని జీవీఎంసీ మేయర్ హరివెంకట కుమారి కొనియాడారు. సోమవారం మద్దిలపాలెంలో గల వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు.

జీవీఎంసీ మేయర్ హరివెంకట కుమారి మాట్లాడుతూ....రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో జీ–20 సదస్సు పేరిట నగర సుందరీకరణలో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలు జీవిఎంసీ చేపట్టిందన్నారు. ఇలా అభివృద్ధి జరిగితే కొందరు ప్రతిపక్ష కార్పొరేటర్లు అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మొత్తం రూ.111 కోట్ల అంచనా వ్యయంలో నగర సుందరీకరణకు రూ.83 కోట్లు వరకు ఖర్చుచేస్తే...రూ.100 కోట్లు అవినీతి జరిగిందని పిచ్చి ఆరోపణలు చేస్తున్నారన్నారు. వీలైతే అభివృద్ధికి సహకరించండి..లేదంటే మౌనంగా ఉండండి..లేనిపోని ఆరోపణలు చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రతీ పైసా లెక్క చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని... అభివృద్ధిపై ఆరోపణలు మానుకోవాలని హితవుపలికారు.

జీవీఎంసీ డిప్యూటీ మేయర్ సతీష్ మాట్లాడుతూ...విశాఖ నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. అందులో భాగంగానే జీ–20కి జీవీఎంసీ విశాఖ నగరాన్ని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అభివృద్ధి చేసినా కొందరు బ్లాక్ మెయిల్ పొలిటీషియన్స్ ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. జనసేన కార్పొరేటర్ పితాల మూర్తి యాదవ్ అనేవాడు ఒక ప్యాకేజీ కార్పొరేటర్. బ్లాక్‌మెయిల్ రాజకీయం చేయడం..పనులు చేసే కాంట్రాక్టర్ ను బెదిరించి డబ్బులు తీసుకున్న ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. అధికారులపై తప్పుడు ఆరోపణలు చేస్తూ.. డబ్బులు డిమాండ్ చేయడం..డబ్బులు ఇవ్వకపోతే కోర్టు లో కేసులు వేయడం ఇదే ఆయన పని అని విమర్శించారు. జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ కేవలం పబ్లిసిటీ కోసమే లేనిపోని ఆరోపణలు చేస్తూ..మీడియా ముందు హంగామా చేస్తుంటాడని పేర్కొన్నారు. ఇప్పటికైనా బ్లాక్ మెయిల్ రాజకీయాలు మానుకుని మంచిగా ఉంటే ప్రజలు ఆదరిస్తారు. లేదంటే విశాఖ నగర ప్రజలంతా తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

.జీవీఎంసీ వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్ మాట్లాడుతూ...జనసేన కార్పొరేటర్ పితాల మూర్తి యాదవ్ చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయనది క్రిమినల్ బ్రెయిన్. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇలాంటి వ్యక్తిని ఎలా దగ్గర ఉంచుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. ఇలా అసత్య ఆరోపణలు చేసే వారిని భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. జీవీఎంసీ 83 కోట్ల రూపాయిలుతో పనులు చేస్తే అందులో 100 కోట్లు అవినీతి జరిగిందని అనడం దారుణమని, 100 కోట్లు అవినీతి జరిగిందని అంటున్న పితాల మూర్తి యాదవ్ పై సుమోటో గా కేసు నమోదు చేయాలని కోరారు. జీవీఎంసీ కౌన్సిల్ నుంచి పీతల మూర్తి యాదవ్ ని శాశ్వతంగా తొలగించాలని మేయర్, జీవిఎంసీ కమీషనర్‌ని కోరుతున్నామన్నారు. ఇలాంటి వ్యక్తుల వలన విశాఖ ప్రతిష్టకు భంగం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

మూడు బిల్లులకు ఓకే.. రెండు రాష్ట్రపతికి..

- మరో రెండు వెనక్కి, మూడు మాత్రమే పెండింగ్‌లో..
- గవర్నర్ తరఫున సుప్రీంకోర్టుకు వెల్లడించిన సొలిసిటర్ జనరల్
- వివరాలను నమోదు చేసుకున్న న్యాయమూర్తి
- విచారణ ఏప్రిల్ 24వ తేదీకి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ గవర్నర్ తన వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లుల్లో మూడింటిని ఇప్పటికే ఆమోదించారని, రెండు బిల్లులను రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారని సుప్రీంకోర్టుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. మరో రెండింటిపై రాష్ట్ర ప్రభుత్వ వివరణకోరుతూ వెనక్కి తిప్పి పంపారని, ఇంకో మూడు బిల్లులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. శాసనసభ ఆమోదించి పంపిన బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టారంటూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. తెలంగాణ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే అందుబాటులో లేని కారణంగా.. విచారణ వాయిదా వేయాలని జూనియర్ న్యాయవాది ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. అయితే గవర్నర్ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వర్చువల్‌గా హాజరుకావడంతో వాదనలు వినిపించాలని ధర్మాసనం సూచించింది. గవర్నర్ నుంచి తనకు అందిన వివరాలను కోర్టుకు సమర్పిస్తున్నట్టు తుషార్ మెహతా తెలిపారు. 'శాసనసభ గతేడాది సెప్టెంబరులో పాస్ చేసిన కొన్ని బిల్లులు ఉన్నాయి కదా.. వాటిపై తుది నిర్ణయం ఏమైనా గవర్నర్ కార్యాలయం నుంచి అందిందా?' అని చీఫ్ జస్టిస్ ప్రశ్నించగా.. ఈ అంశాలపై ప్రస్తుతం తానేమీ చెప్పలేనని తుషార్ మెహతా వివరించారు. ఈ క్రమంలో ధర్మాసనం.. సొలిసిటర్ జనరల్ అందజేసిన వివరాలను రికార్డుల్లోకి తీసుకుంటున్నామని పేర్కొంటూ, తెలంగాణ తరపు న్యాయవాది విజ్ఞప్తి మేరకు విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు తెలిపింది.

సొలిసిటర్ జనరల్ కోర్టుకు ఇచ్చిన వివరాలివీ..

''మూడు బిల్లులు.. తెలంగాణ మోటారు వాహనాల పన్ను సవరణ బిల్లు–2022, తెలంగాణ మున్సిపాలిటీస్ చట్ట సవరణ బిల్లు–2023, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం చట్ట సవరణ బిల్లు–2023లను గవర్నర్ ఆమోదించారు. యూనివర్సిటీ ఆఫ్ ఫారెస్ట్రీ తెలంగాణ బిల్లు–2022, తెలంగాణ విశ్వవిద్యాలయాల ఉమ్మడి రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లు–2022.. ఈ రెండింటిని రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపివేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు విశ్వవిద్యాలయాలు (స్థాపన, నియంత్రణ) సవరణ బిల్లు–2022, తెలంగాణ మున్సిపల్ చట్టాల సవరణ బిల్లు–2022, తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (వయసు నియంత్రణ, పదవీ విరమణ) సవరణ బిల్లు–2022 గవర్నర్ క్రియాశీల పరిశీలనలో ఉన్నాయి. తెలంగాణ పంచాయతీరాజ్ సవరణ బిల్లు–2023కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి గవర్నర్ వివరణ కోరారు. ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా (టర్మినేషన్, రెగ్యులేషన్ ఆఫ్ లీజు) సవరణ బిల్లు–2022కు న్యాయ విభాగం నుంచి వివరణపై స్పందన రాలేదు'' అని కోర్టుకు సొలిసిటర్ జనరల్ తెలిపారు.

నేడు పోలమాంబ మారువారం పండుగ

15న మహాన్నదానం



ఏయూక్యాంపస్: శ్రీ పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర అనంతరం నిర్వహించే మారువారం పండుగ మంగళవారం జరగనుంది. పండగ అనంతరం వచ్చే మంగళవారాన్ని మారువారంగా నిర్వహిస్తారు. సాధారణ పండుగతో సమానంగా మారువారం పండుగను నిర్వహిస్తారు. నేడు కూడా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకోనున్నారు. దీనికి అనుగుణంగా ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన అన్నిచర్యలు చేస్తున్నారు. అదే విధంగా ఈ నెల 15వ తేదీన ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానం చేయనున్నారు.

గల్ఫ్ దేశాల్లో ఉపాధి కల్పనకు శిక్షణ

- తిరుపతి జిల్లా కలెక్టర్
- ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోండి...
- 18–45 ఏళ్ల మహిళలకు మాత్రమే
- ఎంపికైన వారికి తిరుపతిలోనే శిక్షణ..

తిరుపతి అర్బన్: గల్ఫ్ దేశాలలో ఉపాధి అవకాశాలకు సంబంధించి హౌస్ కీపింగ్, కుకింగ్ తదితర పనులు చేపట్టడానికి ప్రభుత్వమే శిక్షణ ఇవ్వడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించడానికి దరఖాస్తులు చేసుకోవచ్చునని సోమవారం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. 18–45 ఏళ్ల వయస్సు ఉన్న మహిళల నుంచి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ దరఖాస్తులు కోరుతోందని వివరించారు. మహిళలు ఉపాధి కొరకు నకిలీ ఎజెంట్ల మోసాల వలలో చిక్కుకుని సరైన అర్హతలు పత్రాలు లేకుండా విదేశాలకు వెళ్లి అక్కడి చట్టాలు తెలియక మోసపోయి ఇబ్బందులు పడుతున్న విషయం గమనించిన రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని తెలిపారు.ఈ కార్యక్రమం లో భాగంగా రాష్ట్రంలో మూడు చోట్ల తూర్పు, పశ్చిమ గోదావరి,కడప జిల్లాలో హౌస్ కీపింగ్, కుకింగ్ మరియు కేర్ టేకర్ అంశాలపై శిక్షణ ప్రారంభించిందని వెల్లడించారు.ఈ శిక్షణ లో భాగముగా విదేశాలలో అనుసరించే మత పరమైన సంస్కృతులు, వారి పద్ధతులు, అలవాట్లు విధానాలతో పాటు ఆయా దేశాల చట్టాల గురించి అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.శిక్షణ అనంతరం వీరికి గల్ఫ్ దేశాలలో ఉపాధి చూపించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధి పొందడానికి వెళ్లిన ఉద్యోగి కి అక్కడ జీత భత్యాలలో మరియు పని చేసే విషయంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తిన సందర్భంలో భారత రాయబార కార్యాలయం భాధ్యత తీసుకుని వహిస్తుంది. వారికి తగిన సహాయం అందిస్తుంది.5 వ తరగతి చదివి ఉండాలి,చదవడం రాయడం తెలిసి ఉండాలి, వయసు 18– 45 ఉండాలి.మహిళలు కు మాత్రమే ఈ శిక్షణ.ఆసక్తి కలిగిన యువతీ యువకులు క్రింద ఇచ్చిన మొబైల్ 7675827308 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.శిక్షణకు ఎంపిక కాబడిన అభ్యర్థులకు తిరుపతి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ వారిచే శిక్షణ ఇస్తారని వెల్లడించారు.

ఇంతకాలం ఎందుకు స్పందించలేదు

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మల్లయ్య పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఎన్నికల కేసులో మూడేళ్లు గడిచినా హైకోర్టులో విచారణకు స్పందించకుండా, ఇక్కడకెందుకు వచ్చారంటూ మల్లయ్య యాదవ్ పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. 2018 కోదాడ అసెంబ్లీ ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లో మల్లయ్య యాదవ్ ఆస్తుల వివరాలు సరిగా వెల్లడించలేదంటూ కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ 2019 డిసెంబర్ నుంచి 2020 మార్చి వరకూ పలుసార్లు విచారణకు వచ్చినా యాదవ్ తరపు న్యాయవాదులు హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో కౌంటరు దాఖలు చేయడానికి వీలు లేకుండా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో హైకోర్టులో తన వివరణ ఇచ్చుకొనే అవకాశం కల్పించాలంటూ మల్లయ్య యాదవ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను సోమవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలాలతో కూడిన ధర్మాసనం విచారించింది. మల్లయ్య యాదవ్ తరపు సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.. హైకోర్టులో వివరణ ఇవ్వడానికి అవకాశం ఇవ్వాలని, కౌంటరు దాఖలు చేస్తామని తెలిపారు. అయితే పలుసార్లు అవకాశమిచ్చినా కోర్టుకు హాజరుకాలేదని పద్మావతి తరపు సీనియర్ న్యాయవాది రవిశంకర్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మూడేళ్ల నుంచి ఏంచేస్తున్నారని పిటిషనర్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. హైకోర్టులో ఎందుకు సమాధానం చెప్పలేదంటూ అసహనం వ్యక్తం చేసింది. విచారణలో జోక్యం చేసుకోబోమంటూ పిటిషన్‌ను కొట్టేసింది.

గంట సేపు ఈటల విచారణ

టెన్త్ ప్రశ్నపత్రం లీక్ కేసులో..

వరంగల్ క్రైం: పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో బీజేపీ నేత, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సోమవారం వరంగల్ కమిషనరేట్ పోలీసుల ఎదుట హాజరయ్యారు. ఉదయం 12.30 గంటలకు బీజేపీ లీగల్ సెల్ న్యాయవాదులతో కలిసి కమిషనరేట్‌లోకి వెళ్లిన ఈటల.. గంట తర్వాత మధ్యాహ్నం 1.30 గంటలకు బయటికి వచ్చారు. సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ చాంబర్‌లో ఈటల రాజేందర్‌ను పోలీసు అధికారులు ప్రశ్నించారు. ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో నిందితులతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా? నిందితుల నుంచి వాట్సాప్‌లో వచ్చిన ప్రశ్నపత్రాలను ఏం చేశారు? అనే అంశాలపై వారు ఆరా తీసినట్లు తెలిసింది. ఫోన్ ఇవ్వాలని వారు ఈటలను కోరగా ఆయన ఇవ్వలేదని తెలిసింది. కానీ ఈటల పీఏ చైతన్య ఆ ఫోన్‌ను ఓపెన్ చేసి అధికారులకు చూపించినట్టు సమాచారం. నిందితుడు మహేశ్ పంపించిన పేపర్‌కు సంబంధించిన మెసేజీను ఓపెన్ చేయడంగానీ, డౌన్‌లోడ్ చేయడంగానీ జరగలేదని వివరించినట్టు తెలిసింది.

బిల్లుల ఆమోదంలో గవర్నర్‌కు కాలపరిమితి నిర్ణయించాలి

తమిళనాడు అసెంబ్లీ తీర్మానం

సాక్షి, చెన్నై: చట్టసభల్లో ఆమోదించిన బిల్లులు, తీర్మానాలను ఆమోదించేందుకు గవర్నర్‌కు కాల పరిమితిని నిర్ణయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని, రాష్ట్రపతిని కోరుతూ సోమవారం తమిళనాడు అసెంబ్లీ తీర్మానం చేసింది. రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వం, గవర్నర్ ఆర్‌ఎన్ రవి మధ్య తరచూ విభేదాలు తలెత్తుతున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. అన్నాడీఎంకే వాకౌట్ చేయడంతో ఓటింగ్ ద్వారా ఈ తీర్మానాన్ని ఆమోదించారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ మాట్లాడుతూ రాజ్ భవన్‌ను రాజకీయ భవన్‌గా మార్చేశారని, గవర్నర్ రాజకీయ నేత మాదిరిగా వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. ప్రభుత్వ విధానాలు, ప్రజల మనోభావాలు, అసెంబ్లీ సార్వభౌమాధికారం, తమిళ ప్రజల ప్రయోజనాల కోసం ఆమోదించిన బిల్లులను బహిరంగంగా కించపరిచేలా గవర్నర్ వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. భారత రాజ్యాంగం కంటే బీజేపీకే ఆయన విశ్వాసపాత్రుడిగా ఉంటున్నారంటూ స్టాలిన్ మండిపడ్డారు. రాష్ట్రానికి ఇటీవల ప్రధాని మోదీ రాక సందర్భంగా గవర్నర్ ప్రభుత్వ వ్యతిరేక వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ప్రారంభంలో అసెంబ్లీ వేదికగా ప్రభుత్వ ప్రసంగంలోని అనేక అంశాలను గవర్నర్ పక్కన పెట్టడం వివాదానికి దారి తీసింది. ఈ సమయంలో ఆయనకు వ్యతిరేకంగా అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం చేసి తన నిరసన తెలిపింది. కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వ తీర్మానాలన్నింటినీ అసెంబ్లీకే గవర్నర్ పరిమితం చేస్తూ వస్తున్నారు.

చదువు, ఉద్యోగం మాత్రమే కాదు ఇష్టమైన కళను సాధన చేస్తూ,
దాని ద్వారా ప్రశంసలు పొందడం ఎప్పుడూ నలుగురిలో ప్రత్యేకంగా నిలబెడుతుంది.
చదువుకుంటూ, ఉద్యోగాలు చేసుకుంటూ
సంగీతంతో తమ ప్రతిభను వేదికల మీద నిరూపించుకుంటూ
యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు యుతి, లాస్యప్రియ, మానస, సౌజన్య.
కలలను సాధించుకోవాలంటే భయాలను అధిగమించాలని
సమయాన్ని సరిగ్గా వినియోగించుకోవాలని
అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెబుతున్న
ఈ యువతరం ఇటీవల హైదరాబాద్‌లోని
ఓ సంగీత కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా తమ పాటలాసక్తిని మాటలుగా మన ముందుంచారు.



నచ్చిన కళలలో ఇష్టంగా...

సౌజన్య బీటెక్ పూర్తి చేసింది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ జాబ్ చేసింది. సంగీతంలోనూ తనదైన ముద్ర వేస్తోంది.

బ్యాలెన్స్ చేసుకోవాలి

లాస్యప్రియది తెలంగాణలోని సిద్ధిపేట. బీటెక్ పూర్తయ్యాక డేటా సైన్స్ జాబ్ చేస్తోంది. గాయనిగానూ రాణిస్తోంది.

‘స్కూల్ రోజుల్లోనే టీవీ షోలలో పాడే అవకాశాలు వచ్చాయి. ముందు సీరియస్‌గా అనుకోలేదు. కానీ, నాకు ప్రతీ మాట పాటలా వచ్చేది. అలా, సంగీతానికి దగ్గరయ్యాను. అలాగని, చదువును దూరం పెట్టలేదు.



చదువు పూర్తయ్యాక ఉద్యోగం చేస్తున్నాను. ఆరుగురం స్నేహితులం కలిసి మ్యూజిక్ బ్యాండ్ ఏర్పాటు చేశాం. మా బ్యాండ్‌తో వారాంతాల్లో ప్రదర్శనలు ఇస్తుంటాం. నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి నిరంతర సాధన ఉంటుంది. ఉద్యోగం, ఇష్టమైన గాత్ర సాధనకు, మ్యూజిక్ బ్యాండ్, ప్రదర్శనలకి టైమ్ బ్యాలెన్స్ చేసుకుంటున్నాను.

- లాస్య ప్రియ

ఛాలెంజింగ్‌గా తీసుకోవాలి



‘ముందు చదువుకే ప్రాధాన్యత ఇస్తూ వచ్చాను. తర్వాత శాస్త్రీయ సంగీతం, నృత్యం అమ్మనాన్నల ద్వారా పరిచయం అయ్యింది. మా ఫ్యామిలీ ఈవెంట్స్ నుంచి బయట కూడా ప్రదర్శనలు ఇచ్చేదాన్ని. ఐదేళ్ల నుంచి టీవీ షోలలో పాల్గొంటున్నాను. కళలను సాధన చేసే క్రమంలో చదువు వెనకబడుతుంది అంటుంటారు కానీ, ఆర్ట్‌లో ఉంటే చదువులో మరింత బాగా రాణించవచ్చు. మొదట స్టేజ్ అంటే చాలా భయమేసేది. పాటలు, నృత్యం వల్ల ఆ భయం పోయింది. బాస్కెట్‌బాల్, జిమ్నాస్టిక్స్‌లో జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నాను. అన్నింటిలోనూ చాలాసార్లు భయపడిన సందర్భాలు ఉన్నాయి. కానీ, వాటిని అంతే ఛాలెంజింగ్‌గా ఎదుర్కోవడం అలవాటైపోయింది. దీంతో చదువు, ఉద్యోగం, సంగీతం, నృత్యం, క్రీడలు అన్నింటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ వెళుతున్నాను.

- మానస సాయిశేషు

మానస సాయి శేషుది కాకినాడ. హైదరాబాద్ బిట్స్ పిలానీలో ఎమ్‌టెక్ చదువుతూనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. శాస్త్రీయ సంగీతం, కూచిపూడి నృత్యంలోనే కాదు క్రీడాకారిణిగా కూడా తన ప్రతిభను చాటుతోంది.

మనల్ని మనమే నిరూపించుకోవాలి

‘మా చిన్నతనంలో తాతగారి ఊళ్లో ఉన్నప్పుడు పద్యాలతో అంత్యాక్షరి చేసేవాళ్లం. అలా నాకు పాటలు, సంగీతంపై ఇష్టం కలిగింది. దీంతో చదువుతోపాటు సంగీతాన్ని కూడా సాధన చేశాను. సినిమాలకు చిన్న చిన్న ట్రాక్స్ పాడాను. అలాంటి సమయంలోనే అర్జున్ రెడ్డి సినిమాలో పాట పాడే అవకాశం కూడా లభించింది. ఆన్‌లైన్-ఆఫ్‌లైన్‌లలో మ్యూజిక్ క్లాసులు తీసుకుంటుంటాను. డిజిటల్ మీడియాలో నా సాంగ్ ట్రాక్స్ అప్‌లోడ్ చేస్తుంటాను. టీవీ మాధ్యమాల ద్వారా ఏ చిన్న అవకాశం వచ్చినా వదులుకోకుండా నన్ను నేను ప్రూవ్ చేసుకుంటున్నాను.

- సౌజన్య భాగవతుల

సాంత్వన కలిగించాలి

బెంగళూరులో ఉంటున్న యుతి డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. స్కూల్ ఏజ్ నుంచే సంగీతం సాధన చేస్తుంది. సాంగ్‌రైటర్‌గా తనని తాను నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తోంది.

‘పన్నెండేళ్లుగా శాస్త్రీయ సంగీతం నేర్చుకుంటున్నాను. వెస్ట్రన్ మ్యూజిక్‌తో కంటెంపరరీ సాంగ్స్ క్రియేట్ చేయడం ఇష్టం. తమిళ మూవీస్‌కి కొన్ని ట్రాక్స్ పాడాను. అవి వచ్చే నెలలో రిలీజ్ అవుతాయి. అవకాశాలు మన కోసం రావు. వాటికోసం ప్రయత్నమూ చేయాలి. నేను చదువుతున్నది సైకాలజీ సబ్జెక్ట్. సంగీతంతో మనసులకు సాంత్వన కలిగించవచ్చు అనే ఆలోచనతోనే నా చదువుకు పాటను జతగా చేర్చుతున్నాను. హిందీ సాంగ్ రైటర్‌గా రాణించాలని కృషి చేస్తున్నాను. ఈవెంట్స్‌లో పాడుతుంటాను. టీవీ షోలలోనూ పాల్గొన్నాను. అన్నివేళలా నన్ను నేను నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తుంటాను.

- యుతి హర్షవర్ధన్



- నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

కిచెన్ టిప్స్

కూర మాడినప్పుడు ఆ మాడిన గ్రేవీలో టీ స్పూన్ పీనట్ బటర్ వేస్తే మాడిన వాసన చిటికెలో మాయం అవుతుంది. ఒకవేళ పీనట్ బటర్ అందుబాటులో లేకపోతే మాడిన గిన్నెను స్టవ్ మీదినుంచి దించి నీళ్లు ఉన్న ఒక వెడల్పాటి పాత్రలో కాసేపు ఉంచితే సరి.



డీప్‌ఫ్రై చేసిన ఆయిల్‌లో మడ్డి పేరుకుని మరోసారి వాడడానికి వీలుపడదు. ఇలాంటప్పుడు నూనెను వడగట్టే గరాటులో పలుచటి వస్త్రం వేసి నూనెను వడగట్టాలి. ఇలా చేస్తే మడ్డి అంతా వస్త్రానికి అతుక్కుని స్వచ్ఛమైన నూనె కిందకు దిగుతుంది.



యాలకుల తొక్కలను పంచదార డబ్బాలో వేసి నిల్వ చేస్తే పంచదార యాలకుల సువాసనలు వెదజల్లుతుంది. ఆ పంచదారను కాఫీలో మినహా టీలో లేదా మరి ఏ ఇతర వంటకంలో వేసినా దాని రుచి మరింత పెరుగుతుంది.



కాదేదీ బిజినెస్‌కు అనర్హం



● రెంజిని థామస్

‘కుక్కపిల్ల అగ్గిపుల్ల సబ్బు బిళ్ల...
కావేదీ కవితకనర్హం అన్నారు శ్రీశ్రీ
కుక్కపిల్ల, అగ్గిపుల్లల సంగతేమిటోగానీ వృథాగా పడి ఉన్న ఖాళీ సీసాలు మాత్రం తమ విలువ తెలుసుకోమన్నాయ్! మరి రెంజిని కళాహృదయం ఊరుకుంటుందా!

ఎన్నెన్నో కళాకృతులను సృష్టించి పాత వస్తువులకు కొత్త శోభను తీసుకువచ్చింది. తన అభిరుచిని వ్యాపారంగా మలిచి విజయం సాధించింది 35 సంవత్సరాల రెంజిని థామస్....

దుబాయ్‌లో ఎం.బి.ఎ. ఫైనాన్స్ చదువుకున్న రెంజిని ఆ రంగంలో కాకుండా మీడియా ఫీల్డ్‌లో పనిచేసింది. 2015లో స్వరాష్ట్రం కేరళకు వచ్చిన రెంజినికి వివాహం అయింది. ‘9 టు 5’ షెడ్యూల్ బోర్ కొట్టడం వల్ల మళ్లీ ఉద్యోగం చేయాలనిపించలేదు. ఖాళీ సమయాన్ని తన ఇష్టమైన పెయింటింగ్‌తో గడిపేది. స్వస్థలం కొచ్చిలో తన పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి ఆర్ట్ లవర్స్‌తో ఒక కమ్యూనిటీని ఏర్పాటు చేసింది. భర్త కూడా ఆర్టిస్ట్ కావడం వల్ల ఇంటినిండా ఆర్ట్ ముచ్చట్లే!



బయటకు వెళ్లినప్పుడు రెంజినికి ఎక్కడ పడితే అక్కడ వృథాగా పడి ఉన్న గాజు సీసాలు కనిపించేవి. భర్త నిర్వహించే ‘సౌండ్ స్టూడియో’కు పాత సంగీత పరికరాలను కొనుగోలు చేయడానికి పాత వస్తువులు అమ్మే ఒక దుకాణానికి వెళ్లింది. అక్కడ వృథాగా పడి ఉన్న ఖాళీ సీసాలు కనిపించాయి. ఆ సమయంలో తనలోని కళాహృదయం నిద్రలేచింది! సీసాలతో పాటు పాత టైర్ రిమ్స్, బకెట్లు, గ్లాసులు.. మొదలైనవి సేకరించడం ప్రారంభించింది రెంజిని.

ఒక ఫైన్ మార్నింగ్ వాటితో ఆర్ట్ మొదలు పెట్టింది. వృథా వస్తువులతో కొన్ని హోమ్‌డేకర్ ఐటమ్స్ తయారుచేసి ఫ్రెండ్స్‌కు బహుమతిగా ఇచ్చింది.‘అద్భుతం’ అనడమేకాదు ‘వీటితో వ్యాపారం చేస్తే బాగుంటుంది’ అని సలహా ఇచ్చారు. వారి సలహాతో ఆన్-డిమాండ్ ఆర్డర్స్ కోసం డెకరేషన్ ఐటమ్స్ తయారీ మొదలుపెట్టింది. వివిధ రూపాల్లో ఆర్ట్ కోసం ఖర్చుపెట్టడం తప్ప ఆర్ట్ ద్వారా డబ్బు సంపాదించడం తనకు ఇదే తొలిసారి! పర్యావరణం కోసం పనిచేస్తున్న ‘క్లైమెట్ కలెక్టివ్’ అనే స్వచ్ఛందసంస్థ మహిళా వ్యాపారుల కోసం ‘క్లైమెట్ ఛేంజింగ్ కాంపిటీషన్’ నిర్వహించింది. రెంజిని తయారుచేసిన కళాకృతులను చూసి ‘క్లైమెట్ కలెక్టివ్’ నిర్వాహకులు ప్రశంసించారు. మరిన్ని కళాకృతులు తయారు చేయాల్సిందిగా కోరారు. రెంజిని ఈ పోటీలో సెమీ-ఫైనల్స్ వరకు వెళ్లింది.

ఐఐఎం-బెంగళూరు స్టార్టప్ ప్రోగ్రామ్‌కు ఎంపికైన రెంజిని అక్కడ ఎన్నో విషయాలు తెలుసుకుంది. అప్ సైకిల్డ్ ప్రొడక్ట్స్‌కు మంచి డిమాండ్ ఉన్న విషయం తనకు అర్థమైంది. ఈ ఉత్సాహంతో ‘వాప సీ’ పేరుతో ఆన్‌లైన్‌లో డెకరేషన్ స్టోర్ ప్రారంభించింది. ఇందులో గ్లాస్ బాటిల్స్, కొబ్బరి చిప్పలు, రకరకాల పాతవస్తువులతో తయారు చేసిన 21,000 హోమ్‌డెకరేషన్ ఐటమ్స్ కనువిందు చేస్తాయి. గ్లాస్ వర్క్ అనేది కత్తి మీద సాములాంటిది. బోలెడు ఓపిక ఉండాలి. చిన్న తప్పు దొర్లినా గ్లాస్ పాడై పోతుంది. తాను చేసిన తప్పులతోనే ఎన్నో పాఠాలు నేర్చుకుంది రెంజిని.

‘మొదట్లో నా వర్క్‌పై నాకు అంతగా ఆత్మవిశ్వాసం ఉండేది కాదు. అయితే ఐఐఎం-బెంగళూరు పాఠాలతో నాపై నాకు ఆత్మవిశ్వాసం ఏర్పడింది’ అంటున్న రెంజిని థామస్ భవిష్యత్‌లో మరిన్ని పర్యావరణ హిత కళాకృతులను తయారు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.

సాగుబడి

రేవతి కార్తె: ఏప్రిల్ 13 వరకు
అశ్విని కార్తె : 14 నుంచి

అగ్ని నిరోధక పత్తి!

● సరికొత్త పత్తి వంగడాలను ఆవిష్కరించిన అమెరికా శాస్త్రవేత్తలు
● జన్యుమార్పిడి లేదు.. సెలక్టివ్ బ్రీడింగ్ పద్ధతిలోనే రూపుకల్పన



సాధారణంగా దూది గానీ, నూలు వస్త్రం గానీ మంట తగిలితే చాలు చప్పున నిప్పంటుకుంటుంది. మంటలను వ్యాపింపజేయకుండా ఆర్పివేసుకునే స్వభావం కలిగిన సరికొత్త తెల్ల పత్తి రకాలను అమెరికా శాస్త్రవేత్తలు రూపొందించారు. జన్యుమార్పిడి అవసరం లేకుండా సంప్రదాయ సెలక్టివ్ బ్రీడింగ్ పద్ధతిలోనే శాస్త్రవేత్తలు ఈ సరికొత్త ఆవిష్కరణను వెలువరించటం విశేషం. పత్తి పంట ద్వారా పండించిన దూది ద్వారా వస్త్రాలు, పరుపులు, కర్టెన్లలు, సోఫాలు, కుర్చీలలో వాడే మెత్తలు, కార్పెట్ల తయారు చేస్తుంటాం. ఈ క్రమంలో వినియోగదారుల భద్రత రీత్యా మంటల వ్యాప్తిని నెమ్మదింపజేసే రసాయనాలను వాడుతున్నారు. అయితే, ఈ రసాయనాల ప్రతికూల ప్రభావం వల్ల మనుషులకు చాలా తీవ్రమైన జబ్బులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా వ్యవసాయ శాఖకు చెందిన వ్యవసాయ పరిశోధనా సంస్థ అగ్ని నిరోధక పత్తి రకాలపై ఐదేళ్లుగా చేస్తున్న పరిశోధనలు ఇటీవల ఫలించాయి. డా. గ్రెగరీ ఎస్. థైస్సెన్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం మంటలు అంటుకున్నా వ్యాపింపజేయకుండా ఆర్పుకునే స్వభావం ఉన్న అనేక రకాల పత్తి మొక్కల్ని పక్కపక్కనే సాగు చేసి.. సంప్రదాయ సెలక్టివ్ బ్రీడింగ్ పద్ధతిలో పది పత్తి రకాలను రూపొందించారు. వాటితో పండించిన దూదితో వస్త్రాలు నేసి, వాటికి వేర్వేరుగా నిప్పంటించి పరీక్షించారు. అందులో నాలుగు రకాల పత్తితో తయారు చేసిన వస్త్రాలు మంటలను నిరోధించాయి. నిప్పంటుకున్న తర్వాత కూడా మంటలను పెద్దగా వ్యాపించనీయ లేదు. మిగతా 6 రకాల వస్త్రాలు మాత్రం కొన్ని సెకన్లలోనే పూర్తిగా దగ్ధమయ్యాయి.



● దగ్ధమవుతున్న సాధారణ దూది
● దగ్ధం కాని కొత్త రకం దూది

సాధారణ పత్తి రకాలను సంకరం చేయడంతో ఆయా రకాల్లోని అనేక జన్యువుల సమ్మేళనం వల్ల మంటలను వ్యాపించకుండా తట్టుకునే గట్టి గుణం కొన్ని పత్తి రకాలకు సమకూరిందని, ఏ ఒక్క జన్యువు వల్లా ఇది జరగలేదని అమెరికా వ్యవసాయ శాఖకు అనుబంధంగా న్యూ ఆర్లియన్స్‌లో ఉన్న పత్తి రసాయనిక-వినియోగ కేంద్రం మాజీ అధిపతి బ్రెయిన్ కాండోన్ చెప్పారు. నిప్పు భయం లేని నూలు వస్త్రాల ఉత్పత్తికి వీలుగా అగ్నినిరోధక పత్తి వంగడాలు రైతులకు అందుబాటులోకి రానున్నాయన్న మాట!

16, 17లలో డా.ఖాదర్ సభలు

పద్మశ్రీ పురస్కార గ్రహీత, స్వతంత్ర శాస్త్రవేత్త డా. ఖాదర్ వలి ఈ నెల 16, 17 తేదీల్లో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్, హన్మకొండల్లో జరిగే సభల్లో ప్రసంగిస్తారు. 16న ఉ. 10 గం.కు హైదరాబాద్ నాంపల్లి రెడ్‌హిల్స్‌లోని ఎఫ్.టి.సి.సి.ఐ. ఆడిటోరియం హాల్‌లో.. సా. 4 గం.కు సికింద్రాబాద్ కార్ఖానాలోని వాసవినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో, 17న ఉ. 10 గం.కు ఈసిఐఎల్ క్రాస్‌రోడ్స్‌లోని కుషాయిగూడ ఫంక్షన్ హాల్‌లో, సా. 5 గం.కు హన్మకొండలోని నక్కలగుట్టలో గల హరిత కాకతీయ హోటల్‌లో జరిగే సభల్లో డా. ఖాదర్ ప్రసంగిస్తారు. వివరాలకు.. 70939 73999

24 లోగా సేంద్రియ పాలిటెక్నిక్ ప్రవేశాలు

ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జింగుర్తిలో నెలకొల్పిన ఏకలవ్య సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ఆర్గానిక్ అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి ఏప్రిల్ 24 లోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇది ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉంది. కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎస్సెస్సీ పాసైన అభ్యర్థులను టిఎస్ పాలీసెట్ ద్వారా ఎంపిక చేస్తారు. తెలంగాణలో తొలి సేంద్రియ సేద్య పాలిటెక్నిక్ ఇది. సేంద్రియ వ్యవసాయం, పండ్ల తోటలు, కూరగాయల సాగు, పశు పోషణ మెళకువలపై ఉత్తమ శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ డా. సురేందర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం ఉంది. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి సేంద్రియ ఉత్పత్తుల పరిశ్రమల్లో, విత్తనాలు/ఎరువుల పరిశ్రమల్లో, ఫామ్ మేనేజర్లుగా లేదా విత్తన దుకాణాల ఏర్పాటు వంటి ఉపాధి అవకాశాలు ఉన్నాయి. వివరాలకు.. 95151 37015, 81427 45440



● అర్క నీలాచల్ కేసరి పండ్లు



● భువనేశ్వర్‌లోని ‘చెస్’ ఆవరణలో అధిక సాంద్ర పద్ధతి (హెక్టారుకు 833 చెట్లు)లో సాగవుతున్న పదేళ్ల అర్క నీలాచల్ కేసరి మామిడి చెట్లు

ముందస్తు మామిడి!

ప్రధాన మామిడి రకాల కన్నా నెలన్నర ముందుగానే పరిపక్వ పండ్లను ఇచ్చే రకం

● ముందస్తు మామిడి రకం అర్క నీలాచల్ కేసరిని అభివృద్ధి చేసిన భువనేశ్వర్‌లోని కేంద్రీయ ఉద్యాన ప్రయోగ కేంద్రం శాస్త్రవేత్తలు
● నవంబర్-డిసెంబర్‌లో పూత వస్తోంది.. మార్చి 15 నుంచి ఏప్రిల్ 15 వరకు పరిపక్వ పండ్లను ఇస్తోంది
● ఇతర రాష్ట్రాల్లో స్థానిక వాతావరణ పరిస్థితులను బట్టి పూత, కాపు ఎంత ముందొస్తుందన్నది తెలియాల్సి ఉందంటున్న శాస్త్రవేత్తలు
● మామిడి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తుందని ఆకాంక్ష

సాధారణంగా ముందస్తు కాపు వచ్చే తోటల్లో పచ్చి మామిడికాయలు తెలుగునాట ఉగాది పచ్చడి చేసుకునే నాటికి అందుబాటులోకి వస్తూ ఉంటాయి. పూర్తిగా పక్వానికి వచ్చి సహజ రుచితో నోరూరించే మధుర ఫలం మన చేతికి రావాలంటే ఇప్పుడు మే నెల వరకు ఆగాల్సివస్తోంది. అయితే, ఇక నుంచి మామిడి ప్రేమికులు మామిడి రుచులు ఆస్వాదించడానికి అంత ఎక్కువ కాలం ఎదురు చూడాల్సిన అవసరం లేదు. మార్చి మొదటి, రెండో వారం నుంచే పూర్తిగా పక్వానికి వచ్చిన తియ్యటి మామిడి పండ్లను అందించే చక్కని సరికొత్త వంగడాన్ని భువనేశ్వర్ (ఒడిషా) లోని కేంద్రీయ ఉద్యాన ప్రయోగ కేంద్రం (సి.హెచ్.ఇ.ఎస్.-చెస్) శాస్త్రవేత్తలు రైతులకు అందుబాటులోకి తెచ్చారు. బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ(ఐఐహెచ్ఆర్)కు అనుబంధంగా ‘చెస్’ పనిచేస్తోంది. ఈ సరికొత్త మామిడి వంగడం పేరు ‘అర్క నీలాచల్ కేసరి’.

ఎర్లీ ఫ్రూట్ రకాలైన హిమసాగర్ లేదా సింధూరి కన్నా 5-6 వారాలు ముందుగానే ఈ మామిడి వంగడం పండ్లను ఇస్తున్నదని వారు వెల్లడించారు. బంగినపల్లి, రసాలు వంటి ప్రధాన మామిడి రకాల కన్నా చాలా ముందుగానే.. మార్చి 15 నుంచి ఏప్రిల్ 15 వరకు పరిపక్వ పండ్లనిచ్చే ఈ రకం ముందస్తు అమ్మకాల ద్వారా రైతులకు కాసుల వర్షం కురిపిస్తుందని ‘చెస్’ అధిపతి డా. పి.శ్రీనివాస్ ‘సాక్షి సాగుబడి’తో చెప్పారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న కేసరి రకంతో దీనికి సారూప్యత లేదన్నారు. కోత అనంతర జాగ్రత్తలు పాటించి విక్రయిస్తే మామిడి రైతుల ఆదాయం రెట్టింపవుతుందన్నారు. అయితే, తాము ‘అర్క నీలాచల్ కేసరి’ వంగడాన్ని తీర ప్రాంత రాష్ట్రమైన ఒడిషా ఉష్ణమండల తేమతో కూడిన వాతావరణంలో అభివృద్ధి చేశామని, ఇరుగు పొరుగు రాష్ట్రాల్లో ఎంత ముందుగా పూతకు, కాపునకు వస్తుందో సాగు చేసి చూస్తేనే తెలుస్తుందన్నారు. మామిడి పూత, కాపుపై స్థానిక వాతావరణ పరిస్థితులు తీవ్రప్రభావాన్ని చూపుతుంటాయన్నారు.

ప్రధాన శాస్త్రవేత్త డా. వి. పాండే సారథ్యంలోని శాస్త్రవేత్తల బృందం అభివృద్ధి చేసిన ‘అర్క నీలాచల్ కేసరి’ వంగడానికి కేంద్రీయ వంగడాల విడుదల కమిటీ (సీవీఆర్‌సీ) గత ఏడాదే ఆమోదం తెలిపింది. కోసుకొని తినే కండ గల పండు ఇది. పండు బరువు 200-220 గ్రాముల వరకు ఉంటుంది. ఆకర్షణీయమైన రంగు, మంచి తియ్యదనం (బ్రిక్స్ 17)తోపాటు కమ్మటి వాసన వెదజల్లుతుంటుంది. ఇతర రకాల కన్నా కనీసం నెలన్నర ముందుగా మార్కెట్‌లోకి ఈ పండ్లు వస్తాయి కాబట్టి ఒడిషాలో రైతులకు ఆమ్రపాలి వంటి రకాలతో పోల్చినప్పుడు 3-4 రెట్లు ధర వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



● అర్క నీలాచల్ కేసరి పండ్లు

పండు ఈగ సమస్యతో పాటు కోత అనంతర తెగుళ్ల సమస్యల నివారణకు వేడి నీళ్ల ఉపచర్య (హాట్ వాటర్ ట్రీట్‌మెంట్) ఇవ్వటం ద్వారా నాణ్యమైన మామిడి పండ్లను మార్కెట్‌కు అందించి మంచి ఆదాయం పొందవచ్చని ‘చెస్’ అధిపతి డా. శ్రీనివాస్ తెలిపారు. భువనేశ్వర్ నగరంలోనే ఉన్న తమ పరిశోధనా కేంద్రంలోని ‘అర్క నీలాచల్ కేసరి’ తోటలో మరో వారం రోజుల వరకు చెట్లకు పండ్లు ఉంటాయని.. తోటను, కోత అనంతర శుద్ధి కేంద్రాన్ని స్వయంగా సందర్శించవచ్చని డా. శ్రీనివాస్ అన్నారు. గ్రాఫ్టింగ్ చేసిన నాణ్యమైన ‘అర్క నీలాచల్ కేసరి’ ఏడాది మొక్కల (ధర రూ. 50)ను ‘చెస్’లో అందుబాటులో ఉన్నాయి.

- పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

ఇతర రాష్ట్రాల్లో సాగు చేసి చూడాలి



ఒడిషాలో ‘అర్క నీలాచల్ కేసరి’ మామిడి పండ్లు సహజంగా పరిపక్వత చెంది మార్చి 15 నుంచి ప్రారంభమై ఏప్రిల్ 15 వరకు కోతకు వస్తాయి. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించిన నేపథ్యంలో నవంబర్-డిసెంబర్‌లలో పూత వచ్చింది. మార్చి మొదటి వారంలో మహిళా దినోత్సవం నాటికే సహజంగా పక్వానికి వచ్చిన పండ్లు కోతకు వచ్చాయి. ఇతర రాష్ట్రాల్లో ఒడిషాలో మాదిరిగా మరీ ముందుగా పూత, కాపు వస్తుందా లేదా అన్నది ఆయా రాష్ట్రాల్లో సాగు చేసి చూస్తేనే తెలుస్తుంది. సాధారణంగా ఈ రకం చెట్లు ఒడిషాలో నవంబర్, డిసెంబర్ నాటికి పూతకు వస్తాయి. దక్షిణాది నుంచి ఉత్తరాదికి వెళ్లే కొద్దీ వాతావరణంలో వేడిని బట్టి పూత ఆలస్యం అవుతూ ఉంటుంది. నాటిన మూడో సంవత్సరం నుంచి పూత, కాపు ప్రారంభమవుతుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల రైతులు కొందరు ఇప్పటికే ఈ రకం మొక్కలను తీసుకెళ్లి ప్రయోగాత్మకంగా నాటుకున్నారు. ఒకటి, రెండేళ్లు గడిస్తే ఆయా రాష్ట్రాల్లో ఎన్ని రోజులు ముందుగా పూత, కాతకు వస్తున్నదీ తెలుస్తుంది. కాబట్టి ఇతర రాష్ట్రాల రైతులు ముందు కొద్ది మొక్కలు నాటుకొని ఫలితం ఎలా ఉందో చూసుకోవాలి. ప్రధాన రకాలైన బంగినపల్లి, రసాల కన్నా చాలా ముందుగానే సహజంగా పరిపక్వత చెందిన పండ్లను అందించే ఈ రకాన్ని పెంచుకుంటే మంచి ధర పలుకుతుంది కాబట్టి రైతులకు అధికాదాయం వస్తుంది. నాణ్యమైన ‘అర్క నీలాచల్ కేసరి’ మొక్కలను ‘చెస్’ ద్వారా సరఫరా చేస్తున్నాం.

- డా. పి. శ్రీనివాస్ (90406 24745), అధిపతి, కేంద్రీయ ఉద్యాన ప్రయోగ కేంద్రం (సి.హెచ్.ఇ.ఎస్.- చెస్), భువనేశ్వర్, ఒడిషా chesb.iihr@icar.gov.in

హెక్టారుకు 10 టన్నుల దిగుబడి



‘అర్క నీలాచల్ కేసరి’ మొక్కలు మధ్యస్థంగా హెక్టారుకు 400 మొక్కలు (5 మీ. × 5 మీ.) నాటుకుంటే మంచిది. మూడో ఏడాది నుంచి కాపు మొదలవుతుంది. 4వ ఏడాదిలో హెక్టారుకు 6-7 టన్నులు, 6వ ఏడాది నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుంది. మామిడి సాగులో అనుభవం ఉండి, మెళకువలు పాటించగలిగే రైతులు అధిక సాంద్రతలో కూడా నాటుకోవచ్చు. హెక్టారుకు 3 మీ. × 4 మీ. దూరంలో 833 మొక్కలు, 2 మీ. × 3 మీ. దూరంలో 1,666 మొక్కలు నాటుకోవచ్చు. అయితే, కొత్తగా ఈ వంగడాన్ని అరెకరం లేదా ఎకరంలో నాటుకొని పూత, కాపు తమ ప్రాంతంలో ఎలా వస్తున్నదో రైతులు పోల్చి చూసుకోవటం మంచిది. ‘అర్క నీలాచల్ కేసరి’ మామిడి పండ్ల ధర ఒడిషాలో ప్రస్తుతం రైతులు కిలో రూ. 70-80కి అమ్ముతున్నారు. మార్కెట్ ధర రూ. 120 వరకు ఉంది.

- డా. కుందన్ కిషోర్ (8763217726), ప్రధాన శాస్త్రవేత్త, కేంద్రీయ ఉద్యాన ప్రయోగ కేంద్రం, (సి.హెచ్.ఇ.ఎస్.- చెస్), భువనేశ్వర్, ఒడిషా



బోపన్న జోడీ శుభారంభం

మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ శుభారంభం చేసింది. మొనాకోలో సోమవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 3–6, 6–3, 10–8తో రాఫెల్ మటోస్ (బ్రెజిల్)–డేవిడ్ వెగా హెర్నాండెజ్ (స్పెయిన్) జంటపై విజయం సాధించింది. 80 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ ఎనిమిది ఏస్‌లు సంధించారు. ప్రిక్వార్టర్ ఫైనల్లో కెవిన్ క్రావిట్జ్–టిమ్ ప్యూట్జ్ (జర్మనీ)లతో బోపన్న, ఎబ్డెన్ తలపడతారు.



జ్యోతి యర్రాజీకి స్వర్ణం

ఇండియన్ గ్రాండ్‌ప్రి మీట్‌లో ఆంధ్రప్రదేశ్ మహిళా అథ్లెట్ జ్యోతి యర్రాజీ స్వర్ణ పతకం సాధించింది. బెంగళూరులో సోమవారం జరిగిన ఈ మీట్‌లో జ్యోతి మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో విజేతగా నిలిచింది. వైజాగ్‌కు చెందిన జ్యోతి అందరికంటే వేగంగా 13.44 సెకన్లలో గమ్యానికి చేరింది. తెలంగాణకు చెందిన అగసార నందిని కాంస్య పతకం గెలిచింది. నందిని 13.85 సెకన్లతో మూడో స్థానంలో నిలిచింది.

‘థ్రిల్లర్’లో లక్నో విన్నర్

- బెంగళూరు అనూహ్య ఓటమి
- వికెట్ తేడాతో నెగ్గిన సూపర్ జెయింట్స్
- గెలిపించిన స్టొయినిస్, పూరన్

డ్రామా... డ్రామా... హైడ్రామా... ఐపీఎల్‌లో వరుసగా రెండో రోజు అభిమానులను మునివేళ్లపై నిలబెట్టిన మ్యాచ్... చిన్నస్వామి మైదానంలో అనేక మలుపులు తిరుగుతూ, అనూహ్య ప్రదర్శనలు చూపించిన పోరు ఒక పెద్ద అద్భుతంగా ముగిసింది. కోహ్లి, డుప్లెసిస్, మ్యాక్స్‌వెల్ ఒకరితో మరొకరు పోటీ పడి పరుగులు బాదడంతో సొంత మైదానంలో బెంగళూరు 212 పరుగులతో నిశ్చింతగా నిలిచింది... 23 పరుగులకే 3 లక్నో వికెట్లు తీసిన తర్వాత ఇక ఫలితం ఏక పక్షమే అనిపించింది. ఈ దశలో ముందుగా స్టొయినిస్ చెలరేగాడు... అయినా సరే 105/5 వద్ద బెంగళూరుదే పైచేయి. 53 బంతుల్లో 108 పరుగులు అసాధ్యంగా అనిపించింది! అయితే నికోలస్ పూరన్ ఒంటి చేత్తో అంతా మార్చేశాడు. తాను ఆడిన 19 బంతుల్లోనే మ్యాచ్‌ను లాగేసుకున్నాడు. చివర్లో ఉత్కంఠ పెరిగినా సూపర్ జెయింట్స్ గెలుపు గీతను దాటి సంబరాలు చేసుకుంది.


పూరన్

బెంగళూరు: ఐపీఎల్‌లో హోరాహోరీగా సాగిన మరో పోరులో చివరి బంతికి ఫలితం వచ్చింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ వికెట్ తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టును ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. ఫాఫ్ డుప్లెసిస్ (46 బంతుల్లో 79 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (44 బంతుల్లో 61; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), గ్లెన్ మ్యాక్స్‌వెల్ (29 బంతుల్లో 59; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో చెలరేగారు. తొలి వికెట్‌కు కోహ్లితో 96 పరుగులు (69 బంతుల్లో) జోడించిన డుప్లెసిస్, రెండో వికెట్‌కు మ్యాక్స్‌వెల్‌తో 115 పరుగులు (50 బంతుల్లో) జత చేశాడు. అనంతరం లక్నో 20 ఓవర్లలో 9 వికెట్లకు 213 పరుగులు సాధించి గెలిచింది. స్టొయినిస్ (30 బంతుల్లో 65; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ నికోలస్ పూరన్ (19 బంతుల్లో 62; 4 ఫోర్లు, 7 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడగా, ఆయుష్ బదోని (24 బంతుల్లో 30; 4 ఫోర్లు) కీలక పరుగులు సాధించాడు.

ముగ్గురూ ముగ్గురే...

బెంగళూరుకు ఓపెనర్లు కోహ్లి, డుప్లెసిస్ ఘనమైన ఆరంభాన్ని అందించారు. ఈ భాగస్వామ్యంలో ముందుగా కోహ్లి చెలరేగిపోయాడు. అవేశ్ ఖాన్ తొలి రెండు ఓవర్లలో 3 ఫోర్లు, 1 సిక్స్ కొట్టిన కోహ్లి, వుడ్ ఓవర్లో వరుసగా 4, 6 బాదాడు. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 56 పరుగులకు చేరగా, 35 బంతుల్లో కోహ్లి అర్ధసెంచరీ పూర్తయింది. ఈ క్రమంలో మరో భారీ షాట్‌కు ప్రయత్నించి మిశ్రా బౌలింగ్‌లో కోహ్లి అవుట్ కావడంతో తొలి వికెట్ పార్ట్‌నర్‌షిప్ ముగిసింది. ఆ తర్వాత వచ్చిన మ్యాక్స్‌వెల్ కూడా చాలా కాలం తర్వాత తనదైన శైలిలో దూకుడు ప్రదర్శించగా, మరో ఎండ్‌లో డుప్లెసిస్ కూడా ధాటిని పెంచాడు. రవి బిష్ణోయ్ ఓవర్లో రెండు భారీ సిక్స్‌లు కొట్టిన ఆర్‌సీబీ కెప్టెన్ 35 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. అనంతరం జోరును కొనసాగిస్తూ ఉనాద్కట్ ఓవర్లో డుప్లెసిస్ 2 సిక్స్‌లు ఒక ఫోర్ కొట్టగా, ఈ ఓవర్లో మొత్తం 23 పరుగులు వచ్చాయి. ఆపై అవేశ్ ఓవర్లో వరుసగా రెండు సిక్సర్లతో మ్యాక్స్‌వెల్ పండుగ చేసుకున్నాడు. 24 బంతుల్లోనే అతని అర్ధ సెంచరీ కూడా పూర్తయింది. బెంగళూరు చివరి 5 ఓవర్లలో 75 పరుగులు చేయగా...జట్టు ఇన్నింగ్స్‌లో మొత్తం 12 ఫోర్లు, 15 సిక్సర్లు ఉన్నాయి.

రాహుల్ విఫలం...

లక్నో ఛేదన పేలవంగా ప్రారంభించింది. తొలి ఓవర్లోనే మేయర్స్ (0)ను సిరాజ్ బౌల్డ్ చేయగా, పార్నెల్ ఒకే ఓవర్లో దీపక్ హుడా (9), కృనాల్ పాండ్యా (0)లను వెనక్కి పంపాడు. కెప్టెన్ కేఎల్ రాహుల్ (20 బంతుల్లో 18; 1 ఫోర్) కూడా ప్రభావం చూపలేకపోయాడు. మరో ఎండ్‌లో స్టొయినిస్ మెరుపు బ్యాటింగ్ సూపర్ జెయింట్స్ శిబిరంలో కాస్త ఆశలు రేపింది. హర్షల్ ఓవర్లో వరుస బంతుల్లో 6, 4, 4 కొట్టిన స్టొయినిస్, కరణ్ శర్మ వేసిన తర్వాతి ఓవర్లో సిక్స్, రెండు ఫోర్లు బాదాడు. ఆపై షహబాజ్ ఓవర్లోనూ రెండు భారీ సిక్సర్లు కొట్టి 25 బంతుల్లోనే స్టొయినిస్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే స్టొయినిస్‌తో పాటు రాహుల్ నాలుగు బంతుల వ్యవధిలో అవుట్ కావడంతో లక్నో గెలుపు అవకాశాలు క్షీణించాయి.


స్టొయినిస్


డుప్లెసిస్

అయితే పూరన్ అద్భుత ప్రదర్శన జట్టును విజయానికి చేరువగా తెచ్చింది. కరణ్ ఓవర్లో 2 సిక్స్‌లు కొట్టిన పూరన్, హర్షల్ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్ కొట్టాడు. పార్నెల్ ఓవర్లోనూ 2 ఫోర్లు, 6 బాదిన అతను 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీని చేరుకున్నాడు. గెలుపు కోసం లక్నో 19 బంతుల్లో 24 పరుగులు చేయాల్సిన దశలో నిష్క్రమించడం చివర్లో తీవ్ర ఉత్కంఠకు కారణమైంది.


బదోని

ఆట చివర్లో అలా...

పూరన్ అవుటైన సమయంలో లక్నో స్కోరు 189/6. మరో 18 బంతుల్లో 24 పరుగులు చేయాలి. కానీ తర్వాతి ఆట మొత్తం మలుపులతో సాగింది. 9 బంతుల్లో 7 పరుగులు చేయాల్సిన సురక్షిత స్థితిలో పార్నెల్ బౌలింగ్‌లో బదోని స్కూప్ షాట్‌తో బంతిని సిక్సర్‌గా మలచడంతో లక్నో సంబరపడింది. కానీ అతని బ్యాట్ స్టంప్స్‌కు తాకడంతో బదోని వెనుదిరగాల్సి వచ్చింది. చివరి ఓవర్లో 5 పరుగులు సునాయాసంగానే అనిపించినా హర్షల్ 5 బంతుల్లో 2 వికెట్లు తీశాడు. స్కోర్లు సమం కాగా, లక్నో విజయానికి చివరి బంతికి ఒక పరుగు కావాలి. అయితే బంతి వేయక ముందే బిష్ణోయ్ క్రీజు దాటి ముందుకు వెళ్లడంతో హర్షల్ ‘మన్కడింగ్’కు ప్రయత్నించాడు. కానీ బంతి స్టంప్స్‌ను తాకలేదు. దాంతో రనౌట్ కోసం త్రో చేశాడు. స్టంప్స్ ఎగిరినా, నిబంధనల ప్రకారం అలా రెండు సార్లు చేయడం కుదరదని అంపైర్ చెప్పేశాడు. దాంతో బిష్ణోయ్ నాటౌట్‌గా తేలాడు. చివరి బంతిని అవేశ్ ఆడలేకపోగా, కీపర్ దినేశ్ కార్తీక్ కూడా తడబడి దానిని నేరుగా అందుకోవడంలో విఫలమయ్యాడు. అతను త్రో చేసేలోగా బిష్ణోయ్ ఆ వైపు, అవేశ్ ఈ వైపునకు వచ్చేశారు! దాంతో లక్నో జట్టు ఆనందాన్ని ఆపడం ఎవరితరం కాలేదు.





స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) స్టొయినిస్ (బి) అమిత్ మిశ్రా 61; డుప్లెసిస్ (నాటౌట్) 79; మ్యాక్స్‌వెల్ (బి) మార్క్ వుడ్ 59; దినేశ్ కార్తీక్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు) 212. వికెట్ల పతనం:** 1–96, 2–211. **బౌలింగ్:** జైదేవ్ ఉనాద్కట్ 2–0–27–0, అవేశ్ ఖాన్ 4–0–53–0, కృనాల్ పాండ్యా 4–0–35–0, మార్క్ వుడ్ 4–1–32–1, రవి బిష్ణోయ్ 4–0–39–0, అమిత్ మిశ్రా 2–0–18–1.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మేయర్స్ (బి) సిరాజ్ 0; కేఎల్ రాహుల్ (సి) కోహ్లి (బి) సిరాజ్ 18; దీపక్ హుడా (సి) కార్తీక్ (బి) పార్నెల్ 9; కృనాల్ పాండ్యా (సి) కార్తీక్ (బి) పార్నెల్ 0; స్టొయినిస్ (సి) షహబాజ్ (బి) కరణ్ శర్మ 65; పూరన్ (సి) షహబాజ్ (బి) సిరాజ్ 62; ఆయుష్ బదోని (హిట్ వికెట్) (బి) పార్నెల్ 30; ఉనాద్కట్ (సి) డుప్లెసిస్ (బి) హర్షల్ పటేల్ 9; వుడ్ (బి) హర్షల్ పటేల్ 1; రవి బిష్ణోయ్ (నాటౌట్) 3; అవేశ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 213. వికెట్ల పతనం:** 1–1, 2–23, 3–23, 4–99, 5–105, 6–189, 7–206, 8–209, 9–212. **బౌలింగ్:** సిరాజ్ 4–0–22–3, విల్లీ 4–0–32–0, పార్నెల్ 4–0–41–3, హర్షల్ పటేల్ 4–0–48–2, కరణ్ శర్మ 3–0–48–1, షహబాజ్ 1–0–15–0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
లక్నో	4	3	1	6	1.048
రాజస్తాన్	3	2	1	4	2.067
కోల్‌కతా	3	2	1	4	1.375
గుజరాత్	3	2	1	4	0.431
చెన్నై	3	2	1	4	0.356
పంజాబ్	3	2	1	4	-0.281
బెంగళూరు	3	1	2	2	-0.800
హైదరాబాద్	3	1	2	2	-1.502
ముంబై	2	0	2	0	-1.394
ఢిల్లీ	3	0	3	0	-2.092

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ఢిల్లీ × ముంబై (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

వికాస్ ‘కంచు’ పట్టు

అస్తానా (కజకిస్తాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ రెండో రోజు పురుషుల గ్రీకో రోమన్ విభాగంలో భారత్‌కు ఒక కాంస్య పతకం లభించింది. 72 కేజీల విభాగంలో వికాస్ కాంస్య పతక బౌట్‌లో 8–0తో ‘టెక్నికల్ సుపీరియారిటీ’ పద్ధతిలో జెయిన్ తాన్ (చైనా)పై గెలుపొందాడు. భారత్‌కే చెందిన సుమిత్ (60 కేజీలు), రోహిత్ దహియా (82 కేజీలు), నరీందర్ చీమా (97 కేజీలు) కూడా కాంస్య పతక బౌట్‌లలో పోటీపడ్డారు. కానీ ఈ ముగ్గురికీ నిరాశే ఎదురైంది. కాంస్య పతక బౌట్‌లలో సుమిత్ 6–14తో మైతా కవానా (జపాన్) చేతిలో... రోహిత్ 1–5తో అలీరెజా (ఇరాన్) చేతిలో... నరీందర్ 1–4తో ఒల్జాస్ (కజకిస్తాన్) చేతిలో ఓటమి పాలయ్యారు.



రన్నరప్ ప్రియాంక



సాక్షి, హైదరాబాద్: జోయెల్ గ్రాటీన్ స్మారక మార్టినిక్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ మహిళా గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం) నూతక్కి ప్రియాంక రన్నరప్‌గా నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. కరీబియన్ దీవుల్లో జరిగిన ఈ టోర్నీలో నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత క్రిస్టియన్ బాయెర్ (ఫ్రాన్స్), ప్రియాంక (భారత్), కార్తీక్ వెంకటరామన్ (భారత్) ఏడు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... బాయెర్‌కు టాప్ ర్యాంక్, ప్రియాంకకు రెండో ర్యాంక్, కార్తీక్‌కు మూడో ర్యాంక్ ఖరారయ్యాయి. ప్రియాంక ఏడు గేముల్లో గెలిచి, రెండు గేముల్లో ఓడిపోయింది. చివరి రెండు రౌండ్‌లలో ప్రియాంక ఫ్రాన్స్ జీఎం రొమైన్‌పై, తెలంగాణ జీఎం హర్ష భరతకోటిపై గెలుపొందింది. హర్ష 6.5 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో నిలిచాడు. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన బొమ్మిని మౌనిక అక్షయ 6 పాయింట్లతో ఏడో ర్యాంక్‌ను దక్కించుకుంది. మహిళల కేటగిరీలో ప్రియాంక, అక్షయ తొలి రెండు స్థానాల్లో నిలిచారు.

సినిమా

పారిజాత పర్వం

సునీల్, శ్రద్ధా దాస్, చైతన్య రావు, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రల్లో సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. వనమాలి క్రియేషన్స్ బ్యానర్‌పై మహిధర్ రెడ్డి, దేవేష్ నిర్మిస్తున్న ఈ మూవీకి ‘పారిజాత పర్వం’ అనే ఆసక్తికరమైన టైటిల్‌ని ఖరారు చేశారు మేకర్స్. ఓ అమ్మాయికి ముసుగు వేసి కుర్చీలో బంధించినట్లు టైటిల్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. ‘‘వైవిధ్యమైన కథతో రూపొందుతోన్న చిత్రం ‘పారిజాత పర్వం’. టైటిల్‌కి మంచి స్పందన వస్తోంది. త్వరలోనే ఫస్ట్ లుక్ రిలీజ్ చేస్తాం’’ అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: అనంత సాయి, కెమెరా: బాల సరస్వతి, సంగీతం: రీ.


● శ్రద్ధాదాస్

పోలీసుల గొప్పతనం


● నాగచైతన్య

అక్కినేని నాగచైతన్య హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం ‘కస్టడీ’. వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెలుగు–తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కృతీశెట్టి కథానాయికగా నటిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాస సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్న ఈ మూవీ మే 12 విడుదలకానుంది. మేస్ట్రో ఇళయరాజా, ఆయన కుమారుడు యువన్ శంకర్ రాజా సంగీతం అందించిన ఈ చిత్రంలోని ‘హెడ్ అప్ హై..’ అంటూ సాగే తొలి లిరికల్ వీడియోని రిలీజ్ చేశారు మేకర్స్. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను అరుణ్ కౌండిన్య, అసల్ కోలార్, యువన్ శంకర్ రాజా పాడారు. ‘‘హెడ్ అప్ హై..’ పాట పోలీసుల గొప్పతనాన్ని వర్ణిస్తుంది. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. నాగచైతన్య తన గ్రేస్‌ఫుల్ డ్యాన్స్‌తో పాటలోని ఎనర్జీని మ్యాచ్ చేశారు’’ అని చిత్రయూనిట్ పేర్కొంది. అరవింద్ స్వామి, ప్రియమణి, శరత్ కుమార్, సంపత్ రాజ్, ‘వెన్నెల’ కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఖతీర్.

అప్పుడు షాక్ అయ్యాను - సమంత

‘‘ఒకప్పుడు నా లైఫ్‌లో ఏ ప్రాబ్లమ్స్ లేవు. సో.. నేను చాలా సింపుల్‌గా, హ్యాపీగా ఉన్నాను. కానీ నా జీవితంలో నేను కొన్ని ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎవరైనా తమ జీవితాల్లో స్ట్రగుల్స్‌ను ఫేస్ చేసినప్పుడు వారు స్ట్రాంగ్‌గా మారిపోతుంటారు. నేనూ అంతే. నన్ను నేను ప్రత్యేకం అనుకోవడం లేదు. అయితే నా జీవితంలో నాకు కొన్ని ప్రత్యేకమైన పరిస్థితులు ఎదురయ్యాయి. ఇవి నా జీవితాన్ని నాశనం చేయకూడదని అనుకుని, ఇందుకు తగ్గట్లుగా జీవితంలో ముందుకెళుతున్నాను’’ అని సమంత అన్నారు. కాళిదాసు రచించిన ‘అభిజ్ఞాన శాకుంతలం’ ఆధారంగా గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందిన మైథలాజికల్ ఫిల్మ్ ‘శాకుంతలం’. ఈ చిత్రంలో శకుంతలగా సమంత, దుష్యంత్ మహారాజుగా దేవ్‌మోహన్ నటించారు. ‘దిల్’ రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో సమంత మాట్లాడుతూ–‘‘శాకుంతలం’ పూర్తి కథ విన్నప్పుడు నేను సర్‌ప్రైజ్ అయ్యాను. భారతీయ సాహిత్యంలో ఎంతోమంది ప్రేమించే శకుంతల పాత్రను పోషించడం నాకు పెద్ద బాధ్యతగా అనిపించింది. ‘ది ఫ్యామిలీ మేన్ 2’ వెబ్‌సిరీస్‌లో రాజీవంటి క్యారెక్టర్ చేసిన నేను వెంటనే శకుంతల పాత్ర చేయడానికి తొలుత భయపడి నో చెప్పాను. కానీ శకుంతల అంటే కేవలం అందమైన అమ్మాయి మాత్రమే కాదు.. హుందాతనం, ఆత్మగౌరవం కలిగిన యువతి కూడా. ఏ తరం అమ్మాయిలకైనా శకుంతల పాత్ర కనెక్ట్ అవుతుందని మళ్లీ ఆలోచించి ఒప్పుకున్నాను. తొలి సారిగా 3డీలో ‘శాకుంతలం’ ట్రైలర్ చూసి షాక్ అయ్యాను. ఈ సినిమా కోసం గుణశేఖర్‌గారు మ్యాజికల్ వరల్డ్‌ను క్రియేట్ చేశారు. నేను ఇబ్బందుల్లో ఉన్నప్పుడు షూటింగ్స్‌కి రమ్మని ఎవరూ నాకు ఫోన్ చేయలేదు. ఈ విధంగా నాకు ఇండస్ట్రీ నుంచి సపోర్ట్ లభించింది’’ అన్నారు. ‘‘కథను నమ్మి ‘శాకుంతలం’ సినిమా తీశాం’’ అన్నారు గుణశేఖర్. ‘‘ఓ మంచి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే గుణశేఖర్‌గారి ప్రయత్నంలో నేనూ భాగమవడం సంతోషంగా ఉంది’’ అన్నారు ‘దిల్’ రాజు.


● గుణశేఖర్, సమంత, ‘దిల్’ రాజు

అలాంటి చిత్రాలకు అవార్డు ఇవ్వాలి - విజయేంద్ర ప్రసాద్

‘‘కొన్నేళ్లుగా ఆగిపోయిన నంది అవార్డ్స్‌ని మళ్లీ తెలంగాణ ప్రభుత్వ సహకారంతో రామకృష్ణ ఇవ్వనుండటం సంతోషం. తెలంగాణ సంస్కృతి, గొప్పదనాన్ని ప్రతిబింబించే సినిమాలకు ప్రత్యేకంగా నంది అవార్డు కేటాయిస్తే బాగుంటుంది’’ అని రచయిత, డైరెక్టర్, ఎంపీ వి.విజయేంద్ర ప్రసాద్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ‘తెలంగాణ ఫిలిం ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ)’ ఆధ్వర్యంలో ‘టీఎఫ్‌సీసీ’ నంది అవార్డ్స్ సౌత్ ఇండియా 2023’ వేడుకలు త్వరలో దుబాయ్‌లో జరగనున్నాయి. ఈ వేడుక బ్రోచర్‌ని వి.విజయేంద్ర ప్రసాద్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ –‘‘తెలంగాణలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలున్నాయి. ఇక్కడ 90 శాతం చిత్రీకరణ పూర్తి చేసుకునే చిత్రాలకు నంది అవార్డ్స్‌తో పాటు నగదు ప్రోత్సాహాన్ని ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నా. ఫలితంగా టూరిజం అభివృద్ధి చెందుతుంది’’ అన్నారు. ‘‘2021, 2022 సంవత్సరాలకుగాను టీఎఫ్‌సీసీ నంది అవార్డ్స్ ఇవ్వనున్నాం’’ అన్నారు టీఎఫ్‌సీసీ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్. ఈ కార్యక్రమంలో ‘ఆర్‌ఆర్‌ఆర్’ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్‌ను సన్మానించారు. ‘తెలుగు ఫిలిం ఛాంబర్’ సెక్రటరీ ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.


● సెంథిల్ కుమార్, విజయేంద్ర ప్రసాద్, ప్రతాని రామకృష్ణ గౌడ్

ఎవరి యుద్ధం వాళ్లది!


● చైతన్య, దేవయాని, మహి వి.రాఘవ, అభినవ్

ప్రియదర్శి, అభినవ్ గోమటం, చైతన్య కృష్ణ, పావని, జోర్దార్ సుజాత, దేవయాని ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ ‘సేవ్ ద టైగర్స్’. ‘అంతరించిపోతున్న పులుల్ని, మొగుళ్లని కాపాడుకుందాం’ అనేది ఉపశీర్షిక. నటుడు తేజ కాకుమాను దర్శకత్వం వహించారు. ‘ఆనందో బ్రహ్మ, యాత్ర’ చిత్రాల దర్శకుడు మహి వి.రాఘవ, ప్రదీప్ అద్వైతం షో రన్నర్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ వెబ్ సిరీస్ ఈ నెల 27 నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ కాబోతోంది. మహి వి. రాఘవ మాట్లాడుతూ–‘‘ప్రతి ఇంట్లోనూ ఒక కామెడీ స్టోరీ ఉంటుంది. భార్యా భర్తల మధ్య ఉండే జోక్స్ ఎప్పుడూ ఫెయిల్ కావు. ఎవరి యుద్ధం వాళ్లది. ‘సేవ్ ది టైగర్స్’ సిరీస్ కుటుంబమంతా ఇంట్లో కూర్చొని చూసేలా ఉంటుంది’’ అన్నారు. ‘‘సేవ్ ది టైగర్స్’ అన్ని వర్గాల వారిని అలరిస్తుంది’’ అన్నారు నటీనటులు జోర్దార్ సుజాత, దేవయాని, పావని, అభినవ్ గోమఠం, చైతన్య కృష్ణ. ఈ సిరీస్‌కి కెమెరా: ఎస్వీ విశ్వేశ్వర్, సంగీతం: శ్రీరామ్ మద్దూరి.

ఏజెంట్‌తో స్టెప్పులు


● ఊర్వశీ రౌతేలా

‘ఏజెంట్’ తో ప్రత్యేక స్టెప్పులు వేయనున్నారట హీరోయిన్ ఊర్వశీ రౌతేలా. అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ స్పై ఫిల్మ్ ‘ఏజెంట్’. ఇందులో సాక్షీ వైద్య హీరోయిన్. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, సురేందర్ 2 సినిమాస్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ముగింపు దశలో ఉంది. అయితే ఈ మూవీలోని ఓ ప్రత్యేక పాటలో ఊర్వశీ రౌతేలా డ్యాన్స్ చేయనున్నారని సమాచారం. అఖిల్, ఊర్వశీల మాస్ స్టెప్స్‌తో ఈ పాట అదిరిపోయే రేంజ్‌లో ఉంటుందట. ‘ఏజెంట్’ చిత్రం ఈ నెల 28న విడుదలకానుంది. కాగా ఈ ఏడాది సంక్రాంతికి రిలీజైన చిరంజీవి ‘వాల్తేరు వీరయ్య’లో ‘బాస్ పార్టీ..’ అనే స్పెషల్ సాంగ్‌లో తన డ్యాన్స్‌తో అలరించారు ఊర్వశి. అలాగే రామ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో కూడా ఆమె ఓ స్పెషల్ సాంగ్ చేశారని తెలిసింది. కాగా ఊర్వశీ రౌతేలా ప్రధాన పాత్రలో నటించిన ‘బ్లాక్ రోజ్’ సినిమా తెలుగులో విడుదల కావాల్సి ఉంది.

కంటెంట్ ఉన్న సినిమాలు రావాలి - వీవీ వినాయక్

‘‘**అ**రంగేట్రం’ మూవీ ట్రైలర్ చాలా బాగుంది.. విజువల్స్ కూడా బాగున్నాయి. ఇటువంటి కంటెంట్ ఉన్న సినిమాలు ఇప్పుడు ఇండస్ట్రీకి రావాలి. ఈ చిత్రం విజయం సాధించాలి’’ అని డైరెక్టర్ వీవీ వినాయక్ అన్నారు. రోషన్, శ్రీనివాస్ ప్రభన్, ముస్తఫా, అనిరుధ్, పూజ, లయ, కీర్తన, ఇందు ప్రధాన పాత్రల్లో ‘కవచం’ మూవీ ఫేమ్ శ్రీనివాస్ ప్రభన్ దర్శకత్వం వహించిన చిత్రం ‘అరంగేట్రం’. మహీ మీడియా వర్క్స్ బ్యానర్‌లో కె.మహేశ్వరి నిర్మించిన ఈ చిత్రం మే 5న విడుదలకానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను వీవీ వినాయక్ విడుదల చేశారు. ‘‘నాట్యం నేపథ్యంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ ‘అరంగేట్రం’’ అన్నారు శ్రీనివాస్ ప్రభన్, కె.మహేశ్వరి. ఈ చిత్రానికి సంగీతం: గిడియన్ కట్టా, కెమెరా: బురాన్ షేక్ (సలీం), సహ నిర్మాత: ఎంజీబీ విజయలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పోలూరి బ్రదర్స్, లైన్ ప్రొడ్యూసర్: వంశీ కె.రెడ్డి.


● వంశీ కె.రెడ్డి, వీవీ వినాయక్, శ్రీనివాస్

యాక్షన్ డ్రామా

‘**మ**సూద’ వంటి హిట్ చిత్రంతో ప్రేక్షకుల్లో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న తిరువీర్ హీరోగా కొత్త సినిమా ప్రకటన వచ్చింది. ఈ చిత్రం ద్వారా జీజీ దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఏషియన్ ఫిల్మ్స్ నారాయణ దాస్ నారంగ్ సమర్పణలో రవి పనస ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై వ్యాపారవేత్త రవి కుమార్ పనస నిర్మిస్తున్నారు. ‘‘పీరియడ్ యాక్షన్ డ్రామా జానర్ చిత్రమిది. గతంలో ఎప్పుడూ చూడని విభిన్నమైన కథాంశంతో ఈ సినిమా రూపొందనుంది. ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభమయ్యాయి. టైటిల్, ఇతర వివరాలు త్వరలోనే వెల్లడిస్తాం’’ అన్నారు రవి కుమార్ పనస.


● తిరువీర్

సాక్షి బిజినెస్
మంగళవారం
11-4-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	14	59,847
నిఫ్టీ ▲	25	17,624

విదేశీ సూచీలు (సోమ రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,039	▽	49
డోజోన్స్	33,527	▲	42
ఎఫ్‌టీఎస్ఈ 100	7,742	▲	79
డాక్స్	15,598	▲	78
షాంఘై	3,315	▽	12
నికాయ్	27,634	▲	115

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	60,355
బంగారం (22 క్యారట్)	60,115
వెండి (కిలో)	74,556

జీఆర్‌టీ జ్యువెలర్స్ అక్షయ తృతీయ ఆఫర్లు

ముంబై: ప్రముఖ జ్యువెలర్స్ సంస్థ జీఆర్‌టీ జ్యువెలర్స్ అక్షయ తృతీయ సందర్భంగా అద్భుతమైన ఆఫర్లు ప్రకటించింది. బంగారు ఆభరణాల తరుగుపై 20% తగ్గింపు, వజ్రాలు, అన్‌కట్ వజ్రాల విలువపై 10% తగ్గింపు, వెండి వస్తువుల తయారీ చార్జీలపై 25% తగ్గింపు, వెండి ఆభరణాల గరిష్ఠ ధరపై 10 శాతం తగ్గింపు అందిస్తుంది. బంగారం ధర హెచ్చుతగ్గుల నుంచి రక్షణ పొందేందుకు కస్టమర్లు ఆభరణాలను ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు. ఒకవేళ పండుగ రోజు ధర తగ్గితే.., వ్యత్యాసం తిరిగి ఇస్తారు. కస్టమర్లు అక్షయ తృతీయ వేడుకలను అత్యంత పవిత్రంగా, సుసంపన్నంగా జరుపుకునేందుకు అద్భుతమైన ఆఫర్లు ప్రకటించామని జీఆర్‌టీ కంపెనీ ఎండీ ఆనంద్ అనంతపద్మనాభన్ తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇన్సూరెన్స్‌దేఖో చేతికి వేరక్




న్యూఢిల్లీ: దేశీ బీమారంగ స్టార్టప్ ఇన్సూరెన్స్‌దేఖో తాజాగా ముంబై సంస్థ వేరక్‌ను కొనుగోలు చేసింది. ఎస్‌ఎంఈ ఇన్సూరెన్స్ పంపిణీ సంస్థ వేరక్‌ను సొంతం చేసుకున్నట్లు ఇన్సూరెన్స్‌దేఖో వ్యవస్థాపకుడు, సీఈవో అంకిత్ అగర్వాల్ వెల్లడించారు. వేరక్ ప్రారంభమైనప్పటినుంచి పటిష్టంగా ఎదుగుతున్నట్లు, కొత్త విభాగం మైక్రోబిజినెస్ ఇన్సూరెన్స్ స్కీమ్‌లో విస్తరించినట్లు అగర్వాల్ పేర్కొన్నారు. తద్వారా తొలిసారి చిన్న వర్తకులను బీమా పరిధిలోకి తీసుకువస్తున్నట్లు తెలియజేశారు. ప్రతీ నెలా ప్రీమియంలో 30 శాతం నెలవారీ వృద్ధిని సాధిస్తున్నట్లు వెల్లడించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-4-2023	
విశాఖ	420-00
చిత్తూరు	428-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	385-00
విజయవాడ	385-00
రిటైల్ ధర (డజను)	66.00
10-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	355-00
వరంగల్	357-00
రిటైల్ ధర	4.15

స్టార్టప్స్‌కు తగ్గిన నిధులు

• క్యూ1లో 75 శాతం క్షీణత • 58 శాతం పడిపోయిన డీల్స్
• ఇంక్42 ఇండియన్ టెక్ స్టార్టప్ ఫండింగ్ నివేదికలో వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: యూనికార్న్ కంపెనీల జాబితాలో 2023 జనవరి-మార్చిలో కొత్తగా ఏ కంపెనీ చోటు సంపాదించలేదు. 2022 క్యూ1తో పోలిస్తే నిధులు 75 శాతం పడిపోయాయి. డీల్స్ సంఖ్య 58 శాతం తగ్గింది. 100 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువ చేసే డీల్స్ 77 శాతం క్షీణించాయి. ఇదీ 2023 మార్చి త్రైమాసికంలో భారత స్టార్టప్స్ స్టోరీ. ఇంక్42 రూపొందించిన ఇండియన్ టెక్ స్టార్టప్ ఫండింగ్ నివేదికలో ఈ విషయాలు వెల్లడి అయ్యాయి.

కారణం ఏమంటే..

కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, రూపాయి విలువ పడిపోవడం, సిలికాన్ వ్యాలీ బ్యాంక్ పతనం, ఆర్థిక అనిశ్చితి వంటి ఇతర విషయాల కారణంగా పెట్టుబడిదారులు భయపడుతున్నారు. అంతే కాకుండా భారతీయ స్టార్టప్‌ల ఆదాయాలు క్షీణించడం, వాటి పెరుగుతున్న నష్టాలు, వ్యాపారాలను తదుపరి స్థాయికి తీసుకు వెళ్లేందుకు వ్యవస్థాపకులు వ్యూహాలను కనుగొనడంలో విఫలం కావడం పెట్టుబడి సెంటిమెంట్‌ను స్పష్టంగా దెబ్బతీసింది. 2021 బుల్ రన్ తర్వాత నిధుల రాక తీరు చూస్తుంటే మహమ్మారి ముందస్తు స్థాయికి పడిపోయినట్టు అవగతమవుతోంది. ఈ సంవత్సరం వృద్ధి దశలో మూలధనాన్ని సేకరించడం సవాలుగా ఉంటుందని 84% పెట్టుబడిదారులు అభిప్రాయపడ్డారు.

ఇవీ గణాంకాలు..

సిరీస్ సి-రౌండ్స్‌లో గరిష్ట కరెక్షన్‌తో ఈ ఏడాది జనవరి-మార్చిలో మెగా డీల్స్ 77 శాతం పడిపోయి ఏడుకు వచ్చి చేరాయి. 2022 క్యూ1లో ఈ సంఖ్య 30గా ఉంది. మెగా డీల్స్ సంఖ్య తగ్గడం 2023 క్యూ1లో భారతీయ స్టార్టప్‌లు సేకరించిన మొత్తం నిధులపై ప్రభావం చూపింది. ఫండింగ్ పరంగా ఈ ఏడాది క్యూ1లో టాప్-3లో నిలిచిన ఫోన్‌పే 650 మిలియన్ డాలర్లు, లెన్స్‌కార్ట్ 500 మిలియన్ డాలర్లు, ఇన్సూరెన్స్‌దేఖో 150 మిలియన్ డాలర్లు అందుకున్నాయి. గతేడాది జనవరి-మార్చిలో మొత్తం 506 డీల్స్ నమోదయ్యాయి. 2023 మార్చి క్వార్టర్‌లో ఈ సంఖ్య 213కు పరిమితమైంది. 2020 క్యూ1లో 3.4 బిలియన్ డాలర్ల విలువ చేసే 212 డీల్స్ నమోదయ్యాయి. 2023 మార్చి త్రైమాసికంలో లేట్ స్టేజ్ ఫండింగ్ 77 శాతం పడిపోయి 1.8 బిలియన్ డాలర్లకు వచ్చి చేరింది. గ్రోత్ స్టేజ్ ఫండింగ్ 76% క్షీణించి 700 మిలియన్ డాలర్లకు వచ్చి చేరింది. సిరీస్-ఏ డీల్స్ 58 నుంచి 30కి, సిరీస్-బీ డీల్స్ 28 నుంచి 4కు పడిపోయాయి.

ఫిన్‌టెక్ ముందంజలో..

మార్చి త్రైమాసికంలో అందుకున్న నిధుల విషయంలో ఫిన్‌టెక్ కంపెనీల వాటా ఏకంగా 44.9 శాతం ఉంది. ఈ-కామర్స్ 22.1 శాతం, ఎంటర్‌ప్రైస్‌టెక్ 6.8, కంస్యూమర్ సర్వీసెస్ 6.5, డీప్‌టెక్ 5.1, ఎడ్‌టెక్ 3.5, మీడియా, వినోదం 2.7, ఇతర కంపెనీలు 8.4 శాతం కైవసం చేసుకున్నాయి. డీల్స్ సంఖ్య పరంగా ఎంటర్‌ప్రైస్‌టెక్ 41, ఈ-కామర్స్ 40, ఫిన్‌టెక్ 25, డీప్‌టెక్ 21, ఎడ్‌టెక్ 17, మీడియా, వినోదం 16, హెల్త్‌కేర్ 13, ఇతర రంగాల కంపెనీలు 40 చేజిక్కించుకున్నాయి. విలీనాలు, కొనుగోళ్లు 2022 క్యూ1లో ఆల్‌టైమ్ హై రికార్డులతో 100 నమోదైతే, ఈ ఏడాది ఇదే కాలంలో 35కు వచ్చి చేరాయి. 2022 సెప్టెంబర్‌లో టాటా 1 ఎంజీ తర్వాత యూనికార్న్ కంపెనీల జాబితాలో కొత్త కంపెనీ చేరకపోవడం గమనార్హం.

పడిన సీడ్ ఫండింగ్..

మందగమనం ఉన్నప్పటికీ భారత్ స్టార్టప్స్‌కు అత్యధిక సీడ్ ఫండింగ్ 2022లో సమకూరింది. గత ఎనిమిదేళ్లలో ఇదే అత్యధికం. 2014 నుంచి 2022 మధ్య సేకరించిన 5 బిలియన్ డాలర్ల సీడ్ ఫండ్‌లో 2 బిలియన్ డాలర్లు 2022లో నమోదు కావడం విశేషం. సీడ్ ఫండింగ్ గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 2023 మార్చి త్రైమాసికంలో 81% క్షీణించి 180 మిలియన్ డాలర్లుగా ఉంది. స్టార్టప్ వ్యవస్థలో భారీ నిధుల దిద్దుబాటును ఇది సూచిస్తోంది. మార్కెట్లు పుంజుకున్న తర్వాత మంచి వాల్యుయేషన్‌తో నిధులను సేకరించాలని వ్యవస్థాపకులు యోచిస్తున్నారు. వర్కింగ్ క్యాపిటల్‌కు చివరి దశలో రుణ నిధుల సాధనాల వైపు పరిశ్రమ మళ్లాల్సి వస్తోంది.



స్వల్ప లాభాలతో సరి..

• సెన్సెక్స్ లాభం 14 పాయింట్లు
• ఆరోరోజూ కొనసాగిన ర్యాలీ

ముంబై: దేశీయ స్టాక్ సూచీలకు సోమవారం స్వల్ప లాభాలొచ్చాయి. ఐటీ, ఆటో, రియల్టీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఆరో రోజూ ర్యాలీ కొనసాగింది. సెన్సెక్స్ ఉదయం 26 పాయింట్ల లాభంతో 59,859 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 276 పాయింట్లు బలపడి 60 వేల స్థాయిని అధిగమించి 60,109 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది. చివరికి 14 పాయింట్ల స్వల్ప లాభంతో 59,847 వద్ద ముగిసింది. నిఫ్టీ 36 పాయింట్ల లాభంతో 17,635 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఇంట్రాడేలో 17,598 వద్ద కనిష్టాన్ని 17,694 వద్ద గరిష్టాన్ని తాకింది. ఆఖరికి 25 పాయింట్లు పెరిగి 17,624 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందడం, వరుస అయిదు రోజుల ర్యాలీ నేపథ్యంలో గరిష్టాల వద్ద లాభాల స్వీకరణ వంటి పరిణామాలు సూచీలను తక్కువ లాభాలకు పరిమితం చేశాయి. అదానీ కంపెనీల షేర్లు భారీగా లాభపడ్డాయి.

మా పెట్టుబడులు పారదర్శకం: అదానీ గ్రూప్



న్యూఢిల్లీ: బిలియనీర్ గౌతమ్ అదానీ గ్రూప్ 2019 నుండి గ్రూప్ సంస్థలలో 2.87 బిలియన్ డాలర్ల వాటా విక్రయాల వివరాల జాబితా విడుదల చేసింది. అలాగే 2.55 బిలియన్ డాలర్లు గ్రూప్ కంపెనీల వ్యాపారాల్లోకి ఎలా వచ్చాయన్న విషయాలనూ వివరించింది. 'షెల్ కంపెనీల' ద్వారా గ్రూప్ కంపెనీలకు రూ. 20,000 కోట్లు వచ్చాయని కొంతమంది చేస్తున్న ఆరోపణలకు సమాధానంగా అదానీ గ్రూప్ సోమవారం ఈ ప్రకటన చేసింది. కాగా, గ్రూప్‌లో ఎఫ్‌డీఐ ఫైనాన్షియల్ టైమ్స్ ప్రచురించిన ఒక నివేదికను అదానీ గ్రూప్ తిరస్కరించింది, ఇది గ్రూప్ ప్రతిష్టను దెబ్బతీసే "ఉద్దేశపూర్వక' ప్రయత్నమని పేర్కొంది.

ఫ్యూచర్ రిటైల్‌కు భలే డిమాండ్

రేసులో రిలయన్స్, అదానీ గ్రూప్‌లు



న్యూఢిల్లీ: రుణ సంక్షోభంలో ఉన్న ఫ్యూ చర్ రిటైల్‌ను సొంతం చేసుకునేందుకు తీవ్ర పోటీ నెలకొంది. రేసులో రిలయన్స్, అదానీ, జిందాల్ తదితర పలు గ్రూప్‌లు, సంస్థలు పోటీపడుతున్నాయి. వెరసి కంపెనీ ఆస్తుల కొనుగోలుకి ఆసక్తిని వ్యక్తం చేస్తూ(ఈవోఐ) 49 బిడ్స్ దాఖలయ్యాయి. ప్రస్తుతం దివాలా పరిష్కార ప్రక్రియలో భాగమైన ఫ్యూచర్ రిటైల్ ఆస్తులను ఐదు క్లస్టర్స్‌గా విడదీశాక రుణదాతలు ఈవోఐ బిడ్స్‌కు ఆహ్వానం పలికిన సంగతి తెలిసిందే.

మణిపాల్ హెల్త్‌పై టెమాసెక్‌కు పట్టు

అదనంగా 41% వాటా కొనుగోలు



న్యూఢిల్లీ: ఆరోగ్య పరి రక్షణ రంగ సంస్థ మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్‌లో సింగపూర్ సావరిన్ వెల్త్ ఫండ్ టెమాసెక్ అదనంగా 41% వాటాను కొనుగోలు చేయనుంది. ఇందుకు 2 బిలియన్ డాలర్లు(రూ. 16,300 కోట్లు) వెచ్చించనున్నట్లు తెలుస్తోంది. వెరసి మణిపాల్ హాస్పిటల్స్ బ్రాండుతో దేశవ్యాప్తంగా ఆసుపత్రుల చైన్‌ను కలిగిన కంపెనీలో వాటాను 59 శాతానికి పెంచుకోనుంది. ఈ లావాదేవీ దేశీయంగా హెల్త్‌కేర్ రంగంలో అతిపెద్ద డీల్‌గా నిలవనుంది.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, మోడల్‌పేపర్స్, ప్రీవియస్ పేపర్స్, టెక్స్ట్‌బుక్స్, గైడెన్స్ మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ గురుకులాల్లో 134 ఆర్ట్, డ్రాయింగ్ టీచర్ పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ-రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్‌ఈఐ‌ఎస్‌ఆర్‌బీ).. తెలంగాణ సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమం, మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో డైరెక్ట్ ప్రాతిపదికన ఆర్ట్, డ్రాయింగ్ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 134
» **పోస్టుల వివరాలు:** ఆర్ట్ టీచర్-132, డ్రాయింగ్ టీచర్ (డీఈపీడీఎస్సీ అండ్ టీపీ)-02.
» **సొసైటీల వారీగా ఖాళీలు(ఆర్ట్ టీచర్):** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాలు-16, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాలు-06, మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకులాలు-72, తెలంగాణ మైనార్టీ సంక్షేమ గురుకులాలు-38.
» **వేతనం:** నెలకు ఆర్ట్ టీచర్‌కు రూ.31,040 నుంచి రూ.92,050, డ్రాయింగ్ టీచర్‌కు రూ.33,750 నుంచి రూ.99,310 చెల్లిస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 24.04.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.05.2023.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.treirb.telangana.gov.in

తెలంగాణ గురుకులాల్లో 124 మ్యూజిక్ టీచర్ పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ-రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్‌ఈఐ‌ఎస్‌ఆర్‌బీ).. తెలంగాణ సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమం గురుకుల విద్యా సంస్థలు, తెలంగాణ గురుకుల విద్యాలయ సంస్థల్లో డైరెక్ట్ ప్రాతిపదికన మ్యూజిక్ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 124
» **సొసైటీల వారీగా ఖాళీలు:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాలు-46, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాలు-20, మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకులాలు-55, తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ-02, డీఈపీడీఎస్సీ అండ్ టీపీ-01.
» **వేతనం:** నెలకు ఆర్ట్ టీచర్‌కు రూ.31,040 నుంచి రూ.92,050, డ్రాయింగ్ టీచర్‌కు రూ.33,750 నుంచి రూ.99,310 చెల్లిస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 24.04.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.05.2023.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.treirb.telangana.gov.in

తెలంగాణ గురుకులాల్లో 92 క్రాఫ్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ-రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్‌ఈఐ‌ఎస్‌ఆర్‌బీ)..తెలంగాణ గిరిజన సంక్షేమం, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమం, గురుకుల విద్యా సంస్థల్లో డైరెక్ట్ ప్రాతిపదికన క్రాఫ్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 92
» **పోస్టుల వివరాలు:** క్రాఫ్ట్ టీచర్-88, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్(డీఈపీడీఎస్సీ అండ్ టీపీ)-04.
» **సొసైటీల వారీగా ఖాళీలు(క్రాఫ్ట్ టీచర్):** తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాలు -24, మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకులాలు-60, తెలంగాణ గురుకుల విద్యాలయ సంస్థలు-08.
» **వేతనం:** నెలకు ఆర్ట్ టీచర్‌కు రూ.31,040 నుంచి రూ.92,050, డీఈపీడీఎస్సీ అండ్ టీపీ విభాగంలో క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్‌కు రూ. 33,750 నుంచి రూ.99,310 ఉంటుంది.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 24.04.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.05.2023.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.treirb.telangana.gov.in

తెలంగాణ గురుకులాల్లో 434 లైబ్రేరియన్(స్కూల్స్) పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ-రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్‌ఈఐ‌ఎస్‌ఆర్‌బీ).. తెలంగాణ సాంఘిక సంక్షేమం ,మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమం, మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో డైరెక్ట్ ప్రాతిపదికన లైబ్రేరియన్(స్కూల్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 434
» **సొసైటీల వారీగా ఖాళీలు:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు-54, మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకులాలు-180, తెలంగాణ మైనార్టీ సంక్షేమ గురుకులాలు-200.
» **వేతనం:** నెలకు రూ.38,890 నుంచి రూ.1,12,510 చెల్లిస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 24.04.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.05.2023.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.treirb.telangana.gov.in

కెరీర్.. ఇలా సెట్!

» ఏపీ లాసెట్ నోటిఫికేషన్ విడుదల
» ఎల్ఎల్‌బీ, బీఏఎల్ఎల్‌బీల్లో అడ్మిషన్
» పీజీ లాసెట్‌తో ఎల్ఎల్ఎంలో ప్రవేశం
» లా పట్టభద్రులకు విస్తృత కెరీర్ అవకాశాలు

ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్థులా.. మీలో వాక్పటిమ, సునిశిత పరిశీలన, తులనాత్మక విశ్లేషణ నైపుణ్యాలు ఉన్నాయా..! అయితే మీకు సరైన కోర్సు.. లా!! ప్రస్తుతం లా డిగ్రీ పట్టా చేతిలో ఉంటే.. ఇటు న్యాయవాద వృత్తితోపాటు.. అటు కార్పొరేట్ రంగంలోనూ కొలువులు సొంతం చేసుకోవచ్చు! తాజాగా.. ఏపీ లాసెట్ 2023 నోటిఫికేషన్ విడుదలైంది. పరీక్ష తేదీలు కూడా వెల్లడయ్యాయి. ఈ నేపథ్యంలో.. ఏపీ లాసెట్ పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, బెస్ట్ ర్యాంకుకు ప్రిపరేషన్ గైడెన్స్..



ఏపీ లాసెట్ 2023

'న్యాయ శాస్త్రం(లా) చదివితే.. కోర్టుల్లో లాయర్లుగానే అవకాశాలు ఉంటాయనేది ఒకప్పటి మాట. ఇటీవల కాలంలో లా గ్రాడ్యుయేట్లకు సంప్రదాయ న్యాయవాద వృత్తితో పాటు కార్పొరేట్ కొలువులూ లభిస్తున్నాయి. కాబట్టి ఈ రంగంపై ఆసక్తి ఉన్న వారు ఎలాంటి సందేహం లేకుండా ఎల్ఎల్‌బీ కోర్సులో అడుగు పెట్టొచ్చు అంటున్నారు నిపుణులు.

మూడు, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ

న్యాయ శాస్త్రంలో నైపుణ్యాలను అందించే ఎల్ఎల్‌బీలో ప్రవేశానికి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఏపీ లాసెట్ నిర్వహిస్తోంది. ఈ పరీక్ష ద్వారా బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో, ఇంటర్మీడియెట్ అర్హతతో అయిదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ కోర్సులో అడుగు పెట్టొచ్చు. ఆ తర్వాత న్యాయవాద వృత్తితోపాటు కార్పొరేట్ రంగంలో లీగల్ ఎక్స్‌పర్ట్స్, లీగల్ ఆఫీసర్స్, అడ్వైజర్స్‌గా కొలువులు సొంతం చేసుకోవచ్చు.

అర్హతలు

• **మూడేళ్ల ఎల్ఎల్‌బీ:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 45 శాతం మార్కులతో 10+2+3 విధానంలో డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. ఓబీసీలకు కనీసం 42 శాతం, ఎస్సీ,ఎస్టీలకు కనీసం 40 శాతం మార్కులు రావాలి.
• **అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ:** ఇంటర్మీడియెట్(10+2 విధానం) తత్సమాన కోర్సులో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఓబీసీలకు 42 శాతం, ఎస్సీ,ఎస్టీలకు 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందాలి.
• ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

మూడు విభాగాలు-120 మార్కులు

• లాసెట్‌ను మూడు విభాగాల్లో 120 మార్కులకు నిర్వహిస్తారు. ఈ పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఉంటుంది. పరీక్ష వ్యవధి గంటన్నర.
• పార్ట్-ఎలో జనరల్ నాలెడ్జ్ అండ్ మెంటల్ ఎబిలిటీ 30 ప్రశ్నలు-30 మార్కులు; పార్ట్-బిలో కరెంట్ అఫైర్స్ 30 ప్రశ్నలు-30 మార్కులకు; పార్ట్-సిలో ఆప్టిట్యూడ్ ఫర్ స్టడీ ఆఫ్ లా 60 ప్రశ్నలు-60 మార్కులకు.. ఇలా మొత్తం 120 ప్రశ్నలు-120 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

క్లిష్టత స్థాయి

మూడేళ్ల ఎల్ఎల్‌బీ, అయిదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే లాసెట్‌లో సిలబస్ అంశాలు ఒకే మాదిరిగా ఉంటాయి. కాని ప్రశ్నల క్లిష్టత స్థాయిలో తేడా ఉంటుంది. మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుకు బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో.. అయిదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ కోర్సుకు ఇంటర్మీడియెట్ స్థాయిలో ప్రశ్నల క్లిష్టత స్థాయి ఉంటుంది.

పీజీ లాసెట్ కూడా

ఏపీ ఉన్నత విద్యా మండలి పీజీ లాసెట్‌ను కూడా నిర్వహిస్తోంది. మూడేళ్ల లేదా అయిదేళ్ల వ్యవధిలోని ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. పీజీ లాసెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తే.. ఎల్ఎల్ఎం కోర్సులో అడ్మిషన్ లభిస్తుంది.

ప్రిపరేషన్ పక్కాగా

జనరల్ నాలెడ్జ్ అండ్ మెంటల్ ఎబిలిటీ

అభ్యర్థులకున్న సామాజిక అవగాహనను పరీక్షించే విభాగం ఇది. ఇందులో విద్యార్థులు జనరల్ నాలెడ్జ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. ముఖ్యంగా చరిత్ర, వార్తల్లోని వ్యక్తులు, ముఖ్యమైన ప్రదేశాలు, సదస్సులు, చారిత్రక కట్టడాలు, స్వాతంత్ర్యం అనంతర కాలంలో జరిగిన ముఖ్యమైన ఘటనల గురించి తెలుసుకోవాలి. ప్రధానంగా జాతీయోద్యమంలో కీలక ఘట్టాలపై దృష్టి పెట్టాలి. భారత రాజ్యాంగానికి సంబంధించి రాజ్యాంగ రూపకల్పన నుంచి తాజా సవరణల వరకు అన్నీ తెలుసుకోవాలి. అదే విధంగా మెంటల్ ఎబిలిటీలో.. వెర్బల్, నాన్-వెర్బల్ రీజనింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. బ్లడ్ రిలేషన్స్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, కోడింగ్, డీ-కోడింగ్, గ్రాఫ్స్, ఫ్లోచార్ట్స్ విశ్లేషణ వంటి అంశాలను ప్రాక్టీస్ చేయాలి.

కరెంట్ అఫైర్స్

ఇందులో రాణించేందుకు సమకాలీన పరిణామాలపై పట్టు సాధించాలి. ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకున్న జాతీయ అంశాలు, అంతర్జాతీయ వ్యవహారాలు, ప్రాంతీయ పరిణామాలపై దృష్టి పెట్టాలి. అంతర్జాతీయ స్థాయిలో ద్వైపాక్షిక ఒప్పందాలు, ముఖ్యమైన సంఘటనలు, సదస్సుల గురించి తెలుసుకోవాలి. ప్రామాణిక జనరల్ నాలెడ్జ్ పుస్తకాలతోపాటు, ప్రతిరోజు దిన పత్రికలను చదివి.. సమకాలీన ప్రాధాన్యం ఉన్న అంశాలపై అవగాహన పొందాలి.

ఆప్టిట్యూడ్ ఫర్ స్టడీ ఆఫ్ లా

అభ్యర్థులకు న్యాయ శాస్త్రం పట్ల ఉన్న ఆసక్తి, పరిజ్ఞానాన్ని పరీక్షించే విధంగా ఈ విభాగంలో ప్రశ్నలు అడుగుతారు. ఇందులో అభ్యర్థి న్యాయ పరమైన దృక్పథం, సహేతుక ఆలోచన ధోరణి, నిర్ణయ సామర్థ్యాలను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. ముఖ్యమైన చట్టాలు, న్యాయ శాఖకు సంబంధించి తాజా పరిణామాలు, లీగల్ టెర్మినాలజీపై అవగాహన పెంచుకోవాలి. కీలక తీర్పులు, వాటి పరిణామాలు -ప్రభావం వంటి అంశాలపైనా దృష్టి పెట్టాలి.

అదే విధంగా భారత రాజ్యాంగం, అధికరణలు, ప్రకరణలు, సవరణలు, వాటి ఉద్దేశం, ప్రభావం వంటి అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

లాతో కెరీర్ స్కోప్

ప్రస్తుత పరిస్థితుల్లో న్యాయ శాస్త్రం అభ్యసించిన వారికి కెరీర్ అవకాశాలకు కొదవలేదు. వీరికి న్యాయవాద వృతితోపాటు కార్పొరేట్ కొలువులు కూడా లభిస్తున్నాయి. ప్రస్తుతం అన్ని రంగాల్లోని కార్పొరేట్ కంపెనీలు ప్రత్యేక న్యాయ విభాగాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. వాటి ద్వారా కార్పొరేట్ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా కార్యకలాపాలు నిర్వహించి, వ్యాపార వ్యవహారాలను ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందుకు సాగాలని భావిస్తున్నాయి. సదరు న్యాయ విభాగాల్లో లా కోర్సులు పూర్తి చేసిన వారికి అవకాశం కల్పిస్తున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీలు, ఆర్ అండ్ డీ సంస్థలు, బ్యాంకులు వీరికి ప్రాధాన్యం ఇస్తున్నాయి.

పీజీతో ఎంఎన్‌సీ జాబ్స్

పీజీ స్థాయిలో కార్పొరేట్ లా, సైబర్ లా, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా,ఇంటర్నేషనల్ లా వంటి స్పెషలైజేషన్స్ పూర్తి చేసుకుంటే..ఎంఎన్‌సీల్లో జాబ్స్ సొంతం చేసుకోవచ్చు.అదే విధంగా విదేశీ అవకాశాలు కూడా దక్కించుకోవచ్చు. ఆయా దేశాల్లోని నియంత్రణ సంస్థలు నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం ద్వారా విదేశాల్లోనూ న్యాయ నిపుణులుగా అడుగుపెట్టే అవకాశం ఉంది.

రెండు విభాగాలు

పీజీ లాసెట్‌ను రెండు విభాగాలుగా 120 మార్కులకు నిర్వహిస్తారు. వివరాలు.. పార్ట్ ఎ 40 మార్కులకు, పార్ట్ బి 80 మార్కులకు పరీక్ష ఉంటుంది. పార్ట్-ఎలో జ్యూరిస్ప్రుడెన్స్ లా 20 ప్రశ్నలు-20 మార్కులు; కాన్‌స్టిట్యూషనల్ లా 20 ప్రశ్నలు-20 మార్కులకు; అలాగే పార్ట్ బిలో పబ్లిక్ ఇంటర్నేషనల్ లా 16 ప్రశ్నలు-16 మార్కులకు; మర్కెంటైల్ లా 16 ప్రశ్నలు-16 మార్కులకు; లేబర్ లా 16 ప్రశ్నలు-16 మార్కులకు; క్రైమ్స్ అండ్ టార్ట్స్ 16 ప్రశ్నలు-16 మార్కులకు; ఐపీఆర్ అండ్ అదర్ లా 16 ప్రశ్నలు-16 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ఇలా రెండు విభాగాలు కలిపి 120 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

• **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
• **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** ఏప్రిల్ 22, 2023
• రూ.500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 29 వరకు; రూ.1000 ఆలస్య రుసుముతో మే 5 వరకు, రూ.2,000 ఆలస్య రుసుముతో మే 9 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
• **దరఖాస్తు సవరణ అవకాశం:** మే10-11 తేదీల్లో
• **హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం:** మే 15 నుంచి
• **ఏపీ లాసెట్, ఏపీపీజీ లాసెట్ పరీక్ష తేదీ:** మే 20
• **వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

క్లుప్తంగా...

ఎంవోయూల సాకారమే ప్రధాన లక్ష్యం

- ఏపీఐఐసీ ఎండీ ప్రవీణ్ కుమార్



సాక్షి, అమరావతి: గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కుదిరిన ఒప్పందాలను సాధ్యమైనంత త్వరగా వాస్తవ రూపంలోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యమని ఏపీఐఐసీ వైస్ చైర్మన్ అండ్ ఎండీ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయంలో ఏపీఐఐసీ వీసీఎండీగా ఆయన బాధ్యతలను స్వీకరించారు. కమిషనర్ ఆఫ్ ఇండస్ట్రీస్, ఏపీ మారిటైమ్ బోర్డు సీఈవోగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలనూ స్వీకరించారు. ఉద్యోగులతో ఆయన మాట్లాడుతూ సులభతర వాణిజ్యం, పెట్టుబడుల ప్రోత్సాహం, ఏపీఐఐసీ భూ కేటాయింపులు, సేకరణ వంటి ప్రధాన కార్యక్రమాలకు ప్రాధాన్యతను ఇవ్వాల్సిందిగా సూచించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని అనుమతులు, సమస్యలను పరిష్కరించాల్సిందిగా సూచించారు. ఏపీఐఐసీ చేపడుతున్న ప్రాజెక్టులతో పాటు వీసీఐసీ, సీబీఐసీ, హెచ్‌బీఐసీ కారిడార్‌లలో చేపట్టిన ప్రాజెక్టుల వివరాలను అధికారులు వివరించారు.

'తిమ్మమ్మ మర్రి'ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి



దుర్గా ప్రసాద్ సాహూకు వినతి పత్రాన్ని అందిస్తున్న జాస్తి వీరాంజనేయులు

సాక్షి, అమరావతి: తిమ్మమ్మ మర్రిమాను ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు, ఏపీ పంచాయతీ పరిషత్ చైర్మన్ జాస్తి వీరాంజనేయులు కోరారు. సోమవారం సచివాలయంలో పర్యాటక శాఖ అదనపు కార్యదర్శి దుర్గాప్రసాద్ సాహూకు వినతి పత్రం అందజేశారు. శ్రీసత్యసాయి జిల్లాలోని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన తిమ్మమ్మ మర్రిమాను, బాల వీరయ్య స్వామి దేవాలయం ప్రాంగణంలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. స్థానిక పర్యాటక అతిథి గృహాన్ని వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.


ఇంధన సామర్థ్య సూచికలో ఏపీ ముందంజ

- ఎస్ఈఈఐ 2021–22 విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: 2021–22లో చేపట్టిన రాష్ట్ర ఇంధన సామర్థ్య సూచిక (స్టేట్ ఎనర్జీ ఎఫిషియన్సీ ఇండెక్స్ – ఎస్ఈఈఐ)లో ఏపీ ముందంజలో ఉంది. తెలంగాణ, కర్ణాటక, కేరళ, రాజస్తాన్ రాష్ట్రాలు కూడా మెరుగైన పనితీరును కనబరిచాయి. ఢిల్లీలో సోమవారం రాష్ట్ర ఇంధన సామర్థ్య సూచిక 2021–22 నివేదికను కేంద్ర విద్యుత్, నూతన, పునరుత్పాదక ఇంధనశాఖ మంత్రి ఆర్.కె.సింగ్ విడుదల చేశారు. ఎస్ఈఈఐలో ఫ్రంట్ రన్నర్ విభాగంలో ఏపీ, తెలంగాణ సహా ఐదు రాష్ట్రాలు 60 పాయింట్ల కంటే ఎక్కువగా సాధించాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, అసోం, చండీగఢ్ తమ రాష్ట్ర గ్రూప్స్‌లో అత్యుత్తమ పనితీరు కనబరిచాయి. గత ఇండెక్స్ కంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అత్యధికంగా అభివృద్ధిని ప్రదర్శించాయి.

దివ్యాంగ విద్యార్థుల కోసం 'ప్రశస్థ్'

- కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్
- దివ్యాంగ విద్యార్థులకు సహాయం అందించడానికి చర్యలు



సాక్షి, అమరావతి: దివ్యాంగులైన విద్యార్థులను గుర్తించడం, వారి చదువుల తీరును విశ్లేషించి.. అవసరమైన సహాయం అందించడం కోసం కేంద్ర ప్రభుత్వం 'ప్రశస్థ్' అనే యాప్‌ను ప్రవేశపెట్టింది. దీన్ని పాఠశాలల్లో దివ్యాంగ విద్యార్థుల కోసం నియమితులైన ప్రత్యేక ఉపాధ్యాయులతో డౌన్‌లోడ్ చేయించడంతోపాటు విద్యార్థుల సమాచారాన్ని అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్లకు సూచనలు జారీ చేసింది. 'ప్రీ అసెస్‌మెంట్ హోలిస్టిక్ స్క్రీనింగ్ టూల్' (ప్రశస్థ్) యాప్ గురించి టీచర్లందరికీ తెలియచేయాలని సూచించింది. 21 రకాల అంగవైకల్యాలకు సంబంధించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ యాప్ ద్వారా కేంద్రం తెలుసుకోనుంది. విద్యార్థులు ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారో గుర్తించి.. పరిష్కారాలను చూపేందుకు ఈ ప్రక్రియలో అందరి భాగస్వామ్యాన్ని పెంచనుంది. ఇందుకోసం పాఠశాలల వారీగా నివేదికలను రూపొందింపజేస్తున్నట్లు కేంద్రం తెలిపింది. ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్లు, టీచర్లు, స్పెషల్ ఎడ్యుకేటర్లు, దివ్యాంగుల కోసం నియమితులైన రిసోర్సు పర్సన్లు, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ), డైట్లు, సీటీఈ, సీమ్యాట్ తదితర సంస్థల బోధన సిబ్బంది ఫోన్లలో యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించాలని పేర్కొంది. అనంతరం దివ్యాంగ విద్యార్థుల వివరాలను నమోదు చేయించాలని తెలిపింది. ఈ వివరాల ఆధారంగా పిల్లలకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించింది.

హత్య చేసిన వ్యక్తికి ముందస్తు బెయిలా?

దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడం చట్ట వ్యతిరేకం

- వాచ్‌మెన్ రంగన్న స్టేట్‌మెంట్‌ను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు?
- సీసీ కెమెరా ఫుటేజీని, పోలీసులు సేకరించిన మెటీరియల్‌ను ఎందుకు పరిశీలించలేదు?
- కడప కోర్టు సుప్రీంకోర్టు ఉత్తర్వులను పాటించకుండా తీర్పు ఇచ్చింది
- తాము చెప్పినట్లు వింటున్నందుకే దస్తగిరికి అనుకూలంగా సీబీఐ కౌంటర్
- కడప కోర్టు దస్తగిరికి ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులను కొట్టివేయాలి
- తెలంగాణ హైకోర్టులో వివేకా పీఏ కృష్ణారెడ్డి తరఫు న్యాయవాది వాదనలు
- మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసు పిటిషన్లపై విచారణ నేటికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడు దస్తగిరిని సీబీఐ అప్రూవర్‌గా ప్రకటించడం, అతడికి కడప కోర్టు బెయిల్ ఇవ్వడం చట్టవ్యతిరేకమని వైఎస్ వివేకా పీఏ కృష్ణారెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది దేశాయి ప్రకాష్ రెడ్డి తెలంగాణ హైకోర్టుకు నివేదించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పట్టించుకోకుండా కడప కోర్టు దస్తగిరికి అనుకూలంగా ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. దస్తగిరిని అప్రూవర్‌గా పేర్కొంటూ.. అతడికి బెయిల్ ఇస్తూ సీబీఐ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులు కొట్టివేయాలంటూ ఎంవీ కృష్ణారెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే అభ్యర్థనతో వైఎస్ భాస్కర్‌రెడ్డి కూడా మరో పిటిషన్ వేశారు. ఈ రెండు పిటిషన్‌లపై న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ సోమవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న ఆయన తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు. కాగా వైఎస్ భాస్కర్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్ రెడ్డి, సీబీఐ తరఫున మరో సీనియర్ న్యాయవాది నాగేందర్ కోర్టుకు హాజరయ్యారు.

చంపడానికి గొడ్డలి కొనుగోలు చేశానని దస్తగిరి ఒప్పుకున్నాడు..

ఈ సందర్భంగా వైఎస్ వివేకా పీఏ కృష్ణారెడ్డి తరఫు న్యాయవాది దేశాయి ప్రకాష్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. హత్యకు సంబంధించి వివేకా వాచ్‌మెన్ రంగన్న స్టేట్‌మెంట్‌ను, సీసీ కెమెరాల్లో నమోదైన వీడియో ఫుటేజీని, పోలీసులు సేకరించిన మెటీరియల్‌ను సీబీఐ పరిశీలించలేదన్నారు. ''వివేకాను హత్య చేయడానికి నగదు తీసుకున్నానని, చంపడం కోసం గొడ్డలి కూడా కొనుగోలు చేశానని దస్తగిరి ఒప్పుకున్నాడు. అలాంటి హంతకుడిని కనీసం కస్టడీలోకి తీసుకుని విచారించకుండానే క్షమించడం చట్టవిరుద్ధం. వివేకాతో దస్తగిరే బలవంతంగా లేఖ రాయించినట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి. విచారణలో సీబీఐ చెప్పినట్లు దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. దీంతో సీబీఐ కూడా అతడికి ముందస్తు బెయిల్ ఇప్పించేందుకు, అప్రూవర్‌గా ప్రకటించేందుకు పూర్తిగా సహకరించింది. అతడు ఇచ్చిన వాంగ్మూలానికి ఎలాంటి ఆధారాలు లేకున్నా.. తొలుత నలుగురు ఉన్న నిందితుల జాబితాకు మరికొందరిని చేర్చింది. హత్య కేసులో వారిని బలవంతంగా ఇరికించే ప్రయత్నం చేస్తోంది. ప్రధాన నిందితుడు దస్తగిరికి బెయిల్ ఇప్పించడం, అప్రూవర్‌గా ప్రకటించడంపై సరికాదని సీబీఐ అధికారులకు కృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ కేసులో సీబీఐ తప్పుడు పద్ధతుల్లో దర్యాప్తు చేస్తుండటంతో కృష్ణారెడ్డి పులివెందుల జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేట్ పిటిషన్ కూడా దాఖలు చేశారు'' అని ప్రకాష్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో వాదనలు వినిపించారు.

రంగన్న స్టేట్‌మెంట్‌ను తొక్కిపెట్టి..

'సీఆర్‌పీసీ సెక్షన్‌లు 161, 164 కింద వివేకా వాచ్‌మెన్ రంగన్న స్టేట్‌మెంట్‌ను సీబీఐ రికార్డ్ చేసింది. దాని ప్రకారం.. హత్య జరిగిన రోజు రంగన్న నిద్రలో ఉండగా పాత్రలు, ఇనుప రాడ్ పడిపోవడం వంటి శబ్దాలు అతడికి వినిపించాయి. దీంతో పార్క్ వైపు ఉన్న తలుపు వద్దకు వెళ్లి.. పక్కనే ఉన్న కిటికీలోంచి లోపలికి చూశాడు. ఇంట్లో నలుగురు వ్యక్తులు కనిపించారు. వారిలో ముగ్గురిని ఎర్ర గంగిరెడ్డి, షేక్ దస్తగిరి, సునీల్ యాదవ్‌గా గుర్తించాడు. నాలుగో వ్యక్తి పొడవుగా, సన్నగా ఉన్నాడు. దీంతో భయపడ్డ రంగన్న చీకటిగా ఉన్న తోటలోని చెట్టు దగ్గర దాక్కున్నాడు. దాదాపు 20 నిమిషాల తర్వాత పార్క్ దగ్గర తలుపు తీసుకుని సన్నగా, పొడవుగా ఉన్న వ్యక్తితోపాటు దస్తగిరి, సునీల్, గంగిరెడ్డి హడావుడిగా బయటికి వచ్చి కాంపౌండ్ వాల్ దూకి పారిపోయారు. వారిని రంగన్న స్పష్టంగా చూశాడు. రంగన్న చీకట్లో ఉండటంతో వారు అతడిని గుర్తించలేదు. వారందరూ వెళ్లిపోయాక రంగన్న లోపలికి వెళ్లాడు. ఇల్లంతా చూసినా వివేకా కనిపించకపోవడంతో బాత్రూమ్‌కి వెళ్లి చూడగా రక్తపు మడుగులో వివేకా పడి ఉన్నారు. ఘటనా స్థలంలో దొరికిన ఆధారాలు కూడా రంగన్న చెప్పిన వివరాలకు సరిపోయాయి. ఈ ఆధారాలతోనే పోలీసులు నలుగురిని నిందితులుగా పేర్కొన్నారు. నిందితులు హత్య సమయంలో వివేకా ఇంటి వద్దే ఉన్నట్లు గూగుల్ లొకేషన్ ద్వారా కూడా తెలిసింది. ఇన్ని ఆధారాలు ఉన్నా వాటిని తొక్కిపెట్టి సీబీఐ విచారణ సాగిస్తోంది. ఇంతవరకు దస్తగిరిని అరెస్టు చేయలేదు.. కస్టడీలోకి తీసుకోలేదు. కాబట్టి కడప కోర్టు దస్తగిరికి బెయిల్ ఇస్తూ, అప్రూవర్‌గా ప్రకటిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలి' అని ప్రకాష్ రెడ్డి కోరారు.

ముస్లింలపై ఈనాడు ద్వంద్వ నీతి!

- బాబు హయాంలో వారికి జరిగిన అన్యాయాలపై ఒక్క ముక్క రాయలేదు
- గుంటూరులో ముస్లిం యువకులపై రాజద్రోహం కేసులు పెట్టినా పట్టించుకోలేదు
- ముస్లింలు ఓటేయలేదని నాలుగేళ్లు ఆ వర్గానికి మంత్రి పదవే ఇవ్వలేదు
- అప్పట్లో కళ్లున్న కబోదిలా ఈనాడు వైఖరి
- ఇప్పుడు ఏమీ జరగకపోయినా ముస్లింలపై ఎక్కడలేని ప్రేమ

సాక్షి, అమరావతి: చంద్రబాబు హయాంలో ముస్లిం సమాజంపై వివక్ష చూపి వారిని తీవ్ర వేధింపులకు గురిచేసినా ఒక్క అక్షరం ముక్క రాయని ఈనాడు పత్రిక ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారిని సగౌరవంగా నిలబెట్టినా అన్యాయం చేస్తున్నారంటూ దుష్ప్రచారానికి దిగింది. పల్నాడు జిల్లా పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ రాజకీయ ప్రయోజనాల కోసం ఆదివారం అమరావతిలోని ఒక ముస్లిం కాలనీకి వెళ్లి ముస్లిం యువకులను అడ్డుపెట్టుకుని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను రెచ్చగొట్టారు. ఈ క్రమంలో ఏర్పడిన ఉద్రిక్తతలను తొలగించేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటే దాన్ని ముస్లిం యువకులపై దాడిగా ఈనాడు చిత్రీకరించి చిలవలు పలవలుగా కథనం రాసింది. ఒక యువకుణ్ణి పోలీసులు కొడుతున్నట్లు ఫొటో ఒకటి ప్రచురించి వైఎస్సార్‌సీపీ ముస్లింలకు వ్యతిరేకంగా ఉన్నట్లు చూపించడానికి తాపత్రయపడింది.

దేశద్రోహం కేసుపై ఎందుకు రాయలేదు?

ఈ చిన్న ఘటనను భూతద్దంలో చూపించిన ఈనాడు.. చంద్రబాబు హయాంలో ముస్లింలపై అడుగడుగునా దారుణాలు జరిగినా ఏనాడూ రాయలేదు. 2018లో చంద్రబాబు సీఎంగా ఉండగా గుంటూరులో నారా హమారా పేరుతో నిర్వహించిన సభలో కొందరు యువకులు తమకిచ్చిన హామీలు అమలుచేయాలని ప్లకార్డులు చూపించడాన్ని తీవ్రమైన నేరంగా పరిగణించి వారిపై రాజద్రోహం కేసు పెట్టి చిత్రహింసలు గురిచేసినప్పుడు ఈనాడులో కనీసం వారి గురించి రాయలేదు. కేవలం చంద్రబాబును ప్రశ్నించారనే కారణంతో 9 మంది యువకులపై ఉగ్రవాదులనే ముద్రవేసి నెలలపాటు వారిని చిత్రహింసలకు గురిచేశారు. సామాన్య ముస్లిం యువకులపై దేశద్రోహం కేసులు ఏమిటని ముస్లిం సమాజం యావత్తూ ఆందోళన చేసినా ఈనాడు స్పందించలేదు. గుంటూరులో పలు సాకులు చూపి ముస్లిం పిల్లలు 200 మందిపై కేసులు పెట్టినా, వేధించినా పట్టించుకోలేదు. కానీ, ఇప్పుడు తెలుగుదేశం ప్రయోజనాల కోసం ఏమీ జరగకపోయినా ముస్లిం యువకులపై ఎక్కడలేని ప్రేమ ఒలకబోస్తూ ఇష్టారాజ్యంగా రాతలు రాయడంపై ఆ వర్గంలోనే ఆగ్రహం వ్యక్తమవుతోంది.

వారికి మంత్రి పదవి ఇవ్వకపోయినా పట్టించుకోలేదు

నిజానికి.. చంద్రబాబు ముస్లింలను అన్ని రకాలుగా అవమానించడంతోపాటు తీవ్రంగా అణచివేశారు. టీడీపీకి ఓట్లు వేయలేదనే కక్షతో కనీసం ఆ వర్గానికి చంద్రబాబు తన కేబినెట్‌లో నాలుగేళ్లపాటు చోటు కల్పించలేదు. నంద్యాల ఉప ఎన్నిక రావడంతో ఆ వర్గాన్ని ఆకట్టుకునేందుకు చివరి ఆర్నెలల్లో ఎన్ఎండీ ఫరూక్‌ను మంత్రిని చేశారు. దీనిపై అప్పట్లోనే తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ముస్లిం సమాజమంతా ముక్తకంఠంతో చంద్రబాబు తీరును వ్యతిరేకించినా ఈనాడుకు పట్టలేదు. ఇప్పుడుమాత్రం చంద్రబాబుకు మేలు చేకూర్చేందుకు వారిపై ప్రేమ ఒలకబోసేలా వార్తలు రాయడంపై ముస్లింలే విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

రామోజీ.. మీ ప్రేమ మాకు అక్కర్లేదు

- ముస్లిం యువతపై దేశద్రోహం కేసులు పెట్టినపుడు ఎక్కడ దాక్కున్నావు?
- మైనార్టీలపై చంద్రబాబు, రామోజీలది కపట ప్రేమ
- ముస్లిం యువతపై దాడులంటూ రాతలు సరికాదు
- రాజకీయ గొడవల్లో అన్ని మతాల వారు ఉండడం సహజమే
- బాబుకోసమే రామోజీ మత చిచ్చును రాజేస్తున్నారు
- ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా



కడప కార్పొరేషన్: ఈనాడు అధినేత రామోజీరావు ముస్లిం, మైనార్టీలపై ఒలకబోస్తున్న ప్రేమాభిమానాలు తమకు అక్కర్లేదని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్ బాషా అన్నారు. కడపలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరావతి సమీపంలోని పెద్దకూరపాడు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో ఘర్షణ జరిగితే శాంతిభద్రతలను పరిరక్షించే క్రమంలో పోలీసులు తీసుకున్న చర్యల్లో ఒక ముస్లిం యువకుడు గాయపడ్డాడని ఈనాడులో ప్రచురించడం హాస్యాస్పదమన్నారు. రెండు వర్గాలు ఘర్షణకు దిగినప్పుడు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు చర్యలు తీసుకోవడం వారి వృత్తి ధర్మమన్నారు. ఆ సమూహంలో ఏ కులం, ఏ మతం వారున్నారో వారికెలా తెలుస్తుందని ప్రశ్నించారు. ఈ మాత్రం కనీస జ్ఞానం కూడా లేకుండా మత విద్వేషాలు రెచ్చగొట్టేలా రాయడం బాధాకరమన్నారు. 2014 నుంచి 2019 వరకూ టీడీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలను అణగదొక్కి, ఒక్క ముస్లింకు కూడా కేబినెట్‌లో చోటు కల్పించకపోతే ఈనాడు ఎందుకు రాయలేదని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబుకు వినతిపత్రాన్ని ఇవ్వాలనుకున్న తనను హౌస్ అరెస్టుచేశారని, అది కూడా రామోజీకి కనిపించలేదన్నారు. నిజంగా ముస్లిం యువతపై దాడులు జరిగితే తమ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని అంజద్ బాషా స్పష్టంచేశారు. మైనార్టీలపై చంద్రబాబు, రామోజీలది కపట ప్రేమ అన్నారు.

టీడీపీ దేశద్రోహం కేసు పెట్టినా రాయలేదు

టీడీపీ హయాంలో.. నారా హమారా సభలో ముస్లిం యువకులు ప్లకార్డులు ప్రదర్శిస్తే వారిపై దేశద్రోహం కేసులు పెట్టినప్పుడు ఇది అన్యాయమని అప్పట్లో రామోజీ తన ఈనాడులో రాయలేదని.. అప్పుడు రామోజీరావు ఎక్కడ దాక్కున్నారని ఆయన ప్రశ్నించారు. అలాగే, బాబు పాలనలో ముస్లిం మైనార్టీలపై ఎన్నో దౌర్జన్యాలు, జరిగినా రాయలేదన్నారు. ఇప్పుడు చిన్న సంఘటన జరిగితే అందులో ముస్లిం యువకుడు గాయపడ్డాడని భూతద్దంలో చూపడం అన్యాయమన్నారు. అసలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక మైనార్టీకి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి, నలుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలు, 12 కార్పొరేషన్ చైర్మన్లు, ఒక డిప్యూటీ చైర్మన్ పదవులిచ్చి మంచి చేస్తున్నా రాయలేదన్నారు. ఇవన్నీ రామోజీరావుకు ఎందుకు కనిపించవని అంజద్ బాషా ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ ఉండగా ఏ ముస్లిం, మైనార్టీకి అన్యాయం జరగదని ధీమా వ్యక్తంచేశారు.

గ్రీన్ ఎనర్జీకి ఉజ్వల భవిత

ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ట్రాన్స్‌కో సీఎండీ విజయానంద్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ (గ్రీన్ ఎనర్జీ)కి ఉజ్వల భవిష్యత్తు ఉందని, అందుకే ప్రభుత్వం ఆ దిశగా పెట్టుబడులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్ చెప్పారు. గత నెలలో విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో ఇంధన రంగానికి సంబంధించి జరిగిన 42 అవగాహన ఒప్పందాల అమలుపై ఆయన సోమవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం, కర్నూలు, వైఎస్సార్, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో 25 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల ఏర్పాటు కోసం రూ.9.57 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందాలు జరిగాయని, అవన్నీ ఆచరణలో అమలయ్యేలా ప్రత్యేకంగా దృష్టిసారించాలని సూచించారు. దాని వల్ల రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, ఉద్యోగాలు వచ్చి రాష్ట్రం స్థిరమైన అభివృద్ధిని సాధిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ వనరులు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పారదర్శక, పునరుత్పాదక ఇంధన ఎగుమతి విధానాలు పునరుత్పాదక ఇంధన ఉత్పత్తికి అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం హైబ్రిడ్ పంప్డ్ హైడ్రో స్టోరేజీ ప్రాజెక్ట్‌లను స్థాపించడం, సోలార్ పార్కుల అభివృద్ధి, రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టలేషన్‌లను ప్రోత్సహించడం, గ్రిడ్‌లో పునరుత్పాదక శక్తిని ఏకీకృతం చేయడం వంటి చర్యలు తీసుకుంటోందని తెలిపారు. శిలాజ ఇంధనాల నుంచి పునరుత్పాదక ఇంధనాలకు విద్యుత్‌ను మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. భవిష్యత్తులో ఇంధన డిమాండ్ తీర్చేలా విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి సాధనకు కృషిచేయాలని విద్యుత్ సంస్థలను ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏపీ జెన్‌కో ఎండీ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు, డిస్కంల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మజనార్దనరెడ్డి, కె.సంతోషరావు, నెడ్‌క్యాప్ వీసీ, ఎండీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటువంటి కాలేజీని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు

- నిర్వహణ, కార్యకలాపాలు సరిగా లేని కళాశాలలపై హైకోర్టు తీర్పు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ గ్రాంట్‌తో నడిచే కాలేజీ కార్యకలాపాలు సక్రమంగా సాగనప్పుడు, ఆస్తుల దుర్వినియోగం జరిగినప్పుడు ఆ కళాశాలను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం తప్పు కాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా నర్సరావుపేటలోని శ్రీ త్రికోటేశ్వర స్వామి ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన ఎస్‌బీటీ అండ్ ఎస్‌వీసీ కాలేజీ యాజమాన్య బాధ్యతలను, ఆస్తులను టేకోవర్ చేస్తూ 2017లో జారీ చేసిన జీవో 17ను హైకోర్టు సమర్థించింది. ఆ జీవోను సవాలు చేస్తూ శ్రీ త్రికోటేశ్వర స్వామి ఎడ్యుకేషనల్ సొసైటీ, ఎస్‌బీటీ అండ్ ఎస్‌వీసీ కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ నల్లా రామచంద్రప్రసాద్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఆ విద్యా సంస్థ సెక్రటరీ కాలేజీ కార్యకలాపాలను సక్రమంగా నిర్వహించకపోవడంతో కళాశాలలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది లేని పరిస్థితి నెలకొందని, దీంతో పేద, అణగారిన వర్గాల ప్రజలకు విద్యనందించాలన్న లక్ష్యం నెరవేరకుండా పోయిందని హైకోర్టు తెలిపింది. ఈ పరిస్థితుల్లో విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వమే ఆ కాలేజీని టేకోవర్ చేసిందని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ మంతోజు గంగారావు ఇటీవల తీర్పు వెలువరించారు.

కోడెల వల్లే మా కాలేజీకి ఈ దుస్థితి

కళాశాలను ప్రభుత్వం టేకోవర్ చేయడాన్ని సవాలు చేస్తూ నల్లా రామచంద్రప్రసాద్ 2017లో దాఖలు చేసిన వ్యాజ్యంలో అప్పటి స్పీకర్ కోడెల శివప్రసాద్‌ను ప్రతివాదిగా చేర్చి, ఆయనపై పలు ఆరోపణలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ గంగారావు తుది విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది డి.కృష్ణమూర్తి వాదనలు వినిపిస్తూ.. స్థానిక రాజకీయ కారణాలతో అప్పటి స్పీకర్ తమ కాలేజీ కార్యకలాపాల్లో జోక్యం చేసుకున్నారని, యాజమాన్యంలో చీలికలు తెచ్చారని తెలిపారు. తమ కాలేజీలోని బోధన, బోధనేతర సిబ్బందిని ఇతర కాలేజీలకు బదిలీ చేయించి, కాలేజీలో విద్యార్థులు లేకుండా చేశారన్నారు. అంతిమంగా కాలేజీని నడపలేని స్థితికి కోడెల తీసుకొచ్చారని తెలిపారు. ఆ తరువాత తమ వివరణను పరిగణనలోకి తీసుకోకుండానే కాలేజీని టేకోవర్ చేస్తూ ప్రభుత్వం 2017లో జీవో జారీ చేసిందన్నారు. ఉన్నత విద్యా శాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అంతర్గత వివాదాల వల్ల కాలేజీ కార్యకలాపాలు సక్రమంగా సాగడంలేదని, నిధుల దుర్వినియోగం కూడా జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. విచారణ జరిపిన కమిటీ ఆ కాలేజీని టేకోవర్ చేయాలని సిఫారసు చేసిందన్నారు. పిటిషనర్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చి, వివరణ కోరామని తెలిపారు. వివరణను పరిగణనలోకి తీసుకున్న తరువాతే కాలేజీని టేకోవర్ చేస్తూ జీవో ఇచ్చినట్లు తెలిపారు.

విశ్రాంత సీజే జస్టిస్ టీబీ రాధాకృష్ణన్‌కు హైకోర్టు ఘన నివాళి

సాక్షి, అమరావతి: ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన ఉమ్మడి హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తొట్టతిల్ భాస్కరన్‌నాయర్‌రాధాకృష్ణన్‌కు హైకోర్టు సోమవారం ఘనంగా నివాళులర్పించింది. ప్రజల న్యాయమూర్తిగా, గొప్ప మానవతావాదిగా పేరుగడించిన జస్టిస్ రాధాకృష్ణన్‌కు నివాళులర్పించేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా నేతృత్వంలో న్యాయమూర్తులందరూ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. న్యాయ వ్యవస్థకు జస్టిస్ రాధాకృష్ణన్ అందించిన సేవలను సీజే జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా కొనియాడారు. ఎన్నో చారిత్రక తీర్పులను వెలువరించారని గుర్తు చేసుకున్నారు. ప్రజల గుండెల్లో జస్టిస్ రాధాకృష్ణన్ చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. అడ్వొకేట్ జనరల్(ఏజీ) ఎస్.శ్రీరామ్ తదితరులు మాట్లాడుతూ ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ఉమ్మడి హైకోర్టు విభజన జరిగేలా జస్టిస్ రాధాకృష్ణన్ చూశారని గుర్తు చేసుకున్నారు.

కాంతులీనుతున్న సాగరతీరం



భీమిలి బీచ్ నీలివర్ణ అందాలు

▶ మొదటి పేజీ తరువాయి

పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ఆహ్లాదకరంగా కనిపించే సాగరతీరం... రాత్రి సమయంలో నీలివర్ణంలో వెలిగిపోతోంది. మొదట్లో ఏమవుతుందో అర్థంకాక పర్యాటకులు ఆందోళనకు గురయ్యారు. కానీ.. నీలి అలలు ఎగిసిపడుతుంటే.. క్రమంగా వాటిని ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ ప్రాంతంలో ముందెన్నడూ చూడని అద్భుతమైన సహజసిద్ధ సముద్ర అందాలను చూసి పులకించిపోతున్నారు. మరోవైపు సముద్రంలో ఏదో జరిగిందంటూ కొందరు ఆందోళన చెందుతున్నారు.

ఎక్కువ రోజులు ఉంటే ఆందోళనకరమే..

దేశంలో ఈ విధంగా బీచ్‌లు తళుక్కున మెరిసిపోవడం కొత్తేమీ కాదు. లక్షదీవులు, అండమాన్ నికోబార్ దీవుల్లోని హేవ్‌లాక్ ద్వీపం, రాధానగర్ బీచ్, మహారాష్ట్రలోని కొంకణ్ తీరం, మాల్దీవుల్లోని వాధూ ద్వీపంతోపాటు చెన్నైలోని మెరీనా బీచ్‌లోనూ కొన్నిసార్లు ఈ తరహా బయోలుమినిసెన్స్ కనిపించింది. ఈ గ్లో–ఇన్–డార్క్‌కు కారణమైన ఆల్గేలు భారీగా ఉంటే చాలా ఆక్సిజన్‌ను తీసుకుంటాయి. దీనివల్ల సముద్రంలో ఆక్సిజన్ కొరత రావొచ్చు. ఎక్కువ పోషకాలు, వ్యర్థాలు ఉన్నచోట ఈ ఆల్గే పోగుపడుతుంది. ఎక్కువ రోజులు ఈ నీలి మెరుపులు ఉంటే ఆ ప్రాంతంలోని సముద్ర జలాల్లో ఆక్సిజన్ తగ్గి సాగరజలాల్లోని జీవరాశులకు కాస్త ప్రమాదకరమైన వాతావరణం ఏర్పడుతుందనే ఆందోళన కూడా ఉంది. ఏది ఏమైనా... భీమిలి బీచ్‌లో ఈ తరహా అద్భుతం మాత్రం ఆహ్వానించదగిన పరిణామం.

– సాయి కిరణ్, వాతావరణ నిపుణుడు

బయోలుమినిసెంట్ కారణంగా..

బీచ్‌లో ఈ తరహా మార్పులు చూసేందుకు ఆహ్లాదకరంగా ఉన్నా... ఒకింత ఆందోళన కూడా కలిగిస్తోందని నిపుణులు చెబుతున్నారు. ఫైటోప్లాంక్టన్ అని పిలిచే చిన్నచిన్న సముద్ర జీవులు విడుదల చేసిన రసాయనాల కారణంగా ప్రకాశవంతమైన నీలి కాంతి విడుదలవుతుంది. దీంతో బయోలుమినిసెంట్ తరంగాలు ఏర్పడుతున్నాయి. అయితే, సముద్రంలోని అతి సూక్ష్మ నీలి, ఆకుపచ్చ శైవలాలే (ఆల్గే) భీమిలి బీచ్ నీలివర్ణంలో మెరిసిపోవడానికి కారణమని నిపుణులు వివరిస్తున్నారు. కొన్నిరకాల ఆల్గేల వల్ల బీచ్‌లు ఆకుపచ్చ వర్ణంలోనూ మెరుస్తుంటాయని, నీటిలో పోషకాలు పుష్కలంగా ఉన్నంతవరకూ బీచ్ ప్రకాశవంతంగా కనిపిస్తుందని చెబుతున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943